

'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 153

శుక్రవారం 17-2-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మళ్లీ స్పిన్ మంత్రం..

నేటి నుంచి ఆసీస్‌తో రెండో టెస్టు.. జోరు మీదున్న టీమిండియా - 13లో



'విండ్‌ఫాల్' తగ్గింపు

డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను తగ్గించిన కేంద్రం - 13లో



ఆదివాసీల అభ్యున్నతికి ప్రాధాన్యం

గతంలో ఎన్నడూ లేని విధంగా దేశంలోని ఆదివాసీల అభ్యున్నతి కోసం కేంద్రం ఎంతో కృషి చేస్తోందని ప్రధాని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸



త్రిపురలో 81.11 శాతం ఓటింగ్

త్రిపురలో 60 శాసనసభ స్థానాలకు నిర్వహించిన ఎన్నికల్లో సాయంత్రం 4 గంటల వరకు 81.11 శాతం ఓటింగ్ నమోదయ్యింది.


వివరాలు 6లో ▸



840 విమానాలు కొంటున్నాం

ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థల నుంచి మొత్తం 840 విమానాలు కొనుగోలు చేస్తున్నట్లు 'ఎయిరిండియా' వెల్లడించింది.

వివరాలు 6లో ▸



శ్రీలంకలో విద్యుత్ చార్జీల మోత


ఐఎంఎఫ్ నిబంధనలకు తలొగ్గిన శ్రీలంక ప్రభుత్వం విద్యుత్ చార్జీలను ఏకంగా 66 శాతం పెంచేస్తూ నిర్ణయం తీసుకుంది.

వివరాలు 6లో ▸

పెద్ద ఉద్యోగం పక్కా

రాష్ట్ర విద్యార్థులకు లక్కీ చాన్స్.. విప్రో 'వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్'

- బిట్స్ పిలానీ నుంచి ఎంటెక్.. ఆపై ఉద్యోగం కూడా
- రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అమలుకు సన్నద్ధం.. బీసీఏ, బీఎస్సీ డిగ్రీ అభ్యర్థులకు మంచి అవకాశం
- కోర్సు కాలపరిమితి 60 నెలలు.. ప్రతి నెలా స్టైపెండ్
- కనీసం రూ.5 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం కూడా
- గుంటూరు, విశాఖ, తిరుపతిలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ
- 18లోగా రిజిస్టర్ చేసుకోవాలి
- రాష్ట్ర ప్రభుత్వ కృషితో ఫలిస్తున్న విద్యారంగ సంస్కరణలు
- నాస్కామ్, మైక్రోసాఫ్ట్ తదితర సంస్థలతో ఉచితంగా శిక్షణ
- ఏటా పెరుగుతున్న ప్లేస్‌మెంట్స్



సాక్షి, అమరావతి: ఇటు ఉన్నత చదువు.. అటు ఉద్యోగం!.. ఒకేసారి రెండు లక్ష్యాలు నెరవేరే చాన్స్.. ప్రతిష్టాత్మక బిట్స్ పిలానీలో ఎంటెక్ అడ్మిషన్.. నెలనెలా స్టైపెండ్.. కనీసం రూ.5 లక్షలతో జాబ్.. ఇదంతా సాధారణ డిగ్రీతోనే సాకారం కానుంది. యువత నైపుణ్యాలను పెంపొందిస్తూ, ఉద్యోగావకాశాలను మెరుగుపరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి మంచి ఫలితాలు లభిస్తున్నాయి. విద్యార్థులు చదువులు పూర్తి చేసి బయటకు రాగానే అవకాశాలను అందిపుచ్చుకునేలా పలు ప్రముఖ సంస్థల ద్వారా శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుండడంతో రాష్ట్రంలో ఏటా ప్లేస్‌మెంట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. మైక్రోసాఫ్ట్, సేల్స్‌ఫోర్స్, గూగుల్, బ్లూప్రిజమ్, ఏడబ్ల్యూఎస్ తదితర ప్రముఖ సంస్థలు మన విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో పాటు నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగావకాశాలూ కల్పిస్తున్నాయి. నేటి అవసరాలకు అనుగుణంగా కోర్సులను ప్రవేశపెట్టడంతోపాటు ఆయా సంస్థలు కోరుకునే నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆంగ్ల భాషా ప్రావీణ్యం మెరుగుపడేలా రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో ▶

బీజేపీకి 'కన్నా' గుడ్‌బై



- పార్టీ జాతీయ అధ్యక్షుడికి రాజీనామా లేఖ
- రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజువల్లే పార్టీ వీడుతున్నా
- త్వరలో అనుచరులతో చర్చించాక భవిష్యత్ కార్యాచరణ
- గుంటూరులో మీడియా సమక్షంలో వెల్లడి
- జీవీఎల్‌పైనా కన్నా ఆరోపణలు

సాక్షి ప్రతినిధి,గుంటూరు/గుంటూరు మెడికల్: మాజీమంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశాడు. గుంటూరులోని తన స్వగృహంలో గురువారం ఈ విషయాన్ని ఆయన మీడియాకు వెల్లడించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు వైఖరివల్లే తాను పార్టీ వీడుతున్నట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర పార్టీలో నెలకొన్న పరిస్థితుల్ని చక్కదిద్దేందుకు కేంద్ర నాయకత్వం ఎలాంటి ప్రయత్నాలు చేయడంలేదని కన్నా ఈ సందర్భంగా ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడే విషయంలో సోము వీర్రాజు వ్యవహారశైలి నచ్చకపోవడంవల్ల పార్టీని వీడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. 2014లో మోదీ నాయకత్వం పట్ల

మిగతా 3వ పేజీలో ▶

సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేత జయమంగళ వెంకటరమణ (మధ్యలో)



వైఎస్సార్‌సీపీలోకి మాజీ ఎమ్మెల్యే జయమంగళ

- సీఎం వైఎస్ జగన్ సమక్షంలో చేరిక
- చంద్రబాబు మోసం చేశారు..
- అవమానం భరించలేకపోయాను
- సీఎం జగన్ బీసీలకు అండగా ఉన్నారు
- వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడి

2లో

ఐటీ కేంద్రంగా విశాఖ

మరిన్ని కంపెనీలు వచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషి: మంత్రి అమర్‌నాథ్

'గ్లోబల్ టెక్ సమ్మిట్'కు హాజరైన దేశ విదేశీ ప్రతినిధులు

2లో



గ్లోబల్ టెక్ సమ్మిట్‌లో వివిధ దేశాల, కంపెనీల ప్రతినిధులతో మంత్రులు, ఎంపీ

కొత్త జిల్లాల్లో త్వరగా ఖాళీల భర్తీ

కార్యదర్శుల సమావేశంలో సీఎస్ డా.జవహర్ రెడ్డి

- పదోన్నతులు, రేషనలైజేషన్, ఇన్‌చార్జ్ బాధ్యతల అప్పగింత
- అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇ–ఆఫీస్ విధానం
- గ్రూపు–1, 2 స్థాయి పోస్టుల వివరాలు వెంటనే అందించండి
- అసెంబ్లీ, కౌన్సిల్‌లో సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు పంపండి
- కోర్టు కేసులపై త్వరలో జీపీలు, కార్యదర్శులతో వర్క్‌షాప్
- ఉద్యోగుల ఆర్థికేతర డిమాండ్లను సకాలంలో పరిష్కరించాలి




14లో

'డ్రోన్ల'పై స్వల్పకాలిక కోర్సులు

- డ్రోన్ల రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరుల అవసరాన్ని తీర్చేందుకు ఆంధ్రప్రదేశ్ సహా 12 రాష్ట్రాల్లోని 116 ఐటీఐల్లో ఆరు స్వల్పకాలిక కోర్సుల నిర్వహణకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ అనుమతిచ్చింది. ఏపీలోని 10 ఐటీఐలతో పాటు అసోం, అరుణాచల్ ప్రదేశ్, బిహార్, చండీగఢ్, గుజరాత్, మహారాష్ట్ర, మణిపూర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు కూడా కేంద్రం అనుమతి మంజూరు చేసింది.

14లో



రారండోయ్... జాతర చూద్దాం!

ఈ నెల 21, 22 తేదీల్లో అనంతపురం గంగమ్మ జాతర.. 2 నుంచి 3 లక్షల మంది తరలిరానున్న భక్తులు

సాక్షి రాయచోటి: రాయలసీమలోనే అత్యంత ప్రసిద్ధి గాంచిన అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలోని లక్కిరెడ్డిపల్లె మండలంలో కొలువైన అనంతపురం గంగమ్మ దేవత.. భక్తుల పాలిట కల్పతరువుగా విరాజిల్లుతోంది. కోరిన కోర్కెలు తీరుస్తూ కొంగుబంగారంగా వెలుగొందుతోంది. ప్రతి ఏటా మహాశివరాత్రి ముగిసిన రెండో రోజు నుంచి ఇక్కడ గంగమ్మ జాతర ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో జరగనున్న గంగమ్మ తల్లి జాతరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కల్లు సమర్పించి..శాంతింపజేసి!

అనారోగ్యానికి గురైన వారికి అభయమిస్తూ, సంతానం లేనివారికి గంగమ్మ సంతానాన్ని ప్రసాదిస్తుందని భక్తుల నమ్మకం. అమ్మవారికి పుట్టినిల్లుగా భావించే కస్తూరాజుగారిపల్లె గ్రామంలోని చాగలగుట్టపల్లె నుంచి గంగమ్మ దేవత ఉత్సవ విగ్రహాన్ని 21వ తేదీన తెల్లవారుజామున 4 గంటలకు మద్దిరేవుల గ్రామంలోని అప్పలరాజుగారిపల్లె, మార్లవాండ్లపల్లె, మర్రిచెట్టు, చౌటపల్లె గ్రామాల మీదుగా జాతర జరిగే ప్రాంతానికి ఊరేగింపుగా తీసుకువస్తారు. అనంతపురం గంగమ్మ దేవత ఆలయానికి ఉత్సవ విగ్రహం రాగానే గొడ సామాజికవర్గానికి చెందిన వారు అమ్మవారికి ఎదురు వచ్చి కల్లు సాంగ్యంతో శాంతింపజేసి ఆలయం లోపలికి తీసుకువస్తారు. గుడి ముంగిటకు అమ్మవారు రాగానే బోనాలు సమర్పించి జంతు బలులను ఇస్తారు. ఇదే రోజు శిద్దల పూజ,



సిడిమాను పూజలతో పాటు, రాత్రికి చాందిని, కుంకుమబండ్లు తిప్పి భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. మొదటి రోజును నిండు తిరునాలగాను, రెండో రోజును మైల తిరునాలగాను భావిస్తారు. జాతర నేపథ్యంలో..మంచినీరు, టాయిలెట్లు, చలువ పందిళ్లు, అన్నదాన కార్యక్రమాలు ఇతర ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. జాతరకు ఇటు కడప, రాయచోటి జాతీయ రహదారి నుంచి భక్తులు వస్తుంటారు. పులివెందుల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ప్రతి ఏటా ఈ జాతరకు 2–3 లక్షల మంది హాజరవుతుంటారు. జాతరలో సాసవల చిన్నమ్మ కథ, హరికథ, బుర్రకథ కాలక్షేపాలు, 21న రాత్రి చెక్క భజన, రేలారే రేలా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు గంగమ్మ ఆలయ చైర్మన్ సామాల నరసింహారెడ్డి చెప్పారు.

ఏపీ విద్యావ్యవస్థ దేశానికే ఆదర్శం

దేశంలో మరెక్కడా లేనివిధంగా ఏపీలో పథకాల అమలు

- ఢిల్లీ ఎస్సీఈఆర్టీ బృందం కితాబు
- రాష్ట్రంలోని స్కూళ్లను సందర్శించిన 28 మంది సభ్యుల బృందం
- ప్రభుత్వ బడుల్లో నాడు–నేడు ద్వారా సమకూరిన వసతులు అద్భుతమని ప్రశంస



ప్రభుత్వ స్కూల్‌లో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఢిల్లీ ఎస్సీఈఆర్టీ బృందం

రేణిగుంట/శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యావ్యవస్థలో చోటుచేసుకున్న విప్లవాత్మకమైన సంస్కరణలు దేశానికే ఆదర్శం. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పేద విద్యార్థుల భవిష్యత్‌ను దేదీప్యమానం చేసేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాలు మమ్మల్ని సంభ్రమాశ్చర్య చకితుల్ని చేస్తున్నాయి. నాడు–నేడు, అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, ట్యాబ్‌ల పంపిణీ, బైజూస్ క్లాసులు వంటి మంచి పథకాలు మరే రాష్ట్రంలో అమలు కావడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఇక్కడి పిల్లలు భవిష్యత్‌లో గొప్ప ఆవిష్కర్తలుగా తయారై దేశకీర్తిని ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపజేస్తారన్న విశ్వాసం కలుగుతోంది' అని ఢిల్లీ ఎస్సీఈఆర్టీ బృందం కితాబిచ్చింది. ఢిల్లీ నుంచి వచ్చిన ఈ బృందం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు, పాఠశాలల్లో నెలకొల్పిన వసతులు, పటిష్టమైన బోధనాభ్యసన వ్యవస్థ, నాణ్యమైన పౌష్టికాహారం పంపిణీ వంటి మహత్తర కార్యక్రమాలు అమలు చేస్తుండటంపై ప్రశంసల జల్లు కురిపించింది.

త్వరలో ఢిల్లీ ప్రభుత్వానికి నివేదిక

ఢిల్లీ రాష్ట్రానికి చెందిన ఎస్సీఈఆర్టీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మృదుల భరద్వాజ్ నేతృత్వంలో 28 మంది సభ్యుల బృందం తొలుత విజయవాడలోని పలు పాఠశాలలను పరిశీలించింది. అనంతరం బుధవారం ఎర్రావారిపాలెం, రేణిగుంట బాలికోన్నత పాఠశాల, గురువారం శ్రీకాళహస్తి బాలికోన్నత పాఠశాలను బృందంలోని సభ్యులు సందర్శించారు. శుక్రవారం మదనపల్లి రిషీ వ్యాలీ స్కూల్‌ను పరిశీలించనున్నారు. పాఠశాలల సందర్శన సందర్భంగా వసతులతోపాటు స్కూల్ ప్రాంగణంలో మొక్కల పెంపకం, క్యాంపస్ సుందరీకరణ, తరగతి పరిశుభ్రత, కంప్యూటర్ ల్యాబ్ వినియోగం, అటల్ టింకరింగ్ ల్యాబ్, 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన బైజూస్ ట్యాబ్‌లు, వాటి వినియోగంతో పిల్లల అభ్యసనంలో వచ్చిన మార్పులను క్షుణ్ణంగా పరిశీలించారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న వసతులు, అమ్మ ఒడి ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15 వేల ఆర్థిక ప్రోత్సాహం, జగనన్న విద్యాకానుక ద్వారా అందిస్తున్న కిట్, జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం విద్యార్థులకు అందజేస్తున్న తీరును పరిశీలించి.. ఇంత గొప్పగా విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు మరే రాష్ట్రంలో జరగలేదని ముక్తకంఠంతో ప్రశంసల జల్లు కురిపించారు. తాము పరిశీలించిన అంశాలను ఢిల్లీ ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు.



చిన్నారులతో మాట్లాడుతున్న సభ్యులు

ఏపీ ప్రభుత్వ చొరవ ప్రశంసనీయం

బృందానికి నాయకత్వం వహిస్తున్న మృదుల భరద్వాజ్ మాట్లాడుతూ.. ఏపీలో అమలవుతున్న పథకాలు మరే రాష్ట్రంలో చేపట్టలేదన్నారు. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం చూపుతున్న చొరవ ఆదర్శనీయమన్నారు. సభ్యురాలు భవానీసింగ్ మాట్లాడుతూ.. ఇక్కడి పాఠశాలల్లో వసతులే కాదు.. గొప్ప విద్యా వ్యవస్థ పటిష్టంగా అమలు అవుతోందని అభినందించారు. పిల్లల మేధోశక్తి నిజంగా అబ్బురపరిచిందని, దేశంలోనే ఏపీ ఆదర్శనీయంగా నిలిచిందని కితాబిచ్చారు. మరో సభ్యురాలు చంద్రిక మాట్లాడుతూ.. ఏపీలో అమలవుతున్న విద్యావ్యవస్థను వినియోగించుకుంటున్న పిల్లలు భవిష్యత్‌లో దేశం గర్వించే పౌరులుగా అవతరిస్తారని తనకు విశ్వాసం ఏర్పడిందన్నారు. ఇక్కడి పాఠశాలల్లో దేశంలో ఎక్కడా లేని రీతిలో అధునాతన వసతులు సమకూరాయని ప్రశంసించారు.

న్యూస్‌రీల్

బాబూ.. మీ ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయండి



రాజకీయాల్లోకి వచ్చేటప్పుడు ఉన్న ఆస్తులు.. ఇప్పటి ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయగలరా అని టీడీపీ అధినేత చంద్రబాబుకు కాకినాడ జిల్లా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సవాల్ విసిరారు. తనపై చేసిన అవినీతి ఆరోపణల్ని చంద్రబాబు నిరూపించాలని డిమాండ్ చేశారు.

వివరాలు 10 ▸

బీబీసీ కార్యాలయంలో మూడో రోజూ 'సర్వే'



ఢిల్లీలోని బీబీసీ కార్యాలయంలో వరుసగా మూడో రోజు కూడా సోదాలు కొనసాగాయి. ఉద్యోగుల నుంచి సంస్థ ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన డేటా, ఎల్రక్టానిక్, పేపర్ డేటా కాపీలను అధికారులు సేకరిస్తున్నారు.

వివరాలు 6 ▸


క్రికెటర్ పృథ్వీ షాపై దాడి



సెల్ఫీకి నిరాకరించిన క్రికెటర్ పృథ్వీ షాపై ముంబైలో కొందరు దాడి చేశారు. ఆయన కారును బేస్ బాల్ బ్యాట్‌తో ధ్వంసం చేశారు. దీనిపై కేసు నమోదు చేసి.. ఒక యువతిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివరాలు 6 ▸

గంగమ్మకే పెద్దమ్మ.. మన కృష్ణమ్మ!



రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యంలో దేశంలోనే అగ్రగామిగా కృష్ణా

- 1,788.99 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో ప్రథమ స్థానం
- రెండో స్థానంలో గంగా, ఆ తర్వాత గోదావరి
- కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) రికార్డులు వెల్లడి

2లో

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన చాగంటి, వరప్రసాద్‌రెడ్డి



చాగంటి కోటేశ్వరరావుకు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం జగన్

సాక్షి,అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు కలిశారు. ఇటీవల టీటీడీ ధార్మిక సలహాదారుగా చాగంటి కోటేశ్వరరావు నియమితులైన విషయం విదితమే. ఈ సందర్భంగా చాగంటికి శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రతిమను సీఎం జగన్ అందజేసి శాలువతో సత్కరించారు. అలాగే సీఎం జగన్‌ను శాంతా బయోటెక్స్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, ఎండీ డాక్టర్ కేఐ వరప్రసాద్‌రెడ్డి కూడా కలిశారు. ముఖ్యమంత్రితో సమావేశం అనంతరం సీఎం నివాసం వద్ద ఉన్న గోశాలను చాగంటి కోటేశ్వరరావు, కేఐ వరప్రసాద్ రెడ్డి సందర్శించారు. గోశాలను అద్భుతంగా తీర్చిదిద్దారని చాగంటి కోటేశ్వరరావు ప్రశంసించారు.

గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్‌కు గ్రీన్ సిగ్నల్

నిర్వహణకు అభ్యంతరం లేదని ప్రకటించిన ఎన్నికల సంఘం

మహారాణిపేట (విశాఖ దక్షిణ): మార్చి 3, 4 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్–2023 నిర్వహణకు ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ సమ్మిట్ నిర్వహణపై జిల్లా యంత్రాంగం ఏపీ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసిన సంగతి విదితమే. సమ్మిట్ నిర్వహణపై తమకు అభ్యంతరం లేదని గురువారం ఎన్నికల కమిషన్ జిల్లా యంత్రాంగానికి పంపిన లేఖలో తెలిపింది.

విలువలు లేని విద్య నిరుపయోగం

జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో వీసీ ఆచార్య రాజశేఖర్



ఏఎన్‌యూ: విలువలు లేని విద్య నిరుపయోగమని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంబేడ్కర్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'అంబేడ్కర్ విజన్ ఆన్ ఎడ్యుకేషన్–రిఫ్లెక్షన్ ఆన్ న్యూ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఈపీ)–2020' అనే అంశంపై రెండు రోజులపాటు జరుగుతున్న జాతీయ సదస్సును గురువారం వీసీ ప్రారంభించారు. వీసీ ప్రసంగిస్తూ మానవతా విలువలు, భిన్న అంశాలలో పరిజ్ఞానం పెంపొందించే విద్యా విధానాన్నే అంబేడ్కర్ కాంక్షించారన్నారు. మన దేశంలో పరిపూర్ణ పౌరులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా నూతన ఎన్ఈపీ–2020 రూపొందించబడిందని హైదరాబాద్ మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఆచార్య ఎం.వనజ అన్నారు. ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ ప్రసంగిస్తూ విద్యలో అంబేడ్కర్ చూపిన మార్గదర్శనంలో నడవాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ గిరిజన సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ ఎ. రవీంద్రబాబు,అంబేడ్కర్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య వై.అశోక్‌కుమార్, యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి, యూనివర్సిటీ విశ్రాంత అధ్యాపకులు ఆచార్య ఎంపీ రాంకుమార్ రత్నం ప్రసంగించారు. సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, పరీక్షల కో–ఆర్డినేటర్ ఆచార్య ఎల్ ఉదయకుమార్ పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి మాజీ ఎమ్మెల్యే జయమంగళ

సాక్షి, అమరావతి: టీడీపీ సీనియర్ నేత, కైకలూరు మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకట రమణ గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. 2009లో కై కలూరు నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతూ బుధవారం ఆ పార్టీకి, కైకలూరు టీడీపీ ఇన్‌చార్జ్ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, కై కలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ రైతు విభాగం రాష్ట్ర నాయకుడు సయ్యపరాజు గుర్రాజుతో కలిసి సీఎం క్యాంపు కార్యాలయం వద్దకు వచ్చారు. వారిద్దరినీ సీఎం జగన్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వెంకటరమణ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. 1999లో చంద్రబాబును నమ్మి, వ్యాపారాలు వదులుకుని టీడీపీలో చేరితే ఆ తర్వాత తీరని ద్రోహం చేశారని, ఓ దశలో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని వాపోయారు. 2014లో నామినేషన్ వేయండని చెప్పి, ఆ తర్వాత విత్ డ్రా చేసుకోమని బలవంతం చేశారన్నారు. పొత్తు అంటూ కామినేని శ్రీనివాసరావుకి టికెట్ ఇచ్చి, నన్ను మోసం చేశారని మండిపడ్డారు. ఆ అవమానం భరించలేక పోయానని చెప్పారు. 'ఇచ్చిన మాట నిలబెట్టుకునే నేత సీఎం జగన్. బీసీల అభివృద్ధికి గట్టిగా కృషి చేస్తున్నారు. సీఎం జగన్ ఏం చెప్పినా చేయటానికి నేను సిద్ధం. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నాకు మంచి స్నేహితుడు. అందరం పార్టీ అభివృద్ధి కోసం కలసి పనిచేస్తాం. సీఎం జగన్ చేస్తోన్న మంచి పనులకు ఆకర్షితుడినై వైఎస్సార్‌సీపీలో చేరా. కైకలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం. నాకు పదవులు ముఖ్యం కాదు. ప్రజా సేవే ముఖ్యం. వచ్చే ఎన్నికల్లో దూలం నాగేశ్వరరావు గెలుపు కోసం కృషి చేస్తా' అని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కొల్లేరు ప్రాంతంలోని పలు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు వెంకటరమణ కృషి చేస్తారని తెలిపారు.

ఐదు కంపెనీలతో షిప్‌యార్డ్ 8 ఎంవోయూలు

ఏరో ఇండియా సదస్సులో ఒప్పందాలు చేసుకున్నట్లు వెల్లడి



సెడ్స్ సంస్థతో ఎంవోయూ చేసుకుంటున్న షిప్‌యార్డు డైరెక్టర్

సాక్షి, విశాఖపట్నం: నౌకల నిర్మాణం, మరమ్మతుల విషయంలో హిందుస్థాన్ షిప్‌యార్డ్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ హేమంత్ ఖత్రి తెలిపారు. అంతర్జాతీయ సంస్థలతో కలిసి సాంకేతికతను అందిపుచ్చుకుంటూ విశాఖను షిప్ రిపేరింగ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలు, వనరుల కోసం అన్వేషణ కొనసాగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఐదు దేశ, విదేశీ సంస్థలతో ఎనిమిది వ్యూహాత్మక భాగస్వామ్యాలు (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు తెలిపారు. బెంగళూరులో నిర్వహిస్తున్న ఏరో ఇండియా–2023 సదస్సులో షిప్ బిల్డింగ్, రిపేర్లు, సబ్‌మెరైన్ రీఫిట్, వాణిజ్యంపై ఆయా సంస్థలతో ఎంవోయూలు చేసుకున్నామని గురువారం వెల్లడించారు. మిథానీ, శ్రీ రిఫ్రిజిరేషన్, బ్రైత్‌వైట్, సెడ్స్, తాయ్ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఎనిమిది ఎంవోయూలను హెచ్ఎస్ఎల్ డైరెక్టర్ రాంబాబు సమక్షంలో చేసుకున్నట్లు వివరించారు. రక్షణేతర షిప్ బిల్డింగ్, ఎగుమతి మార్కెట్‌పైనా షిప్‌యార్డ్ దృష్టి సారించిందని, భవిష్యత్‌లో నౌకా నిర్మాణంలో 80 శాతానికిపైగా స్వదేశీ పరిజ్ఞానం వినియోగించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఖత్రి తెలిపారు.


షిప్‌యార్డ్ సీఎండీకి ప్రతిష్టాత్మక అవార్డు

హిందుస్థాన్ షిప్‌యార్డ్ సీఎండీ కమొడార్ హేమంత్ ఖత్రికి లీడర్‌షిప్ అవార్డు లభించింది. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ ఆధ్వర్యాన ఢిల్లీలో గురువారం 9వ పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్(పీఎస్‌యూ) అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్రా చేతుల మీదుగా లీడర్‌షిప్ అవార్డును సీఎండీ హేమంత్ ఖత్రి స్వీకరించారు.

గంగమ్మకే పెద్దమ్మ.. మన కృష్ణమ్మ!

రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యంలో దేశంలోనే అగ్రగామిగా కృష్ణానది

- 1,788.99 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో ప్రథమ స్థానం
- రెండో స్థానంలో గంగా, ఆ తర్వాత గోదావరి
- కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) రికార్డులు వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో నీటి నిల్వ సామర్థ్యం అత్యధికంగా ఉన్న జలాశయాలతో కృష్ణా నది అగ్రగామిగా అవతరించింది. అతి పెద్ద నది అయిన గంగా, రెండో అతి పెద్ద నది అయిన గోదావరి కన్నా నీటి నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయాల్లో అగ్రగామిగా కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) రికార్డుల్లోకి 'కృష్ణా నది చేరింది. దేశంలో హిమాలయ, ద్వీపకల్ప నదులతో పాటు అన్ని నదీ పరివాహక ప్రాంతాల(బేసిన్)లో నిర్మాణం పూర్తయిన జలాశయాల నీటి నిల్వ సామర్థ్యం 9,105.92 టీఎంసీలు. ఇందులో 1,788.99 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లతో కృష్ణా నది ప్రథమ స్థానంలో నిలిచింది. ఇందులో తెలుగు రాష్ట్రాల్లో ఉన్న రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యం 589.67 టీఎంసీలు కావడం గమనార్హం. అంటే.. దేశంలో అన్ని బేసిన్‌లలోని రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యం కృష్ణా బేసిన్ రిజర్వాయర్ల సామర్థ్యంలో 19.65 శాతమన్నమాట.

అత్యంత దిగువన బ్రహ్మపుత్ర

హిమాలయ పర్వతాల్లో హిమానీనదాల్లో జన్మించి దేశంలో ప్రవహించే గంగా నది అతి పెద్దది. గంగా బేసిన్‌లో ఉన్న జలాశయాల నీటి నిల్వ సామర్థ్యం 1,718.91 టీఎంసీలు. పశ్చిమ కనుమల్లో నాసిక్ వద్ద జన్మించి ద్వీపకల్పంలో ప్రవహించే గోదావరి రెండో అతి పెద్ద నది. ఈ బేసిన్‌లో రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యం 1,237.61 టీఎంసీలు. వీటిని పరిశీలిస్తే.. నీటి నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లలో గంగా, గోదావరి కంటే కృష్ణా నదే మిన్న అని స్పష్టమవుతోంది. రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యంలో గంగా, గోదావరి రెండు, మూడు స్థానాల్లో నిలవగా.. దేశంలో పశ్చిమం వైపు ప్రవహించే నర్మదా నది నాలుగో స్థానంలో నిలిచింది. ఇక దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే వర్షఛాయ ప్రాంతంలో పుట్టి, ప్రవహించే పెన్నా బేసిన్‌లో 239.59 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లున్నాయి. రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యంలో పెన్నా బేసిన్ దేశంలో తొమ్మిదో స్థానంలో నిలవడం గమనార్హం. హిమాలయ నది అయిన బ్రహ్మపుత్ర బేసిన్‌లో రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యం 88.65 టీఎంసీలే కావడం గమనార్హం.

దేశంలో ప్రధాన నదీ పరివాహక ప్రాంతాల్లోని రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం

నదీ పరివాహక ప్రాంతం	రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం (టీఎంసీలలో)
1.కృష్ణా	1,788.99
2.గంగా	1,718.91
3.గోదావరి	1,237.61
4.నర్మదా	770.54
5.సింధూ	572.99
6.మహానది	461.45
7.తాపి	322.71
8.కావేరి	320.81
9.పెన్నా	239.59
10.మహి	177.20
11.బ్రహ్మపుత్ర	88.65

సాగుకు సాంకేతిక సహకారం

- విశాఖలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేస్తాం
- 'సాక్షి'తో ఐరోపా బిజినెస్ అండ్ టెక్నాలజీ సెంటర్ సీఈవో అదా డైండో



సాక్షి, విశాఖపట్నం: వ్యవసాయ రంగంలో సాంకేతిక అంశాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలసి పని చేస్తామని యూరోపియన్ బిజినెస్ అండ్ టెక్నాలజీ సెంటర్(ఈబీటీసీ) సీఈవో అదా డైండో చెప్పారు. విశాఖలో ప్రారంభమైన జీ 20 గ్లోబల్ టెక్ సమ్మిట్–2023లో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన ఆమె 'సాక్షి'తో పలు అంశాల గురించి మాట్లాడారు.

విశాఖలో భిన్నమైన అవకాశాలు..

విశాఖపట్నం చాలా అందంగా ఉంది. నగరంలో ఉన్న భిన్నమైన వాతావరణం కారణంగా అనేక రంగాల అభివృద్ధికి కావాల్సిన మౌలిక సదుపాయాలు, అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఎన్ఆర్‌డీసీతో చేసుకున్న ఎంవోయూతో భవిష్యత్తులో ఈబీటీసీ విశాఖలోనూ పలు రంగాల్లో కలసి పని చేయనుంది.

వ్యవసాయ రంగంపై ప్రధాన దృష్టి

స్థిరమైన అభివృద్ధి, సాంకేతికత బదిలీ, ఆవిష్కరణ రంగాలలో ఐరోపా దేశాలు, భారత్ మధ్య సహకారం, భాగస్వామ్యాలను ప్రోత్సహించడంపై ఈబీటీసీ దృష్టి సారించింది. యూరోపియన్ వ్యవసాయ పద్ధతులు, విధానాలు భారతదేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రైతులకు అందించాలని భావిస్తున్నాం. యూరప్ వ్యవసాయానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. స్థానిక పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా స్థిరమైన, సమర్థవంతమైన వ్యవసాయ పద్ధతులను మా దేశంలో అభివృద్ధి చేశాం. అత్యాధునిక సాంకేతికత, జీపీఎస్ ఆధారిత వ్యవసాయ పద్ధతులను ఉపయోగిస్తున్నాం.

దిగుబడులు పెరిగేలా డ్రోన్ వ్యవస్థ..

ఆంధ్రప్రదేశ్‌లో రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు సంస్కరణలు అమలు చేస్తోంది. వీటికి ఐరోపా పద్ధతులు తోడైతే మరిన్ని సత్ఫలితాలు సాధించగలం. ఉదాహరణకు ఫీల్డ్ మ్యాపింగ్, రిమోట్ సెన్సింగ్, డ్రోన్‌ల వినియోగం పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఐరోపాలో రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్ని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఆధునిక సాంకేతికత, సేంద్రియ వ్యవసాయం తోడైతే మంచి దిగుబడులు సాధ్యమవుతాయని విశ్వసిస్తున్నాం.

విశాఖలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్

వ్యవసాయ రంగంలో పెద్ద ముందడుగు వేసేలా విశాఖపట్నంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఈబీటీసీ ఏర్పాటు చేస్తోంది. దీని ద్వారా ఏపీలోని రైతులకు అనేక అవకాశాలు కల్పించనున్నాం. టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్, వ్యవసాయంలో ఉత్తమ పద్ధతులు అవలంబించడం, ఎగుమతి ఆధారిత పంటలపై దృష్టిసారించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

పెద్ద ఉద్యోగం పక్కా

▶ మొదటి పేజీ తరువాయి

పలు కార్యక్రమాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యతతో ప్రతిష్టాత్మక సంస్థలు మన విద్యార్థులకు అవకాశాలు కల్పించేందుకు ఉత్సాహం చూపుతున్నాయి. తాజాగా ప్రముఖ ఐటీ సంస్థ ''విప్రో'' విద్యార్థులకు ఉన్నత చదువుతోపాటు ఉద్యోగం కూడా ఇచ్చేలా 'వర్క్ – ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్'ని రాష్ట్ర ప్రభుత్వంతో కలసి అమలు చేసేందుకు ముందుకొచ్చింది.

నెలవారీ స్టైఫెండ్.. రూ.5 లక్షల ప్యాకేజీతో జాబ్

వర్క్ – ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌కి ఎంపికైన వారికి ఎంటెక్ చేసే సమయంలో నెలవారీ స్టైఫెండ్‌ను విప్రో సంస్థ అందించనుంది. స్టైఫెండ్ కింద మొదటి ఏడాది నెలకు రూ.15,488 చొప్పున అందిస్తారు. రెండో ఏడాది నెలకు రూ.17,553 చొప్పున, మూడో ఏడాది రూ.19,618 చొప్పున ఇస్తారు. నాలుగో ఏడాది నెలకు రూ.23 వేలు చొప్పున చెల్లిస్తారు. కోర్సు పూర్తైన వెంటనే సంస్థలోనే ఉద్యోగాన్ని కల్పిస్తారు. ఎంటెక్‌లో పెర్ఫార్మెన్స్ ఆధారంగా వేతనాన్ని నిర్ణయిస్తారు. వేతనాల ప్యాకేజీ ఏడాదికి రూ.5 లక్షల నుంచి ప్రారంభం అవుతుంది. శిక్షణ కాలం 60 నెలలు. ఎంటెక్ విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం జాయినింగ్ బోనస్ కింద రూ.76 వేలు చెల్లిస్తారు. అయితే ఎంపికైన అభ్యర్థులు మధ్యలో నిష్క్రమించినా, అగ్రిమెంట్‌కు భిన్నంగా వ్యవహరించినా ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు రూ.75 వేలు చెల్లించాల్సి ఉంటుంది.

దరఖాస్తుకు రేపే తుది గడువు

రాష్ట్రంలోని విద్యార్థుల కోసం మూడు నగరాల్లో ఎంపిక ప్రక్రియ చేపడతారు. అసెస్‌మెంటు, డిస్కషన్‌ల ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. విప్రో ద్వారా 8,000 మందిని ఎంపిక చేస్తారు. దీనికి సంబంధించి వర్సిటీల రిజిస్ట్రార్లు, ప్రిన్సిపాళ్లతో ఇప్పటికే చర్చించారు. కృష్ణా, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన 2021, 2022 బ్యాచ్ గ్రాడ్యుయేట్లకు ఫిబ్రవరి 23న గుంటూరులో ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ఉత్తరాంధ్ర అభ్యర్థులకు అసెస్‌మెంట్, బిజినెస్ రౌండ్‌లను విశాఖపట్నంలో ఫిబ్రవరి 25, 26వ తేదీల్లో నిర్వహిస్తారు. రాయలసీమ విద్యార్థులకు ఫిబ్రవరి 28న తిరుపతిలో ఎంపిక ప్రక్రియను చేపడతారు. 2023 బ్యాచ్ విద్యార్థులకు అసెస్‌మెంట్, బిజినెస్ రౌండ్ల ఎంపిక ప్రక్రియ మార్చి లేదా ఏప్రిల్‌లో నిర్వహించనున్నారు. తేదీలను తరువాత ప్రకటిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు https://bit.ly//apsche-wipro వెబ్‌సైట్‌లో ఫిబ్రవరి 18వ తేదీలోగా రిజిస్టర్ చేసుకోవాలి.

నాస్కామ్, మైక్రోసాఫ్ట్‌తో ఇప్పటికే..

నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్) ద్వారా విద్యార్థులకు శిక్షణ కోర్సుల్లో రాష్ట్ర ప్రభుత్వం తర్ఫీదు అందిస్తోంది. శిక్షణ పొందిన అభ్యర్థులకు నాస్కామ్‌లో సభ్యత్వం కలిగిన 3 వేలకు పైగా సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించేలా ఒప్పందం చేసుకుని అమల్లోకి తెచ్చింది. మైక్రోసాఫ్ట్ ద్వారా వివిధ సర్టిఫికేషన్ కోర్సులను విద్యార్థులకు ఉచితంగా అందిస్తుండడంతో అంతర్జాతీయ స్థాయి ఉద్యోగావకాశాలు మరింత సులభతరమయ్యాయి. మైక్రోసాఫ్ట్ ద్వారా శిక్షణకు ప్రభుత్వం రూ.32 కోట్లకు పైగా వెచ్చించింది. ఇక సేల్స్‌ఫోర్స్, ఏడబ్ల్యూఎస్, బ్లూప్రిజమ్, ఆల్టరీ ఎక్స్, ఫుల్‌స్టాక్ తదితర సంస్థల ద్వారా లక్షలాది మందికి శిక్షణ కార్యక్రమాలు అమలవుతున్నాయి.

'ఉన్నత' దృష్టి ఫలితమే..

పాఠశాల విద్యను బలోపేతం చేస్తూనే ఉన్నత విద్యపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించడంతో అత్యుత్తమ ఫలితాలు ఆవిష్కృతమవుతున్నాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రొఫెసర్ బాలకృష్ణన్ నేతృత్వంలో నిపుణుల బృందాన్ని నియమించి ఆ నివేదిక ప్రకారం ఉన్నత విద్యలో పలు సంస్కరణలను ముఖ్యమంత్రి చేపట్టారు. ఉన్నత చదువులు అభ్యసించే వారికి జగనన్న విద్యాదీవెన కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు జగనన్న వసతి దీవెన కింద ఏడాదికి రూ.20 వేల వరకు అందిస్తున్నారు. కరిక్యులమ్‌ను నేటి పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేశారు. డిగ్రీ కోర్సులను ఆంగ్ల మాధ్యమంలోకి మార్చి ఆనర్ కోర్సులకు శ్రీకారం చుట్టారు. ఇంజనీరింగ్‌తోపాటు డిగ్రీ విద్యార్థులకు కూడా ఏడాదిపాటు ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేశారు. ఇంటర్న్‌షిప్‌కోసం రాష్ట్రవ్యాప్తంగా 27,119 పరిశ్రమలు, ఇతర సంస్థలను కాలేజీలకు అనుసంధానించారు. దీనికోసం ప్రత్యేక పోర్టల్ తెచ్చారు. ఇంటర్న్‌షిప్ సమయంలో పనితీరును అనుసరించి ఆయా సంస్థల్లోనే ఉద్యోగాలు దక్కుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న చర్యల ఫలితంగా రాష్ట్రంలో విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు గతంలో కన్నా భారీగా పెరిగాయి. 2018–19లో 37 వేల ప్లేస్‌మెంట్లు మాత్రమే ఉండగా 2021–22 నాటికి 42 శాతం వృద్ధి సాధించి 85 వేలకు పెరిగాయి. 2022–23లో 1,20,000 ప్లేస్‌మెంట్లను సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

బిట్స్ పిలానీలో ఎంటెక్.. ఆపై ఉద్యోగం

వర్క్ – ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్ ద్వారా అర్హులైన విద్యార్థులకు విప్రో సంస్థ ఫుల్ టైమ్ జాబ్, ఫుల్ స్పాన్సర్‌షిప్‌తో 'బిట్స్ – పిలానీ' (బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ)లో ఎంటెక్ కోర్సు చదివే అవకాశం కల్పిస్తోంది. 2021, 2022, 2023 బ్యాచ్‌లకు చెందిన గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు ఈ అవకాశం కల్పించనున్నారు. బీసీఏ, బీఎస్సీ గ్రాడ్యుయేట్లను అర్హులుగా పరిగణించనున్నారు. కంప్యూటర్ సైన్సు, ఐటీ, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఎలక్ట్రానిక్స్, ఫిజిక్స్ సబ్జెక్టులతో ఆయా కోర్సులు పూర్తిచేసిన వారు ఇందుకు అర్హులు. తప్పనిసరిగా 60 శాతం మార్కులు లేదా 6 సీజీపీఏ కలిగి ఉండాలి. బ్యాక్‌లాగ్‌తో ఒకసబ్జెక్టు వరకు అవకాశం కల్పిస్తారు. అయితే 6వ సెమిస్టర్ నాటికి అన్ని బ్యాక్‌లాగ్ సబ్జెక్టులను పూర్తి చేయాల్సి ఉంటుంది. మూడేళ్ల కాలపరిమితిలో డిగ్రీ పూర్తి చేసిన వారికి ఈ అవకాశం కల్పించనున్నారు.

రాష్ట్రంలో వివిధ సంస్థల ద్వారా శిక్షణ కార్యక్రమాలు ఇలా

సంస్థ	అభ్యర్థుల సంఖ్య
మైక్రోసాఫ్ట్	60,159
సేల్స్‌ఫోర్స్	22,404
ఏడబ్ల్యూఎస్	12,076
పాలోఆల్టో	9263 సైబర్ సెక్యూరిటీ వర్చువల్ ఇంటర్న్‌షిప్
బ్లూప్రిజం	3545 రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ వర్చువల్ ఇంటర్న్‌షిప్
సెలోనిస్ ప్రాసెస్	1915 మైనింగ్ వర్చువల్ ఇంటర్న్‌షిప్
అల్టరీఎక్స్	1728 డేటా అనలిటిక్స్ వర్చువల్ ఇంటర్న్‌షిప్
యూఐపాత్	917 ఆర్పీఏ
దెవలపర్ వర్చువల్ ఇంటర్న్‌షిప్	
ఫుల్ స్టాక్	4135
పైథాన్	3742
హెచ్ఆర్	2091
బీఎఫ్ఎస్ఐ	1968
డిజిటల్ మార్కెటింగ్	2931
నెట్‌వర్కింగ్	1746
జావా డెవలపర్	2143
డీబీ డెవలపర్	1890
యానిమేషన్	950
గూగుల్ ఆండ్రాయిడ్	1840
మొత్తం	135,443

ఇంటర్న్‌షిప్ కోసం జిల్లాల వారీగా ఎంపిక చేసిన మాన్యుఫాక్చరింగ్, సర్వీస్ విభాగాల సంఖ్య

కేటగిరీ	మాన్యుఫాక్చరింగ్	సర్వీస్
మైక్రో	11,510	1,378
స్మాల్	10,169	1,757
మీడియం	569	149
లార్జ్	1,191	227
మెగా	144	25
మొత్తం	23,583	3,536

రాష్ట్రంలో ప్లేస్‌మెంట్లు ఏటా పెరుగుతున్న తీరు ఇలా..

సంవత్సరం	ప్లేస్‌మెంట్లు	సగటు వేతనం
2018–19	37,000	రూ. 2.5 లక్షలు
2019–20	52,000	రూ. 3.5 లక్షలు
2020–21	69,000	రూ. 4.2 లక్షలు
2021–22	85,000	రూ. 5 లక్షలు

ఐటీ కేంద్రంగా విశాఖ



సదస్సుకు హాజరైన దేశ, విదేశీ విద్యార్థులు

సాక్షి, విశాఖపట్నం: దిగ్గజ ఐటీ కంపెనీలు విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఆసక్తి చూపుతున్నాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. సమీప భవిష్యత్తులో విశాఖ ఐటీ డెస్టినీగా అవతరించనుందని, మరిన్ని టెక్ కంపెనీలు ఏర్పాటయ్యేలా సీఎం జగన్ కృషి చేస్తున్నారని చెప్పారు. విశాఖ, తిరుపతి, అనంతపురంలో ఇప్పటికే ఐటీ పార్కులు ఏర్పాటు కాగా భోగాపురంలో త్వరలోనే కొత్త ఐటీ పార్క్ రానుందని వివరించారు. కరోనా తర్వాత ఐటీ ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం అనుసరించగా రాష్ట్రంలో వర్క్ ఫ్రమ్ హోమ్ టౌన్ అనే నూతన విధానాన్ని సీఎం జగన్ తీసుకొచ్చారని పేర్కొన్నారు. గురువారం విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం, పల్సస్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్లోబల్ టెక్ సమ్మిట్ – 2023ని ప్రారంభించిన అనంతరం మంత్రి విడదల రజిని, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, పల్సస్ సీఈవో గేదెల శ్రీనుబాబుతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఆధునిక ఆవిష్కరణలతో పాటు ఐటీ, ఫార్మా, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానంపై పెట్టుబడులకు సంబంధించి ఈ సదస్సు రెండు రోజుల పాటు జరగనుంది. జీ–20 దేశాలతో పాటు వివిధ దేశాలకు చెందిన 300 కంపెనీలకు చెందిన ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా యూరోపియన్ బిజినెస్ అండ్ టెక్నాలజీ సెంటర్(ఈబీటీసీ), నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఆర్‌డీసీ) మధ్య సైన్స్, టెక్నాలజీపై ఎంవోయూ కుదిరింది. సదస్సులో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, బ్రిటిష్ హై కమిషన్ ఇన్ ఇండియా ప్రగ్యా చతుర్వేది, సెంట్రల్ డ్రగ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఏడీసీ అభిజిత్ ఘోష్, ఎన్ఆర్‌డీసీ సీఎండీ కమడోర్ అమిత్ రస్తోగి, జీ 20 నేషనల్ కోఆర్డినేటర్ డా.నవ సుబ్రహ్మణ్యన్‌తో పాటు సియోల్, టోక్యో, రోమ్, పారిస్, న్యూయార్క్, మెల్‌బోర్న్, బీజింగ్, లండన్ తదితర దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రపంచం చూపు.. విశాఖ వైపు



భవిష్యత్తు టెక్నాలజీని రూపొందించేందుకు గ్లోబల్ టెక్ సమ్మిట్ గేట్ వే లాంటిది. ప్రపంచం చూపు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో అగ్ర భాగాన ఉన్న విశాఖ వైపే ఉంది. డిజిటల్ భారత్ లక్ష్యమైన సాంకేతికత, ఆవిష్కరణలు, వ్యవస్థాపకతతో నడిచే కొత్త భారత్‌ను సృష్టించాలి. డిజిటల్ అక్షరాస్యతను ప్రోత్సహించడం, డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ సేవల విస్తరణ, కృత్రిమ మేధస్సు, బ్లాక్‌చెయిన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను స్వీకరించడం వంటివి అమలు చేసే దిశగా వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గ్లోబల్ టెక్ సమ్మిట్ ఏర్పాటు చేశాం.

– గేదెల శ్రీనుబాబు, పల్సస్ గ్రూప్ సీఈవో

డిజిటల్ హెల్త్‌లో రికార్డు



డిజిటల్ హెల్త్‌కేర్‌లో విప్లవాత్మక మార్పులకు ఆంధ్రప్రదేశ్ నాంది పలికింది. మారుమూల ప్రాంతాలకు వైద్య సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం రోజూ 66 వేల మందికి టెలి కన్సల్టెన్సీ సేవలందిస్తున్నాం. రాష్ట్రంలో నాడు–నేడు ద్వారా ఆసుపత్రులు గణనీయంగా అభివృద్ధి చెందాయి. 17 మెడికల్ కాలేజీలు నిర్మాణ దశలో ఉన్నాయి. డిజిటల్ హెల్త్‌లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రికార్డు సృష్టించింది. ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పేదలకు నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందచేస్తున్నారు.

– విడదల రజిని, వైద్యారోగ్య శాఖ మంత్రి

జనం మెచ్చిన గిరిజన ఉత్పత్తులు



టెక్నాలజీ ద్వారా అటవీ ఉత్పత్తులకు ప్రాచుర్యం పెరుగుతుంది. గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ప్రవేశపెట్టిన ఈ కామర్స్, ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానం ఇందుకు నిదర్శనం. ప్రపంచ ప్రసిద్ధి చెందిన అరకు కాఫీ, తేనె, పసుపు, చింతపండు వంటి ఉత్పత్తులు ఇప్పుడు అమెజాన్ లాంటి ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థల ద్వారా ప్రపంచానికి చేరువయ్యాయి. తద్వారా గిరిజనులకు ఆర్థిక పరిపుష్టి కల్పించినట్లైంది.

– పీడిక రాజన్నదొర, ఉపముఖ్యమంత్రి, గిరిజన శాఖ మంత్రి

గ్రంథాలయ పరిషత్ సభ్యుల నియామకం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ సభ్యులుగా ఇద్దరిని ప్రభుత్వం నియమించింది. జీను మహేష్‌బాబు (తూర్పు గోదావరి), వై. నరసింహారావు (పశ్చిమ గోదావరి)లను సభ్యులుగా నియమిస్తూ గురువారం జీవో జారీచేసింది.



హైదరాబాద్‌లో చక్కర్లు కొట్టకుండా ముందు ఏపీలో అడుగుపెట్టండి సార్.. ప్లీజ్!!

బీజేపీకి 'కన్నా' గుడ్‌బై

▶ మొదటి పేజీ తరువాయి

ఆకర్షణతో బీజేపీలో చేరినట్లు కన్నా చెప్పారు. సామాన్య కార్యకర్తగా పార్టీలో పనిచేశానని, 2018లో బీజేపీ అధ్యక్షుడిగా అవకాశమిచ్చారని, 2019 ఎన్నికలకు పదినెలల ముందు అధ్యక్ష బాధ్యతలు ఇచ్చారని చెప్పారు. తనను అధ్యక్షుడిగా ప్రకటించిన పదినెలల్లో 175 నియోజకవర్గాల్లో పర్యటించి, 2019 ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో అభ్యర్థుల్ని నిలబెట్టానని చెప్పారు. అలాగే, 2024లో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేశానన్నారు. మరోవైపు.. 2019 తర్వాత పలువురు మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు అన్ని పార్టీల నేతలు బీజేపీలో చేరారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆ పార్టీ నుంచి పలువురు నేతలు బీజేపీలో చేరారని కన్నా గుర్తుచేశారు. ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై తన పోరాటం కొనసాగించానని, అమరావతి రాజధాని మార్పుపై పెద్ద ఎత్తున పోరాడినట్లు చెప్పారు. కోవిడ్ తర్వాత తన స్థానంలో సోము వీర్రాజును అధ్యక్షుడిని చేశారని, ఆయన కక్ష సాధింపుతో పనిచేశారని కన్నా ఆరోపించారు. తనకు మోదీ మీద అభిమానం జీవితకాలం ఉంటుందని.. కానీ, రాష్ట్ర బీజేపీలో జరుగుతున్న పరిస్థితులు చూసి పార్టీలో ఇమడలేక బీజేపీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఆయన ప్రకటించారు. కన్నాతో పాటు ఆయన అనుచరులు కూడా కొందరు బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

జీవీఎల్ సమాధానం చెప్పాలి..

బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు వైఖరిపైనా కన్నా మండిపడ్డారు. ఒక్క రాత్రిలో నాయకుడు కావాలనుకున్న వారికి కాపుల్ని బీసీల్లో చేర్చడంతో పాటు రంగా వర్ధంతులు, విగ్రహాలు పెట్టుకోవడం చేస్తారని ఎద్దేవా చేశారు. కాపుల విషయంలో పార్టీలో చర్చించి, పార్టీ తరఫున చేయాల్సిన పనుల్ని, వ్యక్తిగతంగా ఎందుకు చేపడుతున్నాడో జీవీఎల్ సమాధానం చెప్పాలన్నారు. కాపుల కోసం ఉద్యమం జరిగిన సమయంలో ఆయన ఎందుకు పాల్గొనలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. తాను ఏ పార్టీలో చేరేది త్వరలో అనుచరులతో చర్చించిన తర్వాతే వెల్లడిస్తానని కన్నా చెప్పారు.

సత్తెనపల్లి పైనే కన్ను..

రాజీనామా అనంతరం తన భవిష్యత్ కార్యాచరణపై ముఖ్య అనుచరులతో కన్నా లక్ష్మీనారాయణ చర్చించారు. ప్రధానంగా సత్తెనపల్లిలో పోటీచేయాలన్న ఉద్దేశంతో ఉన్న ఆయన ఏ పార్టీలో చేరాలన్న దానిపై ఇంకా ఒక నిర్ణయం తీసుకోలేదని సమాచారం. సత్తెనపల్లిలో పోటీచేయాలని ఆయన ఒక దశలో ఆలోచించారు. అయితే, బీజేపీ–జనసేన బదులుగా, తెలుగుదేశం–జనసేన మధ్య పొత్తుకుదిరే అవకాశం ఉండటంతో సోము వీర్రాజును టార్గెట్ చేసి పార్టీ నుంచి బయటికి వచ్చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు గత కొంతకాలంగా తన అసంతృప్తిని మీడియా ముందు వెళ్లగక్కుతూ వచ్చారు. మరోవైపు.. జనసేన–టీడీపీ మధ్య ఇప్పటికే పలుమార్లు సంప్రదింపులు జరిగాయి. కానీ, వీటి మధ్య పొత్తు ఖరారు కాకపోవడంతో ఏ పార్టీలో చేరాలన్న అంశంపై కన్నా సందిగ్ధంలో ఉన్నారు. ఆ రెండు పార్టీల మధ్య పొత్తు ఉండే పక్షంలో జనసేనలో చేరాలని, లేనిపక్షంలో టీడీపీ వైపు ఆలోచిస్తున్నట్లు సమాచారం. టీడీపీలో చేరితే సత్తెనపల్లి సీటు ఇస్తామని.. అయితే పెదకూరపాడు, గుంటూరు పశ్చిమ సీట్లను గెలిపించే బాధ్యత తీసుకోవాలని ఆ పార్టీ కోరినట్లు తెలిసింది. దీనిపై కార్యకర్తలతో చర్చించి ఒక నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఏ పార్టీలో చేరేది ఈ నెల 24న తెలుస్తుందని అనుచరులు చెబుతున్నారు.

ఏపీ సీడ్స్‌కు 'గవర్నెన్స్ నౌ' అవార్డు

- వరుసగా రెండోసారి జాతీయ పురస్కారం
- మూడున్నరేళ్లుగా ఆర్బీకేల ద్వారా విత్తనాల పంపిణీలో విశేష కృషి ఫలితం



జస్టిస్ దీపక్ మిశ్రా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శేఖర్ బాబు, సుష్మిత

సాక్షి, అమరావతి: వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీ సీడ్స్)ను జాతీయ స్థాయిలో మరో ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలకు 'గవర్నెన్స్ నౌ' అంతర్జాతీయ సంస్థ తొమ్మిదేళ్లుగా ఈ అవార్డులను ప్రదానం చేస్తోంది. ఈ ఏడాది పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్ (పీఎస్‌యూ–ప్రభుత్వరంగ సంస్థలు) యూనిట్స్ కేటగిరీలో ఏపీ సీడ్స్‌కు రెండోసారి గవర్నెన్స్ నౌ అవార్డును ప్రకటించింది. ఢిల్లీలో గురువారం జరిగిన జాతీయ స్థాయి సమావేశంలో సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా చేతుల మీదుగా ఏపీ సీడ్స్ ఎండీ డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు, చైర్‌పర్సన్ పేర్నేటి సుశ్మిత ఈ అవార్డును అందుకున్నారు.

సీఎం కృషికి గుర్తింపుగానే అవార్డు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకనుగుణంగా రైతులకు ఏపీ సీడ్స్ చేస్తున్న కృషికి గుర్తింపుగానే ఈ అవార్డు దక్కింది. ఆర్బీకేల్లోని కియోస్క్‌ల్లో బుక్ చేసుకున్న వెంటనే రైతు ముంగిట నాణ్యమైన సర్టిఫైడ్ విత్తనం అందించడం దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే జరుగుతోంది. వరుసగా రెండో ఏడాది కూడా ప్రతిష్టాత్మక గవర్నెన్స్ నౌ అవార్డు రావడం గొప్ప విషయం. మూడేళ్లుగా వరుసగా అవార్డులు రావడం సంస్థ ఆవిర్భవించిన తర్వాత ఇదే తొలిసారి. ఇది రైతుల విజయం, ఈ అవార్డు వారికే అంకితం.

– డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు, ఎండీ, ఏపీ సీడ్స్

14 ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ షురూ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 14 ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. 9 స్థానిక సంస్థల నియోజకవర్గాలు, 3 పట్టభద్రులు, రెండు టీచర్ల నియోజకవర్గాలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం నుంచి మొదలయ్యింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా గురువారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ ఫిబ్రవరి 23 కాగా.. ఉపసంహరణకు ఫిబ్రవరి 27ను చివరి తేదీగా ప్రకటించారు. మార్చి 13న ఎన్నికలు నిర్వహించి.. మార్చి 16న ఫలితాలను ప్రకటిస్తారు.

ఎన్నికలు జరిగే స్థానిక నియోజకవర్గాలు..

అనంతపురం, కడప, నెల్లూరు, పశ్చిమగోదావరి జిల్లాలో రెండు, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, చిత్తూరు, కర్నూలుతో పాటు శ్రీకాకుళం–విజయనగరం–విశాఖపట్నం, ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు, కడప–అనంతపురం–కర్నూలు పట్టభద్రుల నియోజకవర్గాలకు, ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు, కడప–అనంతపురం–కర్నూలు టీచర్ల నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. కౌంటింగ్ పూర్తయ్యే వరకు ఎన్నికలు జరుగుతున్న జిల్లాల్లో కోడ్ అమల్లో ఉంటుంది.

సాగులో డ్రోన్ల సాయం

- మన్యంలో పెరుగుతున్న వినియోగం
- రైతు భరోసా కేంద్రాల పరిధిలో 3 డ్రోన్లు అందజేత



దుద్దుకూరులో డ్రోన్‌తో జీడిమామిడి తోటకు పురుగుమందు పిచికారీ

బుట్టాయగూడెం: సాగులో డ్రోన్‌ల సాయంతో రైతుల శ్రమ, సమయం ఆదా అవుతున్నాయి. పురుగు మందుల పిచికారీ పనులకు ఈ డ్రోన్‌లు వాడడం వల్ల ఖర్చు తగ్గించుకోవడంతో పాటు కూలీల కొరతను అధిగమిస్తున్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగాన్ని ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తుంది. వ్యవసాయానికి సానుకూల నిర్ణయాలు తీసుకుంటూ రైతులను ప్రోత్సహించడంతో రాష్ట్రంలో వ్యవసాయం పండుగలా మారింది. ఫలితంగా ప్రతీ ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతూనే ఉంది. ఈ క్రమంలో ఇతర రంగాల్లోనూ ఉపాధి పెరుగుతుంది. ప్రస్తుతం వ్యవసాయంలో కూలీల కొరత తీవ్రంగా ఉంది. పురుగు మందుల పిచికారీకి కూలీలు దొరకడమే గగనంగా మారింది. దొరికినా రెట్టింపు కూలీ చెల్లించాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లాలోని గిరిజన ప్రాంతంలో పొగాకు, జీడిమామిడి పంటలతోపాటు వరి పంటలపై కూడా పురుగు మందుల పిచికారీ పనులను ముమ్మరంగా డ్రోన్‌ల సాయంతో చేస్తున్నారు.

రాయితీపై డ్రోన్‌లు అందజేత

వ్యవసాయానికి రైతులకు ఉపయోగపడే విధంగా కిసాన్ డ్రోన్ పథకంలో ప్రభుత్వం బీఎస్సీ చదివి వ్యవసాయం చేస్తున్న వారికి 50 శాతం ఇతర రైతులకు 40 శాతం రాయితీపై డ్రోన్‌లను అందజేస్తున్నారు. మండలంలోని ప్రతీ రైతు భరోసా కేంద్రంలో ముగ్గురు రైతులను ఎంపిక చేసి మండలానికి 3 చొప్పున డ్రోన్‌లు అందజేసేలా అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.

డ్రోన్‌ల నిర్వహణకు ఉచిత శిక్షణ

కిసాన్ డ్రోన్ పథకంలో రైతులకు డ్రోన్‌లు అందజేయడమే కాకుండా డ్రోన్‌ల వినియోగంపై రైతులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. డ్రోన్‌ల వినియోగంలో శిక్షణ పొందాలంటే రూ.20,000 నుంచి రూ. 60,000 ఖర్చు అవుతుంది. ఈ శిక్షణను వ్యవసాయశాఖ ద్వారా మార్టేరు, బాపట్ల, తదితర ప్రాంతాల్లో రైతులకు ఉచితంగా ఇచ్చేలా సన్నాహాలు చేస్తున్నారు.

ఖర్చు తక్కువ.. పని ఎక్కువ



పొలాల్లో డ్రోన్‌లతో పురుగుమందులు పిచికారీ చేయించడం వల్ల కూలీల ఖర్చు తగ్గుతుంది. బ్యాటరీ పంపు కంటే తక్కువ మందు పడుతుంది. పని ఎక్కువ కలిసివస్తుంది. రైతులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అందివస్తున్న ఆధునిక సాంకేతికతను రైతులకు అందించేలా ప్రోత్సహిస్తున్నాం. జీడిమామిడి పంటలకు డ్రోన్‌ల ద్వారా పిచికారీ ఎంతో మేలుగా ఉంటుంది. కేవీకే ద్వారా రైతులకు డ్రోన్ వినియోగంపై అవగాహన కూడా కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

–టి.జానకిరామ్, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, వెంకటరామన్నగూడెం

రైతులకు ఉచిత శిక్షణ



డ్రోన్‌లు కొనుగోలు చేసిన రైతులకు వాటి వినియోగంపై ఉచితంగా శిక్షణలు ఇప్పించేలా కృషి చేస్తున్నాం. డ్రోన్ ఖరీదులో 50 శాతం సబ్సిడీ, 40 శాతం బ్యాంక్ రుణం ఉండగా 10 శాతం రైతు వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. ప్రతీ సచివాలయానికి 3 యూనిట్లుగా డ్రోన్‌లు అందజేసే ఏర్పాటు చేస్తున్నాం.

–పీజీ బుచ్చిబాబు, వ్యవసాయ సంచాలకుల, కేఆర్‌పురం, బుట్టాయగూడెం మండలం

20న 'ఏపీఈఆర్సీ' రాష్ట్ర సలహా సమావేశం

- ఇంధనశాఖ సమీక్షలో ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) 18వ రాష్ట్ర సలహా సమావేశాన్ని ఈ నెల 20న తిరుపతిలో నిర్వహించనున్నట్లు మండలి చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి తెలిపారు. ఏపీఈఆర్సీ సభ్యులు పి.రాజగోపాల్‌రెడ్డి, ఠాకూర్‌రామ్‌సింగ్‌తో కలిసి ఇంధన శాఖ అధికారులతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిస్కంలు 2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన అగ్రిగేట్ రెవెన్యూ రిక్వైర్‌మెంట్ (ఏఆర్ఆర్), పవర్ టారిఫ్, క్రాస్ సబ్సిడీ వంటి ప్రతిపాదనలపై సమావేశంలో చర్చిస్తామని వెల్లడించారు. ఎల్ఈడీ ట్యూబ్‌లైట్లు, బ్రష్‌లెస్ డైరెక్ట్ కరెంట్ సీలింగ్ ఫ్యాన్లు, ఎయిర్ కండిషనర్లు వంటి ఉపకరణాలు గృహ వినియోగదారులకు విద్యుత్‌ను ఆదా చేయడానికి, విద్యుత్ బిల్లులను తగ్గించడానికి, పర్యావరణాన్ని పరిరక్షించడానికి సహాయపడతాయని ఆయన వివరించారు. వీటిని సమకూర్చడం కోసం మార్చి 15 నాటికి టెండర్లు ఖరారవుతాయని, అనంతరం విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలో ఆన్–బిల్ ఫైనాన్సింగ్ మోడల్, ముందస్తు చెల్లింపు మోడల్ ద్వారా వినియోగదారులకు వీటిని అందించాలన్నారు. వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడంలో భాగంగా, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, కొత్త కనెక్షన్ల విడుదల వంటి సేవల్లో ఆటోమేటిక్ పరిహారం చెల్లింపు చేపట్టాలని ఆదేశించారు. ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తుదారుల సీనియారిటీ జాబితాను తమ వెబ్‌సైట్‌లలో ప్రచురిస్తున్నామని చైర్మన్ తెలిపారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్, డిస్కంల సీఎండీలు కె.సంతోష రావు, జె.పద్మాజనార్దనరెడ్డి, ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి వెంకటాపురం

- కుప్పం నియోజకవర్గంలోని ఆ గ్రామం ఒకప్పుడు టీడీపీ కంచుకోట
- రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పాలనకు ఆకర్షితమై టీడీపీని వీడిన 60 కుటుంబాలు
- ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ భరత్, నాయకులు

శాంతిపురం: చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం కర్లగట్ట పంచాయతీలోని వెంకటాపురంలో దాదాపు 60 కుటుంబాలు మూకుమ్మడిగా తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామంలో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వీరంతా పార్టీ మారారు. రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న ఆధ్వర్యంలో పార్టీలోకి వచ్చిన వీరికి ఎమ్మెల్సీ భరత్ కండువాలు వేసి ఆహ్వానం పలికారు. ప్రజలు, పేదల కోసం ప్రతిక్షణం తపిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఆయన కోరారు. దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న గ్రామంలో ఇప్పటివరకు మూడు కుటుంబాలు మాత్రమే వైఎస్సార్‌సీపీలో ఉండేవి. ఇప్పుడు ఒక్కసారిగా దాదాపు 60 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామంలో పట్టున్న తమ్మన్నగారి వెంకటస్వామి, కోళ్లఫారం పెద్దన్నగారి జయవేలు, గొల్లెప్పగారి వెంకటస్వామి, గురుస్వామి వెంకటేష్, సుబ్బక్కగారి సుబ్రమణ్యం, గురుస్వామప్పగారి వెంకటేశు, మునివెంకట, రంగస్వామి, ఎ.వి. రమేష్, ఎస్.సుబ్బన్న సహా పలు కుటుంబాల పెద్దలు పార్టీలో చేరారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో వివక్షకు తావులేకుండా తమకు లబ్ధిచేకూరడం, ఎమ్మెల్సీ భరత్ నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలు తీర్చడంతో తాము పార్టీలో చేరుతున్నామని గ్రామస్తులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వసుంధర, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు చంగప్ప, కృష్ణమూర్తి, స్థానిక సర్పంచ్ గోవింద్, ఎంపీటీసీ సభ్యుడు చలం, బెంగళూరు మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల త్యాగం అజరామరం

స్వగ్రామాలను ఖాళీ చేసిన విమానాశ్రయ నిర్వాసితులు

- అన్ని విధాలా వారికి అండగా నిలిచిన ప్రభుత్వం
- ఒక్కో కుటుంబానికి 5 సెంట్లు ఇంటి స్థలం
- రవాణా చార్జీలతో సహా రూ.9.20 లక్షల చొప్పున ఆర్థిక సాయం
- సకల సౌకర్యాలతో పునరావాస కాలనీల నిర్మాణం
- రూ.30 కోట్లతో గూడెపువలస, లింగాలవలస కాలనీల్లో వసతులు
- విశాలమైన రోడ్లు, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు
- ప్రశాంత వాతావరణంలో నిర్వాసితుల తరలింపు పూర్తి




గూడెపువలసలోని నిర్వాసిత కాలనీ

సాక్షి ప్రతినిధి, విజయనగరం: అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం.. ఉమ్మడి విజయనగరం జిల్లాకే కాదు ఉత్తరాంధ్ర ప్రాంతానికే మణిహారం కాబోతోంది!. భోగాపురం వద్ద సాకారం కానున్న ఈ విమానాశ్రయానికి అవసరమైన భూములను ఇచ్చిన నాలుగు గ్రామాల ప్రజల త్యాగం అజరామరమే!. వారి త్యాగానికి తగ్గట్టుగానే ప్రభుత్వం వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది. నిబంధనల ప్రకారం పూర్తి స్థాయిలో పరిహారం, పునరావాసం (ఆర్అండ్ఆర్ ప్యాకేజీ) కల్పించింది. ప్రతి నిర్వాసిత కుటుంబానికి 5 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వడమే గాక ఆధునిక వసతులతో కూడిన కొత్త కాలనీలను నిర్మించింది. సుమారు రూ.30 కోట్ల నిధులతో మౌలిక సదుపాయాలను కల్పించింది. కలెక్టర్ ఎ.సూర్యకుమారి పర్యవేక్షణలో విజయనగరం ఆర్డీఓ సూర్యకళ, భోగాపురం తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు ప్రత్యేక కృషితో నిర్వాసితుల తరలింపు ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయింది. విమానాశ్రయం నిర్మాణ పనుల శంకుస్థాపనకు మార్గం సుగమం అయ్యింది.

తెరపైకి రెండు కొత్త ఊళ్లే...

నిర్వాసితులైన బొల్లింకలపాలెం, రెల్లిపేట, మరడపాలెం, ముడసర్లపేట గ్రామస్తుల సౌకర్యార్థం ప్రభుత్వం రెండు కొత్త ఊళ్లు (కాలనీలు)ను నిర్మించింది. మరడపాలెం గ్రామానికి చెందిన 223 కుటుంబాలకు, ముడసర్లపేట గ్రామానికి చెందిన 33 కుటుంబాలకు పోలిపల్లి రెవెన్యూ పరిధిలోని లింగాలవలసలో 25 ఎకరాల విస్తీర్ణంలోని ప్రత్యేక కాలనీలో ఆవాసం కల్పించారు. రెల్లిపేటకు చెందిన 65 కుటుంబాలకు, బొల్లింకలపాలెంకు చెందిన 55 కుటుంబాలకు గూడెపువలసలో 17 ఎకరాల పరిధిలో నిర్మించిన కాలనీ ఇప్పుడు కొత్తఊరు అయ్యింది. రెండు కొత్త ఊళ్లలో ఇప్పుడు 376 కుటుంబాలు నివసిస్తున్నాయి. వారు స్వగ్రామాల నుంచి ఆయా ఊళ్లకు తరలివెళ్లడానికి రూ.50 వేల చొప్పున రవాణా చార్జీల సహా రూ.9.20 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించింది.



కాలనీలో పార్క్


అయినప్పటికీ గ్రామాల నుంచి కాలనీలకు తమ సామగ్రి, వస్తువులు, పాడి పశువుల సహా ప్రతి ఒక్కటి తీసుకెళ్లడానికి అధికారులు ఉచితంగా ట్రాక్టర్లను ఏర్పాటు చేయడం విశేషం. తాత్కాలికంగా ఉచిత భోజన సదుపాయం కల్పించారు. రెండు కాలనీల్లో వైద్య బృందాలను అందుబాటులో ఉంచారు.

టౌన్‌షిప్ మాదిరిగా మౌలిక సదుపాయాలు...

గూడెపువలస, లింగాలవలస కాలనీల్లో దాదాపు రూ.30 కోట్లు వెచ్చించి విశాలమైన సీసీ రోడ్లు, మెయిన్ రోడ్డుకు అనుసంధానం చేస్తూ అప్రోచ్ రోడ్లు, పిల్లల సౌకర్యార్థం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం నిర్మించింది. పార్కులు, కమ్యూనిటీ భవనాలు, కల్యాణ మండపాలు, గ్రామ దేవతల గుళ్లు, తాగునీటి సదుపాయం నిమిత్తం ఓవర్ హెడ్ ట్యాంకులు, ఇంటింటికీ కుళాయిలు ఉన్నాయి. పోస్టాఫీసు, బిజినెస్ కాంప్లెక్సులు, పశు వైద్యశాలలు కూడా వచ్చాయి. చెత్త తరలింపు కేంద్రాలు, నిత్యం విద్యుత్ సరఫరా ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు.

ఉపాధి కల్పనకు కలెక్టరు ప్రత్యేక చొరవ

నిర్వాసిత కాలనీలకు చేరుకున్న ప్రజలకు తక్షణ ఉపాధి కల్పించేందుకు కలెక్టర్ ఎ.సూర్యకుమారి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. డ్వామా పీడీ ఉమామహేశ్వరిని కాలనీలకు పంపించారు. ఆమె నివేదిక మేరకు బుధవారం నుంచే కొంతమందికి ఉపాధి హామీ పథకంలో స్థానికంగా పని కల్పించారు. కాలనీలకు సమీప ప్రాంతంలో వారికి జాబ్ కార్డులను అనుసంధానం చేశారు.



లింగాలవలసలో స్కూల్

మిగిలిన వారికీ పరిహారం

ప్రస్తుతం ప్యాకేజీ వర్తించని మరో 25 కుటుంబాలకు కూడా ఆర్థిక సాయం అందజేస్తాం. 18 ఏళ్లు నిండిన వారికి ప్యాకేజీ అందించే విషయంలో కోర్టు ఇచ్చే ఉత్తర్వుల మేరకు నిర్ణయం తీసుకుంటాం. వలస కార్మికుల సౌకర్యార్థం ప్రత్యేక స్థలం కేటాయించి జగనన్న కాలనీ మాదిరి ప్రత్యేక కాలనీ నిర్మిస్తాం.

– సూర్యకళ, ఆర్డీఓ, విజయనగరం

అన్నీ నిర్వాసితుల సమ్మతితోనే...

నిర్వాసితుల సమ్మతితోనే తరలింపునకు సంబంధించి అన్ని పనులూ పూర్తి చేశాం. తగిన గడువు తర్వాతనే తరలింపు ప్రక్రియను చేపట్టాం. 2021లోనే పరిహారం చెల్లించాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిర్వాసితుల విజ్ఞప్తి మేరకు పలుమార్లు గడువు పెంచుతూ వచ్చాం. సంక్రాంతి తర్వాత కొత్త కాలనీలకు వెళ్లిపోతామని నిర్వాసితులే చెప్పారు. అయినా, మరొక నెల గడువు ఇచ్చాం. కాలనీల్లో ప్రభుత్వం తరఫున చేయాల్సిన అన్ని రకాల పనులను పూర్తి చేశాం. పరిస్థితులు అనుకూలించక అక్కడక్కడ నిర్వాసితులు ఇళ్లను సకాలంలో నిర్మించుకోలేకపోయారు. త్వరలోనే అన్నీ పూర్తవుతాయి. మౌలిక వసతుల కల్పనలో ఎక్కడా ఇబ్బందులు లేవు.

– కోరాడ శ్రీనివాసరావు, తహసీల్దార్, భోగాపురం

అన్ని సదుపాయాలు ఉన్నాయి..



పునరావాస కాలనీలో అన్ని సదుపాయాలు ఉన్నాయి. వసతులతో కూడిన కాలనీ సిద్ధం చేశారు. బడి, గుడి, విద్య, వైద్యం తదితర సౌకర్యాలు కల్పించారు. మాకు సంతోషంగా ఉంది.

– ఎర్రంశెట్టి పైడయ్య, నిర్వాసితుడు, రెల్లిపేట గ్రామం

భవిష్యత్‌లో మంచి అవకాశాలు



మా కాలనీకి సమీపంలోనే హోటళ్లు, ఐటీ పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని తెలిసింది. ఇవి వస్తే మా ప్రాంతం మరింత అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్న నమ్మకం మాకుంది. మాకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు వస్తాయి.

– ఎర్రంశెట్టి అప్పలనర్సమ్మ, నిర్వాసితురాలు, రెల్లిపేట గ్రామం

తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలి...



ఇంకా కొన్ని సదుపాయాలకు సంబంధించిన పనులు మా కాలనీలో పూర్తి చేయాల్సి ఉంది. అధికారులే ఇకపై కూడా పూర్తి చొరవ తీసుకొని వాటిని పూర్తి చేయాలి.

– ఎర్రంశెట్టి లక్ష్మి, నిర్వాసితురాలు, రెల్లిపేట గ్రామం

ఎక్కడికైనా రవాణా సౌకర్యం...



ఇటు విజయనగరం, అటు విశాఖపట్నం ఎక్కడికి వెళ్లాలన్నా ఈ పునరావాస కాలనీకి రవాణా సౌకర్యం ఉంది. రెండు జిల్లాల కేంద్రాలకు మధ్య ప్రాంతంలో మా కాలనీ ఉండటం మాకెంతో ఉపయోగం.

– ముసర్ల సూరమ్మ, నిర్వాసితురాలు, ముడసర్లపేట గ్రామం

విశాలమైన ఇళ్లు నిర్మించుకున్నాం



విమానాశ్రయం కోసం మా విలువైన భూములను కోల్పోయామనే బాధ ఉన్నప్పటికీ ఇప్పుడు ప్రభుత్వ సాయంతో విశాలమైన ఇళ్లను నిర్మించుకున్నాం. గతంలో ఇరుకు గదుల్లో ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. ఈ రోజు మంచి వసతుల మధ్య ఉన్నామంటే అది కేవలం ప్రభుత్వం చలువే.

– ఇంటి లక్ష్మి, నిర్వాసితురాలు, రెల్లిపేట గ్రామం

అక్రమార్కులపై విజి'లెన్స్'

- దర్జాగా బియ్యం అక్రమ రవాణా
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దందా
- విజిలెన్స్ అధికారుల ఉక్కుపాదం
- రూ.10.41 కోట్ల విలువైన సరుకు సీజ్
- 35 మందిపై క్రిమినల్ కేసులు
- 119 మంది ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ
- బియ్యాన్ని నూకలుగా మార్చి మరీ తరలింపు

పట్టుబడిన పీడీఎస్ బియ్యం: 7017.80 క్వింటాళ్లు
ధాన్యం: 16612.33 క్వింటాళ్లు
విరిగిన బియ్యం: 274.5 క్వింటాళ్లు
రంగుమారిన బియ్యం: 198.5 క్వింటాళ్లు
సాధారణ బియ్యం: 8422.73 క్వింటాళ్లు
ఫోర్టిఫైడ్ రైస్: 186 క్వింటాళ్లు
బియ్యం ఊక: 51.75
సన్నబియ్యం: 39 క్వింటాళ్లు
సరుకు విలువ: రూ.10,41,15,232
6ఏ-కేసులు: 35
క్రిమినల్ కేసులు: 35
అక్రమ రవాణాలో పాల్గొన్న వారు: 119



విజిలెన్స్ అధికారుల సోదాలు

సాక్షి, రాజమహేంద్రవరం: బియ్యం అక్రమ రవాణా విజిలెన్స్ ఉక్కుపాదం మోపుతోంది. సరిహద్దు, సాధారణ ప్రాంతాల్లో నిఘా కట్టుదిట్టం చేస్తోంది. అధికారుల కళ్లుగప్పి తరలిస్తున్న వారికి సంబంధించి సమాచారం అందుకుని దాడులు విస్తృతం చేస్తోంది. పట్టుబడిన లారీలు, బియ్యం బస్తాలను సీజ్ చేస్తోంది. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై కఠినంగా వ్యవహరిస్తోంది. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా క్రిమినల్ కేసులు సైతంపెడుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు ఏకంగా రూ.10.41 కోట్ల విలువ చేసే సరుకు సీజ్ చేశారు.

ఉమ్మడి తూర్పులో ఇలా..

చౌకబియ్యం, ధాన్యం, రంగు మారిన ధాన్యం, ఆఖరికి అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అందించే పోషకాహార ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సైతం అక్రమ రావాణా చేస్తున్నారు. బియ్యం ఊకను సైతం వదలడం లేదన్న అంశం బహిర్గతమైంది. మరి కొందరు బియ్యం రవాణాకు బిల్లులున్నా ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా తరలిస్తున్నట్లు తేలింది. వీటన్నింటిపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. 35 ఎసెన్షియల్ కమాడిటీస్ యాక్ట్ 1955 కింద 6ఏ కేసులు నమోదు చేశారు. మరో 35 మందిపై క్రిమినల్ కేసులు పెట్టారు. ఇందులో 119 మంది పాల్గొనట్లు నిర్ధారించారు. ఇలా జిల్లాలో ఇప్పటి వరకు రూ.10,41,15,232 విలువ చేసే సరుకును సీజ్ చేశారు.

దాడులు చేస్తున్నా..

బియ్యం మాఫియా రెచ్చిపోతోంది. ధనార్జనే ధ్యేయంగా సాగుతోంది. పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యాన్ని రూ.7 నుంచి రూ.10ల చొప్పున సేకరిస్తోంది. వాటిని నూకలు, పిండిగా మార్చి ప్రౌల్ట్రీ సంస్థలకు రూ.18 నుంచి రూ.25కు విక్రయిస్తోంది. తూర్పులో పౌల్ట్రీ పరిశ్రమలు అధికంగా ఉండటంతో క్వింటాళ్ల కొద్దీ బియ్యం ఇక్కడకు దిగుమతి అవుతోంది. ఇళ్ల నుంచి బియ్యం కొనుగోలు చేసే చిరువ్యాపారులు, కొందరు డీలర్ల నుంచి కొనుగోలు చేస్తున్న అక్రమార్కులు పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలకు ఎగుమతి చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నట్లు సమాచారం. తూర్పుగోదావరి జిల్లా నాలుగు రాష్ట్రాలకు సరిహద్దులో ఉండటం, జల రవాణాకు అనుకూల వాతావరణం ఉండటంతో జిల్లా కేంద్రంగా దందా మూడు బస్తాలు.. ఆరు లారీల చందంగా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి.

నూకలుగా మార్చి.. ఏమార్చి..!

రేషన్ బియ్యం అక్రమ రవాణాలో మాఫియా కొత్త ఐడియాకు తెర తీసింది. చిరు వ్యాపారులు, రేషన్ డీలర్లదీ ఇందులో పాత్ర ఉంది. కొన్ని ప్రాంతాల్లో రేషన్ డీలర్లే కార్డుదారుల నుంచి బియ్యం కిలోకు రూ.10 చొప్పున చెల్లించి ఈపాస్ మిషన్‌లో వేలిముద్ర వేయించుకుని పంపుతున్నారు. ఆ బియ్యం తమ దుకాణాల్లో నిల్వ ఉంచుతున్నారు. ఆటోలు, మినీ వ్యాన్లు, లారీల ద్వారా ఎవరికీ దొరకని రహస్య ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడ వాటిని నూకలుగా మార్చి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. రూ.లక్షలు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. తాజాగా ఈ తరహా దోపిడీ అధికమైందని విజిలెన్స్ అధికారులు వెల్లడిస్తున్నారు. ఇటీవల వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో విజిలెన్స్ అధికారుల దాడుల్లో నూకలుగా మార్చే యంత్రాలు పట్టుబడటంతో కొత్త తరహా మోసం బహిర్గతమైంది. జిల్లాలో మరికొంత మంది మిల్లర్లు రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేసి వాటిని పాలిష్ చేసి విక్రయిస్తున్నట్లు విమర్శలున్నాయి.

నిఘా కట్టుదిట్టం చేశాం:

బియ్యం అక్రమ రవాణాపై నిఘా కట్టుదిట్టం చేశాం. బియ్యం పక్కదారి పడుతున్న సమాచారం అందగానే రంగంలోకి దిగుతున్నాం. బియ్యం ఎక్కడెక్కడికి రవాణా చేస్తున్నారన్న విషయమై ఆరా తీస్తున్నాం. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో కాపుకాసి అక్రమ రావాణా చేస్తున్న వాహనాలపై దాడులు చేస్తున్నాం. పట్టుబడిన సరుకును సీజ్ చేస్తున్నాం. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా క్రిమినల్ కేసులు సైతం బనాయిస్తున్నాం. ఇలాంటి వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కేసులు బనాయిస్తాం.

–పి.వి.రవికుమార్, ఎస్పీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్

దేవుడు మిమ్మల్ని నేలనుండి చిత్రవిచిత్రంగా మొలకెత్తించాడు.
తర్వాత ఆయన మిమ్మల్ని అదే నేలలోకి తీసికెళ్తున్నాడు.
చివరికి అందులో నుంచే మిమ్మల్ని బయటికి తీసి నిలబెడ్తాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, ఫిబ్రవరి, 17

నేలరాలిన దళిత సుమం

ముంబైలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) దేశంలో పేరెన్నికగన్న ఉన్నతశ్రేణి విద్యాసంస్థ. 'జ్ఞానమ్ పరమమ్ ధ్యేయమ్' అనే ఉపనిషద్వాక్యాన్ని అది తన చిహ్నంలో అలంకరించుకుంది. చదువులో ముందుంటూ ఇంజనీరింగ్ చేయాలనుకునే ప్రతి విద్యార్థికీ బాంబే ఐఐటీలో అవకాశం రావాలన్న కోరిక బలంగా ఉంటుంది. మొన్న ఆదివారం అలాంటి ప్రాంగణంలో పద్దెమినిదేళ్ల దళిత విద్యార్థి దర్శన్ సోలంకీ ప్రాణం తీసుకున్న వైనం గమనిస్తే దిగ్భ్రాంతి కలుగుతుంది. ఎక్కడో అహ్మదాబాద్‌లో పుట్టి ఎన్నో కలలతో ఆ ప్రాంగణంలో అడుగుపెట్టిన దర్శన్ అంత చిన్న వయసులో ప్రాణం తీసుకోవటం తప్ప గత్యంతరం లేదనుకున్నాడంటే సంస్థ సిగ్గుపడాలి. అంతవరకూ చదువులో చురుగ్గా ఉండేవాడు ఇటీవల ముభావంగా మారాడనీ, నెలక్రితం మాట్లాడినప్పుడు కుల వివక్ష సంగతి చెప్పాడనీ అతని సోదరి చెబుతున్నారు. తన కులం తెలిసినప్పటి నుంచీ సహ విద్యార్థులు మాట్లాడటం మానేశారనీ, తాను ఒంటరినయ్యాననీ బాధపడ్డాడని అంటున్నారు. ఇదే ముంబైలో 2019లో వైద్య శాస్త్రంలో పీజీ చేస్తున్న పాయల్ తాడ్వీ అనే గిరిజన విద్యార్థిని సహ విద్యార్థినుల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంది. గైనకాలజీలో పీజీ చేస్తున్న తనను కనీసం ఆపరేషన్ థియేటర్‌లోకి కూడా రానీయలేదని చివరిసారిగా రాసిన లేఖలో ఆమె బాధపడింది.

విద్యాసంస్థలు చిన్నవైనా, పెద్దవైనా వాటి తరగతి గదులు నిలువెల్లా కులోన్మాదంతో లుకలుకలాడుతున్నాయని తరచు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాటిల్లో ఆవగింజంత నిజం లేదన్న బుకాయింపులూ ఆ వెనకే వినవస్తున్నాయి. బహుశా కేవలం ఆ కారణం వల్లే దళిత, ఆదివాసీ విద్యార్థులకు కుల సర్పాల తాకిడి తప్పడం లేదేమో! తమ ప్రాంగణంలో కుల వివక్ష లేనేలేదని, ఒకవేళ అలాంటిదేమైనా ఉంటే ఫిర్యాదు చేయడానికి ప్రత్యేక విభాగం ఉన్నదని చెబుతున్న బాంబే ఐఐటీ ఆ విభాగం పని తీరెలావుందో ఇప్పటికైనా సమీక్షించుకోవటం మంచిది. ఏడేళ్లనాడు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో రోహిత్ వేముల ప్రాణం తీసుకున్నప్పుడు యాజమాన్యం నుంచి వచ్చిన సంజాయిషీకీ, దీనికీ పెద్దగా తేడాలేదు. రోహిత్ వేముల మరణానికి దారితీసిన పరిస్థితులేమిటో వెలికి తీయాల్సిన జస్టిస్ రూపన్‌వాల్ కమిషన్ అతను ఎస్సీ కాదని చెప్పడానికే తాపత్రయపడింది. తన చిన్ననాడే తల్లిదండ్రులు విడిపోయి దళిత స్త్రీ అయిన తల్లి పెంపకంలో దళిత వాడలోనే పెరిగిన రోహిత్ దళితుడు కాడని 'నిరూపించింది'. మన సమాజంలో అన్నిచోట్లా కులం రాజ్యమేలుతోంది. అందుకు ఢిల్లీ ఎయిమ్స్ మొదలుకొని ఉన్నతశ్రేణి విద్యాసంస్థలేవీ మినహాయింపు కాదని 2007లో థోరట్ కమిటీ ఇచ్చిన నివేదిక మొదలుకొని 2013 నాటి ముంగేకర్ కమిటీ నివేదిక వరకూ చెబుతూనే వస్తున్నాయి. కానీ వాటిని అవసరమైనంతగా పట్టించుకోవటం లేదని దర్శన్ సోలంకీ ఉదంతం మరోసారి నిరూపించింది. ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'హిందూ' కథనం ప్రకారం నిరుడు ఫిబ్రవరిలో బాంబే ఐఐటీలో కుల వివక్ష, అందువల్ల తలెత్తే అనారోగ్య సమస్యలపై సంస్థ లోని ఎస్సీ, ఎస్టీ విభాగం రెండు సర్వేలు చేసింది. దాంట్లో వచ్చిన ఫలితాల ఆధారంగా కొన్ని చర్యలు తీసుకోవాలని కూడా సంకల్పించింది. కానీ ఏడాదైంది. ఇంకా ఆ సంకల్పం ఆచరణ రూపం దాల్చినట్టు లేదు. అసలు సర్వేలకు స్పందించిన విద్యార్థుల సంఖ్య చూస్తేనే వివక్ష ఎంత బలంగా ఉన్నదో అర్థమవుతుంది. బాంబే ఐఐటీలో దాదాపు 2,000 మంది దళిత విద్యార్థులుంటే కేవలం 20 శాతం మంది మాత్రమే తొలి సర్వేకు స్పందించారట! రెండో సర్వేకైతే 5 శాతంమంది మాత్రమే జవాబిచ్చారు. స్టూడెంట్ కౌన్సెలర్‌గా ఉంటున్న మహిళా ప్రొఫెసర్ రిజర్వేషన్ల గురించి సామాజిక మాధ్యమాల్లో బాహాటంగా వ్యక్తంచేసిన అభిప్రాయాలు వారి భయానికి కారణం.

రాజ్యాంగం అట్టడుగు కులాలవారికి కల్పిస్తున్న రిజర్వేషన్ల గురించి మేధావులనుకునేవారిలోనే, శాఖాధిపతుల్లోనే బోలెడంత అజ్ఞానం గూడుకట్టుకుంది. ఇక చదువుకోవడానికొచ్చిన పిల్లల్లో దాన్ని వెదకటం వృథా ప్రయాస. దర్శన్ తల్లిదండ్రుల ప్రకారం సహ విద్యార్థులకు అతని కులం తెలిసినప్పటినుంచీ 'ఉచితంగా సీటు సంపాదించావు. మేం భారీగా డబ్బు చెల్లించాల్సివచ్చింది' అంటూ వేధించారట. దేశంలో శతాబ్దాలుగా వేళ్లూనుకున్న కుల వివక్షవల్ల కొన్ని కులాలు ఈనాటికీ సామాజిక నిరాదరణకు గురవుతున్నాయని, ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోయాయని గుర్తించి మన రాజ్యాంగ నిర్మాతలు ఆ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించారు. దాన్ని ఈనాటికీ పూర్తి స్థాయిలో అందుకోలేనంత బలహీన స్థితిలో ఆ వర్గాలున్నాయి. ఒక దళిత విద్యార్థి లేదా గిరిజన విద్యార్థి ఉన్నత చదువుల వరకూ ఎదగాలంటే ఇంటిల్లిపాదీ ఎన్ని త్యాగాలు చేయాల్సివుంటుందో, మరెన్ని కష్టాలు భరించాల్సివుంటుందో తెలిస్తే అటువంటివారిని ఎవరూ గేలిచేయరు. కానీ ఆధిపత్య కులాల పిల్లలకు ఇదంతా ఎవరు చెప్పాలి? ఇళ్లల్లో చెప్పరు. క్లాసు పుస్తకాల్లో ఉండదు. విశ్వవిద్యాలయ ఆచార్యులు కూడా మౌనం పాటిస్తారు. కులం లేనట్టు ఇంతగా నటించే సమాజంలో అంతిమంగా ఇక జరిగేదేమిటి? బాంబే ఐఐటీలో ఎస్సీ, ఎస్టీ విభాగం నిరుడు ఇచ్చిన నివేదికను బయటపెట్టి దానిపై లోతుగా చర్చిస్తే బహుశా దర్శన్‌కు ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదేమో! ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వటం మంచిదే. కానీ అంతకన్నా ముందు రిజర్వేషన్ల అవసరం గురించి, తోటి విద్యార్థులతో సున్నితంగా, ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాల్సిన తీరుగురించి దళితేతర విద్యార్థులకు కౌన్సెలింగ్ తప్పనిసరి చేయాలి. అప్పుడే ఏదోమేరకు కులవివక్ష జాడ్యం పోతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు
మాఘ మాసం, తిథి: బ.ద్వాదశి రా.8.39 వరకు, తదుపరి త్రయోదశి
నక్షత్రం: పూర్వాషాఢ సా.5.46 వరకు, తదుపరి ఉత్తరాషాఢ
వర్జ్యం: రా.1.16 నుండి 2.44 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.46 నుండి 9.33 వరకు, తదుపరి ప.12.35 నుండి 1.23 వరకు
అమృతఘడియలు: ప.1.16 నుండి 2.46 వరకు.

సూర్యోదయం : 6.30
సూర్యాస్తమయం: 5.57
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సైన్సును తొక్కిపెట్టడం ప్రజాహితమా?

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

జోషీమఠ్ కొంతకాలంగా కుంగిపోతూ ఉందని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఇచ్చిన కీలకమైన నివేదికను గుర్తించడానికి బదులుగా... దేశీయ శాస్త్ర పరిశోధనా సంస్థల నోరు మూయిస్తూ జాతీయ విపత్తు నిర్వహణా ప్రాధికార సంస్థ నిషేధాజ్ఞను జారీ చేసింది. శాస్త్రీయ సమాచారాన్ని తొక్కిపెట్టడమనేది ప్రజా హితం కోసం శాస్త్రవిజ్ఞానాన్ని అన్వయించడంలో తీవ్ర పర్యవసానాలకు దారితీస్తుంది. ఇది వ్యక్తిగతంగా ఒక శాస్త్రజ్ఞుడు తన అభిప్రాయాలను వ్యక్తపర్చడానికి సంబంధించిన విషయం కాదు. ప్రభుత్వ విధాన నిర్ణయంలో సైన్స్ పాత్రకు సంబంధించింది. జీఎం ఆహార పదార్థాలు, నాసిరకం మందులు, డేటా గోప్యత, సూక్ష్మజీవుల నిరోధకత వంటి పలు స్పర్ధాత్మక అంశాల్లో నిపుణుల అభిప్రాయాలు ఆరోగ్యకరమైన చర్చకు వీలుకల్పిస్తాయి.

జోషీమఠ్ సంక్షోభం మరొక తత్సమానమైన తీవ్ర సవాలును దేశం ముందు ఉంచింది. అదేమిటంటే భారతీయ శాస్త్ర పరిశోధనా మండలులను, విద్యావిషయిక సంస్థలను నెమ్మదిగా క్షీణింపజేస్తూ రావడమే. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ 'ఇస్రో' అనుబంధ విభాగమైన హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సి) అందించిన రిమోట్ సెన్సింగ్ డేటాపై ఆధారపడి, జోషీమఠ్ కుంగుబాటుపై కీలకమైన ప్రాథమిక అంచనా జనవరి 11న వెలువడింది. 2022 ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్య జోషీమఠ్ 9 సెంటీమీటర్లు కుంగిందనీ, డిసెంబర్ 27 నుంచి 2023 జనవరి 8 మధ్యలో మరింత వేగంగా కుంగిందనీ ఈ నివేదిక తెలిపింది. జోషీమఠ్‌లో పరిస్థితి తీవ్రతను ఎత్తి చూపిన మొట్టమొదటి శాస్త్రీయ నివేదిక ఇదే.

ఈ నివేదిక తీవ్రతను గుర్తించి, సకాలంలో వ్యవహరించడంలో తాను విఫలమయ్యాయని ఒప్పుకోవడానికి బదులుగా, జాతీయ విపత్తు నిర్వహణా ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎమ్‌ఏ) శాస్త్ర పరిశోధనా సంస్థల నోరు మూయిస్తూ నిషేధాజ్ఞను జారీ చేసింది. సాంప్రదాయిక లేదా సామాజిక మాధ్యమాల ద్వారా జోషీమఠ్‌పై ఎలాంటి సమాచారాన్ని లేక అభిప్రాయాన్ని ప్రజలతో పంచుకోవద్దని ఆదేశించింది. ఎన్‌ఆర్‌ఎస్‌సి, ఇస్రోలను మాత్రమే కాదు; శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధనా మండలి; శాస్త్ర, సాంకేతిక విభాగం; జలవనరుల మంత్రిత్వ శాఖ; ఐఐటీ–రూర్కీతోపాటు సర్వే ఆఫ్ ఇండియా, జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వంటి పలు శాస్త్రీయ సంస్థలకు చెందిన పరిశోధనా ల్యాబ్‌ల నోరు మూయించారు.

ఈ సందర్భంగా ఎన్‌డీఎమ్‌ఏ ఆదేశం కనీవినీ ఎరుగనిదీ. ఎన్‌డీఎమ్‌ఏ కానీ, హోంశాఖ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కానీ శాస్త్రీయ పరిశోధనా సంస్థల మాతృసంస్థలు కావు. కేంద్ర హోంమంత్రి అధ్యక్షతన జరిగిన ఒక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారని ఎన్‌డీఎమ్‌ఏ ఆదేశం సూచించినందున, ఇది రాజకీయ నిర్ణయం మాత్రమే. ఇస్రో, సీఎస్ఐఆర్ వంటి సంస్థలు కాగితం మీద అయినా సరే స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థలు. ఇవి హోంశాఖ పర్యవేక్షణలో లేనేలేవు. కొద్దినెలల క్రితమే, అన్ని శాస్త్ర విభాగాల కార్యదర్శులతో సమావేశానికి పిలుపునిచ్చిన హోంశాఖ కార్యదర్శి తన అధికారాల పరిధిని అతిక్రమించడమే కాకుండా ఇంతవరకు శాస్త్రవేత్తలకు, పరిశోధకులకు ఇచ్చిన అవార్డులన్నింటినీ ఒక్క కలంపోటుతో రద్దు చేసిపడేశారు. జన్యుపరంగా పరివర్తింపజేసిన ఆహార ధాన్యాలపై ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఎలాంటి ప్రకటనలూ చేయవద్దంటూ... పనిచేస్తున్న, రిటైరైన శాస్త్రవేత్తలను ఐసీఏఆర్ ఇటీవలే తీవ్రంగా హెచ్చరించింది.

శాస్త్ర పరిశీలనలపై ఆధారపడిన చర్చలు, వాటి సమాచారాన్ని ప్రజలకు పంచిపెట్టడాన్ని ప్రోత్సహించాలి. అనేక రంగాలలో శాస్త్రవేత్తలు నిత్యం డేటాను పంచుకుంటారు. అమెరికా నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా)కు రిమోట్ సెన్సింగ్ డేటాను నిత్యం షేర్ చేసే పోర్టల్స్ ఉన్నాయి. ప్రపంచంలో ఎక్కడ భూకంపాలు చోటుచేసుకున్నా దానికి సంబంధించిన డేటాను యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే వెబ్‌సైట్‌లో రియల్ టైమ్‌లో అందుబాటులో ఉంచుతుంటారు. ఇక జెనెటిక్ సీక్వెన్స్ డేటాబేస్‌లు ప్రపంచమంతటా శాస్త్రపరిశోధకులకు అందుబాటులో ఉంటున్నాయి.



ఎన్‌ఆర్‌ఎస్‌సి రూపొందించిన అంచనాల్లో ఒక భాగం, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ఉపగ్రహం సెంటినెల్–1 నుంచి తీసిన ఛాయాచిత్రాలపై ఆధారపడి ఉంటోంది. ఈ ఉపగ్రహం సింథెటిక్ అపెర్చర్ రాడార్‌ని కలిగివుంది. ఆకాశం మేఘావృతమై ఉన్నప్పుడూ, అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ రాత్రింబవళ్లు డేటాను సేకరించడంలో ఇది తోడ్పడుతుంది. ఎన్‌ఆర్‌ఎస్‌సి మదింపులో రెండో భాగం భారతీయ ఉపగ్రహమైన కార్టోసాట్–2ఎస్ నుంచి పంపిన ఛాయాచిత్రాలపై ఆధారపడి ఉంటోంది. ఇది 0.65 మీటర్ల రిజల్యూషన్‌తో అన్ని రంగులను గుర్తించగలిగే ఛాయచిత్రాలను అందిస్తుంది. ఈ నేపథ్యంలో ఇఎస్ఏ, ఇస్రో నుండి పొందిన రిమోట్ సెన్సింగ్ డేటాను ఉపయోగించుకునే విశ్లేషణతో ముందుకొచ్చే ఎన్‌ఆర్‌ఎస్‌సి డేటాను ఎవరైనా అభినందించాలి తప్ప ఆంక్షలు విధించరాదు. ఈ విశ్లేషణ... ప్రభావిత ప్రాంతాల్లో నివసించే వారిలోనే కాకుండా, దేశ పౌరుల్లో కూడా గందరగోళాన్ని రేకెత్తిస్తున్నట్లు ఎన్‌డీఎమ్‌ఏ కనిపెట్టింది మరి.

రిమోట్ సెన్సింగ్ డేటాను ఉపయోగించడంపై చర్చ ఉత్తరాఖండ్ ఉదంతం నేపథ్యంలో చోటు చేసుకుంటోంది. ఎందుకంటే భారత్‌లో రిమోట్ సెన్సింగ్ అధ్యయనాలకు ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్ జన్మస్థలం. ఇక్కడే భారతీయ ఫొటో ఇంటర్‌ప్రెటేషన్ ఇనిస్టిట్యూట్ (ఐపీఐ)ని 1966లో స్థాపించారు. ఇది 1957లో జవహర్‌లాల్ నెహ్రూ నెదర్లాండ్స్ సందర్శన సందర్భంగా కుదిరిన ఒప్పంద ఫలితం. ఐపీఐ... భారతీయ సర్వే సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తుంటుంది. దీన్ని 1969లో ఏర్పడిన ఇస్రోకు బదలాయించారు. ఇప్పుడు ఇది ఇస్రో నేతృత్వంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ పేరిట వ్యవహరిస్తోంది.

మొట్టమొదటి భారతీయ రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ 1988లో ఐఆర్ఎస్–1ఏ పేరిట ఆపరేషన్లను ప్రారంభించింది. ఈరోజు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థకు నాలుగు అత్యధునాతనమైన రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలున్నాయి. అవి రిసోర్స్‌శాట్, కార్టోశాట్, ఓషనోశాట్, రైశాట్. భారతీయ ఫారెస్ట్ మ్యాప్ రూపకల్పన కోసం రిమోట్ సెన్సింగ్ డేటాను 1980లలో ఉపయోగించి, ఇస్రో చారిత్రాత్మకమైన తోడ్పాటును అందించింది. ఇది దేశంలో భారీ ఎత్తున అడవుల నరికివేత జరిగిందని చూపించింది. అంతవరకు భారతీయ ఫారెస్ట్ సర్వే సంస్థ (ఎఫ్ఎస్ఐ) రూపొందించిన ఫారెస్టు మ్యాప్‌లతో ఇస్రో మ్యాప్‌లు విభేదించాయి. ఈ కొత్త డేటా వెల్లడించినందుకు నోరు మూసుకోమని ఎవరూ ఆదేశించలేదు. దానికి బదులుగా, భారతీయ ఫారెస్ట్ సర్వే సంస్థ తన మ్యాపింగ్ ప్రక్రియలో రిమోట్ సెన్సింగ్ ఆధారిత టెక్నిక్‌ను పొందుపర్చుకోవడానికి అనుమతించారు. దీనివల్ల అడవుల విస్తీర్ణంపై కచ్చితమైన అంచనాకు రావడం సాధ్యమైంది.

నిపుణుల జ్ఞానాన్ని తొక్కిపెట్టడమనేది ప్రజా హితం కోసం శాస్త్ర విజ్ఞానాన్ని అన్వయించే విషయంలో తీవ్ర పర్యవసానాలకు దారితీస్తుంది. ఇది వ్యక్తిగతంగా ఒక శాస్త్రజ్ఞుడు తమ అభిప్రాయాలను వ్యక్తపర్చడానికి, డేటాను షేర్ చేసే హక్కుకు సంబంధించిన విషయం కాదు. అది ప్రభుత్వ విధాన నిర్ణయంలో, ప్రజాభిప్రాయాన్ని మలచడంలో సైన్స్ పాత్రకు సంబంధించిన విషయం. డేటాను పంచుకోవడం, నిపుణుల అభిప్రాయాలు లేక పరిశోధనా పత్రాలు అనేవి... జీఎం– ఆహార పదార్థాలు, హిమాలయ పర్యావరణం, నాసిరకం మందులు, డేటా గోప్యత లేదా సూక్ష్మజీవుల నిరోధకత వంటి పలు స్పర్ధాత్మక అంశాల్లో ఆరోగ్యకరమైన చర్చలకు వీలుకల్పిస్తాయి.

పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, వివిధ అంశాలపై నిపుణులతో కూడిన విద్యా కేంద్రాలకు సంబంధించి విస్తారమైన నెట్‌వర్క్ కలిగి ఉన్న భారత్ వంటి దేశంలో, భిన్నాభిప్రాయాలు నిత్యం రంగంమీదికి వస్తుంటాయి. ఇలాంటి విభేదాలను సైంటిస్టులు, విద్యావేత్తలు, పౌర సమాజం తోడ్పాటుతో ఆరోగ్యకరమైన ప్రజా చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చు. 1980లలో, కైగా అణు విద్యుత్ సంస్థపై తీవ్రవివాదం నెలకొన్న నేపథ్యంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్... దేశంలోని అణు శాస్త్రవేత్తలు, పర్యావరణ కార్యకర్తల మధ్య ఒక చర్చను నిర్వహించింది. ఈరోజుల్లో అలాంటి చర్చలనుంచి పరిశోధనా మండలులు, విద్యా సంస్థలు దూరం జరుగుతున్నారు. వీటి మౌనంతో శాస్త్ర పరిశోధనా సంస్థల స్వయం ప్రతిపత్తిని మరింతగా క్షీణింప జేసేందుకు ప్రభుత్వానికి ప్రోత్సాహం లభిస్తోంది.

వ్యాసకర్త శాస్త్ర వ్యవహారాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అంతా ఆయనే!



ఒక టిప్. ట్విట్టర్ సీఈఓ ఎలాన్ మస్క్‌ను ట్విట్టర్‌లో ఫాలో కావొద్దు. మీ టైమ్ లైన్‌లో సగం ఆయన ట్వీట్స్, రిప్లైలే ఉంటాయి. మిగిలినవి దాన్ని లైక్ చేసిన వాళ్లవీ, రీట్వీట్ చేసినవాళ్లవీ ఉంటాయి. – అరుణ్ బోత్రా, ఐపీఎస్ అధికారి

తప్పు జరిగిందప్పుడే!



చాలా స్పష్టంగా, గట్టిగా చెబుతున్నాను. నేను పాకిస్తాన్ ద్రోహిని కాను. ద్రోహులు ఎవరంటే 1947లో తమ మాతృదేశమైన భారత్‌ను వదిలిపెట్టి పాకిస్తాన్‌కు వెళ్లిపోయినవారు. నేను ఆ తప్పును సరిదిద్దుతున్నాను. – పాయన్ అలీ, ఫ్రీ థింకర్

కంగ్రాట్స్ ఢిల్లీ!



చాలా కాలం తర్వాత, ప్రపంచంలోని అత్యంత కలుషిత నగరాల జాబితాలో ఢిల్లీ లేదు. ఢిల్లీవాసుల ప్రయత్నాలు నెమ్మదిగానే అయినా కచ్చితంగా ఫలితం ఇస్తున్నాయి. ఢిల్లీకి అభినందనలు. కానీ ఇంకా చేయవలసింది చాలా ఉంది. ప్రపంచంలోని అత్యంత శుభ్రమైన నగరాల్లో మనల్ని లెక్కించాలి.

– అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి

ద్వేషంతో నష్టమే!



ఉత్తర భారతీయులు, హిందీ మాట్లాడే వాళ్ల మీద విద్వేష ప్రసంగాలు ఆగిపోవాలి. తమిళ జాతీయవాదులు, ద్రవిడ ఎకోసిస్టమ్ ఇందులో ఉమ్మడి పాత్రలు. రాష్ట్రానికి ఇది నష్టం కలిగిస్తుంది. ఈ ప్రమాదానికి ప్రజలు మేలుకుంటారని ఆశ.

– సుమంత్ రామన్, జర్నలిస్ట్

మీరేం చేశారని?



ఒక ప్రైవేటు కంపెనీ అయినా టాటా 450 విమానాలకు ఆర్డరిచ్చింది. భారత ప్రభుత్వం 'ఎయిర్ ఇండియా'ను వాళ్లకు అమ్మింది. మరి దీనికి బీజేపీకి చెందిన మోదీకి ఎందుకు శుభాకాంక్షలు చెబుతున్నారు? నవ్వొస్తోంది. మనం ఏమైనా నవ్వులాటగా మారిపోయామా?

– సంజయ్ ఝా, కాంగ్రెస్‌వాది

అనారోగ్య నగరం



ముంబయి ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత కలుషిత నగరాల్లో రెండో స్థానంలో ఉంది. మా నాన్న కేవలం మూడ్రోజులు ఉండి, తీవ్రమైన దగ్గుతో తిరిగివెళ్లారు. స్టెరాయిడ్స్ తీసుకున్న తర్వాతే అది తగ్గింది. నాకు తెలిసినవాళ్లలో సగం మంది ఈ శీతాకాలంలో అనారోగ్యం పాలయ్యారు. మనకేమైనా ప్రణాళిక ఉందా?

– నిఖిల్ ఇనాందార్, జర్నలిస్ట్

నాటోతో చేటు



నాటో అనేది స్వీయరక్షణ కోసం ఉద్దేశించిన కూటమి కాదు. అదొక యుద్ధ యంత్రం. కావాలంటే అఫ్గానిస్తాన్, ఇరాక్, లిబియా జనాలను అడిగి చూడండి. అది యూరప్ ప్రజలకు ఇవ్వగలిగింది ఏమీలేదు. అమెరికా సామ్రాజ్యం, మిలిటరీ కర్మాగారాల ప్రయోజనాలను కాపాడటానికి అది ఉనికిలో ఉంది. అది ఎప్పుడూ యుద్ధాన్ని ప్రోత్సహిస్తుంది, ఎన్నడూ శాంతిని ప్రోత్సహించదు. నాటోను రద్దు చేయాలి. – మిక్ వాలెస్, ఐర్లాండ్ రాజకీయనాయకుడు

ఇన్‌బాక్స్

'నెట్'లో నంబర్ 2

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నెట్ సదుపాయం కల్పనలో ఆంధ్ర ప్రదేశ్ దక్షిణాది రాష్ట్రాల్లో రెండో స్థానం పొందింది. ఇది ఎంతో అభినందనీయమైన సంగతి. కేరళ 94 శాతంతో మొదటి స్థానంలో ఉండగా, 45 శాతంతో మన రాష్ట్రం రెండో స్థానంలో ఉంది. మిగతా దక్షిణాది రాష్ట్రాలు మరీ తక్కువ శాతాలతో కొనసాగుతున్నాయి. ప్రత్యేక శ్రద్ధతో శర వేగంగా అభివృద్ధి పరుస్తున్న కారణంగా ఆంధ్ర ప్రదేశ్ కొద్ది మాసాలలోనే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులోకి తెచ్చి మొదటి స్థానంలో నిలిచే అవకాశం ఉంది. ఈ ఘనత సాధించిన ఢిల్లీ, పాండిచ్చేరిల సరసన నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం. విద్యలో నాణ్యతకూ, ప్రపంచ స్థాయిలో విద్యార్థులు నైపుణ్యాలను అందుకునేందుకూ... ఇంటర్నెట్ సదుపాయం, ట్యాబ్‌లు అందుబాటులోకి రావడం అన్నది ప్రాథమిక అవసరం.



– డా॥ డి.వి.జి. శంకర రావు, మాజీ ఎంపీ, పార్వతీపురం

మరీ గన్ని అబద్ధాలా!

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. ఎప్పటి తీర్గనే అనంద్ బాగ్ చౌరస్తకు బోయిన. గాడ రవి పాన్ డబ్బా ఉన్నది. పొద్దు మీకంగనే మా దోస్తులు గాడ జమైతరు. గాదాని మీద గీదాని మీద నాత్రి తొమ్మిది గొట్టె దాంక ముచ్చట బెడ్తరు. గా దినం నేను బోక ముందు గాల్లు ఏం ముచ్చట బెట్టింగ్రో నాకు ఎర్కలేదు. గని నేను డబ్బ కాడ్కి బోయినంక గాల్లు ఇట్ల మాట్లాడుకుంటున్నరు.

''హాత్ సే హాత్ జోడో అన్కుంట అందరికి చెయ్యిచ్చుకుంట ములుగు కెల్లి రేవంత్ రెడ్డి పాదయాత్ర షురువు జేసిండు. ఒక దిక్కు గాయన పాదయాత్ర జేస్తుంటె కాంగ్రెస్ ఎంపి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అడ్డగోల్ మాటలు షురువు జేసిండు. వచ్చేటి అసెంబ్లి ఎలచ్చన్ల ఏ పార్టీకి అర్వై సీట్లు రావు. అందరం కలిసి పని జేస్తే కాంగ్రెస్‌కు నల్వై కెల్లి యాభై సీట్లు వస్తయి. తెలంగానల హంగ్ సర్కారొస్తది. కాంగ్రెస్, బిఆర్ఎస్ గల్సి సర్కార్ ఏర్పాటు జేస్తయి అని అన్నడు'' అని పాన్ నమ్ముకుంట సత్తారి జెప్పిండు.

''ఒకలేమొ జోడో అంటుంటె ఇంకొకలు తోడో అంటున్నరు. పాదయాత్ర జేస్కుంట వొచ్చెపారి కాంగ్రెస్ సర్కారొస్తదని రేవంత్ అంటున్నడు. ఏ పార్టికి మెజార్టి రాదు. బిఆర్ఎస్, కాంగ్రెస్ గల్సి హంగ్ సర్కార్ ఏర్పాటు జేస్తయని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నడు. గాయినట్లనంగనే కాంగ్రెస్ లీడర్లు మొత్తుకున్నరు. కాంగ్రెస్ల అందరు ఒకే మాటమీద ఉండరు. ఒకరు ఎడ్డెం అంటె ఇంకొకరు తెడ్డెం అంటరు. కాంగ్రెసోల్లు దొంగలు, బిఆర్ఎస్సోల్లు గూడ దొంగలే. దొంగలు దొంగలు గల్సి ఊర్లు పంచుకొన్న తీర్గ గీ రొండు పార్టీల లీడర్లు గల్సి సర్కారు పంచుకుంటమని అంటున్నరు. కాంగ్రెస్ దిక్కుకెల్లి గెల్సినోల్లు బిఆర్ఎస్ల దుంకుతరు. ఇంతకుముందు పన్నెండు మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టిఆర్ఎస్ల దుంకలేదా? అని బండి సంజయ్ అన్నరు'' అని యాద్గిరి జెప్పిండు.

''కొత్త సెక్రెటేరియట్‌ను ఎన్నడు దెరుస్తరు?'' సిగలేట్ దాక్కుంట ఇస్తారి అడిగిండు. ''వాస్తు బాగలేదనుకుంట పాత సెక్రెటేరియట్‌ను కెసిఆర్ కూలగొట్టిచ్చిండు. గాదాని జాగల కొత్త సెక్రెటేరియట్‌ను కట్టిపిచ్చిండు. గాయిన నచ్చత్రం పకారం వచ్చే పదిహేడో తారీకు మంచిగున్నదని అయ్యగార్లు జెప్పింగ్రు. మంచి మూర్తం గూడ బెట్టింగ్రు. కొత్త సెక్రెటేరియట్‌ను తెర్సిన దినం నాడే పరేడ్ మైదాన్ల బిఆర్ఎస్ పబ్లిక్ మీటింగ్ బెడ్దామని కెసిఆర్ అనుకుండు. పదిహేడో తారీకు కెసిఆర్ పుట్టిన దినం. పుట్టిన దినం నాడే కొత్త సెక్రెటేరియట్ల కాలు బెడ్దామని ముఖ్యమంత్రి అనుకుండు. గని గాయిన ఒకటనుకుంటె ఒకటయ్యింది. కొత్త సెక్రెటేరియట్ల మంటలు లేసినయి. శాన్దార్గ గట్టిన సెక్రెటేరియట్‌ను జూసిన అపోజిసనోల్లు కండ్లల్ల నిప్పులు బోసుకున్నరు. గాల్ల దిష్టితోనే కొత్త సెక్రెటేరియట్ల మంటలు లేసినయని ముఖ్యమంత్రి అన్నడు. గీ నెలల గాకుంట ఏప్రిల్ నెలల సెక్రెటేరియట్‌ను దెరుస్తరట'' అని సత్తారి అన్నడు.

''రొండు ఎమ్మెల్సి ఎలచ్చన్లు వొచ్చెబట్కె సెక్రెటేరియట్ తెర్సుడు వాయిద బడ్డ దంటున్నరు నివొద్దేనా?''

''నివొద్దే. సెక్రెటేరియట్ గుమ్మటాలతోని తాజ్‌మహల్ తీర్గ గండ్లబడ్తున్నది. మా బిజెపి సర్కార్ గినొస్తే గా గుమ్మటాలను కూలగొడ్తమని బండి సంజయ్ అన్నడు.''

''వాస్తు బాగలేదని ఒకలు కూలగొట్టింగ్రు. గుమ్మటాలున్నాయని ఇంకొకలు కూలగొడ్త మంటున్నరు. కూలగొట్టుడు, కట్టుడు, జెనం పైసలను పుజూల్గ కర్సుబెట్టుడు. పెద్ద పెద్ద మాటలు జెప్పుడు. పెద్ద పెద్ద మాటలు జెప్పుకుంట పంగనామాలు బెట్టుడు. గిదే గియ్యాల్రేపు లీడర్లు జేస్తున్న పని.''

''ఎమ్మెల్సి ఎలచ్చన్ల కోడ్ అమల్ల కొచ్చింది. ఇక దాంతోని వికారాబాద్ల ఎన్టీఆర్ బొమ్మ నిండ బట్ట గప్పింగ్రు. గని గా బొమ్మ చెయ్యి సూబెడ్తున్న దిక్కు సూస్తె కెసిఆర్ పోట్వ తీసి ఉన్న కంటి వెలుగు హోర్డింగ్ గండ్లబడ్తున్నది. ఒక హోటల్ మీద బెట్టిన గీ హోర్డింగ్‌ను దియ్యలేదు. నాకే ఎలచ్చన్ల కోడా? కెసిఆర్ పోట్వకు లేదా? అని ఎన్టీఆర్ అడుగుతున్న తీర్గ ఉన్నదని జెనమంటున్నరు. కంటి వెలుగుల హోర్డింగ్‌ను కండ్లబడకుంట జేస్తె బాగుంటదా అని ఆపిసర్లు అడుగుతున్నరు.''



''ఎప్పుడు మన్‌కీ బాత్ అనుకుంట ఏదో ఒకటి జెప్పేటి మోదీ అందరు ఒక్క తీర్గ లొల్లి బెడ్తున్నా 'మౌనమే నీ బాస ఓ మూగ మనసా' అనుకుంట సప్పుడు జేస్తలేడు. మన్ కీ బాత్ అన్కుంట ఒక్క మాట గూడ మాట్లాడుతలేడు'' అని యాద్గిరి అన్నడు.

''గీ నడ్మ పట్నం తొవ్వలు కుంగిపోతున్నయి. తొవ్వలు కుంగబట్కె పెద్ద గుంతలు ఏర్పడుతున్నయి. ఎందుకంటవు'' అని ఇస్తారి అడిగిండు. ''ఇర్వైనాలుగ్గంటలు రైతులకు కరెంటిస్తున్నం. దళిత బందు పద్కం కింద దళితులకు లచ్చల రూపాయలిస్తున్నం. సర్కారు జీతగాల్లకు పహలీ తారీకుకే జీతాలిస్తున్నం. గిసువంటి అబద్దాల మీద అబద్దాలు కెసిఆర్ జెప్తున్నడు. గీ అబద్దాల బర్వుకు తొవ్వలు కుంగిపోతున్నయి'' అని సత్తారి అన్నడు. నాత్రి తొమ్మిది గొట్టేదాంక ముచ్చట బెట్టినంక మా దోస్తులు ఎవలింటికి ఆల్లు బోయింగ్రు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ | 99591 50491

అతీతుడు!

ఆయన పేరేమిటి అంటే... శివుడనీ, శంకరుడనీ, మహేశ్వరుడనీ, నీలకంఠుడనీ, పశుపతి అనీ, త్రిలోచనుడనీ, గంగాధరుడనీ, చంద్రశేఖరుడనీ, నాగభూషణుడనీ అంటారు. ఇవన్నీ పేర్లు ఎలా అవుతాయి? శివుడంటే శుభమయుడనీ, శంకరుడంటే క్షేమకరుడనీ ఇలా... ఇవన్నీ ఆయన వర్ణనలు, లక్షణాలు.

ఆయన ఎలా ఉంటాడంటే, ఒక లింగాకారం చూపిస్తారు. లింగం అంటే రూపం కాదు. ఏ రూపమూ లేని దానికి చిహ్నం, ప్రతీక, ప్రత్యామ్నాయం. దానికే రూపం లేదు. మేమడిగేది ఆయన 'మూర్తి' గురించయ్యా అంటే... ఆయనకు గాలి ఒక మూర్తి, నేల ఒక మూర్తి, నింగి ఒక మూర్తి, నిప్పు ఒక మూర్తి, నీరు ఒక మూర్తి, సూర్య చంద్రులు ఆయన మూర్తులు అంటూ ఎనిమిది ఏకరువు పెడతారు. కానీ పంచభూతాలనూ, ప్రాకృతికమైన జ్యోతులనూ పట్టుకొని ఆయన మూర్తులంటే ఎలాగ, ఆయన అసలు మూర్తి ఏమిటో చెప్పమని రెట్టిస్తే... ఆయనది అర్ధనారీశ్వర మూర్తి అంటారు. దేహంలో సగం తనూ, సగం తన భార్యా అట. అన్నీ కనీ వినీ ఎరగని ఊసులు!



కాస్త అర్థమయేలా చెప్పండి, ఆయనకు మనకులా కళ్ళూ ముక్కూ ఉండవా అంటే... కళ్ళు లేకపోవటమేమిటి, మూడు కళ్ళు అంటారు. ఒకటి ఫాలనేత్రమట. చూసే కన్ను కాదు, కాల్చేసే కన్ను. ఆయన నడినెత్తిన నదీమతల్లి నాట్యం చేస్తుందంటారు. జటాజూటాల్లో జాబిల్లి వచ్చి పూవుగా కూర్చొన్నాడంటారు. నమ్మ శక్యమేనా?


పోనీ ఆయన చేసే పనేమిటో అయినా చెప్పమంటే, ఆయన భక్తవత్సలుడు, కానీ సమయం చూసి లోకాలన్నిటినీ లయం చేస్తాడు అంటారు. ఆకలయితే బిచ్చమెత్తుకొంటాడు, కానీ అడిగినప్పుడు ఇంద్రాదులకు కూడా అష్టైశ్వర్యాలిచ్చేది ఆయనే అంటారు.

అసలీ శుష్క చర్చంతా ఎందుకు? ఆయన నామ రూపాతీతుడూ, భావాతీతుడూ, లోకాతీతుడూ, కాలాతీతుడూ అని ఒక్క మాటలో చెప్పచ్చుగదా? అది గ్రహించి మనమూ ఆ సర్వ వ్యాపికీ, సర్వజ్ఞుడికీ, సర్వ శక్తి శాలికీ, సకల లోక రక్షకుడికీ, సర్వ కామ్య ప్రదాతకూ సభక్తికంగా సాష్టాంగ నమస్కారం చేసి చక్కగా ఇహమూ, పరమూ సంపాదించుకొంటాం గదా!

మహాశివరాత్రి సందర్భంగా మహేశ్వరుడికి వందవేల వందనాలు!

–ఎం. మారుతిశాస్త్రి
(రేపు మహా శివరాత్రి పర్వదినం)

మహిళ కడుపులో 6 మీటర్ల బద్దె పురుగు


ఆపరేషన్‌లో బయటపడిన బద్దె పురుగు ఇదే..

కర్నూలు (హాస్పిటల్‌): తీవ్రమైన కడుపునొప్పితో ఆసుపత్రికి వచ్చిన ఓ మహిళకు ఆపరేషన్‌ చేస్తే 6 మీటర్ల టేప్‌ వార్మ్‌ (బద్దె పురుగు) బయటపడింది. గురువారం కర్నూలు ప్రకాష్‌నగర్‌లోని వీఆర్‌ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో సర్జికల్‌ అంకాలజిస్ట్, ల్యాప్రోస్కోపిక్‌ సర్జన్‌ డాక్టర్‌ సి.వాసురెడ్డి ఆపరేషన్‌ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆదోనికి చెందిన మహిళ (45) కడుపునొప్పితో 3 నెలలుగా బాధపడుతోంది. బరువు తగ్గడం, ఆయాసం, నొప్పి అధికం కావడంతో ఇటీవల చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చింది. స్కానింగ్‌లో పేగుకు రంధ్రం పడినట్లు వైద్యులు గుర్తించారు. అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఆపరేషన్‌ చేస్తుండగా..ఆమె కడుపులో 6 మీటర్ల బద్దె పురుగును గుర్తించారు. అది పేగులకు చుట్టుకుని ఉండటమే కాకుండా ఓ చోట రంధ్రం చేసింది. దీంతో ఆ ప్రాంతాన్ని తొలగించి శస్త్రచికిత్స ద్వారా సరిచేశారు. పంది, ఆవు మాంసం కండరాల్లో ఈ పురుగు గుడ్లు పెడుతుంది. ఆ మాంసాన్ని సరిగ్గా ఉడికించకుండా తినడం వల్ల మనిషిలోకి గుడ్ల రూపంలో ఇది ప్రవేశించి పొట్టలో పెరిగి పెద్దదై ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని వాసురెడ్డి చెప్పారు.

అమరావతిలో ఇల్లు కట్టుకుంటావా బాబూ..

- 872వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: మీ కార్యకర్తల మాట విన్నైనా అమరావతిలో ఇల్లు కట్టుకుంటావా బాబూ అని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ప్రశ్నించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్‌ యాక్సిస్‌ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి 872వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడారు. అమరావతిని ప్రపంచస్థాయి రాజధాని చేస్తానని చెప్పిన బాబు.. రైతులను, ఈ ప్రాంత ప్రజలను నట్టేట ముంచాడన్నారు. ఇక్కడ కనీసం సొంతిళ్లు నిర్మాణం చేసుకోకుండా కరకట్టపై అక్రమంగా నిర్మించిన కట్టడాల్లో నివసిస్తూ కాలం వెళ్లదీస్తున్న బాబు కార్యకర్తల సూచనల మేరకైనా ఇల్లు నిర్మించుకుంటే మంచిదని హితవు పలికారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు బహుజనులను వాడుకుని వదిలేసే బాబు తన సహజ నైజంతో గత ప్రభుత్వంలో అంబేడ్కర్‌ స్మృతివనం పేరుతో రాజధానిలో 125 అడుగుల విగ్రహాన్ని నిర్మిస్తానంటూ శంకుస్థాపన చేసి..దాన్ని పూర్తిగా వదిలేసి అంబేడ్కర్‌కు తీరని అవమానం చేశాడన్నారు. అందుకు భిన్నంగా జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి మారుమూల ప్రాంతంలో కాకుండా విజయవాడ నడిబొడ్డున బాబా సాహెబ్‌ 125 అడుగుల విగ్రహం ఏర్పాటు చేసి రాజ్యాంగం పట్ల, బాబా సాహెబ్‌ అంబేడ్కర్‌ పట్ల ఆయనకున్న గౌరవాన్ని చాటుకున్నాడని తెలిపారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరికి అ‘ధనం’ కోకో..

- రాష్ట్రంలో 39,714 హెక్టార్లలో కోకో సాగు
- చాక్లెట్ల తయారీలో వినియోగం
- మొదటి మూడేళ్లు హెక్టారుకు రూ.20 వేల సబ్సిడీ
- ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి ప్రతినిధి, ఏలూరు: ప్రభుత్వ ప్రోత్సాహంతో అంతరపంటగా మెట్ట ప్రాంతంలో ప్రారంభమైన కోకో సాగు ప్రస్థానం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రధాన పంటగా మారింది. ఆయిల్‌పామ్, కొబ్బరికి అంతరపంటగా రైతుకు రెట్టింపు ఆదాయం కోసం ప్రభుత్వం కోకో సాగును ప్రోత్సహిస్తుంది. అంతర్జాతీయంగా మంచి మార్కెట్‌ ఉండటం, సాగు నిర్వహణ తక్కువగా ఉండటం, సాగుకు సంబంధించి మొదటి మూడేళ్లు ప్రభుత్వ ప్రోత్సాహం ఉండడంతో జిల్లాలో కోకో సాగు గణనీయంగా పెరుగుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 39,714 హెక్టార్లల్లో కోకో సాగు ఉండగా ఏలూరు జిల్లాలోని 4 మండలాల్లోనే 14,364 హెక్టార్లలో కోకో సాగవుతుండడం విశేషం. 1990లో పశ్చిమగోదావరి జిల్లాకు పరిచయమైన కోకో సాగు ఏటా క్రమేపీ పెరుగుతూ వస్తుంది. అత్యధికంగా ఏలూరు జిల్లాలో వెయ్యి హెక్టార్లు సాగు చేయనున్నారు. ఆయిల్‌పామ్‌ తరహాలోనే కోకో మొక్కలు కూడా కంపెనీల ద్వారానే రైతులకు పంపిణీ చేసి మొదటి మూడేళ్లు ప్రభుత్వమే నిర్వహణ ఖర్చులు చెల్లిస్తుండడం, అంతరపంటగా మంచి డిమాండ్‌ ఉండడంతో సాగు విస్తీర్ణంపై జిల్లాలో రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఏలూరు జిల్లాలో మాండలీజ్‌ కంపెనీ ద్వారా జిల్లాలో కోకో సాగుకు సంబంధించి మొక్కలు సరఫరా చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే మన రాష్ట్రంలో దిగుబడి అత్యధికంగా ఉంది. అంతరపంటగా ఉన్నప్పటికీ మొక్కలకు సబ్సిడీలు, మొదటి మూడేళ్ల నిర్వహణ ఖర్చులు ప్రభుత్వం ఇస్తుండటం అలాగే 4వ సంవత్సరం నుంచి 30 ఏళ్ల వరకు మంచి దిగుబడి ఇస్తుండడంతో సాగుకు డిమాండ్‌ పెరిగింది.

చాక్లెట్ల తయారీలో కీలకం

ప్రధానంగా కోకోను చాక్లెట్ల తయారీలో వినియోగిస్తుంటారు. జిల్లాలో మాండలీజ్‌ కంపెనీ కోకోను కొనుగోలు చేసి తిరుపతి జిల్లాలోని శ్రీ సిటీ యూనిట్‌లో చాక్లెట్ల తయారీలో వినియోగిస్తున్నారు. దాదాపు 8 ప్రధాన కంపెనీలకు సంబంధించి 50కు పైగా రకాల చాక్లెట్లలో కోకోను అధికంగా వినియోగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా ప్రోత్సహిస్తుంది.

దేశంలో ఏపీ నంబర్‌వన్‌

కోకో సాగులో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ మొదటి స్థానంలో ఉంది. ఏపీలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు మొదటి స్థానంలో ఉన్నాయి. రాష్ట్రంలో 39,714 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న కోకో సాగు ఏటా సగటున 10,903.20 మెట్రిక్‌ టన్నుల దిగుబడి వస్తుంది. తమిళనాడులో 32,080 హెక్టార్లలో 2,802.45 మెట్రిక్‌ టన్నుల దిగుబడి వస్తుంది. అలాగే కేరళ రాష్ట్రంలో 17,366 హెక్టార్లలో సాగు జరుగుతుండగా 9,647.40 మెట్రిక్‌ టన్నుల దిగుబడి వస్తుంది. అలాగే కర్ణాటకలో 14,216 హెక్టార్లలో 3,719.10 మెట్రిక్‌ టన్నులు దిగుబడి వస్తుంది. రాష్ట్రంలో హెక్టారుకు సగటున 950 కిలోలు, తమిళనాడులో 350 కిలోలు, కర్ణాటకలో 525, కేరళలో 850 కిలోలు దిగుబడి వస్తుంది. దేశ వ్యాప్తంగా 4 దక్షిణాది రాష్ట్రాల్లో 97,563 హెక్టార్లలో కోకో సాగు విస్తీర్ణం ఉండగా ప్రతి ఏటా 2,07,072.15 మెట్రిక్‌ టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం కిలో ధర రూ.205గా ఉంది.

అంతరపంటగా ప్రోత్సాహం



కొబ్బరి, ఆయిల్‌పామ్‌లో అంతరపంటగా కోకో బాగా ఉపయుక్తంగా ఉండడంతో ఉద్యానశాఖ ద్వారా పభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుంది. రాష్ట్రంలో ఏలూరు జిల్లాలో అత్యధికంగా సాగు విస్తీర్ణం ఉంది.

– ఎ.దుర్గేష్, ఉద్యానశాఖ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌

శ్రీశైల మల్లన్నకు పుష్పపల్లకీ సేవ

శ్రీశైలం టెంపుల్‌: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీశైలంలో గురువారం భ్రమరాంబసమేత మల్లికార్జునుడు పుష్పపల్లకీపై ఊరేగారు. పల్లకీని పలు రకాల సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను తోడ్కొనివచ్చి పుష్పపల్లకీలో ఆశీనులను చేశారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు ప్రత్యేక పూజా హారతులిచ్చారు. క్షేత్ర తూర్పు, దక్షిణ మాడవీధుల్లో జరిగిన పుష్పపల్లకీ గ్రామోత్సవంలో లక్షలాది మంది పాల్గొన్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్‌ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో లవన్న, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. కాగా, శుక్రవారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లు గజవాహన సేవలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కురుక్షేత్రలో కొనసాగుతున్న లక్ష చండీ మహా యజ్ఞం

భగలాముఖిగా దర్శనమిచ్చిన చండీమాత


భగలాముఖి అలంకారంలో చండీమాత


యజ్ఞంలో పాల్గొన్న స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠం పర్యవేక్షణలో హరియాణ రాష్ట్రం కురుక్షేత్రలో జరుగుతున్న లక్ష చండీ మహా యజ్ఞం గురువారం వైభవంగా కొనసాగింది. యజ్ఞభూమిలో చండీమాత భగలాముఖి అవతారంలో దర్శనమిచ్చారు. మరోపక్క యజ్ఞంలో చండీ మాతను ఆరాధిస్తూ వేలకొద్దీ పారాయణ హోమాలు, సప్తశతీ పారాయణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భగలాముఖి అమ్మవారికి విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్రలు విశేష పూజలు నిర్వహించి మహా మంగళహారతిని సమర్పించారు. హరియాణ క్రీడా శాఖ మంత్రి సందీప్‌సింగ్‌ యజ్ఞంలో పాల్గొన్నారు. దేశం నలుమూలల నుంచి హిందువులు పెద్ద సంఖ్యలో యజ్ఞాన్ని సందర్శించారు.

శ్రీవారి సర్వ దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్టుమెంట్‌లు నిండి ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 66,033 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.4.33 కోట్లు సమర్పించారు. టైం స్లాట్‌ టికెట్లు కలిగిన వారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్నవారికి 3 గంటల్లో దర్శనం అవుతోంది.

సీఎం చిత్రపటానికి నాయీబ్రాహ్మణుల క్షీరాభిషేకం



దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల పాలక మండలిలో నాయీబ్రాహ్మణులకు సభ్యత్వం కల్పిస్తూ సీఎం వైఎస్‌ జగన్‌ తీసుకున్న నిర్ణయంపై విజయనగరం జిల్లా నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం చిత్రపటానికి ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌ కోలగట్ల వీరభద్రస్వామి సమక్షంలో నాయీబ్రాహ్మణులు విజయనగరంలో గురువారం క్షీరాభిషేకం చేశారు. – విజయనగరం

మిర్చి యార్డుని తనిఖీ చేసిన మార్కెటింగ్‌ శాఖ కమిషనర్‌


మిర్చిని పరిశీలిస్తున్న రాహుల్‌పాండే తదితరులు

కొరిటెపాడు (గుంటూరు వెస్ట్‌): గుంటూరు మార్కెట్‌ యార్డుని మార్కెటింగ్‌ శాఖ రాష్ట్ర కమిషనర్‌ రాహుల్‌పాండే గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యార్డు ఆవరణలోని రైతు విశ్రాంత భవనం, ఉచిత భోజనశాల వద్ద రైతులకు అందిస్తోన్న సేవలపై ఆరా తీశారు. యార్డులోని దుకాణాలను సందర్శించి అక్కడ వ్యాపార లావాదేవీలను తెలుసుకున్నారు. మిర్చి ధరలు ఎలా ఉన్నాయి, ఏయే రాష్ట్రాలు,జిల్లాల నుంచి యార్డుకు మిర్చి వస్తుంది, వ్యాపారులు రైతుల నుంచి ఏ విధంగా కొనుగోలు చేస్తారు, కొనుగోలు చేసిన మిర్చికి రైతుల నుంచి ఎంత సెస్‌ వసూలు చేస్తున్నారు, రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుందా లేదా అనే వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ..మిర్చి యార్డు అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని చెప్పారు.

బీసీలను మోసగిస్తున్న టీడీపీ

- ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఇండిపెండెంట్‌ ఎమ్మెల్సీ అభ్యర్థి ఈర్లె శ్రీరామ్మూర్తి ధ్వజం


మాట్లాడుతున్న ఈర్లె శ్రీరామ్మూర్తి

శ్రీకాకుళం అర్బన్‌: రాష్ట్రంలో బీసీలను వాడుకుని మోసగిస్తున్న పార్టీ తెలుగుదేశమని ఆ పార్టీ సీనియర్‌ నేత, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఇండిపెండెంట్‌ ఎమ్మెల్సీ అభ్యర్థి ఈర్లె శ్రీరామ్మూర్తి ధ్వజమెత్తారు. గురువారం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్‌ అతిథి గృహంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ టీడీపీని నమ్ముకుని నిజాయితీగా పనిచేసే వారికి ఎప్పుడూ అన్యాయమే జరుగుతున్నదన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్‌ విడుదల చేసిన సమయంలో తనకు జరిగిన అన్యాయాన్ని చంద్రబాబు ముందు పెడితే.. ఈ దఫా నీకే ఎమ్మెల్సీ టికెట్‌ ఇస్తానని చెప్పారని, ఇపుడు మాట తప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ అభ్యర్థులను ఓటు బ్యాంక్‌గా వాడుకోవడానికే తప్ప పదవులు, అధికారం ఇవ్వడానికి ఎంత మాత్రం చంద్రబాబు అంగీకరించడం లేదని దుయ్యబట్టారు. కార్యకర్తలంతా ఎమ్మెల్సీ రెబల్‌ ఇండిపెండెంట్‌ అభ్యర్థిగా పోటీచేయాలని నిర్ణయించిన మేరకే తాను రెబల్‌ అభ్యర్థిగా నిలిచానని అన్నారు. రెవెన్యూ విశ్రాంత ఉద్యోగుల సంఘం అసోషియేషన్‌ అధ్యక్షుడు ప్రకాశరావు, సెక్రటరీ నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలు రిపాలనదక్షులుగా మారాలి..

అందుకే పాలనలో శిక్షణ

- కేంద్ర మంత్రి జితేంద్రసింగ్‌ వెల్లడి
- అడ్మినిస్ట్రేటివ్‌ స్టాఫ్‌ కాలేజీలో ప్రారంభం
- ఫలితాల ఆధారంగా దేశవ్యాప్త విస్తరణ

సాక్షి, హైదరాబాద్‌: దేశంలోని శాస్త్రవేత్తలు పరిపాలనదక్షులుగానూ మారేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని అందులో భాగంగానే ‘లీడర్‌షిప్‌ ఫర్‌ సైంటిస్ట్‌ అడ్మినిస్ట్రేటర్స్‌’ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని కేంద్ర శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన శాఖల సహాయ మంత్రి డాక్టర్‌ జితేంద్ర సింగ్‌ వెల్లడించారు. అడ్మినిస్ట్రేటివ్‌ స్టాఫ్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇండియా, కెపాసిటీ బిల్డింగ్‌ కమిషన్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం హైదరాబాద్‌లో గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, అడ్మినిస్ట్రేటర్ల మధ్య ఒక అంతరం ఉందన్నారు. ఐఏఎస్‌లు ఏదో ఒక దశలో పరిశోధన సంస్థలకు నేతృత్వం వహించాల్సి వస్తుందనీ కానీ వారికి ఆయా అంశాలపై అవగాహన తక్కువగా ఉంటోందని పేర్కొన్నారు. అలాగే శాస్త్రవేత్తలు కూడా సంస్థలకు నేతృత్వం వహించాల్సి వచ్చినప్పుడు పరిపాలన సంబంధిత విషయాలపై అవగాహన లేకుండా ఉంటారని అన్నారు. ఈ అంతరాన్ని నివారించే లక్ష్యంతోనే శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ఫలితాల ఆధారంగా దేశవ్యాప్తంగా విస్తరించే ఆలోచన ఉందని చెప్పారు. స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల సమయానికి దేశం శాస్త్ర రంగంలో శిఖర స్థాయికి చేరుకునేలా.. మధ్యాదాయ దేశంగా ఎదిగేలా చేసేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని వివరించారు.

ఐఏఎస్‌లకు జియోస్పేటియల్‌ టెక్నాలజీల్లో శిక్షణ

టెక్నాలజీ ఆధారిత పాలనను మరింత అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్రం సివిల్‌ సర్వెంట్లకు కూడా అత్యాధునిక జియో స్పేటియల్‌ టెక్నాలజీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌ తెలిపారు. డ్రోన్‌ సర్వేలు మొదలుకొని మ్యాపింగ్, జీఐఎస్, భూ సర్వే, డిజిటల్‌ మ్యాపింగ్, లైడర్‌ మ్యాపింగ్‌ వంటి అంశాల్లో సివిల్‌ సర్వెంట్స్‌కు శిక్షణ ఇవ్వడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చన్నారు. హైదరాబాద్‌లోని నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ జియో ఇన్ఫర్మేటిక్స్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ (ఎన్‌ఐజీఎస్‌టీ) సంస్థను సందర్శించిన మంత్రి అక్కడ శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడారు. నేషనల్‌ జియో స్పేటియల్‌ పాలసీ (2022)కు అనుగుణంగా జియోస్పేటియల్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ రంగాల్లో పలు ఆన్‌లైన్‌ కోర్సులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఇవన్నీ ఐజీఓటీ కర్మయోగి ప్లాట్‌ఫార్మ్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ విధానంలో భాగంగా ఎన్‌ఐజీఎస్‌టీని అత్యున్నత నైపుణ్య కేంద్రంగా మార్చనున్నామన్నారు. ఎన్‌ఐజీఎస్‌టీ సంస్థ పునర్నిర్మాణ ప్రక్రియ ఇప్పటికే మొదలైందని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఈ సంస్థ విస్తరణ, అభివృద్ధి, శిక్షణ నాణ్యతల్లో మార్పులు, చేర్పులు చేపడతామని వివరించారు. పౌర సేవల విషయంలో ఎన్‌ఐజీఎస్‌టీ అత్యంత కీలకమైన పాత్ర పోషించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్‌ఐజీఎస్‌టీలోని వసతులన్నింటినీ సందర్శించిన మంత్రి అక్కడ సిబ్బందితో పాటు శిక్షణ పొందుతున్న వారితో ముచ్చటించారు. అంతకుముందు సంస్థ కార్యకలాపాలు, అందుబాటులోని కోర్సుల గురించి సంస్థ ఉన్నతాధికారులు మంత్రికి పవర్‌ పాయింట్‌ ప్రెజెంటేషన్‌ ద్వారా వివరించారు.

హంస–యాళి వాహనాలపై ఆది దంపతుల అభయం


హంస–యాళి వాహనాలపై ఊరేగుతున్న శివపార్వతులు

శ్రీకాళహస్తి రూరల్‌ (తిరుపతి జిల్లా): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో శ్రీకాళహస్తిలో మాఘ బహుళ ఏకాదశి గురువారం నాడు మూడవ తిరునాళ్ల గాంధర్వ రాత్రి ఉత్సవం వేడుకగా జరిగింది. ఉదయం హంస వాహనంపై స్వామి వారు, యాళి వాహనంపై అమ్మవారు ఊరేగారు. హంస–యాళి వాహనాలపై ఊరేగుతున్న ఆదిదంపతులను దర్శించుకుని భక్తులు పరవశించారు. దేవదేవుని ఉత్సవం నాలుగుమాడ వీధుల్లో వైభవంగా సాగింది. వేదపండితుల మంత్రోచ్చారణలు, కళాకారుల నృత్యాలు, భక్తుల కోలాటం భజనలు, శివనామ స్మరణల మధ్య ఊరేగింపు ఆద్యంతం కనులపండువగా సాగింది. మహిళలు కర్పూరహారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామి వారు రావణ వాహనంపై, అమ్మవారు నెమలి వాహనంపై ఊరేగారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్‌ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు పాల్గొన్నారు.

ఉండవల్లిలో పర్యాటకాభివృద్ధికి కసరత్తు

- భవానీ ఐలాండ్‌ విస్తరణకు ప్రతిపాదనలు
- ఉండవల్లి, వెంకటపాలెంలో 311.78 ఎకరాలు కేటాయించాలని వినతి


తాడేపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్‌ రామ్‌ప్రసాద్‌తో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్‌ పర్యాటక విజయవాడ రీజనల్‌ డైరెక్టర్‌ శ్రీనివాసులురెడ్డి

తాడేపల్లిరూరల్‌: మంగళగిరి నియోజకవర్గంలో కృష్ణానది ఎగువ ప్రాంతంలో ఉన్న భవానీ ఐలాండ్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌ పర్యాటక శాఖ సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి, తుళ్లూరు మండలం వెంకటపాలెంలో ఉన్న ప్రభుత్వ లంక భూములను పర్యాటక శాఖకు కేటాయించాలని గురువారం తాడేపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్‌ రామ్‌ప్రసాద్‌ను కోరుతూ గురువారం ఆంధ్రప్రదేశ్‌ పర్యాటక శాఖ విజయవాడ రీజనల్‌ డైరెక్టర్‌ శ్రీనివాసులురెడ్డి ప్రతిపాదనలు అందజేశారు. అనంతరం శ్రీనివాసులురెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఉండవల్లిలో భవానీ ఐలాండ్‌కు గతంలో 125.76 ఎకరాలు కేటాయించారని, దానిని ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌ పర్యాటక శాఖ అభివృద్ధి చేసిందని తెలిపారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు ఉండవల్లి పరిధిలో 194.33 ఎకరాలు, వెంకటపాలెం పరిధిలో 117.45 ఎకరాలు మొత్తం 311.78 ఎకరాలు కేటాయించాలని గుంటూరు జిల్లా కలెక్టర్‌ వేణుగోపాల్‌రెడ్డిని కోరామని, భూ కేటాయింపు విషయమై తాడేపల్లి, తుళ్లూరు తహసీల్దార్‌లకు ప్రతిపాదనలను పంపగా, వాటి వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు.

కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

- వంతెనను ఢీకొన్న కారు... నలుగురి మృతి
- మృతులంతా హైదరాబాద్‌ వాసులే

సాక్షి, బళ్లారి: కర్ణాటకలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వంతెనను కారు ఢీకొని నలుగురు హైదరాబాద్‌ వాసులు దుర్మరణం చెందారు. కొప్పళ జిల్లా కుకనూరు తాలూకాలో జాతీయ రహదారిపై గురువారం ఈ ప్రమాదం జరిగింది. మృతులను హైదరాబాద్‌కు చెందిన షణ్ముఖ(28), రూపవతి(26), వెన్నెల(25)గా గుర్తించారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన మరో వ్యక్తి పేరు తెలియరాలేదు. వీరు హైదరాబాద్‌ నుంచి గోవా వైపు కారులో వస్తుండగా బన్నికొప్ప వద్ద ముందు టైర్‌ ఊడిపోయి అదుపు తప్పి వంతెనను ఢీకొని బోల్తా పడిందని పోలీసులు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో కుకనూరు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను కొప్పళ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రెహ్మతాబాద్‌ దర్గా ముతవల్లి తొలగింపు


వక్ఫ్‌బోర్డు సమావేశంలో పాల్గొన్న సభ్యులు

దర్గా నిర్వహణ బాధ్యత చేపట్టనున్న వక్ఫ్‌బోర్డు

వన్‌టౌన్‌ (విజయవాడ పశ్చిమ): శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అనుమసముద్రంపేట రెహ్మతాబాద్‌లో సుప్రసిద్ధ హజరత్‌ సయ్యద్‌ ఖాజా నాయబ్‌ రసూల్‌ దర్గా ముతవల్లి హాఫిజ్‌ బాషాను తొలగించినట్లు ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ వి.ఖాదర్‌బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లైంగిక ఆరోపణలు, పోలీసు కేసులు ఎదుర్కొంటున్న హాఫిజ్‌బాషాను ముతవల్లి బాధ్యతల నుంచి తొలగించాలని, దర్గాను స్వాధీనం చేసుకోవాలని గురువారం విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్‌ స్టేట్‌ వక్ఫ్‌బోర్డు సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆ దర్గా నిర్వహణ బాధ్యతను వక్ఫ్‌బోర్డు చేపడుతుందని ప్రకటించారు.

స్కూటీపై చిన్నారి మృతదేహం తరలింపు!

చికిత్స పొందుతూ 15 రోజుల బాలుడు మృతి

- డీజిల్‌ పట్టించుకోవడానికి వెళ్లిన అంబులెన్స్‌
- సమాచారం ఇవ్వకుండా మృత శిశువును తీసుకెళ్లిన తండ్రి
- పాడేరు వద్ద గుర్తించి తిరిగి అంబులెన్స్‌లో స్వగ్రామానికి..
- ఈ ఘటనపై విచారణకు ఆదేశించిన డిప్యూటీ సీఎం రాజన్నదొర
- వాస్తవాలు తెలుసుకోకుండా పవన్‌ వ్యాఖ్యలు దారుణం అని మండిపాటు


స్కూటీపై మృతదేహంతో పసిబిడ్డ తల్లిదండ్రులు మత్స్యరాజు, మహేశ్వరి

మహారాణిపేట/ముంచంగిపుట్టు/సాలూరు/ సాక్షి, అమరావతి : అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందిన 15 రోజుల శిశువును స్వగ్రామానికి తరలించడానికి అంబులెన్స్‌ సిద్ధం చేస్తుండగానే తల్లిదండ్రులు స్కూటీపై తీసుకెళ్లడం కలకలం రేపింది. అధికారులు మార్గమధ్యంలో గుర్తించి, మృతదేహాన్ని అంబులెన్స్‌లో వారి సొంతూరుకు తీసుకెళ్లారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం కుముడు గ్రామానికి చెందిన చిన్న మత్స్యరాజు, మహేశ్వరి దంపతులకు ఈ నెల 2వ తేదీన పాడేరు ఆస్పత్రిలో మగ శిశువు జన్మించాడు. బరువు తక్కువగా ఉండటంతో పాటు శ్వాస సంబంధిత సమస్యతో జన్మించడం వల్ల పాడేరు ఆస్పత్రి వైద్యులు కేజీహెచ్‌ పిల్లల వార్డుకు రిఫర్‌ చేశారు. అదే రోజున శిశువును కేజీహెచ్‌ పిల్లల వార్డులో చేర్పించారు. అప్పటి నుంచి ఎన్‌ఐసీయూ వార్డులో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ గురువారం ఉదయం 7.15 గంటలకు మృతి చెందాడు. ఈ విషయాన్ని వైద్యులు కేజీహెచ్‌లోని గిరిజన సెల్‌ ఇన్‌చార్జి ఎం.రామకృష్ణకు తెలియజేశారు. శిశువు మృతదేహం తరలింపునకు వాహనం సిద్ధం చేస్తుండగానే.. తండ్రి ద్విచక్ర వాహనంపై తీసుకొని వెళ్లినట్టు ఆయన పాడేరు డీఎంహెచ్‌వో, ఐటీడీఏ పీవోకు సమాచారం అందించారు. ఈ విషయం కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌ దృష్టికి కూడా వెళ్లడంతో ఆయన తక్షణం స్పందించారు. కలెక్టర్‌ ఆదేశాలతో సిబ్బంది మృత శిశువును తీసుకెళ్తున్న స్కూటీని పాడేరు వద్ద గుర్తించారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో కుముడు గ్రామానికి తరలించారు. కేజీహెచ్‌ సిబ్బంది సరిగా స్పందించనందుకే తామిలా తీసుకొచ్చామని తల్లిదండ్రులు తెలిపారు.

విచారణకు ఆదేశం

విశాఖపట్నం కేజీహెచ్‌లో శిశువు మృతదేహాన్ని తరలించేందుకు అంబులెన్స్‌ సమకూర్చలేదన్న విషయంపై విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లను సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్టు డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. సాలూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐటీడీఏ అంబులెన్స్‌కు ఆయిల్‌ పట్టించుకుని వస్తామని సిబ్బంది తెలిపినప్పటికీ వినకుండా సదరు వ్యక్తులు ఎవరి ప్రోద్బలంతోనో వెళ్లిపోయారన్నారు. అయినప్పటికీ మార్గం మధ్యలో వారిని గుర్తించి, అంబులెన్స్‌లో శిశువు మృతదేహాన్ని తరలించారని తెలిపారు. ఈ విషయంలో వాస్తవాలు తెలుసుకోకుండా సీఎం జగన్‌కు మానవత్వం లేదంటూ జనసేన అధ్యక్షుడు పవన్‌ కళ్యాణ్‌ ఇష్టానుసారం మాట్లాడటం తగదన్నారు. ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి, గిరిజనులకు మంచి వైద్యం కోసం సీఎం ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. కాగా, ఈ ఘటనపై కేజీహెచ్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ పి.అశోక్‌కుమార్‌ విచారణ చేస్తున్నారు. రెండు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు.

క్లుప్తంగా...

‘బీబీసీ’లో మూడో రోజూ..

న్యూఢిల్లీ: ఢిల్లీలోని బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసీ) కార్యాలయంలో వరుసగా మూడో రోజు గురువారం సర్వే కొనసాగింది. మంగళవారం ఉదయం 11.30 గంటలకు ఆదాయపు పన్ను(ఐటీ) శాఖ అధికారులు రంగంలోకి దిగిన సంగతి తెలిసిందే. బీబీసీ ఉద్యోగుల నుంచి సంస్థ ఆర్థిక వ్యవహారాల డేటాను సేకరించారు. ఎలక్ట్రానిక్, పేపర్ డేటా కాపీలను తీసుకున్నారు. ఆదాయపు పన్ను శాఖ సర్వేతో ఎలాంటి ఇబ్బంది లేదని, భారత్‌లో తమ చానల్ ప్రసారాలు యథాతథంగా సాగుతున్నాయని ఢిల్లీలోని బీబీసీ ఆఫీసు సిబ్బంది తెలియజేశారు. 60 గంటలపాటు సాగిన సోదాలు గురువారం ముగిశాయి.

లంకలో కరెంట్ చార్జీల మోత

కొలంబో: అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) నిబంధనలు శ్రీలంక ప్రజల పాలిట పెనుభారంగా మారుతున్నాయి. ఐఎంఎఫ్ విధించిన నిబంధనలకు తలొగ్గిన శ్రీలంక ప్రభుత్వం విద్యుత్ చార్జీలను 66 శాతం పెంచేస్తూ నిర్ణయం తీసుకుంది. కరెంటు చార్జీలు పెంచడం గత ఆరు నెలల్లో ఇది రెండోసారి. బిల్లుల పెంపు నేపథ్యంలో విద్యుత్ కోతలకు గురువారం నుంచే తెరపడింది. ఇకపై నిరంతరాయంగా కరెంటు సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. శ్రీలంకలో గత ఏడాది కాలంగా కరెంటు కోతలు కొనసాగాయి. నిత్యం ఒక గంట నుంచి 14 గంటలదాకా కరెంటు సరఫరా నిలిపివేశారు. రుణం ఇవ్వాలంటే విద్యుత్ చార్జీలు పెంచాలని ఐఎంఎఫ్ స్పష్టం చేయడంతో శ్రీలంక ప్రభుత్వం ఒప్పుకోక తప్పలేదు. ఐఎంఎఫ్ నుంచి 2.9 బిలియన్ డాలర్ల రుణం తీసుకోనుంది.

జేపీసీ తప్ప మరేదైనా వృథాయే

న్యూఢిల్లీ : పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ వ్యవహారంలో సమగ్ర విచారణ అత్యంత అవసరమని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఈ విషయంలో సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) తప్ప మరే కమిటీ వేసినా వృథా ప్రయాసేనని అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటుపై సుప్రీం కోర్టు దగ్గర ప్రతిపాదనలు చేస్తే , ఈ అంశంలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నట్టు అవుతుందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదానీ ఆస్తులకు సంబంధించి హిండెన్‌బర్గ్ నివేదికలో వచ్చిన ఆరోపణలపై నిపుణులతో కమిటీ వేయాలని సుప్రీం కోర్టు ఈ నెల 13న జరిపిన విచారణలో అభిప్రాయపడిందని, దీనిపై కేంద్రం 17లోగా స్పందించాల్సి ఉందని జైరామ్ రమేష్ గుర్తు చేశారు. జేపీసీ మినహాయించి ఎలాంటి చట్టబద్ధ కమిటీలు వేసినా ఈ విషయంలో ఉపయోగం ఉండదని అన్నారు.

అధ్యక్ష పోటీకి రిపబ్లికన్ల పోటీ

ట్రంప్‌కు సవాల్ విసురుతున్న డెసాంటిస్, హేలీ, పెన్స్, పాంపియో ● వీరవిధేయులే వ్యతిరేకులుగా మారిన వైనం

ఒకప్పుడు అందరూ ట్రంప్‌కి వీరవిధేయులు
ఇప్పుడు అధ్యక్ష అభ్యర్థిగా ఆయనకే సవాల్ విసురుతున్నారు
ట్రంప్ ఓటమిపాలైనప్పుడు ఆయన వెన్నంటి నడిచిన వారు
కేపిటల్ హిల్‌పై దాడి జరిపినప్పుడు ఆయనకు మద్దతుగా ఉన్నవారు
ఇప్పుడు ఆయనకు ఎదురు తిరుగుతున్నారు
రిపబ్లిక్ పార్టీలో అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీలో ట్రంప్ సన్నిహితులే సై అంటున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



అమెరికాలో అధ్యక్ష బరిలో దిగడం కోసం పబ్లికన్ పార్టీలో పోటీ పెరిగిపోతోంది. భారతీయ సంతతికి చెందిన నిక్కీ హేలీ తాను పోటీలో ఉన్నట్టు ప్రకటించగానే ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయి. అమెరికాలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ట్రంప్ అనుచరులందరూ ఓటమి పాలవడంతో పార్టీలో ఆయనపై విశ్వాసం సన్నగిల్లుతోంది. అధ్యక్ష ఎన్నికల సమయానికి ఆయనకు 78 సంవత్సరాలు మీద పడతాయి. దీంతో ఒకప్పుడు ట్రంప్‌కు మద్దతునిచ్చినవారే ఇప్పుడు ఆయనపై పోటీకి సై అంటున్నారు.అయితే పోటీ ప్రధానంగా డొనాల్డ్ ట్రంప్, ఫ్లోరిడా గవర్నర్ రాన్ డెసాంటిస్ మధ్య ఉంటుందని అంచనాలున్నాయి.

రాన్ డెసాంటిస్

ట్రంప్‌కి గట్టి పోటీ ఇచ్చే వారిలో ఫ్లోరిడా గవర్నర్ రాన్ డెసాంటిస్ ముందు వరుసలో ఉంటారనే అంచనాలున్నాయి. ఇప్పటివరకు ఆయన తాను బరిలో ఉన్నట్టు ప్రకటించకపోయినప్పటికీ పార్టీలో ట్రంప్ వ్యతిరేక వర్గం రాన్‌కు జై కొడుతోంది. మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున ఫ్లోరిడా గవర్నర్‌గా 15 లక్షల ఓట్ల భారీ మెజార్టీతో రాన్ నెగ్గారు. 44 ఏళ్ల వయసున్న రాన్ హార్వార్డ్‌లో లా డిగ్రీ పొందారు. నేవీలో పనిచేశారు. అమెరికన్ కాంగ్రెస్‌లో ప్రజాప్రతినిధుల సభ్యునిగా 2013 నుంచి 2018 వరకు ఉన్నప్పటికీ పెద్దగా గుర్తింపు రాలేదు. రాన్ డెసాంటిస్‌కు రాజకీయాల్లో గుర్తింపు, ఒక లైఫ్ ఇచ్చింది ట్రంపే. 2019 ఎన్నికల్లో ఫ్లోరిడా గవర్నర్‌గా రాన్ అభ్యర్థిత్వాన్ని ట్రంప్ బాహాటంగా బలపరచడంతో ఆయన నెగ్గగలిగారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఫ్లోరిడా గవర్నర్‌గా గత 40 దశాబ్దాల్లో ఎవరికీ దక్కని మెజార్టీతో తిరిగి ఎన్నికయ్యారు. కరోనా సంక్షోభం సమయంలో ప్రజలకు విపరీతమైన స్వేచ్ఛ ఇచ్చారు. మాస్క్‌లు, టీకాలు తప్పనిసరి చేయకపోవడంతో ప్రజలు ఆయనను బాగా అభిమానించారు. దాదాపుగా ట్రంప్ భావాలే ఉన్నప్పటికీ, దుందుడుకు ధోరణితో కాకుండా సౌమ్యంగా వ్యవహరించడం వల్ల ట్రంప్ వ్యతిరేక వర్గానికి ఒక ఆశాదీపంలా కనిపిస్తున్నారు.



నిక్కీ హేలీ

భారతీయ సంతతికి చెందిన నిక్కీ హేలీ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం బరిలో ఉన్నట్టు ప్రకటించి ప్రచారం మొదలుపెట్టడంతో రాజకీయాలు హీటెక్కాయి. ట్రంప్ తర్వాత అధికారిక ప్రకటన చేసిన రెండో అభ్యర్థి నిక్కీ. ఒకప్పుడు రిపబ్లికన్ పార్టీలో యువ కెరటంగా చరిష్మా ఉన్నప్పటికీ, ఇటీవల ఆమె ప్రభ నెమ్మదిగా తగ్గుతూ వచ్చింది. పంజాబ్ నుంచి అమెరికాకు వలస వెళ్లిన కుటుంబానికి చెందిన నిక్కీ అక్కడి దక్షిణ కరోలినా తొలి మహిళా గవర్నర్‌గా చేశారు. 2016లో ట్రంప్‌ను తీవ్రంగా వ్యతిరేకించినా ఆయన అధ్యక్షుడయ్యాక ఆమె రాజీకొచ్చారు. ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారిగా పని చేశారు. ఐరాస భద్రతా మండలి సమావేశం జరుగుతుండగా నాటకీయ పరిణామాల మధ్య పదవి నుంచి వైదొలిగారు.




మైక్ పాంపియో

డొనాల్డ్ ట్రంప్ హయాంలో సీఐఏ డైరెక్టర్‌గా, విదేశాంగ మంత్రిగా పదవులు నిర్వహించిన మైక్ పాంపియో చివరి వరకు ఆయనకు విధేయుడిగానే ఉన్నారు. ట్రంప్ విదేశీ విధానాలను ముందుకు తీసుకువెళ్లడంలో కీలకంగా వ్యవహరించారు. కేపిటల్ హిల్‌పై దాడి జరిగిన సమయంలో కూడా ట్రంప్‌కు మద్దతుగా ఉన్నారు. ''చరిత్ర మమ్మల్ని బాగా గుర్తు పెట్టుకుంటుంది'' అని వ్యాఖ్యానించి వార్తల్లో నిలిచారు. వెస్ట్ పాయింట్ మిలటరీ అకాడమీలో గ్రాడ్యుయేషన్, హార్వార్డ్ యూనివర్సిటీ లా డిగ్రీ చేసిన పాంపియో ఇప్పుడు తన మాజీ బాస్‌నే ఎదిరించడానికి సిద్ధమవుతున్నారు. అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడతానని సన్నిహితుల వద్ద వెల్లడించారు. ఇక అధికారికంగా బరిలో దిగడమే మిగిలి ఉంది.



మైక్ పెన్స్

ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఉపాధ్యక్షుడిగా అత్యంత విధేయత ప్రకటించిన మైక్ పెన్స్ ఈసారి అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడతారని చెబుతున్నారు. 2021 జనవరిలో కేపిటల్ హిల్‌పై దాడి జరిగే వరకు ఇరువురి మధ్య మంచి అనుబంధం కొనసాగింది. ఆ దాడుల తర్వాత ట్రంప్, పెన్స్ సంబంధాలు క్షీణించాయి. 2020 అధ్యక్ష ఎన్నికల్లో కిందపడినా పై చేయి తనదేనని చాటి చెప్పడానికి ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలకు సహకారం అందించడానికి పెన్స్ నిరాకరించారు. అప్పట్నుంచి పెన్స్‌పై గుర్రుగా ఉన్న ట్రంప్ ఆయనని ఒక పిరికివాడుగా ముద్ర వేస్తూ వ్యాఖ్యలు చేశారు. పెన్స్‌కి మృదుస్వభావిగా పార్టీలో మంచిపేరుంది. తొలిసారిగా 2000 సంవత్సరంలో ప్రతినిధుల సభకు ఎన్నికైన పెన్స్ 2013 వరకు కాంగ్రెస్ సభ్యునిగా ఉన్నారు. 2013 నుంచి 2017 వరకు ఇండియానా గవర్నర్‌గా పని చేశారు. కరడు గట్టిన సంప్రదాయవాదిగా ముద్రపడిన పెన్స్ 2016లో ట్రంప్ అభ్యర్థిత్వానికి గట్టి మద్దతుదారుడిగా ఉన్నారు. ఇప్పుడు ఆయనపైనే పోటీకి సై అంటున్నారు.



రిపబ్లికన్లలో ట్రంప్‌కు మద్దతు ఎంత ?

ట్రంప్ అధ్యక్ష అభ్యర్థిగా పోటీకి దిగుతున్నానని ప్రకటించిన తర్వాత మిశ్రమ స్పందన కనిపించింది. ప్రస్తుతం అమెరికా ఉన్న పరిస్థితిల్లో ట్రంప్ వంటి దుందుడుకు ధోరణి కలిగిన వాడే అధ్యక్ష అభ్యర్థిగా ఉంటే గెలుపు సాధిస్తామని కొందరు భావిస్తూ ఉంటే మరికొందరు ట్రంప్ నోటి దురుసును అసహ్యించుకుంటున్నారు. ఇటీవల జరిగిన మధ్యంతర ఎన్నికల్లో రెడ్ వేవ్ వస్తుందని అత్యధికులు ఆశించారు. అధ్యక్షుడు జో బైడెన్ పట్ల నెలకొన్న తీవ్ర వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలచుకోవడంలో రిపబ్లికన్లు విఫలమయ్యారు. మరీ ముఖ్యంగా ట్రంప్ అనుచరులందరూ ఓటమి పాలవడం, కేపిటల్ హిల్‌పై దాడికి సంబంధించిన కోర్టు కేసుల్లో ఇరుక్కోవడం వంటి పరిణామాలతో ట్రంప్‌పై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ట్రంప్ విధానాలకు గ్రాండ్ ఓల్డ్ పార్టీలో అత్యధికులు మద్దతు చెబుతున్నా వాటిని అమలు చేయడంలో ట్రంప్ చూపిస్తున్న దూకుడు స్వభావాన్ని వ్యతిరేకిస్తున్నారు. 40 శాతం మంది ట్రంప్‌కు మద్దతుగా ఉంటే, 60 శాతం మంది వేరొకరు అధ్యక్ష అభ్యర్థిగా ఉండాలని కోరుకుంటున్నట్లు సర్వేలో తేలింది. 30 నుంచి 50 శాతం మంది ఫ్లోరిడా గవర్నర్ డెసాంటిస్‌కు మద్దతివ్వడం విశేషం. అధ్యక్ష అభ్యర్థి ఎన్నికలు పూర్తయ్యే సమయానికి పరిణామాలు వేగంగా మారిపోయి ట్రంప్‌కి అనుకూల పరిస్థితులు వస్తాయన్న అంచనాలు ఉన్నాయి.

ముంబైలో క్రికెటర్ పృథ్వీ షాపై దాడి



ముంబై: భారత క్రికెటర్ పృథ్వీ షాపై ముంబైలో కొందరు యువకులు చెయ్యి చేసుకున్నారు. ఆయన కారుపై బేస్‌బాల్ బ్యాట్‌తో దాడి చేశారు. సెల్ఫీ తీసుకుంటామని అడిగితే నిరాకరించడమే ఇందుకు కారణం. శాంతాక్రుజ్‌లో ఓ లగ్జరీ హోటల్ ఎదుట బుధవారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది. పృథ్వీ షాపై దాడికి దిగిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ సప్న గిల్‌ను అరెస్టు చేశామని, ఆమె మిత్రుడు శోభిత్ ఠాకూర్‌పాటు మరో ఆరుగురిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని పోలీసులు గురువారం వెల్లడించారు. సెల్ఫీ విషయంలో పృథ్వీ షా, నిందితులకు మధ్య తొలుత తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. సహనం కోల్పోయిన నిందితులు ఆయనపై చెయ్యి చేసుకున్నారని పోలీసులు చెప్పారు. ఈ సంఘటన జరిగినప్పుడు సప్న గిల్, శోభిత్ ఠాకూర్ మద్యం మత్తులో ఉన్నారని తెలిపారు. పృథ్వీ షా ఒక సెల్ఫీ ఇచ్చారని, మరికొన్ని సెల్ఫీలు కావాలంటూ వారు డిమాండ్ చేయడంతో ఆయన ఒప్పుకోలేదని అన్నారు. దాడికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

పాక్ ప్రజలకు భారీ పెట్రో వాత

ఇస్లామాబాద్: ఆర్థికసంక్షోభం నుంచి కాస్తయినా తెరిపిన పడేందుకు సిద్ధమైన పాకిస్తాన్ ప్రభుత్వం అక్కడి ప్రజలకు ధరల వాతలు పెడుతోంది. పార్లమెంట్‌లో పన్నుల వడ్డింపుతో కూడిన మినీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కొద్ది గంటలకే ప్రజలపై ‘పెట్రో’ బాంబు పడేసింది. పెట్రోల్ లీటర్‌కు 22 పాక్ రూపాయలు పెంచుతున్నట్లు ఆ దేశ ఆర్థికశాఖ విభాగం ఒక ప్రకటన విడుదలచేసింది. బుధవారం అర్ధరాత్రి అమల్లోకి వచ్చిన కొత్త ధరల ప్రకారం పాక్‌లో ఒక లీటర్ పెట్రోల్ ధర 272 పాక్ రూపాయలకు ఎగబాకింది. ఇక హైస్పీడ్ డీజిల్(హెచ్ఎస్‌డీ) ధర లీటర్‌కు 17.20 పాక్ రూపాయలు పెంచింది. దీంతో హెచ్ఎస్‌డీ కొత్త ధర రూ.280కి చేరింది. కిరోసిన్‌పై 12.9 రూపాయలు పెంచింది. పెంపు తర్వాత లీటర్ కిరోసిన్ ధర రూ.202.73కి చేరింది. కొత్తగా ఉద్దీపన ప్యాకేజీ కింద 7 బిలియన్ డాలర్లలో ఒక దఫాగా 1.1 బిలియన్ డాలర్లు విడల్వాలంటే పన్నుల ద్వారా ఆదాయం పెంచుకోవాలని అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) షరతులు విధించడంతో పాక్ ఈ ధరల మోత మోగించింది. చలికాలంకావడంతో ఇప్పటికే కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్(సీఎన్‌జీ) స్టేషన్లలో సీఎన్‌జీ నిల్వలు నిండుకున్నాయి. దీంతో జనం రవాణాకు పెట్రోల్‌పైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఫిబ్రవరిలో 3 బిలియన్ డాలర్లలోపునకు పడిపోయిన విదేశీ మారకద్రవ్య నిల్వలను కాస్తయినా పెంచుకునేందుకు పాక్ తిప్పలుపడుతోంది.

‘మహారాష్ట్ర’ సంక్షోభంపై సుప్రీం తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని శివసేన పార్టీలో చీలికలు ఏర్పడిన అనంతరం తలెత్తిన రాజకీయ సంక్షోభంపై సుప్రీం కోర్టు తన తీర్పుని రిజర్వ్ చేసింది. 2016లో నబమ్ రెబియా కేసులో తీర్పుని పునఃపరిశీలించాలంటూ విస్తృత ధర్మాసనానికి అప్పగించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని అయిదుగురు సభ్యులున్న ధర్మాసనం శివసేనలో చీలిక, కొందరు ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకి సంబంధించిన పిటిషన్‌ను గురువారం విచారించింది. ‘ ఠాక్రే, షిండే చీలికవర్గం తరఫు లాయర్ల వాదనలన్నింటినీ విన్నాం. నబమ్ రెబియా తీర్పుని పునఃపరిశీలించాలి. దానిని ఏడుగురు సభ్యులున్న విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగిస్తున్నాం’ అని తెలిపింది.

ఏమిటీ నబమ్ రెబియా తీర్పు

ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకు సంబంధించి అసెంబ్లీ స్పీకర్‌కున్న అధికారాలపై అరుణాచల్ ప్రదేశ్‌లోని నబమ్ రెబియా కేసులో 2016లో సుప్రీం తీర్పు చెప్పింది. ఈ తీర్పు ప్రకారం శాసనసభ స్పీకర్‌ను తొలగించిన నిర్ణయం సభలో పెండింగ్‌లో ఉన్న సమయంలో ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే అధికారం సభాపతికి ఉండదు. అరుణాచల్ ప్రదేశ్‌లో అప్పట్లో అధికార కాంగ్రెస్‌కు చెందిన సీఎం నబమ్ టుకీయేని గద్దె దించడానికి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సహకారంతో అసమ్మతి నాయకుడు కలిఖో పుల్ తిరుగుబాటు చేశారు. దీంతో టుకీ సోదరుడైన అసెంబ్లీ స్పీకర్ నబమ్ రెబియా 21 మంది అసమ్మతి ఎమ్మెల్యేల్లో 14 మందిని అనర్హులుగా ప్రకటించారు. మరోవైపు అసమ్మతి ఎమ్మెల్యేలు స్పీకర్ రెబియాను తొలగిస్తూ తీర్మానం చేశారు. దీనిపై కాంగ్రెస్ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే, స్పీకర్‌ను తొలగించిన నిర్ణయం పెండింగ్‌లో ఉన్న సమయంలో ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే అధికారం ఉండదని సుప్రీం తీర్పు చెప్పింది. ఈ తీర్పుని అనుసరించి సుప్రీం కోర్టు నిర్ణయం తీసుకుంటే మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గానికి ఊరట లభిస్తుంది. మహారాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, థాక్రే విధేయుడు నరహరి సీతారామ్ జిర్వాల్‌ను తొలగిస్తూ షిండే వర్గం ఇచ్చిన నోటీసు సభలో పెండింగ్‌లోనే ఉంది.

ఆదివాసీల అభ్యున్నతికి ప్రాధాన్యం

ఆది మహోత్సవ్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: దేశంలోని ఆదివాసీల అభ్యున్నతి కోసం కేంద్రం ఎంతో చేస్తోందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. మెగా జాతీయ ఆదివాసీల ఉత్సవం ‘ఆది మహోత్సవ్’ను గురువారం ప్రధాని ప్రారంభించారు. గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలు ఎలా ఉంటాయో చాటి చెప్పడానికి , ఆదివాసీలు తయారు చేసిన వస్తువులు, ఆహార పదార్థాలు విక్రయించడానికి అవకాశం కల్పిస్తూ వారి అభ్యున్నతి కోసం తాము అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి కృషి చేస్తున్నామని తెలిపారు. బడ్జెట్‌లో నిధులు భారీగా కేటాయిస్తున్నామని, మొట్టమొదటిసారిగా ఆదివాసీ మహిళ ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతి పీఠంపై కూర్చోబెట్టినది తమ ప్రభుత్వమేనని సగర్వంగా చెబుతున్నామని పేర్కొన్నారు. ఢిల్లీ దాని చుట్టుపక్కల రాష్ట్రాల్లోని ప్రజలందరూ తప్పనిసరిగా ఆది మహోత్సవ్‌ను సందర్శించి, ఆదివాసీలు తయారు చేసిన వస్తువుల్ని కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలన్నారు.



ఆదివాసీల ఉత్పత్తులను పరిశీలిస్తున్న ప్రధాని మోదీ

స్వాతంత్ర్య సంగ్రామంలో ఆదివాసీల పాత్ర మరువలేనిదని, వారి త్యాగాలను గుర్తుంచుకోవాలన్నారు. అమృత కాలంలో ఆదివాసీలను తిరిగి వెలుగులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుంటున్నామని మోదీ తెలిపారు.

బొట్టు బొట్టు కాపాడుకోవాలి

దేశంలో నీటి సంరక్షణ అత్యంత ఆందోళన కలిగించే అంశమని మోదీ అన్నారు. ప్రకృతితో మనకున్న భావోద్వేగ బంధాన్ని తిరిగి పునరుద్ధరించుకొని నీటి వనరుల్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర జల శక్తి శాఖ, బ్రహ్మకుమారిలు సంయుక్తంగా నిర్వహిస్తున్న దేశవ్యాప్త ప్రచారం జల్ జన్ అభియాన్‌ను ప్రధాని మోదీ గురువారం ప్రారంభించారు. రాజస్థాన్‌లోని బ్రహ్మకుమారిల ప్రధాన కార్యాలయంలో ఉన్న వారినుద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు.

ఢిల్లీ మద్యం కేసులో నిందితుల బెయిల్ తిరస్కరణ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానంలో అవకతవకల కేసులో ఐదుగురు నిందితుల బెయిల్ దరఖాస్తులను ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు తిరస్కరించింది. సౌత్ గ్రూప్‌కు కిక్‌బ్యాక్స్ రూపంలో రూ.100 కోట్లు బదిలీ కావడంలో ఆప్ నేత విజయ్ నాయర్ కీలకపాత్ర పోషించారని ప్రాథమిక సాక్ష్యాధారాలను బట్టి తెలుస్తోందని జడ్జి ఎంకే నాగ్‌పాల్ తన ఉత్తర్వులో పేర్కొన్నారు. ‘ నిందితులు బెయిల్‌పై విడుదలైతే సాక్ష్యాలను ట్యాంపర్ చేయబోరని కోర్టు విశ్వాసంలోకి తీసుకోవట్లేదు. అందుకే బెయిల్ పిటిషన్లను తిరస్కరిస్తున్నాం’ అని జడ్జి తన ఉత్తర్వులో పేర్కొన్నారు. కేసు విచారణ సందర్భంగా విజయ్‌నాయర్, సమీర్ మహేంద్రు, బినోయ్ బాబు, అభిషేక్ బోయిన్‌పల్లి, శరత్ చంద్రారెడ్డిల బెయిల్ దరఖాస్తులను జడ్జి నాగ్‌పాల్ విచారించారు. ఇరు పక్షాల వాదనల అనంతరం నిందితుల బెయిల్ పిటిషన్లను తిరస్కరిస్తూ జడ్జి 123 పేజీల తీర్పు వెలువరించారు. ‘ నిందితులు తమ వేర్వేరు ఫోన్లను పాడుచేయడంసహా డిజిటల్ సాక్ష్యాలు ధ్వంసం చేశారన్న ఆరోపణల తాలూకు రికార్డులను ఈడీ సమర్పించింది. వీరిపై ఆరోపణలు చాలా తీవ్రమైనవి’ అని జడ్జి తన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ మీడియా ఇన్‌ఛార్జి విజయ్ నాయర్ మద్యం వ్యాపారుల వాటాదారులతో వేర్వేరు ప్రదేశాల్లో సమావేశమైనట్లు ఈడీ దర్యాప్తులో వెల్లడైందని తీర్పులో పేర్కొన్నారు. సీబీఐ నమోదుచేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ కేసు నమోదుచేసి మనీలాండరింగ్ కోణంలో కేసును దర్యాప్తుచేస్తోంది.

మరోసారి ఉక్రెయిన్‌పై క్షిపణుల వర్షం

కీవ్: ఉక్రెయిన్ భూభాగాల దురాక్రమణకు దిగిన రష్యా సేనలు బుధవారం రాత్రి క్రూయిజ్, ఇతర క్షిపణులతో విరుచుకుపడ్డాయి. రెండు గంటలపాటు ఏకధాటిగా పలు రకాల క్షిపణులు దూసుకొచ్చాయని, 36 మిస్సైళ్లలో 16 క్షిపణులను కూల్చేశామని ఉక్రెయిన్ సైనిక చీఫ్ వలేరీ జలూజ్నీ చెప్పారు. రష్యా క్షిపణుల దాడిలో ఒక వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయింది. ఏడుగురు గాయపడ్డారు. అయితే, రష్యా వాయుసేన కొత్తగా భారీ బెలూన్లను వదులుతోందని వలేరీ చెప్పారు. బెలూన్లకు ఉన్న కార్నర్ రిఫ్లెక్టర్లు రాడార్ సిగ్నళ్లను వెనక్కి పంపుతాయి. దీంతో ఆకాశంలో శత్రుదేశ డ్రోన్, క్షిపణి వస్తుందని భావించి ఉక్రెయిన్ గగనతల రక్షణ వ్యవస్థ క్షిపణులను ప్రయోగిస్తుంది. దీంతో ఉక్రెయిన్ క్షిపణులు వృథా అవుతాయి. ‘ఇది రష్యా వేసిన మరో ఎత్తుగడ’ అని వలేరీ అన్నారు. కాగా, రష్యాతో పోరులో మునిగిపోయిన ఉక్రెయిన్‌కు సాయపడేందుకు నార్వే ముందుకొచ్చింది. ఐదు సంవత్సరాల్లో విడతలవారీగా మొత్తంగా 7.4 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం చేస్తామని నార్వే ప్రకటించింది.

ప్రసంగం కోసం బ్రిటన్‌కు రాహుల్

న్యూఢిల్లీ: కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ప్రసంగించేందుకు మరికొద్ది రోజుల్లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బ్రిటన్‌కు వెళ్లబోతున్నారు. వర్సిటీ బిజినెస్ స్కూల్‌లో ప్రసంగించి అక్కడి విద్యార్థులతో రాహుల్ మాట్లాడతారు. మరోవైపు ఈనెల 24, 25, 26 తేదీల్లో ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో కాంగ్రెస్ పార్టీ కీలక ప్లీనరీ సమావేశాల్లో రాహుల్ పాల్గొననున్నారు.

బైడెన్ ఆర్థిక బృందంలో భారతీయుడు



వాషింగ్టన్: అమెరికా ఆర్థిక విధానాల విషయంలో అధ్యక్షుడికి సలహాలు ఇచ్చే ఆర్థిక బృందంలో భారతీయ మూలాలున్న అమెరికన్ భరత్ రామమూర్తి కీలక స్థానంలో నియమితులయ్యారు. భరత్‌ను నేషనల్ ఎకనమిక్ కౌన్సిల్(ఎన్ఈసీ) డెప్యూటీ డైరెక్టర్‌గా మళ్లీ నియమిస్తున్నట్లు అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌజ్ బుధవారం ప్రకటించింది. వ్యూహాత్మక ఆర్థిక సంబంధాలకు సంబంధించి భరత్ బైడెన్‌కు సలహాదారుగానూ వ్యవహరిస్తారు. 2020 డిసెంబర్‌లో భరత్ ఎన్ఈసీలో ఆర్థిక సంస్కరణలు, వినియోగదారుల రక్షణ విభాగానికి డెప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు.

త్రిపురలో 81.11 శాతం ఓటింగ్



రాజ్‌నగర్‌లో పోలింగ్ కేంద్రం వద్ద బారులుతీరిన ఓటర్లు. (ఇన్‌సెట్లో) ఓటేశాక సిరా గుర్తు చూపిస్తున్న సీఎం మాణిక్ సాహా

స్వల్ప ఉద్రిక్తతలు మినహా ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

అగర్తలా: త్రిపురలో శాసనసభ ఎన్నికల పోలింగ్ అక్కడక్కడా స్వల్ప ఉద్రిక్తతలు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 4 గంటల వరకు 81.11 శాతం ఓటింగ్ నమోదయ్యిందని చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈఓ) కిరణ్‌కుమార్ దినకర్‌రావు చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 60 అసెంబ్లీ స్థానాలకు ఒకేదశలో ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచే పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాల ముందు బారులు తీరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో వేర్వేరు చోట్ల జరిగిన ఘర్షణల్లో సీపీఎం నాయకుడితో పాటు అదే పార్టీకి చెందిన ఇద్దరు పోలింగ్ ఏజెంట్లు గాయపడ్డారు. పశ్చిమ త్రిపుర జిల్లాలోని ఖాయేర్‌పూర్‌లో సీపీఎం అభ్యర్థి పబిత్రా కర్‌కు చెందిన వాహనంపై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి దిగారు. దాదాపు 45 కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎంలు) మొరాయించాయి. అధికారులు వెంటనే వాటి స్థానంలో కొత్త యంత్రాలు ఏర్పాటు చేశాయి. ఎన్నికల బూత్‌లను ఆక్రమించుకోవడం, రిగ్గింగ్ వంటి సంఘనలు ఎక్కడా చోటుచేసుకోలేదు. ప్రజలు తమ పార్టీకి అనుకూలంగా ఓటు వేశారని, ఈ ఎన్నికల్లో స్పష్టమైన మెజార్టీ దక్కించుకోవడం ఖాయమని త్రిపుర ముఖ్యమంత్రి, బీజేపీ నేత మాణిక్ సాహా ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల కంటే ఈసారి మరిన్ని ఎక్కువ సీట్లు వస్తాయన్నారు. మొత్తం 60 సీట్లకు గాను బీజేపీకి 40 సీట్లు లభిస్తాయని మాజీ ముఖ్యమంత్రి, రాజ్యసభ సభ్యుడు విప్లవ్‌కుమార్ దేవ్ చెప్పారు. రాష్ట్రంలో ప్రజాస్వామిక వాతావరణాన్ని పునరుద్ధరించే కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకున్నారని సీపీఎం నేత, మాజీ సీఎం మాణిక్ సర్కారు తెలిపారు. మార్చి 2వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. రాష్ట్రంలో 2018లో 79 శాతం ఓటింగ్ నమోదయ్యింది.

840 విమానాలు కొంటున్నాం

న్యూఢిల్లీ: ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థల నుంచి మొత్తం 840 కొనుగోలు చేస్తున్నామని టాటా గ్రూప్ యాజమాన్యంలోని ‘ఎయిరిండియా’ చీఫ్ కమర్షియల్, ట్రాన్స్‌ఫార్మేషన్ అధికారి నిపుణ్ అగర్వాల్ గురువారం తెలిపారు. ఎయిర్‌బస్ నుంచి 250, బోయింగ్ నుంచి 220 విమానాల కొనుగోలుకు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఎయిరిండియా ఇప్పటికే ప్రకటించింది. ప్రపంచంలోని ప్రతి ముఖ్య నగరాన్ని భారత్‌తో ‘నాన్-స్టాప్’గా అనుసంధానించాలన్నదే తమ గ్రూప్ లక్ష్యమని నిపుణ్ అగర్వాల్ వెల్లడించారు. నూతన విమానాల కోసం ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థలతో ఎయిరిండియా కుదుర్చుకున్న ఒప్పందాలపై భారత ప్రధాని నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు బైడెన్, బ్రిటన్ ప్రధాని సునాక్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ హర్షం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

‘టీమ్ జార్జి’పై విచారణ జరపాలి

కాంగ్రెస్ పార్టీ డిమాండ్

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్ కాంట్రాక్టర్లతో కూడిన ‘టీమ్ జార్జి’ మన దేశంలో ప్రజల డేటాను సేకరించి, సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ నేతలు పవన్ ఖేరా, సుప్రియా శ్రీనాతే డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే నోరు విప్పాలని అన్నారు. మన ఎన్నికల వ్యవస్థలోకి ఇజ్రాయెల్ కాంట్రాక్టర్లు ప్రవేశించడం దారుణమని విమర్శించారు. టీమ్ జార్జికి, అధికార బీజేపీ ఐటీ సెల్‌కి మధ్య దగ్గరి పోలికలు ఉన్నాయని చెప్పారు. ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడానికి తప్పుడు వార్తలను ప్రచారంలోకి తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు. భారతీయుల డేటా పరాయి వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిందని ఆరోపించారు.

ఏమిటీ టీమ్ జార్జి?

ఇజ్రాయెల్ కాంట్రాక్టర్లు తమ బృందానికి టీమ్ జార్జి అని పేరు పెట్టుకున్నారు. వీరు అడ్వాన్స్‌డ్ ఇంపాక్ట్ మీడియా సొల్యూషన్స్(ఏఐఎంఎస్) సాఫ్ట్‌వేర్‌ను తమ క్లయింట్లకు విక్రయిస్తుంటారు. సదరు క్లయింట్లు ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా సోషల్ మీడియాలో ప్రత్యర్థి పార్టీలపై తప్పుడు ప్రచారం సాగిస్తుంటారు. ఓటర్లను తమకు అనుకూలంగా మార్చుకుంటారు. టీమ్ జార్జి ఇప్పటిదాకా ప్రపంచవ్యాప్తంగా 30కిపైగా ఎన్నికల్లో పని చేసినట్లు అంతర్జాతీయ జర్నలిస్టుల పరిశోధనలో తేలింది.

కొత్తవి ఎగిరొస్తున్నాయ్

నమీబియా నుంచి 18న డజను చీతాల రాక

న్యూఢిల్లీ: భారత్‌లో చీతాల సంఖ్యను పెంచే లక్ష్యంతో వాటిని దక్షిణాఫ్రికా ఖండం నుంచి రప్పిస్తున్న మోదీ సర్కార్ ఈ దఫాలో 12 చీతాలను వాయుమార్గంలో తీసుకొస్తోంది. నమీబియా దేశం నుంచి 12 చీతాలను ఫిబ్రవరి 18వ తేదీన తీసుకొస్తామని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ గురువారం చెప్పారు. ‘ నమీబియా నుంచి వాటిని తెచ్చేందుకు సీ-17 విమానం గురువారం బయల్దేరింది. భారత్‌కు తెచ్చాక వాటిని ఉంచేందుకు మధ్యప్రదేశ్‌లోని కూనో జాతీయ పార్కులో 10 క్వారంటైన్ ఎన్‌క్లోజర్‌లను సిద్ధంచేశాం’ అని మంత్రి చెప్పారు. ఈసారి ఏడు మగ, ఐదు ఆడ చీతాలను తీసుకొస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 17న ప్రధాని మోదీ తన పుట్టినరోజున కూనో పార్కులోకి ఐదు ఆడ, మూడు మగ చీతాలను విడిచిపెట్టిన విషయం విదితమే. భారత్‌లో 1948లో అంతరించిపోయిన చీతాలను మళ్లీ పెంచేందుకు భారత సర్కార్ నడుంబిగించింది. నమీబియా నుంచి దాదాపు పదేళ్లపాటు ఏటా 12 చీతాలను తీసుకొచ్చి అడవుల్లో వదిలేయాలని భావిస్తున్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023


శివరాత్రిని పురస్కరించుకుని కలబుర్గి జిల్లా అలంద పట్టణంలో గురువారం రూట్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

న్యూస్‌రీల్

పోలీసు కస్టడీలోని వ్యక్తి గుండెపోటుతో మృతి

తుమకూరు: జిల్లాలోని హుళియారు పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తి మార్గమధ్యలో గుండె పోటుతో మరణించాడు. చిక్కనాయకనహళ్లి తాలూకా హులవెడె దేవస్థానంలో దొంగతనం జరిగింది. ఈ కేసులో ఎల్లప్ప (38) అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఇదే క్రమంలో విచారణ సందర్భంగా దొంగతనం చేసిన సొత్తును చూపిస్తానని చెప్పి పోలీసులను తనతో పాటు తీసుకెళ్లాడు. కాగా, మార్గమధ్యలో గుండెనొప్పి వచ్చింది. తక్షణమే అతడిని కణకొప్పె ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. అయితే చికిత్స ఫలించక మరణించాడు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ రాహుల్ కుమార్ మాట్లాడుతూ దేవాలయంలో జరిగిన దొంగతనం గురించి అతడిని విచారించిన సంగతి నిజమేనని ధ్రువీకరించారు. ఆ దొంగతనం సొత్తును చూపిస్తానని చెప్పడంతో తరలిస్తుండగా మార్గమధ్యలో గుండెపోటు వచ్చినట్లు చెప్పారు.

శివమొగ్గ ఎయిర్‌పోర్టుకు నేరుగా ప్రధాని



శివమొగ్గ: శివమొగ్గ కొత్త విమానాశ్రయంలో ఈ నెల 27న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమానమే తొలిసారిగా ల్యాండ్ కానుంది. ఢిల్లీ నుంచి నేరుగా ప్రధాని మోదీ రానున్నారు. 27న శివమొగ్గ విమానాశ్రయ ప్రారంభం జరగనుంది. అక్కడే పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. శివమొగ్గ బీజేపీ కార్యాలయంలో గురువారం ఎంపీ బీవై రాఘవేంద్ర మాట్లాడుతూ... ప్రధాని మోదీ విమానమే తొలిసారిగా ఇక్కడ ల్యాండ్ అవ్వనుందన్నారు. ఇప్పటికే డీజీసీఏ అధికారులు విమానాశ్రయాన్ని పరిశీలించారని చెప్పారు. ఇండిగో, స్టార్ ఎయిర్‌లైన్స్ విమానాలు ఇక్కడి నుంచి రాకపోకలు సాగించేందుకు అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టు ప్రారంభమైన 15–20 రోజుల తర్వాత అధికారికంగా విమానాలు రాకపోకలు సాగిస్తాయని చెప్పారు.

అశ్వత్థ నారాయణను మంత్రి పదవి నుంచి తొలగించాలి

శివాజీనగర: ప్రతిపక్ష నాయకుడు సిద్దరామయ్య పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి అశ్వత్థనారాయణను పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే ప్రియాంక్ ఖర్గే, అశ్వత్థనారాయణ వ్యాఖ్యలు సరికాదు. కేశవ కృపాలో ఏ విధంగా చెప్పిస్తారో అదే విధంగానే మంత్రి అశ్వత్థనారాయణ, సీ.టీ.రవి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. టిప్పును హత్యచేసిన వారు ఉరిగౌడ, నంజేగౌడ అని చెబుతున్నారు. ఏ చరిత్ర పేజీలో నమోదైంది. ఏ పుస్తకంలో ఉంది. వాట్సాప్ యూనివర్సిటీలో చదువుకుని మంత్రి అశ్వత్థనారాయణ ఇలా మాట్లాడుతున్నారని మండిపడుతూ నేరుగా పోరాటం చేసే ధైర్యం ఈయనకు లేదు. ఈయన సిద్దరామయ్యను కొట్టి పారవేయాలని చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర ప్రజలు సమాధానం చెబుతారని, ఇటువంటివారిని మంత్రి మండలిలో కొనసాగించటం సరికాదని తెలిపారు.

అశ్వత్థ మానసిక స్థితి సరిగా లేదు :
మంత్రి అశ్వత్థనారాయణ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి రణదీప్ సుర్జేవాలా స్పందించారు. ఎన్నికల్లో ఓటమి తప్పదనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది అశ్వత్థ నారాయణ మానసిక స్థితి సరిగా లేదని తెలుస్తోందన్నారు.

దురుద్దేశ్యంతో మాట్లాడినవి కావు : మంత్రి అశ్వత్థ

శివాజీనగర: సిద్దరామయ్య గురించి తాను దురుద్దేశ్యంతో మాట్లాడిన మాటలు కావని మంత్రి అశ్వత్థ నారాయణ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కేవలం ఆ వ్యాఖ్యను విమర్శగా తీసుకోవాలని, మరో విధంగా అర్థం చేసుకోకూడదన్నారు. ప్రధానిని నరహంతకుడనటం, ముఖ్యమంత్రి ఇల్లు నాశనం కావాలని అనటం సిద్దరామయ్య సంస్కృతి కావచ్చు. అయితే ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓటమిపాలు చేయాలనే అర్థంలోనే తాను ఆ మాటలు మాట్లాడాను. అందుచేత ఆయనకు బాధ కలిగించి ఉంటే ఆవేదన వ్యక్తం చేస్తున్నానన్నారు.

మంత్రిపై బెంగళూరు, హుబ్లీలో కేసు
సీఎల్‌పీ నేత సిద్దరామయ్యపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి అశ్వత్థనారాయణపై బెంగళూరు, హుబ్లీలో కేసు నమోదు చేశారు. ఈ మేరకు మల్లేశ్వరం పోలీస్ స్టేషన్‌లో అశ్వత్థ నారాయణ, నళిన్‌కుమార్ కటీల్‌పై కాంగ్రెస్ నాయకుల బృందం ఫిర్యాదు చేసింది. ఇదే సమయంలో సిద్దరామయ్య అభిమానులు హుబ్లీ గోకుల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసింది.

దద్దరిల్లిన విధానసభ

- మంత్రి అశ్వత్థనారాయణ వ్యాఖ్యలపై ఆగ్రహం
- చర్చించేందుకు కాంగ్రెస్ పట్టు
- నో అన్న స్పీకర్
- ఈశ్వరఖండ్రే తీరుతో సభకు అపకీర్తి అంటూ స్పీకర్ వ్యాఖ్య
- భగ్గుమన్న కాంగ్రెస్
- పోడియం వద్దకు వెళ్లి ధర్నా


విధానసభ సమావేశ దృశ్యం

బనశంకరి: మంత్రి అశ్వత్థనారాయణ వివాదాస్పద వ్యాఖ్యలతో విధానసభ గురువారం రణరంగంగా మారింది. అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్యుద్ధం జరిగింది. మంత్రి అశ్వత్థ నారాయణ చేసిన వ్యాఖ్యలపై చర్చించేందుకు అవకాశం ఇవ్వాలని ప్రతిపక్ష సభ్యులు కోరగా, స్పీకర్ అందుకు నిరాకరించడంతో వివాదం రాజుకుంది. జీరో అవర్‌లో మంత్రి అశ్వత్థ నారాయణ మాట్లాడుతూ... సిద్దరామయ్యను టిప్పుసుల్తాన్ తరహాలో కొట్టాలంటూ వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని సీఎల్‌పీ ఉపనేత యూటీ.ఖాదర్ పేర్కొనగా మంత్రి అశ్వత్థనారాయణ తాను చేసిన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేశారు. కాగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఈశ్వర్‌ఖండ్రే, ప్రియాంక్ ఖర్గే మంత్రి వ్యాఖ్యలపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు. మీరు పదేపదే ఇలా లేచి నిలబడి మాట్లాడుతున్నారు. చాలా రోజుల నుంచి మీ ప్రవర్తన గమనిస్తున్నా, ఈ విధంగా వ్యవహరించడం సరికాదని స్పీకర్ అన్నారు. సభలో పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలని సూచించారు. కార్యాధ్యక్షుడిగా ఉంటూ ఇలా వ్యవహరించడం తగదని, సభలో ఇలాగే ప్రవర్తిస్తే సభ నుంచి గెంటేస్తామని ఈశ్వరఖండ్రేను స్పీకర్ హెచ్చరించారు. మీలాంటి వారు సభకు ఎన్నిక కావడం సరికాదని స్పీకర్ వ్యాఖ్యానించడంతో కాంగ్రెస్ సభ్యులు ధర్నాకు దిగారు. ప్రియాంక్‌ఖర్గే, కృష్ణబైరేగౌడ, సంగమేశ్‌లు ఈశ్వర్‌ఖండ్రేకు మద్దతుగా నిలిచారు. మాకు మాట్లాడే హక్కులేదా.. తమను ఎన్నుకున్న ప్రజలకు అవమానపరిచేలా మీ వ్యాఖ్యలు ఉన్నాయంటూ స్పీకర్‌ను ఉద్దేశించి ఈశ్వరఖండ్రే అన్నారు.అనంతరం కాంగ్రెస్ సభ్యులు స్పీకర్ పోడియం వద్ద ధర్నాకు దిగారు. దీంతో స్పీకర్ సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు.


ఆవేశంతో మాట్లాడా, ధర్నా విరమించండి : స్పీకర్
ఈశ్వర్‌ఖండ్రే పట్ల, అతడిని ఎన్నుకున్న ప్రజల పట్ల తనకు అపారమైన గౌరవం ఉంది. ఉద్రేకంతో కొన్ని మాటలు మాట్లాడానని, ధర్నా విరమించాలని స్పీకర్ విశ్వేశ్వరహెగ్డేకాగేరి పేర్కొనడంతో కాంగ్రెస్ సభ్యులు శాంతించారు. అనంతరం స్పీకర్ కార్యాలయంలో జరిగిన రాజీ చర్చ విజయవంతం కావడంతో మళ్లీ సభ ప్రారంభమైంది. తాను చేసిన వ్యాఖ్యలను రికార్డులనుంచి తొలగిస్తానని తెలిపారు. ఈశ్వర్‌ఖండ్రే తండ్రి భీమణ్ణఖండ్రేను చూశానని, ఆయనతో తనకు పరిచయం ఉందని, ఈశ్వర్‌ఖండ్రేపై వ్యక్తిగతంగా తనకు ద్వేషం లేదని స్పీకర్ అన్నారు. ఈశ్వర్‌ఖండ్రే మాట్లాడుతూ స్పీకర్‌పట్ల అపారమైన గౌరవం ఉందని పేర్కొన్నారు.

పరిషత్‌లో ప్రశ్నలు.. సమాధానాలు

బనశంకరి: ముద్రణా రంగానికి అన్ని ప్రభుత్వాలు అధికంగా నిధులు కేటాయిస్తున్నాయని, ఈ ఏడాది కూడా ప్రాధాన్యత ఇస్తామని సీఎం తెలిపారు. పరిషత్‌లో ప్రశ్నోత్తరాల సమయంలో పత్రికా ప్రకటనల గురించి బీజేపీ సభ్యుడు హెచ్.విశ్వనాథ్ అడిగిన ప్రశ్నకు సీఎం బొమ్మై పైవిధంగా సమాధానం ఇచ్చారు. ఆర్యవైశ్య మండలి, బ్రాహ్మణుల మండలికి ఈ ఏడాది తలా రూ.10 కోట్లు అదనంగా నిధులు ఇస్తామన్నారు. జేడీఎస్ సభ్యుడు టీఏ.శరవణ అడిగిన ప్రశ్నకు సీఎం సమాధానం ఇస్తూ ప్రస్తుతం రూ.6 కోట్లు బ్యాంకులో ఉన్నాయని, వాటిని ఖర్చుచేస్తే అదనపు నిధులు కేటాయిస్తామన్నారు. జలమండలి పరిధిలో తాగునీరు సరఫరా మార్గంలో నీరు లీకేజీని అరికట్టి అనధికార కనెక్షన్లు తొలగించేందుకు ప్రత్యేక స్క్వాడ్ ఏర్పాటుచేస్తామన్నారు. గత బడ్జెట్‌లో మైనార్టీల మండలికి రూ.60 కోట్లు కేటాయించాగా అదనంగా రూ.50 కోట్లు ఇచ్చామని కాంగ్రెస్ సభ్యుడు సలీంఅహ్మద్ అడిగిన ప్రశ్నకు బసవరాజబొమ్మై సమాధానం ఇచ్చారు. మూడేళ్లలో 57 షాదీమహళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. అప్పర్ కృష్ణా మూడో దశ పథకం నోటిఫికేషన్ కాని నేపథ్యంలో కాలపరిమితిలోగా పనులు పూర్తిచేయడం రాష్ట్ర ప్రభుత్వానికి సాధ్యంకాదని, అయితే దశలవారిగా పనులు చేపడతామని న్యాయ, శాసనసభ వ్యవహారాల శాఖమంత్రి జేసీ.మాధుస్వామి తెలిపారు.

ప్రజాకర్షక పద్దేనా?

- నేడే రాష్ట్ర బడ్జెట్
- ప్రవేశపెట్టనున్న సీఎం బసవరాజ బొమ్మై
- బీజేపీ ప్రభుత్వానికి ఇది చివరి పద్దు
- ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తాయిలాలు ప్రకటించే అవకాశం



సాక్షి బెంగళూరు: రాష్ట్ర ప్రజలు ఎంతో ఆశక్తిగా ఎదురు చూస్తున్న 2023–24 ఆర్థిక ఏడాది బడ్జెట్‌ను ముఖ్యమంత్రి బసవరాజుబొమ్మాయి శుక్రవారం విధానసభలో ప్రవేశపెట్టనున్నారు. అధికార బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే ఆఖరి బడ్జెట్ ఇది కావడం గమనార్హం. విధానసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 150 సీట్లను గెలుచుకోవాలని లక్ష్యం పెట్టుకున్న బీజేపీ ఆ దిశగా ప్రజాకర్షక పద్దును తీసుకురానుంది. ముఖ్యంగా రైతుల మనసు గెలుచుకునేందుకు భద్రా ఎత్తిపోతల పథకం, కృష్ణా ఎత్తిపోతల పథకం, మహదాయి, మేకెదాటు వంటి ప్రాజెక్టులకు నిధులు వరద పారించునుందని, ఉత్తర కర్ణాటక జీవనాడి కృష్ణా ఎత్తిపోతల ప్రాజెక్టు మూడో దశ పనులకు కేటాయింపులు పెంచనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. పాత మైసూరు ప్రాంతం నుంచి అత్యధిక నియోజకవర్గాలను గెలుచుకునేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు భారీగా జరిపినా ఆశ్చర్యం లేదు. హంపి, మైసూరు టూరిజం క్లస్టర్, పర్యాటక ప్లాజా నిర్మాణం, ఘటప్రభ ప్రాజెక్టు, ఆలమట్టి డ్యాం ఎత్తుపై పెంపు, పలు ప్రాజెక్టు పునర్వాసానికి అధిక కేటాయింపులు జరపనున్నారు. కల్యాణ కర్ణాటకలో ఖాళీగా ఉన్న 25 వేల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ప్రకటన చేయనుంది. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మైసూరులో ఫిల్మ్ స్టూడియో నిర్మాణం కోసం నిధులు కేటాయించాలనే డిమాండ్లను ఈ బడ్జెట్‌లో సాకారం చేయనున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. హుబ్లీ–ధారవాడలో మెట్రో పనులకు కేటాయింపులు, ఉత్తర కన్నడ జిల్లాలో కుమటాలో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం కోసం ప్రభుత్వం స్పష్టమైన హామీనిచ్చే అవకాశం ఉంది. మధ్య కర్ణాటకలోని ప్రముఖ జిల్లా దావణగెరెలో విమానాశ్రయ నిర్మాణం ప్రకటన, చిత్రదుర్గలో భద్రా ఎత్తిపోతల పనులకు కేటాయింపులు, దావణగెరె–చిత్రదుర్గ–తుమకూరు రైల్వే మార్గం కోసం భూస్వాధీన ప్రక్రియను వేగవంతం చేసేందుకు కేటాయింపులు చేయనుంది. చిక్కబళ్లాపుర జిల్లాకు హెచ్ఎన్ వ్యాలీ నీటి శుద్ధీకరణకు కేటాయింపులు, కోలారులో గోల్డ్ మైనింగ్ విషయంలో స్పష్టత ఇచ్చే అవకాశం లేకపోలేదు. రామనగర జిల్లా కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలు బలంగా ఉన్నాయి. ఈ క్రమంలో బీజేపీ తన అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు రామనగర జిల్లాకు కూడా పలు ప్రత్యేక కేటాయింపులు చేసే అవకాశం ఉంది. సంకీర్ణ ప్రభుత్వంలో ప్రకటించి బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రద్దు చేసిన కనకపుర మెడికల్ కాలేజీ మరోసారి ప్రకటించి బీజేపీ తన బలాన్ని పెంచుకోవాలని చూస్తోంది. బెంగళూరు నగరానికి ఈసారి బడ్జెట్‌లో ఎప్పటిలాగే అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. విమానాశ్రయానికి మెట్రో రైల్వేతో అనుసంధానం, తుమకూరు రోడ్డు పైవంతెన సమస్యకు పరిష్కారం, ట్రాఫిక్ రద్దీ సమస్యకు పరిష్కారం, సబర్బన్ రైల్వే ప్రాజెక్టు వంటి తదితర పనులకు ప్రభుత్వం కేటాయింపులు చేయనుంది.

మహా శివరాత్రికి లడ్డూలు సిద్ధం

తుమకూరు: చారిత్రక ప్రసిద్ధ పొందిన త్రివిధ దాసోహ క్షేత్రం సిద్ధగంగ మఠంలో మహాశివరాత్రి సందర్భంగా మఠానికి వచ్చే భక్తాదులకు, మఠంలోని వేలాది మంది విద్యార్థులకు భోజన వ్యవస్థను ఏర్పాటు చేశారు. పండుగ సందర్భంగా ప్రసాదంగా పంచేందుకు లడ్డూలు సిద్ధం చేశారు. శనివారం శివరాత్రి పండుగ కోసం సుమారు 30 వేల లడ్డూలను సిద్ధం చేశారు. మఠంలోని పిల్లలకు 12 వేల లడ్డూలను పంచనున్నారు. మిగిలిన లడ్డూలను రథోత్సవానికి వచ్చే భక్తులకు పంచిపెట్టనున్నారు.


సిద్ధం చేసిన లడ్డూలు

బీజేపీ ఆరోపణలకు అసెంబ్లీలోనే సమాధానం

- హెచ్.డీ.కుమారస్వామి

శివాజీనగర: జేడీఎస్ గురించి, దివ్యాంగ బిడ్డ బిజినెస్ చేస్తున్నారని అసెంబ్లీలో చేసిన ఆరోపణలకు అక్కడే సమాధానం చెప్పటంతో పాటుగా ఏమేమి బిజినెస్ చేశారనేది బహిరంగపరుస్తానని మాజీ ముఖ్యమంత్రి హెచ్.డీ.కుమారస్వామి ధ్వజమెత్తారు. గురువారం విలేకరులతో మాట్లాడిన ఆయన, గవర్నర్ ప్రసంగంపై వంద నిర్ణయాలపై చర్చ సందర్భంలో రాజకీయ మార్పులపై చర్చ జరిగింది. అధికార పార్టీ ఎమ్మెల్యే సీ.టీ.రవితో పాటు ఎవరెవరు ఏమేమి మాట్లాడరనేది తనకు తెలుసని, వారికి అసెంబ్లీలోనే సమాధానం చెబుతానన్నారు. పంచరత్న రథయాత్రలో పాల్గొనటంతో అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు సాధ్యపడలేదు. సమావేశాల్లో రాష్ట్ర సమస్యల కంటే అధికంగా దేశ, విదేశాల గురించి చర్చించారు. కేజీపీలో ఉన్నపుడు మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప ఏమి ఆరోపణలు చేశారనేది తెలుసని, బీజేపీ బీ టీమ్ అని ఒకరు, మరొకరు కాంగ్రెస్ బీ టీమ్ అని ఆరోపిస్తున్నారు. శృంగేరి మఠంలో రాజకీయానికి అవకాశం లేదని, అక్కడ వేరే విధమైన సంప్రదాయముంటుందని అన్నారు.

ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు

- కేపీసీసీ చీఫ్ డీకే శివకుమార్


దప్పు వాయిస్తున్న కాంగ్రెస్ నేతలు

మైసూరు: బీజేపీ ప్రభుత్వం ప్రజలకు 90 శాతం మోసం చేసిందని, ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ఆరోపించారు. గురువారం మైసూరు నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో ప్రజాధ్వని కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...ఇది బీజేపీ ప్రభుత్వం చివరి బడ్జెట్ అని, ఇందులో మాటలు తప్ప ఏమీ ఉండదన్నారు. గత బడ్జెట్ సమయంలో ఇచ్చిన ఎన్ని హామీలు అమలు చేశారు, అన్నదానిపై చర్చించడానికి గత బడ్జెట్ నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబల్ ఇంజిన్ ప్రభుత్వాలు ప్రజలకు ఏమీ ఉపయోగం లేదని తేలిందన్నారు. నేటి బడ్జెట్ కేవలం చదవటానికి తప్ప, ప్రజలకు ఉపయోగపడే పథకాలు ఏమీ ఉండవన్నారు.

మాదప్ప శివరాత్రి జాతరకు వేలాదిగా భక్తులు

- కావేరి నది దాటుతున్న జన సాగరం

శివాజీనగర: దక్షిణ భారతదేశ ప్రధాన తీర్థ క్షేత్రాల్లో ఒకటైన హనూరు తాలూకా మలెమహదేశ్వర కొండలో ఈ నెల 17 నుంచి 21 వరకు మహాశివరాత్రి జాతర జరుగుతుండగా, భక్తులు తండోపతండాలుగా వస్తున్నారు. మాదప్ప కొండకు బెంగళూరు, రామనగర, మండ్య, కనకపురతో పాటు అనేక వైపుల నుంచి వస్తున్న భక్తులు కావేరి సంగమంలో నది దాటుతుండటం జన ప్రవాహంలా కనిపిస్తోంది. వీరికి స్థానికులు మజ్జిగ, పానకం పంపిణీ చేస్తున్నారు. గత సంవత్సరం పాదయాత్రగా వెళుతున్న సమయంలో కావేరి నీటి ప్రవాహం పెరిగి ముగ్గురు భక్తులు అదృశ్యమైన నేపథ్యంలో ఈసారి రామనగర జిల్లా యంత్రాంగం గజ ఈతగాళ్లు నియమించింది.

బైక్‌ల నిషేధం: జాతర సందర్భంగా కేఎస్ఆర్టీసీ 500 బస్సులను సిద్ధం చేసింది. అదే విధంగా భద్రత కారణాల దృష్ట్యా ద్విచక్ర వాహనాలను పూర్తిగా నిషేధిస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉడుపికి పాకిన డ్రగ్స్ దందా

యశవంతపుర: మంగళూరు తరహాలో డ్రగ్స్ వ్యవహారం ఉడుపి మెడికల్ కాలేజీలకు తాకింది. మాహె వర్సిటీ పరిధిలోని మెడికల్ కళాశాలలో చదువుతున్న మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు డ్రగ్స్ వినియోగించినట్లు ఉత్తర ఉడుపి జిల్లా ఎస్పీ అక్షయ్ మచ్చీంద్ర తెలిపారు. కాలేజీ యజమాన్యం సదరు విద్యార్థులను సస్పెండ్ చేసి విచారణకు సహకరించాలని ఎస్పీ కోరారు.

నకిలీ భూ దాఖలాలతో వంచన

- ఏడుగురు సభ్యుల ముఠా అరెస్ట్

కృష్ణరాజపురం: నకిలీ దాఖలాలు సృష్టించి వంచనకు పాల్పడుతున్న ముఠా పట్టుబడింది. ప్రధాన నిందితులు సయ్యద్ మునావర్ సాబ్,ప్రతాప్‌తో కలిసి మత్తం 7 మందిని హెచ్ఏఎల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్దనుంచి 833 ఎకరాలకు సంబంధించిన నకిలీ ఆస్తి పత్రాలు, హెచ్ఏఎల్ అధికారులకు చెందిన నకిలీ లెటర్‌హెడ్‌లను స్వాధీనం చేసుకున్నారు. భూములు కొనుగోలు చేయాలని భావిస్తున్న వారిని గుర్తించి హెచ్ఏఎల్ పరిధిలోని భూములను చూపించి లీజుకు, లేదా విక్రయానికి యత్నించారు. ఇందులో భాగంగా ముగ్గురు వ్యక్తులనుంచి రూ.3 కోట్ల నగదును అడ్వాన్స్‌గా నిందితులు తీసుకున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు.


గగనతలంలో విమానాలను ఆశ్చర్యంగా తిలకిస్తున్న ఓ కుటుంబం


ఆకాశంలో సూర్యకిరణ్ విమానాల రొద

ఆకాశమే హద్దు....




నిప్పులు చిమ్ముతూ దూసుకుపోతున్నఫైటర్ జెట్

యశవంతపుర: యలహంక ఎయిర్ బేస్ ఆవరణలో జరుగుతున్న వైమానిక ప్రదర్శన శుక్రవారం ముగియనుంది. కాగా గురువారం ఆకాశమే హద్దుగా జరిగిన వైమానిక విన్యాసాలు చూపరులను గగుర్పాటుకు గురి చేశాయి. సారంగ్ హెలికాప్టర్లు రంగురంగుల పొగలను విరజిమ్ముతూ విన్యాసాలు చేశాయి. రఫెల్ యుద్ధ విమానం, అమెరికాకు చెందిన ఎఫ్-35ఎ, ఫైటర్ జెట్, హెచ్ఏఎల్ తయారు చేసిన తేజస్ హెలికాప్టర్లు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కాగా వేల సంఖ్యలో జనం కార్లలో ప్రత్యేక మార్గంలో వైమానిక కేంద్రానికి చేరుకున్నారు. మేఖ్రి సర్కిల్, హెబ్బాళ వద్ద గంటలకొద్దీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.


సారంగ్ హెలికాప్టర్ల విన్యాసాలు


బెంగళూరులోని బళ్లారి రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

క్లుప్తంగా

ఈవీఎంలపై ఓటర్లకు జాగృతి



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కంప్లి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎం యంత్రాలు ఉపయోగించనున్నందున ఓటర్లకు ఈవీఎం యంత్రాలపై జాగృతి కల్గిస్తున్నామని సెక్టోరల్ అధికారి ఎల్‌జీ రాఘవేంద్ర తెలిపారు. పట్టణంలోని 20వ వార్డు మారుతీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఆయన మాట్లాడుతూ బ్యాలట్ యూనిట్‌లో ఓటు వేయగా వీవీ ప్యాట్‌లో ప్రదర్శితమవుతుందన్నారు. దీంతో ఓటు హక్కు వినియోగం సులభం అవుతుందన్నారు. ప్రముఖులు లక్ష్మి, కే.శేఖర్, హుస్సేన్‌సాబ్, మునియప్ప, జ్యోతి, జయశ్రీ, అస్లాం బేగం, గౌసియా బేగం పాల్గొన్నారు.

దేవదాసి మహిళల ధర్నా



ధర్నాలో పాల్గొన్న దేవదాసి మహిళలు

సిరుగుప్ప: తమ డిమాండ్ల సాధన కోసం దేవదాసి మహిళలు గురువారం పట్టణంలో ధర్నా చేపట్టారు. తాలూకా దేవదాసి మహిళా విమోచన సంఘం అధ్యక్షురాలు ఈరమ్మ మాట్లాడుతూ దేవదాసి మహిళలకు నెలవారీ వేతనం పెంచాలని, జనాభా లెక్కల్లో తమ పేర్లను చేర్చాలని, తమ కుటుంబాలకు పునర్వసతి కల్పించాలన్నారు. అనంతరం టీపీ ఈఓ ఎం.బసప్పకు మనవిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఉపాధ్యక్షురాలు గంగమ్మ, అంబమ్మ, ముద్దటనూరు దురగమ్మ, సిరిగేరి కెంచమ్మ, బెళగల్లు మాళమ్మ, ముదేనూరు మల్లమ్మ పాల్గొన్నారు.

దేవదాసి మహిళల డిమాండ్లు తీర్చాలి

హొసపేటె: దేవదాసి మహిళల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఒత్తిడి చేస్తూ దేవదాసి మహిళా విమోచన సంఘం, దేవదాసి మహిళా హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకురాలు నాగరత్న మాట్లాడుతూ దేవదాసి మహిళలకు కనీసం ప్రతి నెల రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించాలని, ఉపాధి హామీ పథ కింద కనీసం 200 రోజుల కూలీ పనులను కల్పించాలని, ఉచిత ఇళ్లను కట్టించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం నేతలు హంపమ్మ, యల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థులు

రాయచూరు రూరల్: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐడీఎస్‌ఓ డిమాండ్ చేసింది. గురువారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి రాష్ట్ర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ విద్యార్థులకు సక్రమంగా ఉపకార వేతనాలు చెల్లించాలని, విద్యా రంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు పెంచాలని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పర్మినెంట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులను నియమించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

నిందితులపై చర్యకు డిమాండ్



వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

గంగావతి రూరల్: అంబేడ్కర్‌ను అవమానించిన జైన్ విశ్వవిద్యాలయ వ్యవస్థాపకునిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ హమారా ప్రసాద్ అంబేడ్కర్‌ను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలు ఖండనీయమన్నారు. అతనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఉపతహసీల్దార్ వరపేటికు మనవిపత్రాన్ని అందించారు. అనంతరం కర్ణాటక రక్షణా వేదిక నగర శాఖ అధ్యక్షులు యమనూరు భట్ మాట్లాడుతూ బెంగళూరులోని జైన్ డీమ్డ్ వర్సిటీ విద్యార్థులతో భారతరత్న, రాజ్యాంగ శిల్పి డా.బి.ఆర్.అంబేడ్కర్‌ను కించపరిచేలా నాటకాన్ని ప్రదర్శించడం తగదన్నారు. ఈసందర్భంగా కె.చంద్రశేఖర శెట్టి, తాలూకా అధ్యక్షులు లక్ష్మణసింగ్, నగర ఉపాధ్యక్షులు హులుగప్ప, తాలూకా యువ అధ్యక్షులు హనుమేశ్, యువ ఉపాధ్యక్షులు శరణప్ప, బసవరాజ్, పవన్ కుమార్, హనుమంత, మంజునాథ్ పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో నారీ భేరీ

- గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణలో మహిళల భాగస్వామ్యం
- అన్ని జీపీల్లో మహిళా డ్రైవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్న వైనం

సాక్షి,బళ్లారి: సాధారణంగా ప్రతి ఇంటి శుభ్రత బాధ్యత గల్లీ నుంచి ఢిల్లీ వరకు మహిళలే చూసుకుంటారు. మహిళలు ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు తాపత్రయపడుతుంటారు. మహిళలకు పరిసరాలు, తమ గ్రామాల శుభ్రత బాధ్యతతో పాటు ఆర్థిక ఎదుగుదల, ఉపాధి కల్పన ఉద్దేశంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటా చెత్త సేకరణకు శ్రీకారం చుట్టిన పథకాల బాధ్యతలను మహిళలకు అప్పగించడం సత్ఫలితాలిస్తున్నాయి. జిల్లాలో 100 గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛత కాపాడేందుకు దాదాపు 356 మంది మహిళలకు ఇంటింటా చెత్త సేకరణ బాధ్యతలను అప్పగించారు. వారికి నెలవారీ జీతం కూడా కేటాయించారు. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి వాహనాల్లో తరలించడంతో పాటు వాహన డ్రైవర్లుగా కూడా మహిళలనే నియమించే ఉద్దేశంతో వారికి డ్రైవింగ్‌లో శిక్షణ





చెత్త సేకరణ వాహనాలకు మహిళలే డ్రైవర్లుగా వ్యవహరిస్తున్న దృశ్యం

ఇచ్చి వాహన డ్రైవర్లుగా నియమించారు.

మహిళలకు ఉపాధి కల్పనకు దోహదం

2021వ సంవత్సరం నుంచి ఉమ్మడి బళ్లారి జిల్లాలో ఈ పథకాన్ని అమలు చేశారు. ప్రస్తుతం విభజిత బళ్లారి జిల్లాలో బళ్లారి తాలూకాలో 25 మంది, సండూరులో 26, కంప్లిలో 10, కురుగోడులో 12, సిరుగుప్పలో 27 మంది మహిళలు ఆయా జీపీల్లో చెత్త సేకరణ వాహనాలకు డ్రైవర్లుగా పని చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో స్వచ్ఛత కాపాడటంతో పాటు ఉపాధి అవకాశాలతో మహిళల్లో ఆత్మస్థైర్యం పెంపొందించడానికి దోహదపడుతోంది. జిల్లాలో 356 మంది మహిళలు చెత్త సేకరణ విధుల్లో నిత్యం పని చేస్తుండగా, వీరిలో 56 మంది వాహన డ్రైవర్లుగా ఉండటం గమనార్హం. ప్రతి రోజు ఉదయం ఆయా గ్రామాల్లో చెత్త సేకరణకు పాటలు పెట్టుకుని వాహనాలు, సామగ్రితో విధులకు హాజరవుతూ స్వచ్ఛభారత్‌ను అమలు చేస్తున్నారు. గ్రామాల్లో చెత్త సేకరణకు మహిళలను భాగస్వామ్యం చేసి వారికి ఉపాధి అవకాశాలు కల్పించడంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

56 జీపీల్లో మహిళలే వాహన డ్రైవర్లు

జిల్లాలో 100 జీపీలకు గాను ఇప్పటికే 56 జీపీల్లో ఒక్కో జీపీలో ఒక మహిళను చెత్త సేకరణ వాహన డ్రైవర్‌గా నియమించారు. మిగిలిన 44 జీపీల్లో నియమించేందుకు మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. ప్రతి జీపీలోనూ మహిళా డ్రైవర్లను చెత్త సేకరణకు నియమించి గ్రామాల్లో స్వచ్ఛత కాపాడేందుకు కృషి చేస్తున్నామని సంబంధిత జెడ్పీ అధికారి తెలిపారు. ముఖ్యంగా 10వ తరగతి, పీయూసీ, డిగ్రీ చదివిన యువతులు కూడా చెత్త సేకరణ వాహనాలకు డ్రైవర్లుగా పని చేసేందుకు ముందుకు వస్తుండడం శుభపరిణామం అన్నారు. గ్రామాల్లో స్వచ్ఛత గురించి వారికి పూర్తి అవగాహన కలిగి పాలన గురించి తెలుసుకుంటున్నారన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణ వాహనాలకు తమను డ్రైవర్లుగా నియమించడం ఎంతో సంతోషంగా ఉందని, ప్రతి రోజు ఉదయం 4 గంటల పాటు ఓ వైపు చెత్త సేకరణ పూర్తి చేసి మరో వైపు తమ ఇంటి పనులు చూసుకుంటున్నామని మహిళలు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో శివభక్తుడు మృతి



ఆంధ్రలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బళ్లారి వాసి రమేష్‌గౌడ

బళ్లారిఅర్బన్: శ్రీశైలంలోని మల్లికార్జున స్వామిని దర్శించుకొనేందుకు బళ్లారి నుంచి పాదయాత్ర చేపట్టి మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నగరానికి చెందిన రమేష్‌గౌడ(50) అనే వ్యక్తి మృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా పాములపాడు మండలం రుద్రవరం గ్రామ సమీపంలో గుంటూరు ప్రధాన రహదారిపై గురువారం తెల్లవారు జామున గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రమేష్‌గౌడ తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. వారం రోజుల క్రితం కాలినడకన శ్రీశైలానికి బయలుదేరి వెళ్లి శివరాత్రికి ఆ మహాశివుడిని దర్శించుకోవాలనుకున్న శివభక్తుడు రమేష్‌గౌడ మృతదేహాన్ని కర్నూలు ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఈ ఘటనపై ఆంధ్రా పోలీసులు తమకు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

రైల్వే అభివృద్ధి పనులకు స్థల పరిశీలన



రైల్వే అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ కరడి సంగణ్ణ

గంగావతి: కొప్పళ నగరంలోని రైల్వే స్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫారానికి టికెట్ కౌంటర్, విశ్రాంతి భవన నిర్మాణం చేపట్టే విషయంపై గురువారం కొప్పళ లోక్‌సభ సభ్యుడు కరడి సంగణ్ణ రైల్వే అధికారులతో చర్చించారు. అలాగే తాలూకాలోని బసాపుర వద్ద నూతన రైల్వే స్టేషన్, సరుకు రవాణా స్టేషన్ నిర్మాణం గురించి ఆ ప్రాంతంలో అధికారులతో కలిసి ఎంపీ పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు టీసీఎం అనూప్, సీనియర్ డీసీఎం హరిత, కొప్పళ ఏసీ బసవణ్ణప్ప, తహసీల్దార్ అమరేశ్ బిరాదార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శివరాత్రి ఉత్సవాలు

రాయచూరు రూరల్: నగరంలో ఈనెల 18 నుంచి 20 వరకు శివరాత్రి సందర్భంగా ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంచాలకురాలు స్మిత పేర్కొన్నారు. ఆమె గురువారం వర్సిటీలో విలేకరులతో మాట్లాడారు. వాల్కట్ మైదానంలో 18న ఆత్మ సాక్షాత్కార మహోత్సవం, 12 జ్యోతిర్లింగాల దర్శనం, 12 కార్లపై శివలింగాల యాత్ర, 19న పరమాత్మ సాక్షాత్కార మహోత్సవం, 20న శ్రేష్ఠ జీవన సాక్షాత్కార మహోత్సవం, సాంస్కృతిక ఉత్సవాలు, సర్వధర్మాల సారం భగవంతుడు ఒక్కడే అనే తోలుబొమ్మలాట నాటక ప్రదర్శన నిర్వహిస్తామన్నారు.

ఏనుగు దంతాల కళాకృతుల సీజ్

- ఐదుగురు విక్రేతల అరెస్ట్

హుబ్లీ: ఏనుగుదంతాల్లా అలంకార వస్తువులు తయారు చేసి విక్రయించడానికి ప్రయత్నిస్తున్న బెళగావి, మహారాష్ట్రకు చెందిన ఐదుగురిని హుబ్లీ కొత్త బస్టాండ్ వద్ద సీఐడీ ప్రత్యేక అటవీ సంచారదళం అరెస్ట్ చేసింది. కోల్హాపూర్‌కు చెందిన సాత్ జమదార్, విజయ్ కుంబార, సాగర్ పురాణిక్, నిప్పాణికి చెందిన వినాయక్ కాంబ్లె, దానాజి పాటిల్ అనే నిందితుల నుంచి 384 గ్రాముల అలంకార పెట్టె, 112 గ్రాముల చేతి కడియం, 350 గ్రాముల మరో పెట్టె, 279 గ్రాముల గుడ్డు ఆకారపు పెట్టెను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ కోట్లాది రూపాయలు ఉంటుందని అధికారులు తెలిపారు. రాజస్థాన్‌లోని ఓ సంతలో సాధువు వద్ద వీటిని కొన్నామని నిందితులు తెలిపారన్నారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు

హుబ్లీ సీఐడీ విభాగం డీఎస్పీ ముత్తణ్ణ సర్వగోళ, ఎస్ఐ ప్రసాద్, ఎంఏ పటాక్, అశోక్, రవీంద్ర, దివ్యానాయక్, హులగేరి దాడిలో పాల్గొన్నారు. కేసు నమోదు చేసుకొని నిందితులను జుడీషియల్ కస్టడీకి అప్పగించారు.

అప్రమత్తతతో నేరాల కట్టడి సాధ్యం

చెళ్లకెరె రూరల్ : ముందు జాగ్రత్తలతో సమాజంలో నేరాలను అదుపు చేయవచ్చని నగర పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆర్ పీ దేశాయి తెలిపారు. గురువారం హెగ్గెరె తాయమ్మ తిప్పేస్వామి బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన నేరాల నివారణ మాసోత్సవంలో విద్యార్థుల నుద్దేశించి ఆయన మాట్లాడారు. నిరుద్యోగ సమస్యతో పలువురు యువత నేరాలకు పాల్పడడం శోచనీయమన్నారు. విద్యావంత యువకులు సోషల్ మీడియాకు బానిస కారాదన్నారు. నేడు సైబర్ నేరాలు కూడా అధికం అవుతున్నాయన్నారు. వీటిలో చాలా వరకు విద్యార్థులే బాధితులుగా ఉండడం ఆందోళనకరమన్నారు. విద్యార్థులు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి కె మాధవ్, ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు బి రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆర్ పీ దేశాయి

నిజాయితీపరులను గెలిపించండి

గంగావతి: నిజాయితీపరులైన అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపించాలని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి అరళి నాగరాజ్ హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లో అవినీతిని, కులమతాలను పరిగణించని అభ్యర్థులకు తమ ఓటును వేయాలని సూచించారు. అవినీతిపరులు, జైలు జీవితం గడిపిన వారికి ఎన్నికల్లో పోటీకి తావు ఇవ్వరాదని ఆయన తెలిపారు. ప్రజాప్రతినిధిగా ఉండి మూడు రోజుల పాటు జైలులో ఉన్న వారి సభ్యత్వాన్ని రద్దు చేసేలా చట్టాలను పరివర్తించాలన్నారు. ఒకే వ్యక్తికి రెండు పదవులను, రెండు పింఛన్లను తీసుకొనే పద్ధతిని రద్దు చేసేలా చట్టం రూపొందించాలన్నారు. ఎన్నికల్లో ఎట్టి పరిస్థితిలో డబ్బులకు తమ ఓటును అమ్ముకోకుండా నిజాయితీ పరులను గెలిపించాలన్నారు. ఓటు హక్కు ముఖ్యమైనది, దీనికి బాధ్యత కూడా ఎంతో ఉంటుందన్నారు. మంచి అభ్యర్థులు గెలిచి మంచి ప్రభుత్వం ఏర్పడితే ప్రజాప్రభుత్వ విలువలను కాపాడినట్లు అవుతుందన్నారు.



మాట్లాడుతున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి అరళి నాగరాజ్

రేపటి నుంచి పంచరత్న రథయాత్ర

రాయచూరు రూరల్: నగర, గ్రామీణ ప్రాంతాల్లో జేడీఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నుంచి పంచరత్న రథయాత్రను నిర్వహిస్తున్నట్లు జిల్లాధ్యక్షుడు విరుపాక్షి పేర్కొన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో జేడీఎస్‌ను గెలిపించాలన్నారు. గతంలో సాగించిన 18 నెలల పాలనలో మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి చేపట్టిన అభివృద్ధి పనులు, రైతులకు రుణమాఫీ, ఇతర సంక్షేమ పథకాల గురించి గ్రామీణలో 18 నుంచి 35 గ్రామ పంచాయతీల్లో, నగరంలోని 35 వార్డుల్లో ముమ్మర ప్రచారం చేస్తామన్నారు. సమావేశంలో కార్యాధ్యక్షుడు శివశంకర్, కార్యదర్శి లక్ష్మీపతి, గ్రామీణ అభ్యర్థి నరసింహ నాయక్, నగర అభ్యర్థి వినయ్ కుమార్‌లున్నారు.

అస్వస్థతకు గురైన మరొకరి మృతి

- మూడుకు చేరిన మృతుల సంఖ్య

సాక్షి,బళ్లారి: యాదగిరి జిల్లా గురుమఠకల్ తాలూకా అనపుర గ్రామంలో కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన వారిలో మరొకరు మృతి చెందారు. ఇప్పటికే కలుషిత నీరు తాగి సావిత్రమ్మ(35), సాయమ్మ(72) అనే ఇద్దరు మహిళలు మృతి చెందిన సంగతి తెలిసిందే. తాజాగా బుధవారం రాత్రి నరసమ్మ(75) అనే మహిళ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో అనపుర గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామంలో పారిశుద్ధ్య లోపంతో మంచినీరు కలుషితమై 40 మందికి పైగా ఆస్పత్రి పాలైన నేపథ్యంలో మరొకరు మృతి చెందినట్లు గ్రామస్తులు వాపోయారు.

రాయల ఆదర్శాలు అనుసరణీయం



ఊరేగింపులో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

రాయచూరు రూరల్: మున్నూరు కాపు సోదరులు శ్రీకృష్ణదేవరాయల ఆదర్శాలను అనుసరించాలని మాజీ ఎమ్మెల్యే ఏ.పాపారెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన రాయల 551వ జయంతి ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. నగర ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, మాజీ ఎమ్మెల్సీ బోసురాజు, ఆర్డీఏ మాజీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నగరసభ అధ్యక్షురాలు లలిత, ఉపాధ్యక్షురాలు నరసమ్మ, మాజీ సభ్యులు నరసారెడ్డి, మహేంద్రరెడ్డి, వెంకటరెడ్డి, రామన్న, గోపాలరెడ్డిలున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం ఇవ్వండి

బళ్లారిఅర్బన్: తాను పట్టభద్ర ఓటర్ల ఆకాంక్ష మేరకు ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తానని, వివిధ సంఘ సంస్థల నేతలను కలిసి వారి అభిప్రాయం మేరకు ఈసారి ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నట్లు కాంగ్రెస్ నాయకుడు, గ్రాడ్యుయేట్ టీచర్స్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు తిమ్మయ్య పుర్లే తెలిపారు. ఆయన గురువారం మయూర హోటల్ సభాంగణంలో విలేకరులతో మాట్లాడారు. గొల్ల సంఘం కార్యదర్శి కేశవ చిదానందప్ప, ఉపాధ్యక్షుడు సోమప్పయాదవ్, పదాధికారులు లక్ష్మీనారాయణ యాదవ్, కౌల్‌బజార్ లోకేష్, ఆనంద్, ప్రభాకర్, సుంకన్న పాల్గొన్నారు.

సిరుగుప్ప కేఆర్‌పీపీ అభ్యర్థిగా ధరప్ప నాయక



ఆదేశ పత్రాన్ని అందిస్తున్న గాలి జనార్దన్‌రెడ్డి

గంగావతి రూరల్: కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ(కేఆర్‌పీపీ) వ్యవస్థాపకులు గాలి జనార్దన్ రెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన వేదికలో గురువారం బళ్లారి జిల్లా సిరుగుప్ప అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా టి.ధరప్ప నాయకను ప్రకటించారు. ఈ సందర్భంగా సిరుగుప్ప క్షేత్రం నుండి వేలాది సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పార్టీలో చేరారు. బళ్లారి సిటీ అభ్యర్థి గాలి లక్ష్మీ అరుణ, కొప్పళ జిల్లా అధ్యక్షులు మనోహరగౌడ హేరూరు, బళ్లారి జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ గౌడ, బళ్లారి మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఖుతబ్‌సాబ్, నాయకులు మల్లేశప్ప గుమగేరి, సంగమేశ్ బాదవాడగి, ప్రకాశ రెడ్డి, రాజు ధలభంజన్, అలిఖాన్, సంజయ్ బెటగేరి, మహబూబ్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయరూ

రాయచూరు రూరల్: పాఠశాలల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేస్తున్న మధ్యాహ్న భోజన(బిసి ఊట) కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి శరణ బసవ డిమాండ్ చేశారు. గురువారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ఆందోళన నుద్దేశించి ఆయన మాట్లాడారు. అనంతరం స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

జేడీఎస్ అభ్యర్థి గెలుపు తథ్యం

మాలూరు : వచ్చే ఎన్నికల్లో మాలూరులో సమాజ సేవతో ప్రజల మనసులో నిలిచిన జేడీఎస్ అభ్యర్థి రామేగౌడ గెలుపు తథ్యమని తాలూకా జేడీఎస్ అధ్యక్షుడు బల్లహళ్లి నారాయణస్వామి తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో తాలూకా జేడీఎస్ సంభావ్య అభ్యర్థి జి ఇ రామేగౌడ 52వ పుట్టిన రోజు సందర్భంగా రోగులకు బ్రెడ్, పండ్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజ సేవకుడు, స్థానికుడైన దాత రామేగౌడ దశాబ్దాలుగా తాలూకా ప్రజలకు ఎంతో సేవ చేశారన్నారు. పిల్లలకు ఉచిత విద్య, ఆరోగ్యం, మహిళా సబలీకరణ, యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించారన్నారు. గత కొన్నేళ్లుగా తాలూకాలో జేడీఎస్‌ను సంఘటితపరిచారన్నారు. ప్రస్తుతం తాలూకాలో బలిష్ఠంగా ఉన్న జేడీఎస్ అభ్యర్థిని ఈసారి ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో నియోజకవర్గ ప్రజలు గెలిపిస్తారన్నారు. ఈ సందర్భంగా జేడీఎస్ రాష్ట్ర సమితి సభ్యుడు హెచ్ మిచేంద్రశేఖర్ గౌడ, తాలూకా పాలనాధికారి డాక్టర్ వసంతకుమార్, న్యాయవాది ఎం ఎస్ ఆనంద్ కుమార్, కె వి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణస్వామి

కోలారు వార్తలు...

రోడ్డు విస్తరణలో ఉద్రిక్తత

- ఎమ్మెల్యే, ఎంపీల మధ్య వాగ్వాదం

కేజీఎఫ్ : నగరంలోని సల్డానా సర్కిల్ నుంచి అండర్సన్ పేటె సర్కిల్ వరకు రోడ్డు విస్తరణ విషయంలో గురువారం ఎమ్మెల్యే రూపా శశిధర్, ఎంపీ ఎస్.మునిస్వామిల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అకారణంగా రోడ్డు విస్తరణ కోసం చుట్టుపక్కల ఉన్న ఇళ్లను కూల్చి వేస్తున్నారని, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగజేస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. ఆమె ఆరోపణలపై తీవ్రంగా స్పందించిన ఎంపీ మునిస్వామి రోడ్డు విస్తరణకు బీజేపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. విస్తరణకు అడ్డుగా ఉన్న ఇళ్లను తొలగిస్తే తప్పేంటన్నారు. తొలగింపునకు మార్కు చేసిన ఇళ్లను తొలగించాల్సిందేనని, ఇందులో ఎలాంటి ములాజాకు తావు లేదన్నారు. తాను అసెంబ్లీలో గొంతెత్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.500 కోట్లను విడుదల చేయించుకున్నాను, విస్తరణకు అడ్డుగా లేని ఇళ్లను కూడా ఎందుకు తొలగిస్తున్నారని ఎమ్మెల్యే రూపా ఎంపీ మునిస్వామిని ప్రశ్నించారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయడాన్ని మానుకోవాలని ఎంపీకి సలహా ఇచ్చారు. అయితే పట్టు వీడని ఎంపీ తాను దగ్గరే ఉండి పలు చోట్ల ఫుట్‌పాత్‌లను జేసీబీతో తొలగింపజేశారు.



వాగ్వాదం చేసుకుంటున్న ఎంపీ, ఎమ్మెల్యే

అంగన్‌వాడీ పిల్లలకు మాంటిస్సోరి శిక్షణ



పిల్లలతో కలెక్టర్ వెంకటరాజు

కేజీఎఫ్ : తాలూకాలోని 5 అంగన్‌వాడీ కేంద్రాల్లో అమిగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచితంగా మాంటిస్సోరి శిక్షణను అందించనున్నట్లు కలెక్టర్ వెంకటరాజు తెలిపారు. గురువారం తాలూకాలోని క్యాసంబళ్లి ఫిర్కా రామసాగర గ్రామంలో అమిగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణనిచ్చే అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలో 16 అంగన్‌వాడీ కేంద్రాల్లో 300 మంది పిల్లలకు ఉచితంగా అందిస్తోన్న మాంటిస్సోరి శిక్షణలో భాగంగా మొదటి సారిగా కోలారు జిల్లాలోని కేజీఎఫ్ తాలూకా టి.గొల్లహళ్లి, రామసాగర, క్యాసంబళ్లి, మల్లంపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో 120 మంది పిల్లలకు ఉచితంగా శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ యుకేష్‌కుమార్, ముద్దణ్ణ, ఈఓ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌కుమార్

శ్రీనివాసపురం : పట్టణ అభివృద్ధికి ప్రతి పురసభ సభ్యుడు పార్టీల కతీతంగా సహకరించాలని ఎమ్మెల్యే కె ఆర్ రమేష్‌కుమార్ సలహా ఇచ్చారు. గురువారం పట్టణంలోని పురసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ క్రీడాంగణంలో రూ.3 కోట్ల వ్యయంతో స్విమ్మింగ్ పూల్ నిర్మించాలని ఎమ్మెల్యే సలహా ఇవ్వగా సభ్యుడు అయిషా నయాజ్ ఇందుకు అభ్యంతరం తెలిపారు. ప్రస్తుతం అంత ఖర్చు చేసి స్విమ్మింగ్ పూల్ నిర్మించాల్సిన అవసరం ఏముందని, అందుకు బదులుగా పట్టణంలో వీధి దీపాల ఏర్పాటు, స్వచ్ఛతా కార్యక్రమం, రక్షిత తాగునీటి యూనిట్ల ఏర్పాటుకు నిధులను ఖర్చు చేస్తే బాగుంటుందని తెలిపారు. పురసభ అధ్యక్షురాలు ఎం ఎస్ లలితా శ్రీనివాస్, ముఖ్యాధికారి వై ఎస్ సత్యనారాయణ, కె జి రమేష్ పాల్గొన్నారు.

19న సీసీ రోడ్డు ప్రారంభం



మాట్లాడుతున్న మాజీ సైనికుడు అశ్వర్థరాం

కోలారు : వక్కలేరి మార్కండేశ్వర ఆలయానికి వెళ్లే సీసీ రోడ్డును ఈ నెల 19న ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తున్నట్లు మాజీ సైనికుడు, జీపీ సభ్యుడు అశ్వర్థరాం తెలిపారు. గురువారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్కండేశ్వర కొండపై వెలసిన ఆలయానికి వెళ్లే దారిని గత ఎస్పీ డి.దేవరాజ్, ఎంపీ ఎస్.మునిస్వామి, దాతల సహకారంతో సుమారు రూ.50 లక్షల వ్యయంతో రెండు కి.మీ.ల మేర నాణ్యమైన సీసీ రోడ్డుగా నిర్మించినట్లు తెలిపారు. వక్కలేరి గ్రామ యువకుల బైక్ ర్యాలీతో దారిని ప్రారంభిస్తామని తెలిపారు. శివరాత్రి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని, ఆలయానికి పెద్ద సంఖ్యలో వచ్చే భక్తుల అనుకూలం కోసం దారిని నిర్మించినట్లు తెలిపారు. గ్రామస్తుడు మునిరాజు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఎస్పీ సిటీ రౌండ్స్

- రౌడీ మూకలకు గట్టి హెచ్చరిక

కోలారు : ఏడీజీపీ అలోక్‌కుమార్, ఐజీపీ రవికాంతేగౌడ సూచనల మేరకు అర్ధరాత్రి జిల్లా ఎస్పీ ఎం.నారాయణ తమ సిబ్బందితో కలిసి నగరంలో రాత్రి గస్తీ తిరిగి సిటీ రౌండ్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లు, ఎంవోబీలు, అపరాధ కృత్యాల్లో పాల్గొన్న వారి ఇళ్లపై దాడులు నిర్వహించి ఇళ్లలో పరిశీలించారు. వారిని స్టేషన్‌కు పిలిపించి గట్టిగా హెచ్చరించారు. జిల్లాలో సుమారు 500 మందికి పైగా పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి జిల్లా వ్యాప్తంగా అన్ని తాలూకాల్లోనూ రాత్రి గస్తీ తిరిగారు. సరిహద్దు ప్రాంతాల్లో 25 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వచ్చే వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. రాత్రి 11 గంటలపైన అనవసరంగా తిరిగే వారిని మందలించారు. ఈ సందర్భంగా ఎస్పీ నారాయణ మాట్లాడుతూ ఇకపై ప్రతి నిత్యం రాత్రి సమయాల్లో ప్రత్యేక బృందాలతో గస్తీ నిర్వహిస్తామన్నారు. నేరాల అదుపునకు ప్రజలు సహకరించాలన్నారు. అదనపు ఎస్పీ భాస్కర్, డీఎస్పీలు మురళీధర్, జై శంకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం రేసులో ఉన్నా

తుమకూరు: తాను కూడా ముఖ్యమంత్రి రేసులో ఉన్నానని, ఈసారి కాంగ్రెస్ పార్టీ వంద శాతం అధికారంలోకి వస్తుందని మాజీ డీసీఎం జి.పరమేశ్వర అన్నారు. పార్టీలో ప్రస్తుతం 10 మందికి పైగా నేతలు సీఎం రేసులో ఉన్నారని, అందులో తాను ఒకడినని చెప్పారు. అయితే తమ మొదటి లక్ష్యం పార్టీని అధికారంలోకి తీసుకురావడమేనన్నారు. ఆ తర్వాత సీఎం ఎవరనే విషయంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కొరటిగెరె నియోజకవర్గం హనుమంతపుర గ్రామంలో పరమేశ్వర తన ఐదేళ్ల విజయాలపై పుస్తకాన్ని విడుదల చేసి మాట్లాడారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థుల ఎంపిక జరుగుతోందని, స్క్రీనింగ్ కమిటీ ఈనెలలోపే తుది జాబితా ప్రకటిస్తుందని తెలిపారు.

క్యాంటర్ ఢీకొని వ్యక్తి మృతి

దొడ్డబళ్లాపురం: క్యాంటర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన దొడ్డ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.

బెంగళూరులోని న్యూ తిప్పసంద్ర గ్రామానికి చెందిన గోపీనాథ్ (50) మృతి చెందిన వ్యక్తి. బెంగళూరు నుంచి దొడ్డబళ్లాపురం వచ్చిన గోపీనాథ్ ఇక్కడి రైల్వే స్టేషన్ సర్కిల్‌లో నిలబడి ఉండగా క్యాంటర్ రివర్స్ తీసుకుని వెనుక నిల్చున్న గోపీనాథ్‌ను ఢీకొంది. కింద పడ్డ గోపీనాథ్ మీద క్యాంటర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దొడ్డ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మంత్రి అశ్వత్థ నారాయణను అరెస్టు చేయండి



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శివమొగ్గ: మాజీ సీఎం సిద్ధరామయ్య హత్యకు ప్రేరేపించేలా మాట్లాడిన మంత్రి అశ్వత్థ నారాయణపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసి అరెస్టు చేయాలని కాంగ్రెస్‌పార్టీ శివమొగ్గ నగర దక్షిణ బ్లాక్ వెనుకబడిన వర్గాల కాంగ్రెస్ పార్టీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి గురువారం వినతి పత్రం సమర్పించారు. మాజీ సీఎం సిద్ధరామయ్య పేరున్న నాయకుడు అని, టిప్పును ముగించినట్లే సిద్ధరామయ్యను ముగించాలని మంత్రి అశ్వత్థ నారాయణ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఆయనపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

కన్నడభాషకు జీవం పోయాలి

గౌరిబిదనూరు: జానపద కార్యక్రమాలు, నృత్య, సంగీత కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం ద్వారా కన్నడ భాషకు జీవం పోయాలని ఎమ్మెల్యే శివశంకరరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని హెచ్ఎన్ కళా మందిరంలో గౌరి కన్నడ కళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జరిగిన నగెహబ్బ కార్యక్రమం (హాస్య పండుగ), జానపద గీతాలాపన పోటీల్లో ఆయన పాల్గొని విజేతలకు బహుమతుల వితరణ చేసి ప్రసంగించారు. కన్నడ భాషకు రెండువేల సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. సీనియర్ క్రీడాకారుడు అశోక్‌కుమార్, రిచర్డ్ లూయిస్, రాజేశ్ కశ్యప్ హాస్య ప్రసంగాలు సభికులను నవ్వుల్లో ముంచెత్తాయి. జానపద కళాకారులు లలితమ్మ,పుష్పలతను సన్మానించారు.

ఇద్దరు హంతకుల అరెస్టు

మైసూరు: కబాబ్ వ్యాపారి హత్య కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. కల్యాణగిరి నివాసి సయ్యద్ మన్సూర్ (32)ను జబీ, ఇక్బాల్ అనే వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. వీరిద్దరు యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో మన్సూరు మందలించాడు. దీంతో కక్ష పెంచుకున్న వీరు మన్సూర్‌ను హత్య చేసి పాండవపుర దరసకొప్ప వద్ద ఉన్న కాలువలో పడేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తొలుత సయ్యద్ జైనుల్లా, బబన్ అనే వ్యక్తులను అరెస్టు చేశారు. వారిద్దరి సమాచారం మేరకు జబీ, ఇక్బాల్‌ను అరెస్టు చేశారు.

యువకుడి దారుణ హత్య

గుర్తు తెలియని యువకుడు (25) హత్యకు గురైన ఘటన చాముండిబెట్ట తావరికెరె రోడ్డులో చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న నజర్‌బాద్ పోలీసులు అక్కడికి చేరుకుని ఆధారాలు సేకరించారు. హతుడి వివరాలు సేకరిస్తున్నారు.

రెండు ఇళ్లలో చోరీలు

మైసూరు: జిల్లాలోని నంజనగూడు విద్యానగరలో దొంగలు తెగబడి బంగారు నగలు దోచుకెళ్లారు. శివపునీత్ అనే వ్యక్తి ఇంటి తాళాలు పగులకొట్టి 167 గ్రాముల బంగారు ఆభరణాలు, నాగేంద్ర అనే వ్యక్తి ఇంటిలో 70 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలు దోచుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు నంజనగూడు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వ్యాధులపై వీధి నాటకాలతో జాగృతి

గౌరిబిదనూరు: అంటు వ్యాధులపట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ లక్ష్మీకాంత్ సూచించారు. అంటువ్యాధులపై జాగృతి కల్పించేందుకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో జిల్లా ఆరోగ్య శాఖ, పరివర్తనా ప్రతిష్టాపనా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీధి నాటకాలను గురువారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. క్షయ తదితర అంటు వ్యాధులు దరిచేరకుండా ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. అనంతరం కళాకారులు గౌరమ్మ, గాయత్రీ వెంకటస్వామి, మూర్తి, ఆరోగ్య శాఖ మంజునాథ్ వీధి నాటకాలతో ప్రజలకు అవగాహన కల్పించారు.

ఎంగేజ్‌మెంట్ పార్టీలో విషాదం

- ఐదో అంతస్తు నుంచి పడి యువకుడు దుర్మరణం
- బెంగళూరులో ఘోరం



బనశంకరి: వివాహ నిశ్చితార్థ వేడుక సందర్భంగా నిర్వహించిన స్నేహితుల మందుపార్టీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఓ యువకుడు ఐదో అంతస్తు నుంచి పడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన మడివాళ పరిధిలోని గురువారం వేకువజామున చోటుచేసుకుంది. వివరాలు... లగ్గెరె నివాసి గౌతమ్ (27), ఏపీకి చెందిన ప్రదీప్‌లు స్నేహితులు. వీరు శుభకార్యాలకు సంబంధించిన ఈవెంట్లు నిర్వహిస్తుంటారు. ఇదిలా ఉంటే ప్రదీప్‌కు ఇటీవలె వివాహ నిశ్చయమైన నేపథ్యంలో రెండు కుటుంబాలకు చెందిన వారు దుస్తులు, బంగారు ఆభరణాల కొనుగోలు చేయడానికి వెళ్లారు. ఇదిలా ఉంటే ప్రదీప్ వివాహ నేపథ్యంలో మందు పార్టీ చేసుకోవాలని స్నేహితులు భావించారు. అనుకున్నదే తడవుగా ప్రదీప్ ఉంటున్న మడివాళ టీచర్స్ కాలనీ, మొదటి మెయిన్ రోడ్డులో ఉన్న ఓ ఐదో అంతస్తుకు చేరుకుని బుధవారం రాత్రి అక్కడ మందు పార్టీకి ఏర్పాట్లు చేసుకున్నారు. స్నేహితులు పిచ్చాపాటి మాట్లాడుకుంటూ ఆస్వాదిస్తున్నారు. ఈ క్రమంలో మద్యం మత్తులో గౌతమ్ కాలుజారి పై అంతస్తు నుంచి జారి కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న మడివాళ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉచిత విద్యుత్, నెలకు రూ. 2 వేలు

- అధికారంలోకి రాగానే అమలు చేస్తాం

బనశంకరి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికి నెలకు రూ. 2 వేలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తప్పకుండా ఇస్తామని బెంగళూరు గ్రామాంతర ఎంపీ డీకే.సురేశ్ తెలిపారు. గురువారం బెంగళూరు దక్షిణ నియోజకవర్గంలోని అంజనాపురలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు సమావేశంలో ఎంపీ డీకే.సురేశ్ మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ఉచిత విద్యుత్ ఇవ్వదని, ప్రతినెల ఆడపిల్లలకు రూ.2 వేలు ఉత్తమాటలను విపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నారని వీరి మాటలు నమ్మరాదని, చెప్పినదానికి కట్టుబడి ఉంటామన్నారు. బీజేపీ అవినీతి, అక్రమాలపై కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలకు తెలియాలని పిలుపునిచ్చారు. బెంగళూరు దక్షిణ కాంగ్రెస్‌నేత ఆర్‌కే.రమేశ్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడేది కాంగ్రెస్ పార్టీ ఒక్కటే అని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కే.కుమార్, శ్రీధర్ లక్ష్మణ్, అంథోణి కిరణ్, శ్రీధర్‌గౌడ, మాజీ కార్పొరేటర్లు ఓ.మంజునాథ్ ఎస్.గంగాధర్, అంజనప్ప, శోభాగౌడ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బొమ్మనహళ్లి: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, వచ్చిన వెంటనే ప్రతి మహిళకు రూ. 2 వేల నగదుతో పాటు ప్రతి ఇంటికి 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తామని, ఈ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని హెచ్ఎస్ఆర్ లేఔట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి. వాసు దేవవరెడ్డి అన్నారు. గురువారం నగరంలోని బండెపాళ్య పరిధిలో స్థానిక నాయకులు కే.వాసుదేవ, ఉమాపతి శ్రీనివాసగౌడతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు.

అనుమానంతో హత్య

యశవంతపుర: అనుమానంతో ఉపాధ్యాయుడు భార్యను హత్య చేసిన ఘటన కలబురిగి పట్టణంలోని జరిగింది. ఫరీదా బేగం(39) ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. ఆమెకు ఎజాజ్ అహ్మద్‌తో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. బుధవారం రాత్రి నిద్రలో ఉన్న ఆమెపై అనుమానంతో తలపై బండరాయితో బాది హత్య చేశాడు. కలబురిగి స్టేషన్ బజార్ పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేశారు.

కాంతారా నటి సప్తమిగౌడ సందడి



నగలు ప్రదర్శిస్తున్న సప్తమి

బనశంకరి: బెంగళూరు నగరంలో కాంతారా హీరోయిన్ సప్తమిగౌడ సందడి చేశారు. గురువారం హెచ్ఎస్ఆర్‌లేఔట్ రెండోసెక్టార్‌లో 27వ మెయిన్ రోడ్డులో ఓ నూతన జ్యువెలరీ షోరూమ్‌ను సప్తమిగౌడ ప్రారంభించి అక్కడి జువెలరీని ప్రదర్శించారు.

మళ్లీ అధికారం మాదే

యశవంతపుర: బీజేపీలోని వివిధ మోర్చాల ద్వారా పార్టీని బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో మళ్లీ అధికారాన్ని దక్కించుకొంటామని రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు బీవై విజయేంద్ర తెలిపారు. గురువారం మల్లేశ్వరంలో పార్టీ ఆఫీసులో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికలలోపు భారీగా సమావేశాలను నిర్వహించాలని సూచించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

తుమకూరు: తుమకూరు 23వ వార్డులో గణేశనగర, భగిరథ నగరలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే జ్యోతిగణేష్ గురువారం భూమిపూజ చేశారు. మేయర్ ప్రభావతి సుదీశ్వర్, ఉప మేయర్ టి.కే. నరిసింహ మూర్తి, ఏఈఈ విజయ్‌కుమార్, సిద్దప్ప పాల్గొన్నారు

సీటీ రవి అప్పుడు రాజీనామా

యశవంతపుర: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవి అప్పుడు హెచ్‌డీ తమ్మయ్య బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. టికెట్ ఇవ్వాలని ఇటీవల మద్దతుదారులతో కలసి పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. ఏం జరిగిందో ఏమో కాని గురువారం రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు కల్మడురప్పకు అందించారు.

దర్శన్ పుట్టిన రోజు వేడుకలు

నటుడు దర్శన్ 46వ పుట్టిన రోజును బెంగళూరులో వైభవంగా జరుపుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి అభిమానులు రాజరాజేశ్వరినగరలో దర్శన్ ఇంటి వద్దకు చేరుకొని ఆయన శుభాకాంక్షలు చెప్పారు.

ప్రజల ముందు అవార్డులు గొప్పవికావు

తుమకూరు: కన్నడ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమ కన్నా అవార్డులు ఎక్కువ కావని నాడోజా డాక్టర్. బరగూరు రామచంద్రప్ప అన్నారు. గురువారం తుమకూరు జిల్లా శిర తాలూకాలోని బరగూరు సాంస్కృతిక భవనంలో నిర్వహించిన నాడోజా డాక్టర్. బరగూరు ప్రతిష్టాపన బెంగళూరు వారి ఆధ్వర్యంలో బరగూరు రామచంద్రప్ప పుట్టిన ఇల్లు, మ్యూజియం ఆయనే స్వయంగా ప్రారంభించి మాట్లాడారు. ప్రజల ఆశీర్వాదంతోనే తాను ఎన్నో అంతర్జాతీయ అవార్డులు తీసుకున్నానని గుర్తు చేశారు. కళలు, కళాకారులపై ఇంతటి గౌరవం చూపించడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు.



మాట్లాడుతున్న రామచంద్రప్ప

హరిద్వార్ నుంచి దొడ్డకు గంగాజలం



గంగాజలం క్యాంటర్‌కు పూజలు

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకాలో శివరాత్రి సందర్భంగా ఇంటింటికీ గంగాజలం పంపిణీ చేసేందుకు బీజేపీ నేతలు హరిద్వార్ నుంచి క్యాంటర్‌లో గంగాజలాన్ని తెప్పించారు. గురువారం హరిద్వార్ నుంచి నేరుగా దొడ్డ పట్టణానికి విచ్చేసిన గంగాజలం క్యాంటర్‌కు బీజేపీ నేతలు ఇక్కడి సోమేశ్వర దేవాలయం వద్ద పూజలు చేసారు. ఈ సందర్భంగా మాట్లాడిన బీజేపీ నేతలు హరిద్వార్ నుంచి 60 వేల లీటర్ల గంగాజలాన్ని క్యాంటర్ ద్వారా తెప్పించామన్నారు. శివరాత్రి పర్వదినం రోజు దొడ్డ పట్టణంలోని సోమేశ్వర దేవాలయం, కాశీవిశ్వేర దేవాలయం, అరుణాచలేశ్వర దేవాలయం, బసవన్న దేవాలయాల్లో భక్తులకు రుద్రాక్ష, విభూది, ప్రసాదంతో పాటు గంగాజలం పంపిణీ చేస్తామని తెలిపారు.

ఘటికోత్సవం విశిష్ట ఘట్టం



బంగారు పతకాలు అందజేస్తున్న దృశ్యం

సాక్షి బెంగళూరు: ఘటికోత్సవం విద్యార్థి జీవితంలో విశిష్ట ఘట్టమని భారత రక్షణ మంత్రి శాస్త్రసాంకేతిక సలహాదారుడు డాక్టర్ జి.సతీశ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఘటికోత్సవం అనేది అధ్యాపకులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల మద్దతుతో విద్యార్థుల కృషితో సాధించే గరిష్ట ఫలితమని చెప్పారు. గురువారం నగరంలో రామయ్య యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ (ఆర్‌యూఏఎస్)లో ఘటికోత్సవం నిర్వహించారు. ఇందులో మొత్తం 1,866 విద్యార్థులు పట్టాలు అందుకోగా, వారిలో విశేష ఫలితాలు సాధించిన 34 మందికి డాక్టర్ ఎంఎస్ రామయ్య బంగారు పతకాన్ని అందించారు.

మేయర్‌ను కలిసిన కమిషనర్



కమిషనర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మేయర్

హోసూరు: హోసూరు కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారిణి స్నేహ గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ ఎస్.ఏ.సత్యను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ సత్య కమిషనర్‌కు జ్ఞాపికను అందజేసి హోసూరు నగర అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కార్మికుడి ఇంట్లో చోరీ

హోసూరు: హోసూరు సమీపంలో పట్టపగలే ఇంటి తాళాలు పగులగొట్టి నగలు దోచుకెళ్లిన ఘటన హడ్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... హోసూరు సమీపంలోని కదిరేపల్లి గ్రామానికి చెందిన కార్మికుడు కుడియప్ప (45) బుధవారం ఉదయం ఇంటికి తాళాలు వేసుకొని కూలి పనులకెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటిలో చోరీ విషయం గుర్తించారు. హడ్కో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 1.50 పౌన్ల బంగారు నగలు, 500 గ్రాముల వెండి చోరీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

కూలిపోతున్న చెరువుకట్ట



జే.కారుపల్లి చెరువు

కెలమంగలం: డెంకణీకోట తాలూకా కెలమంగలం సమీపంలోని జే.కారుపల్లి చెరువు కట్టకు రంధ్రం ఏర్పడి కూలిపోయే స్థితికి చేరుకుందని, ఈ విషయాన్ని సంబంధిత శాఖ దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని గ్రామస్తులు మండిపడ్డారు. భారీ వర్షాల వల్ల 20 ఏళ్ల అనంతరం చెరువుకు నీరు చేరింది. ప్రస్తుతం చెరువు కట్ట పూర్తిగా దెబ్బతినిందని, దీంతో నీరు వృథాగా పోయే పరిస్థితి ఏర్పడుతుందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని గ్రామపెద్ద ఆనంద్, మాజీ పంచాయతీ అధ్యక్షుడు నాగరాజ్, రవి, మునిక్రిష్ణన్, అన్నయ్యప్ప, నంజుండప్ప, శివవకుమార్, రవీంద్ర, నారాయణన్ తదితరులు డిమాండ్ చేస్తున్నారు. మరమ్మతులు చేపట్టకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

రాగుల ఖరీదు కేంద్రంలో అగ్నిప్రమాదం



గోడౌన్‌లో కాలిపోతున్న రాగుల మూటలు



గ్యారేజీలో కాలిపోతున్న వాహనాలు

దొడ్డబళ్లాపురం: రాగుల ఖరీదు కేంద్రంలో మంటలు చెలరేగి వందలాది మూటలు కాలి బూడిదైన సంఘటన మాగడి తాలూకా సోలూరులో చోటుచేసుకుంది. కేంద్రం ముందు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పు రవ్వలు ఎగిరిపడడంతో మంటలు వ్యాపించినట్టు తెలిసింది. మంటల్లో వందలాది రాగుల మూటలు కాలిపోయాయి. నాలుగు ఫైరింజన్లు వచ్చి మంటలను అదుపుచేసాయి. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గ్యారేజీలో అగ్ని ప్రమాదం, భారీ నష్టం

కృష్ణరాజపురం: కేఆర్ పురం పరిధిలోని ఒక గ్యారేజీలో మంటలు చెలరేగాయి. కోట్లాది రూపాయల విలువైన కార్లు మంటల్లో కాలిపోయాయి. ఈ ఘటన రామ్మూర్తి నగర కస్తూరి నగరలో జరిగింది. ఈ మంటల్లో సుమారు 10 కార్లు దగ్ధమయ్యాయి. చాంద్‌పాషా, తబేరేజ్ పాషా అనే ఇద్దరు ఈ గ్యారేజీని నిర్వహిస్తున్నారు. గ్యారేజీలో స్టార్టర్ పనులు చేస్తుండగా మంటలు చెలరేగినట్లు అనుమానిస్తున్నారు. రామ్మూర్తినగర పోలీసు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వరిగడ్డికుప్ప అగ్నికి ఆహుతి

శివమొగ్గ: నగర శివార్లలోని బొమ్మనకట్టె గ్రామంలో గురువారం వరిగడ్డి కుప్ప, పశువుల కొట్టం అగ్నికి ఆహుతైంది. మారెప్ప అనే రైతు పొలంలోనే పాక ఏర్పాటు చేశాడు. ఇటీవల కోసిన వరిపంటను పొలంలోనే కుప్పగా ఏర్పాటు చేశాడు. గురువారం మారెప్ప బయటకు వెళ్లిన సమయంలో వరిగడ్డి కుప్పకు నిప్పంటుకొని పక్కనే ఉన్న పాకకు మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో పశువులు లేవు. దీంతో ప్రాణనష్టం తప్పింది. అయితే మంటలకు వరిధాన్యం మొత్తం కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఐదు ఎకరాల్లో సాగు చేసిన వరి ధాన్యం కాలిపోయి లక్షల రూపాయల నష్టం జరిగిందని రైతు మారెప్ప తెలిపాడు.

జేడీఎస్‌లోకి భారీగా వలసలు

తుమకూరు: తుమకూరు గ్రామీణ నియోజకవర్గంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు గురువారం స్థానిక ఎమ్మెల్యే గౌరిశంకర్ సమక్షంలో జేడీఎస్‌పార్టీలో చేరారు. వివిధ పార్టీలకు చెందిన 500 మంది జేడీఎస్‌లో చేరారు.

విశ్వనాథ్ నివాసానికి డీకేశి

మైసూరు: బీజేపీ శాసన మండలి సభ్యుడు హెచ్. విశ్వనాథ్‌ను కేపీసీసీ అధ్యక్షుడు డి.కే శివకుమార్ గురువారం ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. మైసూరు జిల్లా కేఆర్ నగరలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాధ్వని కార్యక్రమంలో డికే శివకుమార్, విశ్వనాథ్ నివాసానికి వెళ్లి చర్చించారు. ఇదిలా ఉంటే ఇప్పటికే విశ్వనాథ్ సిద్దును కలిశారు. ఆయన కాంగ్రెస్‌లోకి వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది.

మంత్రి వ్యాఖ్యలపై ఆగ్రహం



మైసూరులో ధర్నా చేస్తున్న కార్యకర్తలు

మైసూరు: సీఎల్‌పీ నేత సిద్ధరామయ్యపై రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి అశ్వత్థ నారాయణ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను నిరసిస్తూ మైసూరు నగరంలో కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. నగరంలో ప్రధాన కూడలిలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ప్లకార్డులు పట్టుకుని మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంత్రి పదవిలో ఉండి మాజీ సీఎం సిద్ధుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, వెంటనే ఆయన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం



బనశంకరి: బృహత్ బెంగళూరు మహానగర పాలికె ఆధ్వర్యంలో గోవిందరాజనగరలోని దాసరహళ్లివార్డు (105) ఎంసీ.లేఔట్‌లో అత్యాధునిక వసతులతో రూ.106 కోట్ల వ్యయంతో 300 పడకల శ్రీ బాలగంగాధరనాథ స్వామీజీ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని గురువారం సీఎం బసవరాజ బొమ్మై ప్రారంభించారు. కార్యక్రమంలో ఆదిచుంచనగిరి మహాసంస్థానమఠ పీఠాధ్యక్షుడు జగద్గురు డాక్టర్ నిర్మలానందనాథ స్వామీజీ, సిద్ధగంగ పీఠాధ్యక్షుడు సిద్ధలింగమహాస్వామీజీ, నంజావదూత స్వామీజీ, చంద్రశేఖరనాథస్వామీజీ, కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి, రాష్ట్ర మంత్రులు వీ.సోమణ్ణ, ఆర్.అశోక్ , గోపాలయ్య, సుధాకర్ , ఎమ్మెల్సీ దేవేగౌడ, బీబీఎంపీ పాలనాధికారి రాకేశ్‌సింగ్, కమిషనర్ తుషార్‌గిరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

చోరీలు చేసి దానధర్మాలు

బనశంకరి: సులభ సంపాదన కోసం దొంగలు చోరీలకు పాల్పడుతుంటారు. ఇందుకు భిన్నంగా కేవలం దానధర్మాలు చేసేందుకు ఓ వ్యక్తి చోరీబాట పట్టాడు. ఇలాంటి విచిత్ర దొంగను గురువారం అశోకనగర పోలీసులు అరెస్ట్‌చేశారు. పట్టుబడిన దొంగ జాన్ అలియాస్ మంజునాథ్‌గా పోలీసులు గుర్తించారు. చోరీచేసిన విలువైన వస్తువులు, నగదులో సగభాగాన్ని యాచకులకు దానం చేస్తాడు. అంతేగాకుండా బంగారు ఆభరణాలను ఆలయాల్లోని హుండీల్లో, విలువైన కానుకలను చర్చిలకు అందించి తాను చేసిన తప్పులను మన్నించాలని దేవుళ్లను వేడుకుంటాడని పోలీసులు తెలిపారు. గతంలో ఓ ఇంటిలో పనిచేసేవాడు. జీతం పెంచలేదని రూ.2లక్షల నగదు చోరీ చేసినట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు.

తాలూకా కార్యాలయం కిటకిట



అర్జీలను ఇవ్వడానికి క్యూ గట్టిన మహిళలు

చిక్కబళ్లాపురం: పేదలందరికీ ఇళ్లు కట్టించి ఇస్తామని వైద్యశాఖ మంత్రి సుధాకర్ చెప్పడంతో నివేశనాలకు కోసం గురువారం మహిళలు క్యూ కట్టారు. ఇటీవల మంత్రి సుధాకర్ 20 వేల ఇళ్లు కట్టించి ఇస్తామని ప్రకటించడంతో అర్జీలు ఇవ్వడానికి తాలూకా కార్యాలయానికి మహిళలు భారీగా తరలివచ్చారు. నగరంలోని జిరాక్స్ సెంటర్లు కూడా కిటకిలాడాయి. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇలాంటి కిటుకలు మామూలేనని కొందరు పెదవి విరిచారు.

హోసూరు వార్తలు..

సెలవులకు ఇంటికొస్తే ప్రాణాలు పోయాయి

- దాడిలో గాయపడి చికిత్స పొందుతూ సైనికుడు మృతి



వేడియంబట్టి గ్రామంలో ఆందోళన నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

క్రిష్ణగిరి: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి సమీపంలో ఈనెల 8న ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన ప్రభు(28) అనే సైనికుడు బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి డీఎంకే కౌన్సిలర్‌తో పాటు ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. పోచ్చంపల్లి సమీపంలోని వేలంబట్టి గ్రామానికి చెందిన ప్రభాకరన్, సోదరుడు ప్రభు(28) సైన్యంలో పనిచేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం సెలవులపై స్వగ్రామానికొచ్చారు. ఈనెల 8వ తేదీ తాగునీటి తొట్టి వద్ద ప్రభాకరన్ బట్టలు ఉతుకుతుండగా డీఎంకే కౌన్సిలర్ చిన్నస్వామి (55) మందలించాడు. దీంతో వారి మధ్య గొడవ జరిగింది. కౌన్సిలర్ చిన్నస్వామి అదే రోజు సాయంత్రం తన కొడుకు గురుమూర్తి(27), గుణనిధి(19), రాజపాండ్యన్(30)తో కలిసి ప్రభాకరన్ ఇంటివద్దకు వెళ్లి గొడవ పడ్డారు. ప్రభాకరన్, ప్రభు, వారి తండ్రి మాదయ్యన్‌పై దాడి చేశారు. తీవ్ర గాయాలేర్పడిన వీరిని హోసూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రభు బుధవారం మృతి చెందాడు. బాధితుడు ప్రభాకరన్ ఫిర్యాదు మేరకు నాగరసంబట్టి పోలీసులు కేసు నమోదు చేసి కౌన్సిలర్ చిన్నస్వామి, గురుమూర్తి, గుణనిధి, రాజపాండ్యన్, మణిగంఠన్(32), మాదయ్యన్(60), పులియండి(24), వేడియప్పన్(55), కాళియప్పన్(40)పై కేసులు కేసులు నమోదు చేశారు. గురుమూర్తి, గుణనిధి, మణిగంటన్, రాజపాండ్యన్, మాదయ్యన్, వేడియప్పన్‌ను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

కౌన్సిలర్‌ను అరెస్ట్ చేయాలని ధర్నా

సైనికుడు మృతికి కారకుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఎంకే కౌన్సిలర్‌కు వ్యతిరేకంగా క్రిష్ణగిరి తూర్పు జిల్లా బీజేపీ అధ్యక్షుడు శివప్రకాష్ నేతృత్వంలో వేడియంబట్టి గ్రామంలో కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. మాజీ ఎంపీ నరసింబన్, క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షుడు ఎం.నాగరాజ్ మాట్లాడుతూ దేశాన్ని రక్షించే సైనికులకే రక్షణలేకపోయిందన్నారు. డీఎంకే కౌన్సిలర్‌ను అరెస్ట్ చేయాలని, బాధిత సైనిక కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

ఉద్యోగిపై దాడి చేసిన రైతు అరెస్ట్

కెలమంగలం: ఇంటి ముందు కూర్చొని మద్యం సేవించడాన్ని నిలదీసిన ఉద్యోగితో పాటు నలుగురిపై దాడి చేసిన ఘటనలో రైతును అరెస్ట్ చేసి పరారీలో ఉన్న నిందితుల కోసం తళి పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు... తళి సమీపంలోని రాజనాయకన్‌దొడ్డి గ్రామానికి చెందిన ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి గణేష్ ఇంటి ముందు కచ్చువాడి గ్రామానికి చెందిన నాగ (40), అతని మిత్రులు రవి, గజేంద్రన్, మాదులు మద్యం తాగుతుండగా గణేష్, అతని బంధువులు నిలదీశారు. దీంతో ఆవేశానికి గురైన నాగ వర్గీయులు గణేష్, అతని బంధువులపై దాడి చేశారు. ఈ ఘటనపై తళి పోలీసులు కేసు నమోదు చేసుకొని నాగను అరెస్ట్ చేసి పరారీలో ఉమన్న రవి, గజేంద్రన్, మాధు కోసం గాలిస్తున్నారు.

వ్యవసాయాభివృద్ధి పథకం పనుల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న సంయుక్త డైరెక్టర్ బృందా

హోసూరు: క్రిష్ణగిరి జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా జరుగుతున్న పథకం పనులను ఆ శాఖ సంయుక్త డైరెక్టర్ బృందాదేవి గురువారం పరిశీలించారు. మొదటగా బర్గూరు తాలూకా మజీత్‌గొల్లహళ్లి గ్రామంలో ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు అందజేసిన పళ్ల రకాల చెట్లను పరిశీలించారు. అనంతరం కాయగూరల విత్తనాల పంపిణీ, ఆధునిక ఉపకరణాల పంపిణీ, కొబ్బరి చెట్ల పంపిణీ వివరాలను రైతుల వద్ద అడిగి తెలుసుకొన్నారు. పోచ్చంపల్లి, కావేరిపట్టణం ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహిస్తున్న అద్దె యంత్రాలు కేంద్రాలను పరిశీలించారు. క్రిష్ణగిరి తాలూకా గంగలేరి, కావేరిపట్టణం ప్రాంతాల్లో నిర్వహిస్తున్న మామిడి రసాల ఉత్పత్తి కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు భూపతి, మహమ్మద్ అస్లాం, రామప్రసాద్, భాస్కర్, క్రిష్ణమూర్తి, క్రిష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై చైతన్య ర్యాలీ



చైతన్య ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

హోసూరు: హోసూరు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని నినదిస్తూ ఆర్.వి. ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులు గురువారం చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చైతన్య ర్యాలీని హోసూరు విద్యాజిల్లా విద్యాశాఖాధికారి గోవిందన్, ప్రాథమిక విద్యాశాఖాధికారి గోపాలప్ప ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్, స్కౌట్, ఎన్‌సీసీ, ఎన్‌జీసీ విద్యార్థులు పాల్గొని ప్లకార్డులు చేతపట్టి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజల్లో చైతన్యం కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మునిరాజ్ నేతృత్వంలో జరిగిన ఈ చైతన్య కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్‌బాబు, రమేష్, సుధాకర్, ఎస్.టి.రాజు, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

రాష్ట్ర అధ్యక్షుడుగా జి.ధైర్యం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఏపీ రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి సభ్యులు పాల్గొన్నారు. ఏపీ గ్రామ రెవెన్యూ సహాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జి.ధైర్యం (కడప), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కె.సత్యరాజు (కర్నూలు), కార్యనిర్వహణ అధ్యక్షుడిగా వై. అప్పలరాజు (శ్రీకాకుళం), కోశాధికారిగా జి.హజరత్ (నెల్లూరు), ఉపాధ్యక్షుడుగా పి.ప్రభాకర్‌రావు (గుంటూరు), కార్యవర్గ సభ్యులుగా డి.అప్పారావు, పి.అచ్చమ్మ, డి.పేలేసు, పి.సుబ్బయ్య, బి.మినర ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం నాలుగు వేల మంది వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా, వీఆర్వోలకి సీనియర్ సహాయకులుగా పదోన్నతి కల్పించిందని నూతన కమిటీ పేర్కొంది. తామంతా ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపింది.

కుతూహలమ్మకు కన్నీటి వీడ్కోలు

- అధికార లాంఛనాలతో ముగిసిన అంత్యక్రియలు
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప నివాళి



కుతూహలమ్మ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప

సాక్షి, చిత్తూరు/గంగాధర నెల్లూరు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, మాజీ డిప్యూటీ స్పీకర్ గుమ్మడి కుతూహలమ్మ అంత్యక్రియలు గురువారం చిత్తూరు జిల్లాలోని గంగాధర నెల్లూరు మండలం వింజం పంచాయతీ, లక్ష్మీరెడ్డి పల్లిలో ముగిశాయి. కుతూహలమ్మ అనారోగ్యంతో బుధవారం తిరుపతిలో కన్నుమూసిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం 11.30 గంటలకు తిరుపతి నుంచి ఆమె పార్థివదేహాన్ని లక్ష్మీరెడ్డిపల్లి గ్రామానికి తీసుకువచ్చి ప్రజల సందర్శనార్థం ఉంచారు. అనంతరం వందలాది మంది అభిమానులు, వివిధ పార్టీల నేతలు, కార్యకర్తల ఊరేగింపు నడుమ కన్నీటి వీడ్కోలు పలికారు. కుటుంబ సంప్రదాయాలతో ఆమె రెండో కుమారుడు హరికృష్ణ అంత్యక్రియలు నిర్వహించారు. మొదటి కుమారుడు సురేష్ విదేశాల్లో ఉన్న కారణంగా కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు. రాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాల్లో భాగంగా ఆమె పార్థివదేహం వద్ద గౌరవ వందనం సమర్పిస్తూ పోలీసులు గాల్లో మూడు రౌండ్ల కాల్పులు జరిపి శ్రద్ధాంజలి ఘటించారు. అంతకుముందు డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్పతోపాటు పలువురు ప్రముఖులు ఆమె మృతదేహానికి నివాళులు అర్పించి, ఆమె భర్త మునిసిద్ధయ్య, కుమారుడు హరికృష్ణను పరామర్శించారు.

ఏపీటీఎఫ్ అభ్యర్థులకు టీడీపీ మద్దతు

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీటీఎఫ్ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులకు టీడీపీ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పశ్చిమ రాయలసీమ ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల నియోజకవర్గ పరిధిలో ఒంటేరు శ్రీనివాసరెడ్డికి, తూర్పు రాయలసీమ ప్రాంతమైన ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎల్‌సీ రమణారెడ్డికి టీడీపీ మద్దతు ఇస్తుందని ప్రకటించారు.

తెలంగాణ

సునీల్‌యాదవ్ బెయిల్ పిటిషన్‌లో వాదనలు 27కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో ఏ2గా ఉన్న వై.సునీల్ యాదవ్ బెయిల్ పిటిషన్‌లో వాదనలను హైకోర్టు ఈ నెల 27కు వాయిదా వేసింది. వివేకా హత్య కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని, బెయిల్ మంజూరు చేయాలని సునీల్ హైకోర్టులో ఈ నెల 6న బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 16వ తేదీ గురువారం కాణిపాకంలో సోదరుడి సంస్మరణ కార్యక్రమానికి వెళ్లేందుకు అనుమతించాలని కోరారు. బెయిల్ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ సుమలత ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది నయన్‌కుమార్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేశారు. కాగా, ఈ బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సునీల్‌యాదవ్‌కు బెయిల్ ఇవ్వవద్దని విజ్ఞప్తి చేస్తూ వివేకా కూతురు సునీతారెడ్డి, భార్య సౌభాగ్యమ్మ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ దశలో బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని వెల్లడించారు.

మీసం లేని రొయ్య

అడవిలో ఉంటుందయ్యా..



బొడ్డెంగులు కేరాఫ్ విశాఖ మన్యం ప్రొటీన్లు..

పోషకాలు వీటిలో అధికం	• డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు లభ్యం • రొయ్యల వేపుడు తరహాలో వంటకాలు • ఆదివాసీలు అమితంగా ఇష్టపడే వంటకం
ఈత దుబ్బులే వీటి ఆవాసాలు	• పాడేరు, అరకు సంతల్లో లభ్యం • 30 బొడ్డెంగులు రూ.100కు విక్రయం

దట్టమైన అడవుల్లో ఈత దుబ్బుల మాటున లభ్యమయ్యే అడవి రొయ్యల కోసం ఆదివాసీలు ఏడాది పొడవునా ఎదురు చూస్తుంటారు. వాటి కోసం వాగులు.. వంకలు.. కొండలు.. గుట్టలు దాటుకుని దట్టమైన అరణ్యాల్లోకి వెళ్తారు. ఈత దుబ్బుల్లో కనిపించగానే ఒడిసిపట్టి బుట్టలో వేసుకుంటారు. ఇంటికి తెచ్చి కమ్మగా వండుకుని ఆబగా తింటారు. ఏడాదికి మూడు నెలలు మాత్రమే లభించే ఈ జీవులను బొడ్డెంగులు అని పిలుస్తారు. ఆదివాసీలు మాత్రం వీటిని అడవి రొయ్యలుగా ముద్దుగా పిలుచుకుంటారు. బొడ్డెంగులకు రొయ్యల మాదిరిగా మీసాలుండవు కానీ.. సేమ్ టు సేమ్ రొయ్యల్ని పోలి ఉంటాయి.

సాక్షి, అమరావతి: ఉమ్మడి విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల్లోని మన్యంలో దొరికే బొడ్డెంగులు (అడవి రొయ్యలు) గిరిజనులకు ఎంతో ప్రీతి. వాటిని మన్యం ప్రజలు లొట్టలేసుకుని మరీ తింటారు. డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకూ మాత్రమే ఇవి లభిస్తాయి. గిరిజన గ్రామాలను ఆనుకుని ఉండే అటవీ ప్రాంతంలో ఈత దుబ్బులున్న చోట ఇవి పెరుగుతాయి. ఈత మొదలును తవ్వితే మట్టిలో రొయ్యల మాదిరిగా ఉండే పురుగులు లభిస్తాయి. వీటి శరీరం పూర్తిగా కొవ్వుతో కూడి ఉంటుంది. వీటిని రొయ్యల వేపుడు, ఇగురు తరహా కూరలతోపాటు ఇతర వంటకాలను తయారు చేస్తుంటారు గిరిజనులు.

ఎలా సేకరిస్తారంటే..

ఆదివాసీ యువకులు అటవీ ప్రాంతంలో చాలా శ్రమకోర్చి వీటిని సేకరిస్తుంటారు. సేకరించిన తర్వాత ఒక రాత్రి మాత్రమే ఇవి బతికి ఉంటాయి. ఈత చెట్టు కాపు పూర్తయ్యాక చెట్టు ఎండి అంతరించిపోయే క్రమంలో వాటి అడుగు భాగాన బొడ్డెంగులు పుట్టుకొస్తాయని ఆదివాసీలు చెబుతున్నారు. ఇటీవల కాలంలో వీటి సేకరణ గిరిజన యువతకు ఉపాధి వనరుగా మారింది. పాడేరు ఏజెన్సీ ప్రాంతంలోని పెదబయలు, జి.మాడుగుల, ముంచంగిపుట్టు మండలాల పరిధిలోని అటవీ ప్రాంతాలతోపాటు తూర్పు గోదావరి జిల్లాలోని అటవీ ప్రాంతంలో మాత్రమే ఈత చెట్ల పెంపకం ఉంది. మంగళవారం పాడేరు మార్కెట్‌కు బతికి ఉన్న బొడ్డెంగుల్ని గిరిజనులు తీసుకురాగా.. హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. 30 బొడ్డెంగుల్ని రూ.100 చొప్పున విక్రయించగా, గంటలో ఎగరేసుకుపోయారు.

రక్తహీనతకు తగ్గించే మందులా..

రక్తహీనత ఉన్న వారు బొడ్డెంగులను వేపుడు లేదా కూర వండుకుని తింటే ఆ సమస్య తగ్గుతుందని గిరిజనులు చెబుతుంటారు. బొడ్డెంగులు రక్తపుష్టిని కలగజేస్తాయని వైద్యులు సైతం ధ్రువీకరిస్తున్నారు. ప్రొటీన్లు, పోషకాలు పుష్కలంగా ఉండే వీటిని సహజసిద్ధంగా దొరికే పౌష్టికాహారంగా అభివర్ణిస్తుంటారు. ఇవి దొరికిన రోజున బంధువులను పిలిచి మరీ గిరిజనులు విందులు ఏర్పాటు చేస్తుంటారు. జీలుగ కల్లు, మద్యం తాగేవారు నంజు (స్టఫ్)గా వీటిని ఆస్వాదిస్తారు.



బొడ్డెంగుల్ని విక్రయిస్తున్న గిరిజనులు

మంచి ఆదాయం



వీటి కోసం దాదాపు వారం రోజులుగా తిరిగాం. పెదబయలు మండలం మారుమూల కుంతర్ల ప్రాంతంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఈత దుబ్బుల్లో సేకరించాం. తెచ్చిన గంటలోనే అమ్ముడయిపోయాయి. మంచి ఆదాయం వచ్చింది. వీటి వేపుడు ముందు రొయ్యల వేపుడు దిగదుడుపే.

– బోనంగి కుమార్, కుంతర్ల, ఏఎస్సార్ మన్యం జిల్లా

టీడీపీలో సాధికార సారథులు

- ప్రతి 30 కుటుంబాలకు ఒకరు చొప్పున నియామకం
- పెద్దాపురం సభలో చంద్రబాబు



రాష్ట్రంలో ఇల్లు కట్టుకోవాలని చంద్రబాబుకు చెబుతున్న టీడీపీ మాజీ సర్పంచ్ ప్రశాంతకుమార్

సాక్షి ప్రతినిధి, కాకినాడ : కుటుంబ సాధికార సారథుల పేరిట తెలుగుదేశం పార్టీ కొత్త వ్యవస్థకు శ్రీకారం చుడుతోందని ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు వెల్లడించారు. ప్రతి 30 కుటుంబాలకు ఒకరు చొప్పున నియమిస్తామని చెప్పారు. 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండో రోజు గురువారం ఆయన జగ్గంపేటలో పార్టీ కార్యకర్తల సమావేశం, పెద్దాపురం సభలో మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి అధికారంలో ఉన్నప్పుడు న్యాయం చేయలేక పోయామన్నారు. ఈసారి అలా జరగకుండా పక్కా వ్యవస్థలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇకపై పార్టీలో ఉన్న సెక్షన్ ఇన్‌చార్జ్‌లందరినీ కుటుంబ సాధికార సారథులుగా పిలుస్తామని, వీరి నియామకంలో మహిళలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో కుటుంబ సాధికార సారథి విభాగం ఉంటుందని చెప్పారు. ప్రతి కుటుంబానికీ న్యాయం చేసేందుకు ఈ విభాగం పని చేస్తుందని తెలిపారు. ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం పని చేసి, పేదలను పైకి తీసుకొస్తామని వివరించారు.

ఒక్క చాన్స్ అంటూ దోచుకుంటున్నారు..

'ఎన్నికల ముందు ఒక్క చాన్స్ అని అడుగుతాడని నాడే చెప్పాను. ఇప్పుడు అదే జరిగింది. రూ.10 ఇచ్చి, రూ.100 దోచుకుంటున్నారు. రెండువేల నోట్లు కనిపిస్తున్నాయా? ఎక్కడికి పోయాయి అవి. అన్నీ తాడేపల్లి ప్యాలెస్‌కే వెళుతున్నాయి. రూ.పది మీ చేతుల్లో పెట్టి రేషన్ బియ్యాన్ని ఆఫ్రికా దేశాలకు పంపిస్తున్నారు. పోలీసులకు డీఏ, లీవ్ సరెండర్ ఎన్‌క్యాష్ కావడం లేదు. ఒకప్పుడు ఎన్జీవోలకు నేను కూడా భయపడే వాడిని. ఇప్పుడు వారు 10వ తేదీన జీతాలు ఇస్తే చాలు అనుకుంటున్నారు. ఇక వ్యక్తిగత ఆస్తులపై పడ్డారు దుర్మార్గులు. మీ ఆస్తులు జాగ్రత్తగా చూసుకోండి. విశాఖపట్నంలో లలితేష్ అనే ఎన్ఆర్ఐ సుమారు ఐదెకరాలు సంపాదించి, రాజశేఖరరెడ్డి హయాంలో రూ.10 కోట్లు కట్టి రెగ్యులరైజేషన్ చేయించుకున్నారు. ఆ భూమిని కొట్టేయాలని వైఎస్సార్‌సీపీ నేతలు పథకం వేశారు. ఆయన కోర్టుకు వెళితే చివరకు లిటిగేషన్ భూమిగా తేల్చి ఇబ్బందులు పెడుతున్నారు. రాజధానిపై డ్రామాలాడుతున్నారు.' అని చంద్రబాబు అన్నారు. మరోవైపు పెద్దాపురం సభ జనం లేక పేలవంగా సాగింది. వాస్తవానికి సామర్లకోట ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సభ ఏర్పాటు చేయాల్సి ఉంది. అక్కడ జనం ఉండరనే అనుమానంతో సభను పెద్దాపురానికి మార్చేశారు. అయినప్పటికీ జనం హాజరు పలచగా కనిపించడంతో ఇరుకు రోడ్డులో సభను ఏర్పాటు చేశారు.

బాబూ.. రాష్ట్రంలో ఇల్లు కట్టుకోండి

టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాజీ సర్పంచ్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు జగ్గంపేటలో చేదు అనుభవం ఎదురైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రెండో రోజు పర్యటనలో భాగంగా గురువారం పార్టీ కార్యకర్తలతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. విభిన్న వర్గాల నుంచి ఒక్కొక్కరితో మాట్లాడించి వారి అభిప్రాయాలు తెలుసుకోవడమే ప్రధాన అజెండా అని ఆ పార్టీ నాయకులు తొలుతే ప్రకటించారు. సమావేశంలో ఒకరి తర్వాత మరొకరు మాట్లాడుతూ వారి అభిప్రాయాలు చెప్పారు. ఈ నేపథ్యంలో గోకవరం మండలం కృష్ణునిపాలెం మాజీ సర్పంచ్ ప్రశాంతకుమార్ హాలోనిన్ (కన్నబాబు) వంతు వచ్చింది. మైకు చేత్తో పట్టుకుని 'అయ్యా.. గౌరవ అధ్యక్షుల వారికి ఒక విన్నపం. ఇది నా ఒక్కడి విన్నపమే కాదు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరిదీ. ముఖ్యంగా మన కార్యకర్తలందరిదీ. మీరు ఈ రాష్ట్రంలో ఇల్లు కట్టుకోవాలి. కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడే నివాసం ఉండాలి' అని విన్నవించారు. దీంతో వేదికపై ఉన్న చంద్రబాబు ఒక్కసారిగా బిత్తరపోయి అటూ ఇటూ చూశారు. పక్కనే ఉన్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి చెవిలో ఏదో చెప్పారు. అనంతరం మరొకరు మాట్లాడాలంటూ ఆయన సూచించారు.

బాబూ.. మీ ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయగలరా?

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సవాల్




జగ్గంపేట: టీడీపీ అధినేత చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చేటప్పుడు ఉన్న ఆస్తులు, ఇప్పటి ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయగలరా అని కాకినాడ జిల్లా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సవాల్ చేశారు. చంద్రబాబు నాయుడు జగ్గంపేటలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో పాటు తనపై చేసిన విమర్శలను ఆయన తిప్పికొట్టారు. జగ్గంపేటలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై చేసిన అవినీతి ఆరోపణల్ని చంద్రబాబునాయుడు నిరూపించాలని డిమాండ్ చేశారు. తన ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేస్తానని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్యలు సంస్కారహీనంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. రాజకీయ వ్యభిచారం చేసే వారు రాసిచ్చిన స్క్రిప్ట్ చదివేటప్పుడు చంద్రబాబు విజ్ఞతతో వ్యవహరించాలని సూచించారు. రూ.35 కోట్లు తీసుకుని పార్టీ ఫిరాయించిన వ్యక్తుల వల్లే జగ్గంపేటలో టీడీపీ నాశనమైందని పరోక్షంగా జ్యోతుల నెహ్రూను, ఆయన కుమారుడు జ్యోతుల నవీన్‌ను విమర్శించారు. చంద్రబాబుకు విలువలు లేవని, పార్టీని నమ్ముకున్నవారిని ముంచేసి సర్వనాశనం చేస్తారని, దానికి తానే నిదర్శనమని చెప్పారు. రెండుసార్లు టీడీపీ నుంచి పోటీచేసి ఆర్థికంగా నష్టపోయానన్నారు. విలువ, చిత్తశుద్ధిలేని రాజకీయాలను భరించలేక.. ఆత్మాభిమానం చంపుకోలేక 2017లో టీడీపీకి రాజీనామా చేసినట్లు చెప్పారు. అన్నమాటకు కట్టుబడి విలువలతో కూడిన రాజకీయం చేయడం దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి లక్షణమని, సీఎం జగన్‌ది అదే లక్షణమని తెలిపారు. అందుకే ప్రజలు వారిని గుండెల్లో పెట్టుకున్నారన్నారు. ఊసరవెల్లి కన్నా ఎక్కువ రంగులు మార్చే నైజం చంద్రబాబుదని విమర్శించారు. జిల్లాలో చాలామంది టీడీపీ నేతలు చంద్రబాబు పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. చంద్రబాబును నమ్ముకుంటే నష్టపోతారని పేర్కొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి: లోకేశ్

కేవీబీపురం: యువత రాజకీయాల్లోకి రావాలని, రాణించాలని తెలుగుదేశం నాయకుడు లోకేశ్ పిలుపునిచ్చారు. ఆయన నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర గురువారం తిరుపతి జిల్లా కేవీబీపురం మండలంలోని రాయపేడు నుంచి కోవూవనూరు వరకు సాగింది. రాయపేడు వద్ద యువతతో ముఖాముఖి నిర్వహించిన లోకేశ్ రాజులకండ్రిగ కూడలిలో రైతులతో, కోవనూరు వద్ద ఎస్సీ, ఎస్టీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చదువులతో పాటు, రాజకీయాల్లోను రాణించాలని సూచించారు. తన పాదయాత్రను అడ్డుకునే ప్రయత్నంలో పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారని, తమ పార్టీ అధికారంలోకి వస్తే ఎవ్వరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. మరోవైపు పాదయాత్రలో టీడీపీ కార్యకర్తలు ఎన్నికల కోడ్‌ను యథేచ్ఛగా ఉల్లంఘించారు. జెండాలు కట్టవద్దని అడ్డుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు.

నీ పంట దున్నెయ్.. లీడర్‌ని చేస్తాం..

- తన పంటను తానే ధ్వంసం చేసుకున్న టీడీపీ కార్యకర్త
- పంటను ధ్వంసం చేసింది వైఎస్సార్‌సీపీ అంటూ దుష్ప్రచారం
- పాదయాత్రలో లోకేశ్ పరామర్శించేలా టీడీపీ స్కెచ్
- పోలీసుల విచారణతో వెలుగులోకి వచ్చిన కుట్ర



వివరాలు వెల్లడిస్తున్న డ్రైవర్ మధు

శ్రీకాళహస్తి: తన పంటను తానే ధ్వంసం చేసుకుని వైఎస్సార్‌సీపీ వారిపైకి నెట్టిన టీడీపీ కార్యకర్త బాగోతం బట్టబయలైంది. పోలీసుల విచారణలో తెలుగుదేశం నేతల కుట్ర బయటపడింది. లోకేశ్ పాదయాత్ర తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం మీదుగా సాగనుండడంతో దానికి ప్రచారం తీసుకురావాలని టీడీపీ నేతలు కుట్రకు తెరతీశారు. అందుకు పార్టీ కార్యకర్త మురళీకృష్ణారెడ్డిని పావుగా చేసుకున్నారు. మండలంలోని చిట్టత్తూరు గ్రామానికి చెందిన మురళీకృష్ణారెడ్డి 4.25 ఎకరాల విస్తీర్ణంలో వేరుశనగ సాగుచేశాడు. 'నీ పంటను నువ్వే ధ్వంసం చేసి దాన్ని వైఎస్సార్‌సీపీ వారు చేశారని ప్రచారం చెయ్యి. పాదయాత్రలో లోకేశ్‌ను మీ ఇంటికి తీసుకొస్తాం. నీకు నష్టపరిహారం ఇప్పించి, మంచి లీడర్‌ని చేస్తాం..' అంటూ మురళీకృష్ణారెడ్డికి చెప్పారు. దీంతో మురళీకృష్ణారెడ్డి, డ్రైవర్ మధు ఈనెల 9న (గురువారం) రాత్రి రోటావేటర్‌తో వేరుశనగ పంటను ధ్వంసం చేశారు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి తన పంటను వైఎస్సార్‌సీపీ నాయకులు నాశనం చేశారంటూ మురళీకృష్ణారెడ్డి గగ్గోలు పెట్టారు. పథకం ప్రకారం టీడీపీ నేతలంతా గ్రామంలో పర్యటించి వైఎస్సార్‌సీపీ నాయకులపైన, ప్రభుత్వంపైన తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కాల్ డేటా, సీసీ ఫుటేజీలు పరిశీలించి మురళీకృష్ణారెడ్డిని, మధుని విచారించారు. తన పంటను తానే ధ్వంసం చేసుకున్నట్లు మురళీకృష్ణారెడ్డి అంగీకరించారని సీఐ విక్రమ్ తెలిపారు. ఈ విషయంపై విలేకరులు డ్రైవర్ మధుని అడగగా.. పంట ధ్వంసం వెనుక రాజకీయాలు తనకు తెలియదని చెప్పాడు. పంట సరిగా రాలేదని, ధ్వంసం చేస్తే ఇన్సూరెన్స్ వస్తుందని చెప్పడంతోనే రోటావేటర్‌తో దున్నేశానని స్పష్టం చేశాడు. దీంతో టీడీపీ కుట్ర బహిర్గతమైంది.

108కు శాశ్వత కార్యాలయం

- విజయవాడ రాణిగారితోటలో రూ.12లక్షలతో ఏర్పాటు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న 108 కార్యాలయం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆపదలో ఉన్నవారికి అపర సంజీవనిలా సేవలు అందిస్తున్న 108 వాహనానికి, సిబ్బందికి శాశ్వత కార్యాలయం ఏర్పాటు చేసి విజయవాడ నగరపాలకసంస్థ సముచిత గౌరవం కల్పించింది. సాధారణంగా 108 వాహనాలు, ఉద్యోగులకు ప్రత్యేకంగా ఎటువంటి కార్యాలయాలు ఉండవు. స్థానికంగా ఉన్న అవకాశాల మేరకు షెడ్లు లేదా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోని చెట్ల కింద అంబులెన్స్‌లను పెట్టుకుని సిబ్బంది అక్కడే ఉంటారు. ఆపదలో ప్రజలు ఉన్నారంటూ తమకు ఫోన్ వచ్చిన వెంటనే వెళ్లి ప్రాణాలను కాపాడుతుంటారు. ఇదే తరహాలో విజయవాడ 18వ డివిజన్ రాణిగారితోటలోని కనకదుర్గమ్మ వారధి పక్కన వాటర్ ట్యాంక్ కింద ఆశ్రయం పొందుతున్న 108 వాహనం, సిబ్బందికి నగరపాలక సంస్థ రూ.12లక్షలతో శాశ్వత భవనం నిర్మించింది. వాటర్ ట్యాంక్ కింద 108 అంబులెన్స్ పెట్టుకుని సిబ్బంది పడుతున్న ఇబ్బందులను గుర్తించిన స్థానిక కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ... ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచన మేరకు కార్పొరేషన్ అధికారులతో సంప్రదించి వారధి సమీపంలోనే 108 అంబులెన్స్‌కు శాశ్వత కార్యాలయం నిర్మాణానికి అనుమతులు, రూ.12లక్షల నిధులు మంజూరు చేయించారు. నిర్మాణ పనులు పూర్తయి కార్యాలయం ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. ఈ కార్యాలయంలో విద్యుత్, వాహనాల పార్కింగ్ వంటి అన్ని సదుపాయాలను ఏర్పాటు చేశారు. 108 వాహనానికి శాశ్వత కార్యాలయం ఏర్పాటు చేయడంపై సిబ్బంది హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ప్రతిష్టాత్మకంగా అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు

- సర్వమత ప్రార్థనలతో విగ్రహ ప్రతిష్టాపన పనులు ప్రారంభం
- పూజా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు మేరుగు, కొట్టు, బొత్స



విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో మంత్రులు మేరుగు నాగార్జున, కొట్టు సత్యనారాయణ, బొత్స సత్యనారాయణ తదితరులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ మహోన్నత ఘట్టమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. విజయవాడ స్వరాజ్య మైదానంలో నిర్మిస్తున్న అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణ పనుల్లో భాగంగా అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్టాపన పనులను గురువారం సర్వమత ప్రార్థనలతో ప్రారంభించారు. మంత్రులు బొత్స సత్యనారాయణ, కొట్టు సత్యనారాయణ, మేరుగు నాగార్జున పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మేరుగు నాగార్జున, బొత్స సత్యనారాయణ, కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ.. ఏప్రిల్ 14 నాటికి నిర్మాణ పనులు పూర్తి చేయాలనే సీఎం జగన్ ఆదేశాలకు అనుగుణంగా అన్ని శాఖల సమన్వయంతో పనులను వేగవంతం చేశామన్నారు. విగ్రహ శిల్పి నరేష్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'సాంఘిక సంక్షేమ' నిర్మాణ పనుల్లో వేగం పెరగాలి

ఎస్సీ గురుకులాలకు సంబంధించిన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి నాగార్జున ఆదేశించారు. సచివాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ 507 పనులకు రూ.1,061కోట్లు మంజూరుచేయగా, రూ.723కోట్లతో 420 భవనాల నిర్మాణం పూర్తయ్యిందన్నారు.

సీమెన్స్‌లో రూ.250 కోట్ల దొంగ.. చంద్రబాబే

- అవినీతి కేసుల్లో స్టేలు తెచ్చుకున్నది మీ బాబు కాదా?
- స్కాములు చేసి జనం డబ్బులు కొట్టేసిన మీ నాన్నే 'జాదూ బాబు'
- లోకేశ్ ఫెయిల్యూర్ పొలిటీషియన్ కాదు.. మనిషే ఫెయిల్యూర్
- ఈసారి రెండో మూడో కూడా రావని వారికి అర్థమైంది
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి



సాక్షి, అమరావతి : '2014–19 సమయంలో సీమెన్స్ కంపెనీతో ఒప్పందం అని చెప్పి చంద్రబాబు రూ.250కోట్లు దోచుకున్నమాట వాస్తవం కాదా?... అందులో ముమ్మాటికీ చంద్రబాబే దొంగ.. ఆ సొమ్ము ఎలా మాయమైందో లోకేశ్ సమాధానం చెప్పాలి?'.. అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. ప్రభుత్వ, ప్రజాధనాన్ని ఇంత పెద్ద మొత్తంలో దోచుకున్న కుంభకోణంపై మీరేం సమాధానం చెబుతారు? షెల్ కంపెనీలు ప్రారంభించి, ఆ సొమ్మును ఆ కంపెనీల్లోకి మళ్లించి, మీరు స్వాహా చేసింది వాస్తవం కాదా? ఇంతపెద్ద కుంభకోణానికి పాల్పడ్డ మీ తండ్రి చంద్రబాబును జాదూ బాబు అని అంటే బాగుంటుంది. ఆ పదానికి మీ తండ్రీ కొడుకులిద్దరూ సరిపోతారు. బాబు అవినీతిని, దోపిడీని ఎప్పుడు నిరూపించాలని చూసినా వెంటనే కోర్టులకు పరుగులు తీసి స్టేలు తెచ్చుకుంటాడు. మంగళగిరిలో ఓడిపోయిన పనికిమాలినోడు నారా లోకేశ్‌కు ప్రజలందరి నాయకుడు, సీఎం వైఎస్ జగన్ గురించి మాట్లాడే అర్హత ఉందా? లోకేశ్ ఫెయిల్యూర్ పొలిటీషియన్ కాదు.. మనిషే ఫెయిల్యూర్. ఏలేరు స్కాం నుంచి ఐఎంజీ వరకు రూ.వేల కోట్ల స్కాములు చేసింది బాబే. సీమెన్స్ కంపెనీ ఒప్పందం పేరుతో జరిగిన దోపిడీపై ప్రభుత్వం లోతుగా దర్యాప్తు చేపట్టాలని, దోపిడీదారులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా. అంతేకాదు.. బాబు కుంభకోణాలపై ప్రభుత్వం విచారణ జరిపించాలి. ఇక మంగళగిరిలో గెలవలేని లోకేశ్, ఆ పార్టీని అధికారంలోకి తెస్తాడా? టీడీపీ కార్యకర్తలే నవ్వుకుంటున్నారు. నెత్తి మీద రూపాయి పెడితే పావలాకి చెల్లని లోకేశ్ బ్లడ్, బ్రీడ్ గురించి ప్రగల్భాలా? రూ.2 లక్షల కోట్లు నేరుగా పేదల అకౌంట్లలో డబ్బువేస్తే రాష్ట్రం వెనక్కి పోతుందా? ప్రజల్లోకి వెళ్లి సీఎం జగన్ చేసిన పనులు గురించి అడిగితే ప్రజలే లోకేశ్, చంద్రబాబులకు సరైన సమాధానం చెబుతారు.

బాలకృష్ణ కేసును గుర్తుచేసుకుంటే మంచిది..

లోకేశ్‌కు, చంద్రబాబుకు వస్తున్న జనాన్ని చూస్తుంటే, 23 కాదు కదా.. రెండో, మూడో సీట్లు కూడా రావని టీడీపీకి బాగా అర్థమైంది. అందుకే తండ్రీకొడుకులు ఫ్రస్ట్రేషన్‌లోకి వెళ్లారు. వారి సమావేశాల్లోనే కొందరు మహిళలు జై జగన్ అని నినదిస్తున్నారు. మరికొందరు నిన్ను నమ్మం బాబూ అంటున్నారు. ఈ రోజు మరో టీడీపీ కార్యకర్త బాబుతో మాట్లాడుతూ.. మీరు ఏపీలో ఇల్లు కట్టుకుని, నివాసం ఉండి ఇక్కడ రాజకీయం చేయండి సార్, లేకపోతే జనం మిమ్మల్ని నమ్మే పరిస్థితిలేదని కుండబద్దలు కొట్టాడు. అంటే టీడీపీ స్థాయి ఎంతకు దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చు. బాలకృష్ణ కేసులో వైఎస్సార్ చేసిన మేలు అనండి, ఔదార్యం అనండి.. లోకేశ్, బాబు, టీడీపీ శ్రేణులు ఒకసారి గుర్తుచేసుకుంటే మంచిది. టీడీపీ కార్యకర్తలు ట్రాన్స్‌లో బతకొద్దు.. వాస్తవంలో జీవించాలి.

రిషికొండ తవ్వకాలపై కమిటీ

- 4 వారాల్లో నివేదిక ఇవ్వాలని కమిటీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: రిషికొండ తవ్వకాలపై సర్వే నిమిత్తం కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ (ఎంవోఈఎఫ్) కొత్త కమిటీని నియమించింది. గతంలో కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు స్థానం కల్పించడంపై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈసారి కేవలం కేంద్ర ప్రభుత్వ అధికారులకు మాత్రమే స్థానం కల్పించింది. సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ కార్యనిర్వాహక ఇంజనీర్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.వి.ఎస్.ఎస్.శర్మ, సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు శాస్త్రవేత్త డి.సౌమ్య, నేషనల్ సెంటర్ ఫర్ సస్టెయినబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్ శాస్త్రవేత్త డాక్టర్ మాణిక్ మహాపాత్రలకు ఈ కమిటీలో స్థానం కల్పించినట్లు కేంద్ర ప్రభుత్వం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) ఎస్.హరినాథ్ కోర్టుకు నివేదించారు. ఈ వివరాలతో ఆయన ఓ మెమోను కోర్టు ముందుంచారు. సర్వే నిర్వహించి నివేదిక సమర్పించేందుకు ఎనిమిది వారాల గడువు మంజూరు చేయాలని కోరారు. అయితే హైకోర్టు నాలుగు వారాల గడువు మంజూరు చేసింది. తదుపరి విచారణను మార్చి 16కి వాయిదా వేసింది. రిషికొండ తవ్వకాలపై ఏదైనా సమాచారాన్ని డీఎస్‌జీ ద్వారా కమిటీకి అందచేసేందుకు పిటిషనర్లకు హైకోర్టు వెసులుబాటునిచ్చింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రధాన న్యాయమూర్తి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

కోర్టుముందు హాజరుకండి

- జీవీఎంసీ కమిషనర్ రాజాబాబుకు హైకోర్టు ఆదేశం
- విచారణ మార్చి 1కి వాయిదా

సాక్షి, అమరావతి: విశాఖపట్నం జిల్లా యందాడ గ్రామ పరిధిలోని 12.50 ఎకరాల భూమిలో హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ చేస్తున్న నిర్మాణాల విషయంలో కౌంటర్ దాఖలు చేయకపోవడంపై గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కమిషనర్ రాజాబాబు వ్యక్తిగత హాజరుకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. జీవీఎంసీ తరఫున గత విచారణ సమయంలో ఓ న్యాయవాది, తాజా విచారణకు మరో న్యాయవాది హాజరు కావడంపై అసహనం వ్యక్తం చేసింది. ఈ కేసులో ఏదో జరుగుతోందంటూ వ్యాఖ్యానించిన హైకోర్టు.. దీనిపై స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని రాజాబాబును ఆదేశించింది. విచారణను మార్చి 1కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

ఫ్యాషన్



ఈ స్టైల్‌కి ప్రత్యేక ఎంపికలు అవసరం లేదు. మిక్స్ అండ్ మ్యాచ్‌కే మొదటి ప్రాధాన్యత.
ఆభరణాల ఎంపికకు అసలు పోటీ అక్కర్లేదు.
పూసలు, సిల్వర్, ఉడ్ జ్యువెల్రీ ఏదైనా సెలక్షన్ మహా ఈజీ.
ఎవరికి వారు తమకంటూ ఓ స్పెషల్ లుక్‌ను క్రియేట్ చేసుకునే సౌలభ్యం ఈ స్టైల్ సొంతం.
అందుకే, కాలాలతో పనిలేకుండా యూత్‌ని అమితంగా ఆకట్టుకుంటున్న మోడర్న్ బోహో-చిక్ స్టైల్ ఇది.

యువతను అమితంగా ఆకట్టుకునే వాటిలో బోహీమియన్ స్టైల్ ఎప్పుడూ ముందుంటుంది. ఇది ఫ్రెంచ్ నుంచి వచ్చిన శైలిగా చెబుతుంటారు. ఇది గిరిజన జీవన శైలి కి దగ్గరగా ఉండటం, మనసులను ఉల్లాసంగా ఉంచడంతోపాటు చాలా బాగా అట్రాక్ట్ చేస్తుంటుంది. గతంలో పాప్, ర్యాప్ ఈవెంట్లలో బోహో-చిక్ ఫ్యాషన్ శైలి దుస్తులను ధరించేవారు. ఇప్పుడు మోడర్న్ స్టైల్‌ను అనుసరిస్తూ జీన్స్‌తో, పలాజోలతో ఇక్కత్ ఫ్లైస్లీ బ్లౌజులు, బటన్ డౌన్ టాప్స్, ఖఫ్తాన్స్ ఆకట్టుకుంటున్నాయి. వీటి మీదకు ట్రైబల్ జ్యువెలరీ లేదా ఫ్యాషన్ జ్యువెలరీ మరింత ఆధునిక హంగులతో మది దోచుకుంటున్నాయి.

సెలక్షన్ స్టైల్











ఆధ్యాత్మిక శోభ

రుద్రాక్ష పేరు తలిస్తేనే మనసులో ఆధ్యాత్మిక సౌరభం నిండిపోతుంది. అందుకే, రుద్రాక్ష ఆభరణాలకూ శోభను చేకూర్చుతుంది. ప్రత్యేక పర్వదినాల్లో ధరించడానికి అనువుగా కొందరు బంగారు, వెండి మాలలుగా తయారు చేయించుకుంటారు. ఫ్యాషన్ ఆభరణాలలోనూ రుద్రాక్ష తనదైన వైవిధ్యాన్ని చూపుతుంది. నేడు వీటిని యువత కూడా తమదైన స్టైల్‌లో ధరించడానికి ఉత్సాహపడుతున్నారు.









ఇంటిప్స్

- తీపిని ఇష్టపడని పిల్లలు ఉండరంటే అతిశయోక్తి కాదు. కొంతమంది పిల్లలకు చక్కెరతో చేసిన స్వీట్ తింటే వెంటనే జలుబు, దగ్గు సమస్యలు వస్తుంటాయి. అలాంటప్పుడు తేనె వాడడం మంచిది. చక్కెరచక్కటి ప్రత్యామ్నాయం తేనె. ఇది సహజమైనది కాబట్టి ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్స్‌ఉండవు. త్వరగా శక్తినిస్తుంది.



- తేనె కొద్ది నెలలకు చిక్కబడుతుంది. అప్పుడు సీసాను పది నిమిషాల సేపుఎండలో ఉంచితే తిరిగి పలచబడుతుంది. చిక్కబడకపోయినా సరే కనీసం ఏడాదిలోఒకసారి అయినా అరగంట సేపు ఎండలోఉంచాలి. బాటిల్ అడుగున ఉండిపోయినతేనెను బయటకు తీయాలన్నా కూడా ఇదే పద్ధతి. తేనెను ఎప్పుడు కూడా మంటమీద వేడి చేయకూడదు.
- వంటల్లో తేనె వాడేటప్పుడు కూడా పూర్తయి దించిన తర్వాత తేనె వేసి కలపాలి.

మిర్రర్

న్యాయం కోసం రణం

మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, బాధితుల న్యాయపోరాటం, పోరాటం చేసే క్రమంలో పడుతున్న కష్టాలు... అయినప్పటికీ వెనకడుగు వేయని పట్టుదలకు 'టు కిల్ ఏ టైగర్' డాక్యుమెంటరీ అద్దం పడుతుంది. ఝార్ఖండ్‌లోని ఒక గ్రామంలో జరిగిన వాస్తవ సంఘటన ఆధారంగా నిషా పహుజా తీసిన ఈ చిత్రం టోరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ నుంచి పామ్ స్ప్రింగ్స్ ఫిల్మ్ ఫెస్టివల్(2023) వరకు 'బెస్ట్ డాక్యుమెంటరీ'గా ప్రశంసలు అందుకుంటూనే ఉంది...

పదమూడు సంవత్సరాల తన కూతురిని ముగ్గురు వ్యక్తులు అత్యాచారం చేశారని పోలిస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాడు రంజిత్ అనే రైతు. పోలీసుల స్పందన అంతంతమాత్రంగానే ఉంటుంది. ఇక చుట్టాలు, పక్కాలు, గ్రామస్థుల విషయానికి వస్తే...

'జరిగిందేదో జరిగింది. పోయేది మీ కుటుంబ పరువే. కేసు వెనక్కి తీసుకోండి'

'మీ సంగతి ఏమిటోగానీ మన కులం పరువు పోయేట్లు ఉంది. కేసు వెనక్కి తీసుకోండి'

'మన జాగ్రత్తలో మనం ఉండకపోవడం వల్లే ఇలాంటివి జరుగుతాయి. వారిని మనం ఏం చేయలేము. కేసు వెనక్కి తీసుకోండి'

ఎవరు ఎలా స్పందించినా, ఆ స్పందనలో చివర గట్టిగా వినిపించే మాట... కేసు వెనక్కి తీసుకోండి.

అయితే రంజిత్ వీరి ఉచిత సలహాలను పట్టించుకోలేదు. పోరాటదారిని వదలలేదు. ఈలోపు బెదిరింపులు పెరిగాయి. 'కేసు ఉపసంహరించుకుంటావా లేదా?' అని గ్రామస్థుల నుంచి ఒత్తిడి పెరిగింది. రంజిత్ చేస్తున్న న్యాయపోరాటానికి శ్రీజన ఫౌండేషన్ అండగా నిలిచింది. మహిళల హక్కుల గురించి పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థ ఇది. స్థూలంగా చెప్పాలంటే 'టు కిల్ ఏ టైగర్' అనే డాక్యుమెంటరీ కథ ఇది.

అయితే ఇది కాల్పనిక కథ కాదు.

ఝార్ఖండ్‌లోని బెరో జిల్లాలో జరిగిన వాస్తవ సంఘటనల సమాహారం.



'టు కిల్ ఏ టైగర్' డాక్యుమెంటరీలో ఓ దృశ్యం



నిషా పహుజా
దర్శకురాలు

కమర్షియల్ డైరెక్టర్, రైటర్ నిషా పహుజా 'టు కిల్ ఏ టైగర్' రూపకర్త.

కెనడియన్ ఫిల్మ్‌మేకర్‌గా గుర్తింపు పొందిన నిషా ఢిల్లీలో పుట్టింది. కెనడాలోని టోరంటోలో పెరిగింది.

చిన్నవయసులోనే తల్లిదండ్రులతోపాటు కెనడాకు వెళ్లిన నిషా తన భారతీయ మూలాలను ఎప్పుడూ మరచిపోలేదు. బాలీవుడ్ సినిమాలు చూస్తూనే పెరిగింది.

'యూనివర్శిటీ ఆఫ్ టోరంటో'లో ఇంగ్లీష్ సాహిత్యాన్ని చదువుకున్న నిషా రకరకాల సామాజిక ఉద్యమాల్లో పాల్గొంటోంది. డాక్యుమెంటరీ రీసెర్చర్‌గా పేరు తెచ్చుకుంది.

కాలేజీ రోజుల నుంచే నిషాకు రచన, దర్శకత్వం అనేవి ఇష్టమైన సబ్జెక్ట్‌లు.

కెరీర్ ప్రారంభంలో రీసెర్చర్‌గా కెనడియన్ ఫిల్మ్ మేకర్స్ జాన్ వాకర్, అల్ కజిమ్‌లతో కలిసి పనిచేసిన నిషా చిత్ర నిర్మాణంపై కొంత అవగాహన, అనుభవం వచ్చాక డైరెక్టర్‌గా అడుగులు వేసింది. తక్కువ కాలంలో డాక్యుమెంటరీ ఫిల్మ్ డైరెక్టర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది.

డైరెక్టర్‌గా రాణించాలనేది ఆమె కల కాదు. వాస్తవ సంఘటనలనే చిత్రాలుగా తీయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. 'చిత్రం ఎంత వాస్తవికంగా ఉంటే ప్రేక్షకులు అంతగా కనెక్ట్ అవుతారు' అంటుంది నిషా.

2012లో వచ్చిన 'ది వరల్డ్ బిఫోర్ హర్' డాక్యుమెంటరీ ఆమెలో రచన, దర్శకప్రతిభను ప్రపంచం దృష్టికి వచ్చేలా చేసింది. భారతీయ సమాజానికి చెందిన అమ్మాయిల జీవితంలో సంక్లిష్టతలు, వైరుధ్యాలను ఆధారంగా చేసుకొని తీసిన ఈ డాక్యుమెంటరీ వివాదాస్పదం కావడంతో పాటు ఎంతో చర్చను రేకెత్తించింది.

ఇక 'టు కిల్ ఏ టైగర్' విషయానికి వస్తే మొదట ఈ చిత్రాన్ని తీయాలనుకోలేదు నిషా. ఝార్ఖండ్‌లోని ఒక స్వచ్ఛందసంస్థ చేపడుతున్న కార్యక్రమాల గురించి చిత్రం చేయాలని రంగంలోకి దిగినప్పుడు 13 సంవత్సరాల అమ్మాయి అత్యాచారానికి గురైన సంఘటన గురించి విన్నది. బాధితురాలు, ఆమె తండ్రితో మాట్లాడింది. మొదట తాను తీస్తున్న చిత్రంలో భాగంగానే బాధితురాలి గురించి చెప్పాలనుకుంది. అయితే ఆ తరువాత మాత్రం ఈ సంఘటననే చిత్రంగా తీయాలని నిర్ణయించుకుంది.

టోరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్ నుంచి (హాట్ డాక్స్) కెనడియన్ ఇంటర్నేషనల్ డాక్యుమెంటరీ ఫెస్టివల్ వరకు ఎక్కడో ఒకచోట 'టు కిల్ ఏ టైగర్' గురించి ప్రస్తావన, ప్రశంస వినిపిస్తూనే ఉంది. ఎన్నో ప్రశ్నలు రేకెత్తిస్తూనే ఉంది.

వంటిల్లు

పండంటి ఆహారం


రేపే శివరాత్రి!
రోజంతా ఉపవసించాలి... నీరసించకూడదు.
వండ వద్దు... ఎండకు డస్సిపోనూ వద్దు.
పండంటి ఆహారంతో శక్తిని పుంజుకోవచ్చేమో!
వంటకు నిషేధం... పండ్లకు ఆహ్వానం!!

రెయిన్ బో ఫ్రూట్ సలాడ్



కావలసినవి: స్ట్రాబెర్రీలు – 2 కప్పులు (శుభ్రం చేసి సగానికి కట్ చేయాలి); **తర్బూజ ముక్కలు** – 2 కప్పులు; **బ్లూ బెర్రీలు** – కప్పు; **కివీ పండ్లు** – 2 (తొక్క తీసి పలుచగా ముక్కలు చేయాలి); **బొప్పాయి పండు** (ముక్కలు చేయాలి); **రాస్ప్ బెర్రీలు** – కప్పు

తయారీ: ఈ ముక్కలను చక్కగా ఫొటోలో ఉన్నట్లు ఇంద్రధనుస్సు ఆకారంలో అమర్చాలి. ఫ్రూట్ సలాడ్ ప్లేట్‌ని ఇలా చూస్తే ఎవరికైనా ఒక ముక్క తినాలనిపిస్తుంది. మనకు అందుబాటులో ఉన్న అరటిపండు, యాపిల్, ఆరెంజ్, ద్రాక్ష వంటి పండ్లతోనూ సరదాగా ఇంద్ర ధనుస్సును అమర్చుకోవచ్చు.



దానిమ్మ రసం



కావలసినవి: దానిమ్మ పండ్లు – 2

తయారీ: దానిమ్మ పండ్లను కడిగి ఒక్కొక్క పండును నాలుగు భాగాలుగా కట్ చేయాలి. మొత్తం ఎనిమిది ముక్కలను వెడల్పాటి పాత్రలో వేసి ముక్కలు మునిగేటట్లు నీరు పోయాలి. ఇప్పుడు వేళ్లతో మృదువుగా గింజలను వేరు చేయాలి. గింజలు నీటి అడుగున చేరతాయి, వగరుగా ఉండే పలుచని తొక్క నీటి మీద తేలుతుంది. పై చెక్కు, లోపలి తొక్కలను తీసేసి నీటిని వడపోయాలి. ఈ గింజలను మిక్సీ జార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ జ్యూస్‌ను అలాగే తాగవచ్చు లేదా వడపోసి తాగవచ్చు. వడపోయకుండా తాగినట్లయితే జీర్ణవ్యవస్థ చక్కగా శుభ్రపడుతుంది. దానిమ్మలోని తీపి సరిపోదనుకుంటే గింజలను గ్రైండ్ చేసేటప్పుడు రెండు ఖర్జూరాలను (గింజ తీసేసినవి) కలుపుకోవచ్చు.

డ్రై ఫ్రూట్ లడ్డు



కావలసినవి: **ఖర్జూరాల ముక్కలు** – కప్పు; **బాదం** – 3 టేబుల్ స్పూన్‌లు; **కిస్‌మిస్** – 2 టేబుల్ స్పూన్‌లు; **జీడిపప్పు** – 2 టేబుల్ స్పూన్‌లు; **అంజీర్** – 8; **కొబ్బరి తురుము** – టేబుల్ స్పూన్; **యాలకులు** – 2.

తయారీ: బాదం పప్పును బాగా ఎండబెట్టి సన్నగా తరిగి ఒక పాత్రలో వేయాలి. అంజీర్‌లను కూడా తరగాలి, యాలకులను తొక్క వేరు చేసి గింజలను పొడి చేసి బాదం తరుగులో వేయాలి. మిక్సీ జార్‌లో ఖర్జూరం పలుకులు, అంజీర్ మిశ్రమం, జీడిపప్పు, కిస్‌మిస్, బాదం తరుగు, కొబ్బరి తురుము, యాలకుల పొడి వేసి సమంగా కలిసేటట్లు బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని కావలసిన సైజ్‌లో లడ్డూలుగా తయారు చేయాలి.

పుచ్చకాయ రసం



కావలసినవి: పుచ్చకాయ – 1 (మీడియం సైజ్); **పుదీన ఆకులు** – 2 టేబుల్ స్పూన్‌లు; **నిమ్మరసం** – టీ స్పూన్.

తయారీ: పుచ్చకాయలో గింజలు తీసేసి ముక్కలు తీసుకోవాలి. ఈ ముక్కల్లో పుదీనా ఆకులు వేసి మిక్సీ జార్ (జ్యూస్ బ్లెండర్)లో గ్రైండ్ చేయాలి. చివరగా నిమ్మరసం కలపాలి. ఫైబర్ సమృద్ధిగా అందాలంటే ఈ మిశ్రమాన్ని వడపోయకుండా తాగవచ్చు. అలా తాగలేకపోతే వడపోసి తాగవచ్చు.

యువర్స్



● యంగ్ టాలెంట్


● దావల్, జయేష్

షార్క్ టైగర్స్

'నా దగ్గర ఎన్నో ఐడియాలు ఉన్నాయి. ఫండింగ్ ఉంటే ఎక్కడో ఉండేవాడిని' అనేది బ్లాక్ అండ్ వైట్ జమాన నాటి మాట. 'నీ దగ్గర ఐడియా ఉంటే చాలు...దానికి రెక్కలు ఇవ్వడానికి ఎంతోమంది ఉన్నారు' అనేది నేటి మాట. 'ఐడియా' ఉండి ఫండింగ్ అవకాశం లేని స్టార్టప్ కలల యువతరానికి 'షార్క్ ట్యాంక్ ఇండియా'లాంటి టీవీ ప్రోగ్రామ్స్ ఆశాదీపాల్లా మారాయి. తాజాగా గుజరాత్‌కు చెందిన 20 సంవత్సరాల దావల్ తన సోదరుడు జయేష్‌తో కలిసి స్టార్టప్ కలను సాకారం చేసుకోబోతున్నాడు...

దావల్‌కు కాలేజీ టీ స్టాల్‌లో టీ తాగడం అంటే చాలా ఇష్టం. అలాంటి ఇష్టం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీనికి కారణం టీ స్టాల్‌లో పనిచేసే అబ్బాయి ఒక టబ్‌లో అవే నీళ్లలో గ్లాసులను కడగడం. దారిన పోయే మేక ఒకటి వచ్చి ఆ నీళ్లు తాగినా ఆ నీళ్లు అలాగే ఉండడం! టీ స్టాల్ యజమానికి చెప్పినా అతడు పట్టించుకోకపోవడం!!

కాలేజీ టీ స్టాల్‌లోనే కాదు బయట రోడ్డు సైడ్ టీ స్టాల్స్, దాబాలలో కూడా ఇలాంటి దృశ్యాన్నే చూశాడు దావల్.

'ఈ సమస్యకు ఒక పరిష్కారం కనుక్కోవాలి' అని గట్టిగా అనుకున్నాడు గుజరాత్‌లోని బవస్కంత గ్రామానికి చెందిన దావల్.

యూట్యూబ్‌లో మెషిన్ డిజైనింగ్ సబ్జెక్ట్‌పై దృష్టి పెట్టాడు. ఆరు నెలల్లో ఒక అవగాహన వచ్చింది.

తండ్రితో కలిసి ఒక హార్డ్‌వేర్ షాప్‌కు వెళ్లి స్క్రాప్ ఉచితంగా ఇవ్వాల్సిందిగా బతిమిలాడుకున్నాడు. స్క్రాప్ చేతికి వచ్చిన తరువాత ప్రయోగాలు ప్రారంభించాడు.

ఒకటి, రెండు, మూడు, నాలుగు ప్రయత్నాల్లోనూ విఫలం అయ్యాడు.

'చేసింది చాలు. ఇక ఆపేయ్. స్క్రాప్ ఇచ్చేదే లేదు' అన్నాడు హార్డ్‌వేర్ షాప్ యజమాని. దీంతో తనకు తెలిసిన ప్రొఫెసర్‌ను కలిసి విషయం చెప్పాడు. ఆయన పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించాడు.

ఈసారి మాత్రం తన ప్రయత్నంలో పూర్తిగా సక్సెస్ అయ్యి ఆటోమెటిక్ టీ–గ్లాస్ వాషింగ్ మెషిన్ కలను నెరవేర్చుకున్నాడు. ఈ మెషిన్‌లోని వాటర్ జెట్‌తో 30 సెకండ్ల వ్యవధిలో 15 టీ గ్లాసులను శుభ్రపరచవచ్చు. దీని సామర్థ్యాన్ని పెంచే కొత్త మెషిన్ కూడా తయారు చేశాడు దావల్.

దీని గురించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తే అనూహ్యమైన స్పందన వచ్చింది. కొందరు ప్రొఫెసర్‌లను కలిసి ఈ మెషిన్ గురించి డెమో ఇచ్చాడు. వారికి నచ్చి అభినందించడమే కాదు లక్ష రూపాయలు ఇచ్చారు. వారు ఇచ్చిన లక్షతో అయిదు మెషిన్‌లను తయారుచేసి కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్రలలో అమ్మారు.

దావల్ సోదరుడు జయేష్‌కు సొంతంగా వ్యాపారం చేయాలనేది కల. సోదరులిద్దరు 'మహంతం' పేరుతో స్టార్టప్ ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. తాజాగా షార్క్‌ట్యాంక్ ఇండియా(సోనీ టీవీ) రియాల్టీ షోలో దావల్, జయేష్‌లు చెప్పిన స్టార్టప్ ఐడియా నచ్చి అయిదుగురు షార్క్స్(బిగ్–షాట్ ఇన్వెస్టర్స్) డీల్ ఆఫర్ చేయడమే కాదు 'మీ విజయం యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తుంది' అని అభినందించారు.

ఆ మాటే విజయమంత్రం

'అపజయం మాత్రమే అంతిమం కాదు' అనే మాటను ఎన్నోసార్లు విన్నాను. నా ప్రయత్నంలో విఫలమైనప్పుడల్లా ఈ మాటను గుర్తు తెచ్చుకునేవాడిని. మళ్లీ మళ్లీ ప్రయత్నించేవాడిని. కొందరు నన్ను వింతగా చూసేవారు. కొందరైతే...నీకు నువ్వు సైంటిస్ట్‌లా ఫీలవుతున్నావు అని వెక్కిరించేవాళ్లు. అయితే నేను వాటిని ఎప్పుడూ పట్టించుకోలేదు. సక్సెస్ కావడమే నా లక్ష్యం అన్నట్లుగా కష్టపడ్డాను. చివరికి ఫలితం దక్కింది.

-దావల్

● అవును...ఇది నిజమే!

● 'అన్‌ఫ్రెండ్' అనే మాట ఫేస్‌బుక్‌కు ముందు ఉందా? అనే ప్రశ్నకు చాలామంది చెప్పే జవాబు 'లేదు' అని. అయితే 13వ శతాబ్దానికి చెందిన కవి లయమన్ కవితలో ఈ పదం కనిపిస్తుంది. అప్పటి ఇంగ్లీష్‌ను అర్థం చేసుకోవడం కొంచెం కష్టమే అయినా అర్థం కాకుండా మాత్రం పోదు!

● 'హెడ్‌లెస్ చికెన్ మాన్‌స్టర్' గురించి ఎప్పుడైనా విన్నారా? నిజానికి దీనికీ చికెన్‌కు ఎలాంటి సంబంధం లేదు. 'హెడ్‌లెస్ చికెన్ మాన్‌స్టర్' అనేది ఒక రకమైన సముద్రపు దోసకాయ. సదరన్ ఒషియన్‌కు సమీపంలో దీన్ని కనుగొన్నారు.

● 'టర్టిల్ అనగా ఏమిటి?' ప్రశ్నకు అందరి నుంచి వినిపించే జవాబు...తాబేలు. స్కాట్‌లాండ్‌లో మాత్రం దీనికి వేరే అర్థం ఉంది. ఎవరి పేరు అయినా ఎంతకూ గుర్తుకు రాని సందర్భంలో, అసహనానికి, తట్టుకోలేని కోపానికి గురయ్యే సమయంలో ఉపయోగించే మాట ఇది.

● గేమింగ్ : నేడే విడుదల



విల్లు అందుకుంటే ఇక విలయమే!

ఒక పెద్ద చెట్టు కింద నిల్చుంటాడు కథానాయకుడు. అది చెట్టు కాదని భయానకమైన మాన్‌స్టర్ అని తెలుసుకోవడానికి ఎంతో సేపు పట్టదు. ఒక కొండ పక్కన కూర్చొని ఉంటాడు హీరో...'కొండ కదులుతున్నదేమిటి!' అనే ఆశ్చర్యం నుంచి తేరుకునేలోపే అది క్రూరమైన మాన్‌స్టర్ అని తెలుసుకుంటాడు. పూలతోటల నుంచి మంచుఎడారి వరకు రకరకాల మాన్‌స్టర్‌లను బుక్‌వార్క్‌లాంటి యంత్రం సహాయంతో ఎలా ఎదుర్కొన్నాడు అనేదే వైల్డ్ హార్ట్స్ గేమ్.

యాక్షన్–అడ్వెంచర్ వీడియో గేమ్ 'వైల్డ్ హార్ట్' నేడు విడుదల అవుతుంది. జపాన్‌కు చెందిన వీడియో గేమింగ్ కంపెనీ ఓమెగా ఫోర్స్ దీన్ని రూపొందించింది. మాన్‌స్టర్ హంటింగ్ గేమ్స్‌లో చేయి తిరిగిన కొటారో హిరాట్ ఈ గేమ్‌కు డైరెక్టర్. అలనాటి ఫ్యూడల్ జపాన్‌ను స్ఫూర్తిగా తీసుకొని 'అజుమి' అనే మాయాప్రపంచాన్ని సృష్టించారు. భయంకరమైన మాన్‌స్టర్స్‌ను వేటాడే బాధ్యత ప్లేయర్స్‌పై ఉంటుంది. మోనస్టర్స్‌ను వేటాడడానికి వాగస, కలూనాలాంటి ఎనిమిది ఆయుధాలు ఈ గేమ్‌లో ఉంటాయి. బుక్‌వార్క్‌లాంటి యంత్రంతో ఎమిమీ దారిని బ్లాక్ చేయవచ్చు.

ప్లాట్‌ఫామ్స్: పీఎస్ 5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్, పీసీ
మోడ్: సింగిల్ ప్లేయర్, మల్టీ ప్లేయర్

● టెక్.. టాక్



సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్23 ఆల్ట్రా

సైజ్: 6.8 అంగుళాలు
బరువు: 234 గ్రా.
రిజల్యూషన్: 1440X3088 పిక్సెల్స్
ఓఎస్: ఆండ్రాయిడ్ 13, వన్ యూఐ 5.1
మెమోరీ:
256జీబి 8జీబి ర్యామ్
256జీబి 12జీబి ర్యామ్
512 జీబి 12జీబి ర్యామ్
కలర్స్: ఫాంటమ్ బ్లాక్, గ్రీన్, క్రీమ్, స్కైబ్లూ, రెడ్, జీఎండబ్ల్యూ ఎం ఎడిషన్



వాట్సాప్‌లో ఫొటో క్వాలిటీ ఫీచర్

వాట్సాప్ 'ఫొటో క్వాలిటీ' ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ ఫీచర్ ద్వారా ఆండ్రాయిడ్, ఐవోఎస్ యూజర్‌లు ఒరిజినల్ క్వాలిటీతో, కంప్రెస్‌డ్ ఫార్మట్‌లో ఫొటోలను పంపి డాటా సేవ్ చేసుకోవచ్చు. యూజర్లు తమ వాట్సాప్ సెట్టింగ్స్ మార్చుకోవడం ద్వారా ఈ ఫీచర్‌ను ఉపయోగించుకోవచ్చు.

వాట్సాప్‌లో (ఐఫోన్) ఒరిజినల్ క్వాలిటీ ఫొటోలు సెండ్ చేయడానికి...
▶ వాట్సాప్ ఓపెన్ చేసి సెట్టింగ్స్ ఐకాన్ ట్యాప్ చేయాలి.
▶ స్టోరేజ్ అండ్ డాటా–ట్యాప్ ▶ మీడియా అప్‌లోడ్ క్వాలిటీ–ట్యాప్ ▶ ఆటో–సెలెక్ట్



లాప్‌ట్యాప్ స్టాండ్

బ్రాండ్: ఐస్టఫ్ 365
కంపాటబుల్: లాప్‌టాప్, టాబ్లెట్, ఐప్యాడ్స్ ● టూ ఇన్ వన్ డిజైన్ ● డిటాచబుల్ హోల్డర్ ఫర్ మొబైల్ ఫోన్స్
కలర్: బ్లాక్ బరువు: 375 గ్రా.

● ఇంగ్లిష్ ఇడియమ్స్



ఒక విద్యలో అంతగా ప్రతిభ లేకపోయినా తనకు తానే ధైర్యం చెప్పుకుని బరిలోకి దిగడం, కంఫర్ట్ జోన్ వదిలి కొత్త దారిలో ప్రయాణిస్తున్నప్పుడు ఎక్కడైనా అసౌకర్యంగా ఉన్నా అది బయటపడనివ్వకుండా జాగ్రత్త పడడం...మొదలైన సందర్భాలలో ఉపయోగించే ఇడియమ్ ఇది.

ఉదా: ఐ నో యూ ఆర్ వెరీ అన్‌కంఫర్టబుల్ ఇన్‌దిస్ క్లాత్స్. బట్ మస్ట్ యాక్ట్ ఇన్ ఫ్రంట్ ఆఫ్ ది ఆడియెన్స్. యూ గాట్ టు ఫేక్ ఇట్ అన్‌టిల్ యూ మేక్ ఇట్.

సినిమా


● కృతీ శెట్టి, నాగచైతన్య

ఒక పాట.. ఏడు సెట్లు

ఏడు సెట్లలో హీరో నాగచైతన్య, హీరోయిన్ కృతీ శెట్టి ఆడిపాడుతున్నారు. ఎందుకంటే 'కస్టడీ' చిత్రం కోసం. వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కస్టడీ'. పవన్ కుమార్ సమర్పణలో తెలుగు, తమిళ భాషల్లో శ్రీనివాసా చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో నాగచైతన్య, కృతీపై ఒక పాట చిత్రీకరిస్తున్నారు. ఈ పాట కోసం ప్రొడక్షన్ డిజైనర్ రాజీవన్, ఆర్ట్ డైరెక్టర్ డీవై సత్యనారాయణ ఏడు సెట్స్‌ని రూపొందించారు. ''ఇళయరాజా, ఆయన తనయుడు యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్న చిత్రం 'కస్టడీ'. ఇందులోని ఓ పాటని శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో హీరో హీరోయిన్లపై చిత్రీకరిస్తున్నాం. ఈ పాట కోసమే ఏడు సెట్లు వేయించాం. ఈ పాట కనువిందుగా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. కాగా మే 12న 'కస్టడీ' రిలీజ్ కానుంది.

బ్రేక్ ఇవ్వలేదు

- రాశీ ఖన్నా

దక్షిణాదిలో పదేళ్లుగా సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా రాణిస్తున్నారు రాశీ ఖన్నా. అలాగే 'రుద్ర' సిరీస్‌తో వెబ్ వరల్డ్‌లోకి ఎంటర్ అయిన రాశీ తాజాగా 'ఫర్జీ' వెబ్ సిరీస్‌లో ఓ లీడ్ రోల్ చేశారు. రాజ్ అండ్ డీకేలు తెరకెక్కించిన ఈ సిరీస్‌లో షాహిద్ కపూర్, విజయ్ సేతుపతి, రెజీనా ఇతర లీడ్ రోల్స్ చేశారు. ఈ నెల 10 నుంచి ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా రాశీ ఖన్నా చెప్పిన విశేషాలు.

● 'ఫర్జీ'లో మీ పాత్రకు వచ్చిన అభినందనల గురించి...

ఈ సిరీస్‌లో నేను చేసిన మేఘా వ్యాస్ పాత్రకు వ్యూయర్స్ నుంచి మంచి స్పందన లభిస్తున్నందుకు హ్యాపీ. సామ్ (సమంత), కీర్తి సురేష్ బాగుందంటూ మెసేజ్‌లు పెట్టారు. వీరితోపాటు కొందరు దర్శక–నిర్మాతలు కూడా కంగ్రాట్స్ చెప్పారు. తెలుగు, తమిళ ఆడియన్స్ నుంచి కూడా పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది.

● ప్రస్తుతం మీ చేతిలో ఎక్కువ సినిమాలు లేవు. అయితే మీరు కొత్త సినిమాలు ఒప్పుకోనిది పెళ్లి చేసుకోవడం కోసమే అని కొందరు అనుకుంటున్నారు...

సినిమాలకు నేను బ్రేక్ ఇవ్వలేదు. తెలుగులో మూడు, తమిళంలో మూడు కథలు విన్నాను. అవి చర్చల దశలో ఉన్నాయి. 'ఫర్జీ' రిలీజ్ తర్వాత ఓ నిర్ణయం తీసుకుందామని వెయిట్ చేశాను.. అంతే. త్వరలో నా కొత్త సినిమా ప్రకటనలు వస్తాయి.

● హిందీ చిత్రం 'మద్రాస్ కేఫ్' (2013)తో కెరీర్ ప్రారంభించిన మీరు ఆ తర్వాత మరో హిందీ సినిమా చేయడానికి పదేళ్ల గ్యాప్ తీసుకోవడానికి కారణం?

తెలుగు ప్రేక్షకులు నాపై ఎంతో ప్రేమ చూపించారు. అందువల్ల నేను దక్షిణాది సినిమాలకే స్టక్ అయిపోయాను. నిజానికి కెరీర్‌లో ఏం చేయాలి అని నేను ప్లాన్ చేసుకోలేదు. ఓ ఫ్లో ప్రకారం వెళ్లిపోయాను. ఇప్పుడు ఏదో హిందీ సినిమా చేయాలని 'యోధ' ఒప్పుకోలేదు. కథ నచ్చడంతో 'యస్' చెప్పా. ఓటీటీ ప్రభావంతో భాషపరమైన హద్దులు కూడా లేవు. తెలుగు, హిందీ అని కాదు.. ప్రతిదీ ఇండియన్ సినిమానే. ప్రస్తుతం 'యోధ' సినిమా షూటింగ్ జరుగుతోంది.

● ఇటీవల కొందరు హీరోయిన్లు అనారోగ్యం బారిన పడటానికి వృత్తిపరమైన ఒత్తిడి ఓ కారణం అనుకోవచ్చా? ఒకవేళ మీకు ఒత్తిడి ఉంటే దాన్ని ఎలా అధిగమిస్తారు?

నిజం చెప్పాలంటే నా కెరీర్‌ను నేనెప్పుడూ ప్రెజర్‌గా ఫీల్ కాలేదు. సాధారణ పాత్ర చేసినప్పుడు మాత్రమే కాదు.. చాలెంజింగ్ రోల్ చేసినప్పుడూ కూల్‌గానే ఉంటాను. ఎందుకంటే యాక్టింగ్‌ని ఎంజాయ్ చేస్తున్నాను. ఇక హెల్త్ విషయానికొస్తే.. నేను ఆరోగ్యంగా, హ్యాపీగా ఉన్నాను. దీన్ని నేను అదృష్టంగా భావిస్తున్నాను.

● మీకు డ్రీమ్ రోల్స్ ఏమైనా?

తెలుగులో నేను లవ్‌స్టోరీ సినిమాలు చేశాను. కామెడీ రోల్స్ చేశాను. ఇప్పుడు యాక్షన్ ఫిల్మ్ చేయాలని ఉంది. 'బాహుబలి'లో అనుష్కగారు చేసిన యువరాణిలాంటి పాత్ర చేయాలని ఉంది. నా కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి చేసే ఏ పాత్రనైనా నేను డ్రీమ్ రోల్‌లానే భావిస్తాను.

● ఓ సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా కొత్తగా సినిమాల్లోకి వచ్చే అమ్మాయిలకు మీరు ఇచ్చే సలహా?

నా లైఫ్‌లో నేను టైమ్‌కి చాలా ప్రాధాన్యం ఇస్తాను. ఇండస్ట్రీలో రాణించాలంటే కష్టపడే తత్త్వం, క్రమశిక్షణ చాలా ముఖ్యం. అలాగే ఏ ఇండస్ట్రీకి వెళ్లినా అక్కడి భాషను నేర్చుకోవాలి.


● రాశీ ఖన్నా


● మురళీ కిషోర్, అల్లు అరవింద్, కిరణ్ అబ్బవరం, అఖిల్, కశ్మీర, బన్నీ వాసు

రెండు సీన్లు చూశా... థ్రిల్ అయ్యా!

- అఖిల్

''గీతా ఆర్ట్స్ ఈవెంట్‌కు నేను ఓ కుటుంబసభ్యుడిలా వచ్చాను. కొత్తదనం కోసం అరవింద్‌గారు ఎప్పుడూ తాపత్రయపడుతుంటారు. కష్టం ఎప్పుడూ వృథా కాదు. కిరణ్ ఎంతో కష్టపడుతున్నాడు. తనకు ఆల్ ది బెస్ట్'' అని అన్నారు అక్కినేని అఖిల్. కిరణ్ అబ్బవరం, కశ్మీరా పరదేశి జంటగా మురళీ కిషోర్ (నందు) దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన అఖిల్ మాట్లాడుతూ– ''వినరో..'లోని రెండు సీన్లు చూసి, థ్రిల్ అయ్యాను. ట్విస్ట్స్ అండ్ టర్న్స్‌తో ఈ సినిమా వస్తోంది '' అని అన్నారు. ''జెన్యూన్‌గా ఉండే కిరణ్‌లాంటి వ్యక్తులు తక్కువ. బన్నీ వాసుతో పాటు కిరణ్ అబ్బవరంనూ ఓ నిర్మాతగా ఫీలవుతున్నాను. ఈ సినిమాకు అతను అలా వర్క్ చేశాడు'' అన్నారు నిర్మాత అల్లు అరవింద్. ''అఖిల్‌గారి సినిమాలో నేను ఓ కీ రోల్ చేయాల్సింది. కుదర్లేదు. ఏయన్నార్‌గారు చేసిన 'మనం' సినిమా తెలుగు ప్రేక్షకులకు ఓ ఎమోషన్. స్క్రీన్‌పై గీతా ఆర్ట్స్ అని చూసిన మాలాంటి వారు కూడా అదే బ్యానర్‌లో సినిమాలు చేయొచ్చు అంటూ చాన్స్ ఇచ్చిన అల్లు అరవింద్‌గారికి ధన్యవాదాలు. నాలా సినిమాపై ప్యాషన్‌తో వచ్చేవారి తరఫున అల్లు అరవింద్‌గారికి ధన్యవాదాలు చెబుతున్నాను. 'వినరో. ..' సినిమా బాగా రావడానికి ఎంతో కారణమైన బన్నీ వాసుగారి దగ్గర్నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ మూవీతో నందు అన్నకు మంచి పేరు వస్తుంది. యూట్యూబ్‌లో షార్ట్‌ఫిల్మ్ 'గచ్చిబౌలి' నుంచి నేను ఇక్కడి వచ్చేంతవరకు నన్ను ప్రోత్సహించిన, ఇంకా సపోర్ట్ చేస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్. 'వినరో..' పెద్ద హిట్టవుతుందని నమ్ముతున్నాను'' అన్నారు కిరణ్ అబ్బవరం. ''నేను దర్శకుడిని అయ్యానని మా నాన్నకు నేను హ్యాపీగా చెప్పుకునేలా చేసిన కిరణ్ అబ్బవరంకు, నిర్మాతలు అరవింద్, బన్నీ వాసుగార్లకు ధన్యవాదాలు'' అన్నారు మురళీ కిషోర్. ''గీతా ఆర్ట్స్ తర్వాత నాగచైతన్య, అఖిల్ నాకు ఆప్తులు. నా మనసుకు కనెక్ట్ అయిన సినిమా ఇది. ఈ సినిమా చూశాక ఆడియన్స్ కొన్ని అంశాలను వెంట తీసుకెళ్తారు. కిరణ్, కిశోర్, మ్యూజిక్ డైరెక్టర్ చేతన్‌లకు మంచి భవిష్యత్తు ఉంటుంది'' అన్నారు బన్నీ వాసు.



నటిని కావాలని అనుకోలేదు

గౌరి జి. కిషన్

''శ్రీదేవి శోభన్‌బాబు'లో నేను చేసిన జాను పాత్ర మోడ్రన్‌గా ఉంటుంది'' అని హీరోయిన్ గౌరి జి. కిషన్ అన్నారు. ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వంలో సంతోష్ శోభన్, గౌరి జి. కిషన్ జంటగా రూపొందిన చిత్రం 'శ్రీదేవి శోభన్‌బాబు'. సుష్మిత కొణిదెల, విష్ణు ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గౌరి జి. కిషన్ మాట్లాడుతూ– ''నేను నటిని కావాలనుకోలేదు. జర్నలిస్ట్ అవుదామనుకున్నా. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడు తమిళ మూవీ '96' ఆడిషన్స్‌కి వెళ్లి సెలక్ట్ అయ్యాను. తెలుగులో నా తొలి చిత్రం 'శ్రీదేవి శోభన్‌బాబు'. 'ఏమాయ చేసావె' టైమ్‌లో సమంత ఎలా ఉన్నారో ఇప్పుడు నేను అలా ఉన్నానని చాలామంది అన్నారు. ఆమెలా నాకూ అన్ని భాషల్లో నటించాలనుంది. ఇండస్ట్రీలో మహిళా రచయితలు తక్కువగా ఉన్నారు.. ఎక్కువమంది రావాలి. నేను కూడా రాయడానికి ప్రయత్నం చేస్తున్నాను'' అన్నారు.

హాలీవుడ్ నటి రాక్వెల్ వెల్చ్ కన్నుమూత



కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రముఖ హాలీవుడ్ నటి రాక్వెల్ వెల్చ్ (82) తుది శ్వాస విడిచారు. అమెరికాలోని ఇల్లినాయిస్ స్టేట్ చికాగోలో 1940 సెప్టెంబర్ 5న రాక్వెల్ వెల్చ్ జన్మించారు. ఆమె అసలు పేరు జో రాక్వెల్ టిజేడా. హైస్కూల్ చదువుతున్న రోజుల్లో 'ఫెయిరెస్ట్ ఆఫ్ ద ఫెయిర్'గా పేరు పొందారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, స్టేట్ కాలేజ్‌లో థియేటర్ ఆర్ట్స్‌లో చేరారు రాక్వెల్. 'ఎ హౌస్ ఈజ్ నాట్ ఎ హోమ్' (1964)లో చేసిన చిన్న పాత్ర ద్వారా ఆమె వెండితెరకు పరిచయమయ్యారు. 1966లో వచ్చిన 'ఫెంటాస్టిక్ వాయేజ్'లో ఓ లీడ్ రోల్ చేసిన రాక్వెల్‌కు మంచి గుర్తింపు లభించింది. 1973లో 'ద త్రీ మస్కటీర్స్'కి ఆమెకు ఉత్తమ నటిగా 'గోల్డెన్ గ్లోబ్' అవార్డు లభించింది. 1995లో 'ది ఎంపైర్' మ్యాగజీన్ ప్రచురించిన '100 సెక్సియస్ట్ స్టార్స్ ఆఫ్ ట్వంటీయత్ సెంచరీ'లో ఒకరిగా, మరో మ్యాగజీన్ 'ప్లే బాయ్' లిస్ట్‌లో మూడో స్థానంలో నిలిచారామె. రాక్వెల్ చివరి చిత్రం 'హౌ టు బి ఏ లాటిన్ లవర్' (2017). ఇక 1959లో జేమ్స్ వెల్చ్‌ను పెళ్లాడారామె. వీరికి ఇద్దరు సంతానం. వెల్చ్ నుంచి విడిపోయాక దాదాపు మూడు పెళ్లిళ్లు చేసుకున్నప్పటికీ ఆయన 'ఇంటి పేరు'తోనే కొనసాగారామె.

దరువెయ్ బాగా వచ్చింది

- సాయిరామ్ శంకర్


● సాయిరామ్ శంకర్, యాశా శివకుమార్

''వెయ్ దరువెయ్' టీజర్ ఆసక్తిగా ఉంది. ఈ సినిమా హిట్ కావాలి. సాయి అన్నకి, డైరెక్టర్, ప్రొడ్యూసర్‌లకు మరిన్ని అవకాశాలు రావాలి'' అన్నారు హీరో సాయిధరమ్ తేజ్. సాయిరామ్ శంకర్, యాశా శివకుమార్ జంటగా నవీన్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వెయ్ దరువెయ్'. దేవరాజు పోతూరు నిర్మించిన ఈ సినిమా మార్చిలో రిలీజ్ కానుంది. ఈ చిత్రం టీజర్‌ని సాయిధరమ్ రిలీజ్ చేశారు. సాయిరామ్ శంకర్ మాట్లాడుతూ– ''మా సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన రెండు పాటలకు విశేష స్పందన లభించింది. సినిమా బాగా వచ్చింది.. అందరికీ నచ్చుతుంది'' అన్నారు. ''సాయిరామ్, దేవరాజుగార్లు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని అనుకుంటున్నాను'' అన్నారు నవీన్ రెడ్డి. ''సాయిరామ్‌గారి కెరీర్‌లో మరొక మంచి చిత్రం అవుతుంది'' అన్నారు దేవరాజ్. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్, కెమెరా: ముత్యాల సతీష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: జనగాని కార్తీక్, శ్రీపాల్ చొల్లేటి.


● తనీష్, బంటి, శ్రీరామ్

ప్రేమించు డూడ్

యువత మనస్తత్వం, వారి ఆలోచనాధోరణి ఎలా ఉన్నాయి? అనే కథాంశంతో రూపొందనున్న చిత్రం 'కేసీపీడీ' (కొంచెం చూసి ప్రేమించు డూడ్). గౌతం మన్నవ దర్శకత్వంలో కార్తీక్ రెడ్డి, వరుణ్ దగ్గుబాటి నిర్మించనున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసింది యూనిట్. ''రొమాంటిక్ కామెడీ జానర్ సినిమా ఇది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. తనీష్ అల్లాడి, శ్రీరామ్ రెడ్డి, ద్వారక వీడీఎస్ (బంటి), సుభశ్రీ రాయగురు, ప్రియాంక పాసల, దివ్య దిల్హోకర్ నటించనున్న ఈ చిత్రానికి కెమెరా: శ్రీకరబాబు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
17-2-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	44	61,320
నిఫ్టీ ▲	20	18,135

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	11,972	▽ 99
డోజోన్స్	33,937	▽ 192
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,013	▲ 15
డాక్స్	15,534	▲ 27
హాంగ్‌సెంగ్	3,249	▽ 31
నికాయ్	27,696	▽ 195

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (24 క్యారెట్)	56,428 ▽ 50
బంగారం (22 క్యారెట్)	56,202 ▽ 50
వెండి (కిలో)	65,389 ▽ 22

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	81.15	83.72
£	బ్రిటన్ పౌండ్	86.28	91.02
€	యూరో	98.81	101.63
¥	జపాన్ ఎన్ (100)	60.65	62.63
AUS	ఆస్ట్రేలియా డాలర్	56.81	57.90
S$	సింగపూర్ డాలర్	59.34	62.45
SAR	సౌదీ రియాల్	21.06	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	21.62	23.42
¥	చైనా యువాన్	10.95	13.02

వెబ్‌సైట్ల నిర్వహణ తప్పనిసరి

బ్రోకర్లు, డిపాజిటరీలకు సెబీ ఆదేశాలు

న్యూఢిల్లీ: పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా స్టాక్ బ్రోకర్లు, డిపాజిటరీలకు వెబ్‌సైట్ల నిర్వహణను తప్పనిసరి చేసింది. తద్వారా స్టాక్ బ్రోకర్ల(ఎస్‌బీలు), డిపాజిటరీ పార్టిసిపెంట్ల(డీపీలు) చేపట్టే వివిధ లావాదేవీ(యాక్టివిటీ)ల సమాచారం ఇన్వెస్టర్లకు పారదర్శకంగా అందుబాటులోకి రానుంది. ఆధునిక సాంకేతికతల నేపథ్యంలో సంబంధిత వెబ్‌సైట్లను



ఎస్‌బీ, డీపీలు తప్పనిసరిగా నిర్వహించవలసి ఉంటుంది. వెరసి ఇన్వెస్టర్లకు ఉత్తమ సర్వీసులు అందించేందుకు వీలుంటుంది. ఆయా వెబ్‌సైట్లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ నంబర్, రిజిస్టరైన చిరునామా, ప్రధాన కేంద్రం, బ్రాంచీలు, కాంటాక్టుకు వీలయ్యే పేర్లు, ఈమెయిల్ ఐడీలు తదితర ప్రాథమిక సమాచారంతోపాటు కీలక యాజమాన్యం, కంప్లయెన్స్ అధికారుల వివరాలు సైతం పొందుపరచవలసి ఉంటుందని తాజాగా విడుదల చేసిన సర్క్యులర్‌లో సెబీ పేర్కొంది. తాజా మార్గదర్శకాలు ఆగస్ట్ 16 నుంచి అమల్లోకి రానున్నట్లు తెలియజేసింది. ఈ సర్క్యులర్ అమల్లోకి వచ్చిన వారంలోగా ఎస్‌బీలు, డీపీలు వెబ్‌సైట్ యూఆర్‌ఎల్(లింక్)ను స్టాక్ ఎక్స్ఛేంజీలకు నివేదించవలసి ఉంటుందని సర్క్యులర్‌లో సెబీ స్పష్టం చేసింది. యూఆర్‌ఎల్‌లో సవరణలు చేపడితే మూడు రోజుల్లోగా తెలియజేయవలసి ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-2-2023	
విశాఖ	420-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	409-00
విజయవాడ	409-00
రిటైల్ ధర (డజను)	66.00
16-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	389-00
వరంగల్	391-00
రిటైల్ ధర	4.45

బ్యాంకింగ్ వడ్డీ రేట్లు ప్రియం

జాబితాలో బీఓబీ, ఐఓబీ

ముంబై: వడ్డీ రేటు పెంపు జాబితాలో తాజాగా ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐఓబీ) చేరాయి. ఈ నెల మొదట్లో ఆర్‌బీఐ బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు- రెపోను పావుశాతం పెంచడం (6.5 శాతానికి) దీనికి నేపథ్యం. ఎస్‌బీఐ బుధవారం రేట్ల పెంపు నేపథ్యంలో తాజాగా ఈ జాబితాలో బీఓబీ, ఐఓబీలు చేరడం గమనార్హం.





బీఓబీ: నిధుల సమీకరణ వ్యయ ఆధారిత రుణ రేటు- ఎంసీఎల్ఆర్‌ను అన్ని కాల వ్యవధులపై 5 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) పెంచింది. ఫిబ్రవరి 12 నుంచీ తాజా రేటు అమల్లోకి వస్తుందని పేర్కొంది. తాజా పెంపు నేపథ్యంలో ఏడాది రేటు 8.55 శాతానికి, ఓవర్‌నైట్, నెల, మూడు నెలా రేట్లు వరుసగా 7.9 శాతం, 8.2 శాతం, 8.3 శాతానికి చేరాయి.

ఐఓబీ: అన్ని కాలపరిమితులపై ఎంసీఎల్‌ఆర్ 15 బేసిస్ పాయింట్ల వరకూ పెరిగింది. ఏడాది ఎంసీఎల్‌ఆర్ 0.15 శాతం పెరిగి 8.45కు చేరింది. నెల, మూడు, ఆరు నెలల రేట్లుసైతం ఇదే స్థాయిలో పెరిగి వరుసగా 7.9 శాతం, 8.2 శాతం, 8.35 శాతాలకు చేరాయి. ఓవర్‌నైట్, రెండేళ్లు, మూడేళ్ల రేట్లు 10 బేసిస్ పాయింట్లు పెరిగాయి.

ఎస్‌బీఐ డిపాజిటర్లకు తీపికబురు

రుణ రేటును బుధవారం 10 బేసిస్ పాయింట్లు పెంచిన బ్యాంకింగ్ దిగ్గజం- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) డిపాజిట్ రేట్లను కూడా గురువారం 5 నుంచి 25 బేసిస్ పాయింట్ల శ్రేణిలో పెంచింది. తాజా పెంపు నేపథ్యంలో ఐదేళ్ల డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లు 8.5 శాతం వడ్డీ రేటు పొందుతారు. ఏడాది నుంచి రెండేళ్లలోపు డిపాజిట్లపై 6.8 శాతం వడ్డీ లభిస్తుంది. రెండేళ్ల నుంచి మూడేళ్ల మధ్య రేటు పావు శాతం పెరిగి 7 శాతానికి చేరింది. మూడేళ్ల పైబడిన డిపాజిట్లపై రేటు కూడా పావుశాతం పెరిగి 6.5 శాతానికి చేరింది.

నెస్లే డివిడెండ్ రూ. 75

క్యూ4లో నికర లాభం హైజంప్



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియా గత కేలండర్ ఏడాది(2022) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ4)లో నికర లాభం 66 శాతం దూసుకెళ్లి రూ. 628 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2021) ఇదే కాలంలో కేవలం రూ. 379 కోట్లు ఆర్జించింది. కంపెనీ జనవరి-డిసెంబర్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 75 చొప్పున తుది డివిడెండును ప్రకటించింది. పూర్తిఏడాదికి నికర లాభం 13 శాతం వృద్ధితో రూ. 2,391 కోట్లకు చేరింది. నికర అమ్మకాలు 14 శాతం అధికమై రూ. 16,789 కోట్లను తాకాయి. క్యూ4లో నెస్లే నికర అమ్మకాలు 14 శాతం ఎగసి రూ. 4,233 కోట్లను దాటాయి. మొత్తం వ్యయాలు 13 శాతం పెరిగి రూ. 3,427 కోట్లను తాకాయి.

ఫలితాల నేపథ్యంలో షేరు బీఎస్ఈలో 1.6 శాతం బలపడి రూ. 19,562 వద్ద ముగిసింది.

క్రూడ్ ఆయిల్ ఎగుమతులపై 'విండ్‌ఫాల్' తగ్గింపు

- డీజిల్, ఏటీఎఫ్‌లపై కనిష్ట స్థాయికి
- అంతర్జాతీయంగా ధరలు తగ్గిన నేపథ్యం



న్యూఢిల్లీ: డీజిల్, జెట్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ఎగుమతులపై కేంద్రం విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్‌ను వాటి కనిష్ట స్థాయికి తగ్గించింది. దేశీయంగా ఉత్పత్తి చేసిన ముడి చమురు ఎగుమతులపై కూడా పన్ను తగ్గింపు నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయంగా ధరలు దిగిరావడం దీనికి నేపథ్యం. చమురు సహజ వాయువుల సంస్థ (ఓఎన్‌జీసీ) వంటి కంపెనీలు ఉత్పత్తి చేసే ముడి చమురుపై పన్ను టన్నుకు రూ.5,050 నుండి రూ.4,350కి తగ్గించినట్లు కేంద్రం ఉత్తర్వులో తెలిపింది. డీజిల్ ఎగుమతిపై లీటర్‌కు రూ.7.5 నుంచి రూ.2.5కి, అలాగే ఏటీఎఫ్‌పై లీటర్‌కు రూ.6 నుంచి రూ.1.50కి పన్ను తగ్గించింది. గత ఏడాది జూలై ఈ పన్ను వ్యవస్థను ప్రారంభించిన తర్వాత డీజిల్‌పై ఈ రేటు ఈ స్థాయికి తగ్గడం ఇదే తొలిసారికాగా, ఏటీఎఫ్ విషయంలో డిసెంబర్ తర్వాత రెండవసారి. భారత్ 2022 జూలై 1వ తేదీన విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్ విధానాన్ని ప్రవేశపెట్టింది. తద్వారా అంతర్జాతీయంగా ధరలు పెరుగుదల వల్ల ఇంధన కంపెనీలకు అనూహ్యంగా వచ్చే భారీ లాభాలపై పన్ను విధిస్తున్న పలు దేశాల సరసన చేరింది.

సూచీలకు స్వల్ప లాభాలు

ఇంట్రాడేలో ఒడిదుడుకుల ట్రేడింగ్

ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు గురువారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఇంట్రాడేలో 486 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 44 పాయింట్ల లాభంతో 61,320 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 136 పాయింట్ల రేంజ్ కదలాడింది. ఆఖరికి 20 పాయింట్లు బలపడి 18,135 వద్ద నిలిచింది. సూచీలకిది వరుసగా మూడోరోజూ లాభాల ముగింపు. ఉదయం ఉత్సాహంగా ట్రేడింగ్‌ను ప్రారంభించిన సూచీలు ఇంట్రాడేలో భారీ ఊగిసలాటకు లోనయ్యాయి. ఆఖరి గంటలో లార్జ్ క్యాప్ షేర్లలో తలెత్తిన అమ్మకాలు ఆరంభ లాభాలను హరించి వేశాయి. వీక్లీ ఇండెక్స్ ఆప్షన్స్ ఎక్స్‌పైరీ కావడంతో బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విస్తృత స్థాయి మార్కెట్లో ఐటీ, మెటల్, ఫార్మా, రియల్టీ, ఇంధన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా బీఎస్ఈ స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు ఒకశాతం చొప్పున లాభపడ్డాయి. రూపాయి విలువ ఎనిమిది పైసలు బలపడి 82.72 వద్ద స్థిరపడింది.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- అంతర్జాతీయంగా దిగివచ్చిన క్రూడ్ ఆయిల్ ధరలకు అనుగుణంగా కేంద్రం విండ్‌ఫాల్ పన్నును తగ్గించింది. ఈ అంశం దేశీయ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల షేర్లకు కలిసొచ్చింది. ఓఎన్‌జీసీ 5.66%, ఆయిల్ ఇండియా అయిదు శాతం చొప్పున లాభపడ్డాయి.
- నాన్ బ్యాంకింగ్ ఆర్థిక సేవల సంస్థ అక్మే ఫిన్‌ట్రేడ్ ఐపీఓకు వచ్చేందుకు సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా కంపెనీ 1.1 కోట్ల తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. గ్రేటెక్స్ కార్పొరేట్ సర్వీసెస్ లిమిడ్ ఈ ఇష్యూకు బుక్ రన్నింగ్ మేనేజర్‌గా వ్యవహరించనుంది.

యూపీఐతో హెచ్‌డీఎఫ్‌సీ రూపే క్రెడిట్ కార్డుల అనుసంధానం



ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూపే క్రెడిట్ కార్డులను యూపీఐతో అనుసంధానం చేసుకునే సదుపాయాన్ని తీసుకొచ్చింది. ఇంతకుముందు వరకు యూపీఐకి కేవలం బ్యాంక్ సేవింగ్స్ ఖాతాలను లింక్ చేసుకుని చెల్లింపులు చేసుకోవాల్సి వచ్చేది. ఆర్‌బీఐ క్రెడిట్ కార్డుల లింకింగ్ కూడా అనుమతించడంతో పరిశ్రమలో ఈ మేరకు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ''ఇక నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూపే క్రెడిట్ కార్డులను ప్రముఖ యూపీఐ ప్లాట్‌ఫామ్‌లపై అనుసంధానించుకుని, వినియోగించుకోవచ్చు'' అని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రకటించింది. ఈ నిర్ణయంతో కస్టమర్లకు డిజిటల్ చెల్లింపులు మరింత సౌకర్యవంతంగా మారతాయని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పేమెంట్స్ విభాగం హెడ్ పరాగ్‌రావు తెలిపారు. యూపీఐపై రూపే క్రెడిట్ కార్డ్ అనుసంధానం నిజంగా పరిశ్రమ రూపురేఖలను మారుస్తుందని భావిస్తున్నట్టు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సీవోవో ప్రవీణ్ రాయ్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

అదానీ పవర్-డీబీ పవర్ డీల్ వెనక్కి..

సంతకాలు చేయకుండానే ముగిసిన ఒప్పంద గడువు



న్యూఢిల్లీ: డీబీ పవర్‌కి చెందిన బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి ప్లాంట్లను అదానీ పవర్ కొనుగోలు చేయడానికి సంబంధించిన రూ. 7,017 కోట్ల డీల్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఒప్పందంపై సంతకాలు చేయకుండానే .. లావాదేవీకి నిర్దేశించుకున్న గడువు తీరిపోవడం ఇందుకు కారణం. 2022 ఆగస్టు 18 నాటి అవగాహన ఒప్పందం గడువు తీరిపోయిందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు అదానీ పవర్ తెలిపింది. తేదీలను పొడిగించారా లేక ఒప్పందంపై మళ్లీ చర్చలు జరుపుతున్నారా వంటి వివరాలేమీ వెల్లడించలేదు. గడువు తేదీ ముగియడంతో ప్రస్తుతానికి ఈ డీల్‌ను పక్కన పెట్టినట్లే భావించాల్సి ఉంటుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ప్రాథమికంగా గతేడాది ఎంవోయూ కుదుర్చుకున్న తర్వాత తుది గడువు నాలుగు సార్లు పొడిగించారు. నాలుగో గడువు ఫిబ్రవరి 15తో ముగిసింది. ఖాతాలు, షేర్ల ధరల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన ఆరోపణలు, పరిణామాలు దీనికి నేపథ్యం.

సాక్షి స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో భారత్

దుబాయ్‌లో జరుగుతున్న ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్ జోరు కొనసాగుతోంది. గ్రూప్ 'బి'లో భారత జట్టు వరుసగా మూడో విజయం సాధించి క్వార్టర్స్‌లోకి అడుగు పెట్టింది. గురువారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో 4-1తో మలేసియాను భారత్ ఓడించింది. మహిళల సింగిల్స్‌లో సింధు 21-13, 21-17తో వాంగ్ లింగ్ చింగ్‌పై, పురుషుల సింగిల్స్‌లో హెచ్.ఎస్.ప్రణయ్ 18-21, 21-13, 25-23తో లీ జి జియాపై నెగ్గారు. పురుషుల డబుల్స్‌లో ధ్రువ్ కపిల-చిరాగ్ షెట్టి 16-21, 10-21తో అరోన్ చియా-సో వూయి యిక్‌ల చేతిలో ఓడగా, మహిళల డబుల్స్‌లో గాయత్రి-ట్రెసా జాలీ 23-21, 21-15తో పియర్లీ టన్-తినా మురళీధరన్‌లపై, మిక్స్‌డ్ డబుల్స్‌లో ఇషాన్ భట్నాగర్-తనిషా క్రాస్టో 21-19, 19-21, 21-16తో చెన్ తంగ్ జి-తొ ఇ విపై గెలుపొందారు. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో హాంకాంగ్‌తో భారత్ తలపడుతుంది.

మళ్లీ స్పిన్ మంత్రం

- నేటి నుంచి ఆసీస్‌తో రెండో టెస్టు
- జోరు మీదున్న టీమిండియా
- ఒత్తిడిలో కంగారూ జట్టు

ఉదయం 9.30 నుంచి 'స్టార్‌స్పోర్ట్స్'లో ప్రత్యక్ష ప్రసారం



న్యూఢిల్లీ: మరోసారి స్పిన్ ప్రభావం ఉంటుందా...తొలి మ్యాచ్ మూడు రోజుల్లోనే ముగిస్తే ఇది ఎన్ని రోజులు సాగుతుంది... ఆసీస్ మన స్టార్లు అశ్విన్, జడేజాలను ఎదుర్కోగలదా...అసలు ఆ జట్టు పోరాడగలదా...టీమిండియా తిరుగులేని ప్రదర్శనతో ఆధిపత్యం ప్రదర్శిస్తుందా... ఇలాంటి ఆలోచనలు, అంచనాల మధ్య రెండో టెస్టుకు రంగం సిద్ధమైంది. ఆస్ట్రేలియాకు పెను సవాల్ విసిరేందుకు మరో స్పిన్ వికెట్ స్వాగతం పలుకుతోంది. ప్రపంచ టెస్టు క్రికెట్‌లో టాప్-2 జట్లయిన ఆసీస్, భారత్‌ల మధ్య నేటి నుంచి ఢిల్లీ కోటలో రెండో టెస్టు జరుగుతుంది. ఈ 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో భారత్ తొలి టెస్టు గెలిచి 1-0తో పైచేయి సాధించింది. మరోవైపు మేటి జట్టు ఆస్ట్రేలియా రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ వంద ఓవర్లయినా ఎదుర్కోలేకపోవడం జట్టు స్థైర్యాన్ని దెబ్బతీసింది. ఇప్పుడు సిరీస్‌లో పుంజుకోవాలంటే ఈ మ్యాచ్‌లో భారత బౌలింగ్‌ను దీటుగా ఎదుర్కోవాల్సిందే!

ఉత్సాహంగా భారత్

సిరీస్‌లో శుభారంభం చేసిన భారత్ ఇప్పుడు ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. బ్యాటింగ్‌లో రోహిత్ ఫామ్‌లో ఉండగా, వందో టెస్టు ఆడనున్న చతేశ్వర్ పుజారా దీన్ని చిరస్మరణీయం చేసుకోవాలని పట్టుదలగా ఉన్నాడు. గత టెస్టులో పుజారా, కోహ్లి విఫలమయ్యారు. కానీ తన సొంతగడ్డయిన ఢిల్లీపై కోహ్లి చెలరేగడం ఖాయం. శ్రేయస్ అయ్యర్ ఫిట్‌నెస్ సాధించడంతో సూర్యకుమార్ బెంచ్‌కే పరిమితమవుతాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన రవీంద్ర జడేజాతో పాటు శ్రీకర్ భరత్, అక్షర్ పటేల్ వరకు అంటే తొమ్మిదో వరుస వరకు బ్యాటింగ్ చేసే సామర్థ్యం ఉండటం కచ్చితంగా అదనపు బలం కాగలదు. అశ్విన్‌కు ఢిల్లీ అచ్చొచ్చిన పిచ్. ఇక్కడ నాలుగు టెస్టులాడిన అశ్విన్ ఏకంగా 27 వికెట్లు తీశాడు. జడేజా, అక్షర్‌ల స్పిన్ తప్పకుండా మ్యాచ్‌ను మలుపుతిప్పగలదు. కొన్ని గణాంకాలు భారత జట్టును ఊరిస్తున్నాయి. 1987 తర్వాత ఢిల్లీలో భారత్ పరాజయమే ఎరుగదు. చివరిసారిగా ఆ ఏడాది విండీస్ చేతిలో ఓడిన టీమిండియా తదనంతరం గెలవడం లేదంటే డ్రా చేసుకుంది కానీ... ఏ టెస్టులోనూ ఓడలేదు. 249 వికెట్లతో ఉన్న జడేజా ఒక్క వికెట్ తీస్తే 250 మార్క్‌ను అధిగమిస్తాడు.

పుంజుకోవడం ఎలా!

భారత్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి స్పిన్ బూచిపై కంగారు పడిన ఆస్ట్రేలియా ప్రత్యేక కసరత్తులు చేసింది. వార్నర్, ఉస్మాన్ ఖాజా, లబుషేన్, స్మిత్ ఇలా మేటి బ్యాటర్స్ అంతా పూర్తి స్థాయి ఫిట్‌నెస్‌తో అందుబాటులో ఉన్నారు. కానీ ఆట దగ్గరకు వచ్చేసరికి వార్నర్ (1, 10), ఖాజా (1, 5)ల ఓపెనింగ్ అత్యంత పేలవంగా మొదలైంది. ఇది రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ జట్టును చావుదెబ్బ తీసింది. ప్రత్యర్థి స్పిన్ అస్త్రాలకు మిడిలార్డర్ ఇంకాస్త బలహీనపడింది. ఢిల్లీ కూడా అలాంటి వికెటే కావడంతో ఆస్ట్రేలియా శిబిరంలో ఆందోళన పెరుగుతుంది. అనుభవజ్ఞుడైన స్మిత్, ఫామ్‌లో ఉన్న లబుషేన్ బాధ్యతగా ఆడితే బ్యాటింగ్‌లో జట్టు నిలబడేందుకు ఆస్కారం వుంటుంది. కమిన్స్, మర్ఫీ, లయన్, బోలండ్‌లతో కూడిన బౌలింగ్ దళం కూడా ఆతిథ్య బ్యాటర్లపై ప్రభావం చూపిస్తేనే ఈ మ్యాచ్‌లో పుంజుకుంటుంది.



పిచ్-వాతావరణం

అరుణ్ జైట్లీ స్టేడియం స్పిన్‌కు అనుకూలించేదే అయినా... ఆరంభంలో పేసర్లకు మంచి అవకాశం కల్పిస్తుంది. మ్యాచ్ సాగే కొద్దీ స్పిన్నర్లు ప్రమాదకరం కాగలరు. వర్షంతో ఏ ముప్పు లేకపోయినా... ఉత్తరాది నగరంలో చలి తీవ్రత కాస్త ఎక్కువే! డే మ్యాచ్ కాబట్టి సమస్య లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), రాహుల్, పుజారా, కోహ్లి, శ్రేయస్ అయ్యర్, జడేజా, శ్రీకర్ భరత్, అశ్విన్, అక్షర్, షమీ, సిరాజ్.

ఆస్ట్రేలియా: కమిన్స్ (కెప్టెన్), వార్నర్, ఉస్మాన్ ఖాజా, లబుషేన్, స్మిత్, హ్యాండ్స్‌కోంబ్, రెన్‌షా / కామెరాన్ గ్రీన్, క్యారీ, స్టార్క్, మర్ఫీ, లయన్.

కుప్పకూలిన బెంగాల్

తొలి ఇన్నింగ్స్‌లో 174 ఆలౌట్ • సౌరాష్ట్రంతో రంజీ ట్రోఫీ ఫైనల్


ఉనాద్కట్‌కు సహచరుల అభినందన

కోల్‌కతా: 34 ఏళ్ల తర్వాత రంజీ ట్రోఫీ సాధించాలని కలలుగంటున్న బెంగాల్ జట్టుకు సొంతగడ్డపై మొదటి రోజే దెబ్బ పడింది. సౌరాష్ట్రతో జరుగుతున్న ఫైనల్లో గురువారం బెంగాల్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 54.1 ఓవర్లలో 174 పరుగులకే ఆలౌటైంది. షహబాజ్ అహ్మద్ (112 బంతుల్లో 69; 11 ఫోర్లు), అభిషేక్ పోరెల్ (98 బంతుల్లో 50; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించగా, మిగతావారంతా విఫలమయ్యారు. సౌరాష్ట్ర పేస్ బౌలర్లు చేతన్ సకారియా (3/33), జైదేవ్ ఉనాద్కట్ (3/44) ధాటికి బెంగాల్ బెంబేలెత్తింది. 17 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన జట్టు ఒక దశలో 65/6 వద్ద నిలిచింది. అభిమన్యు ఈశ్వరన్ (0), సుదీప్ కుమార్ (0), సుమంత (1), కెప్టెన్ మనోజ్ తివారి (7), అనుస్టుప్ మజుందార్ (16) విఫలమయ్యారు. ఈ స్థితిలో షహబాజ్, అభిషేక్ ఆదుకున్నారు. వీరిద్దరు ఏడో వికెట్‌కు 101 పరుగులు జోడించారు. ధర్మేంద్ర జడేజా, చిరాగ్ జాని చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం ఆట ముగిసే సమయానికి సౌరాష్ట్ర 2 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. జే గోహిల్ (6), విశ్వరాజ్ జడేజా (25) అవుట్ కాగా... హార్విక్ దేశాయ్ (38 బ్యాటింగ్), చేతన్ సకారియా (2 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. ప్రస్తుతం సౌరాష్ట్ర మరో 93 పరుగులు వెనుకబడి ఉంది.

ఇంగ్లండ్ 325/9 డిక్లేర్డ్


బ్రూక్

మౌంట్ మాంగనీ: గత కొంతకాలంగా దూకుడైన ఆటతో టెస్టు క్రికెట్‌కు కొత్త పాఠాలు చెబుతున్న ఇంగ్లండ్ మరోసారి అదే తరహా ఆటతీరును ప్రదర్శించింది. న్యూజిలాండ్‌తో గురువారం మొదలైన తొలి టెస్టులో ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 9 వికెట్ల నష్టానికి 325 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. కేవలం 58.2 ఓవర్లు మాత్రమే ఆడిన ఆ జట్టు ఏకంగా ఓవర్‌కు 5.57 రన్‌రేట్‌తో పరుగులు సాధించడం విశేషం. వికెట్లు కోల్పోయే అవకాశం ఉన్నా... ఓపిగ్గా క్రీజ్‌లో నిలబడే ప్రయత్నం చేయకుండా ఇంగ్లండ్ బ్యాటర్లంతా ధాటిని కొనసాగించారు. హ్యారీ బ్రూక్ (81 బంతుల్లో 89; 15 ఫోర్లు, 1 సిక్స్), బెన్ డకెట్ (68 బంతుల్లో 84; 14 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేయగా, ఒలి పోప్ (42), బెన్ ఫోక్స్ (38) రాణించారు. వాగ్నర్‌కు 4 వికెట్లు దక్కాయి. అనంతరం ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ 3 వికెట్లు కోల్పోయి 37 పరుగులు చేసింది. లాథమ్ (1), విలియమ్సన్ (6), నికోల్స్ (4) పెవిలియన్ చేరగా...కాన్వే (17 బ్యాటింగ్), వాగ్నర్ (4 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. అండర్సన్ 2 వికెట్లు పడగొట్టాడు.


ఆస్ట్రేలియా 'హ్యాట్రిక్'

గెబెర్హా: మహిళల టి20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన గ్రూప్ '1' మ్యాచ్‌లో ఆసీస్ 10 వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. ముందుగా లంక 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 112 పరుగులకే పరిమితమైంది. హర్షిత (34)దే అత్యధిక స్కోరు. అనంతరం ఆసీస్ 15.5 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 113 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అలీసా హీలీ (43 బంతుల్లో 54 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), బెత్ మూనీ (53 బంతుల్లో 56 నాటౌట్; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు.

పాక్‌ను గెలిపించిన మునీబా...



కేప్‌టౌన్: గ్రూప్ '2'లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్ 70 పరుగుల తేడాతో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది. ముందుగా పాక్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మునీబా అలీ (68 బంతుల్లో 102 నాటౌట్; 14 ఫోర్లు) పాక్ తరఫున అంతర్జాతీయ టి20ల్లో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా నిలిచింది. అనంతరం ఐర్లాండ్ 16.3 ఓవర్లలో 95 పరుగులకే ఆలౌటైంది.



ఫుట్‌బాల్ దిగ్గజం బలరాం కన్నుమూత

కోల్‌కతా: రెండు సార్లు ఒలింపిక్స్‌లలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన, ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన జట్టులో సభ్యుడైన అలనాటి ఫుట్‌బాల్ దిగ్గజం తులసీదాస్ బలరాం గురువారం కన్నుమూశారు. 87 ఏళ్ల బలరాం సుదీర్ఘ కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తమిళ కుటుంబానికి చెందిన బలరాం 1936లో సికింద్రాబాద్‌లోని అమ్ముగూడలో జన్మించారు. ఇక్కడే ఫుట్‌బాల్‌లో ఓనమాలు నేర్చుకున్న ఆయన సంతోష్ ట్రోఫీలో హైదరాబాద్ జట్టు తరఫున ఆడారు. సెంటర్ ఫార్వర్డ్‌గా సత్తా చాటిన బలరాం అంతర్జాతీయ కెరీర్ 1955-1963 మధ్య ఏడేళ్ల పాటు గొప్పగా సాగింది. అదే సమయంలోనే 1956 మెల్‌బోర్న్, 1960 రోమ్ ఒలింపిక్స్‌లలో ఆయన భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. ఒలింపిక్స్‌కు ఆడిన సమయంలో బలరాం హైదరాబాద్ ఆటగాడిగానే ఉన్నారు. 36 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 10 గోల్స్ సాధించిన ఆయన 1962 జకార్తా ఆసియా క్రీడల్లో భారత్ విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించారు. ఒక దశలో 'హోలీ ట్రినిటీ' అంటూ కితాబులందుకున్న చుని గోస్వామి, పీకే బెనర్జీ, బలరాం త్రయం భారత ఫుట్‌బాల్‌కు అద్భుత విజయాలు అందించింది. ట్యూబర్ క్యులోసిస్ కారణంగా 27 ఏళ్ల వయసుకే దురదృష్టవశాత్తూ ఆయన కెరీర్ ముగిసింది. ఆటకు గుడ్‌బై చెప్పిన తర్వాత చాలా ఏళ్ల క్రితమే బలరాం కోల్‌కతాకు వెళ్లిపోయి స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. అక్కడే కోచ్‌గా కూడా తన సేవలందించారు.

కెప్టెన్లుగా హోప్, పావెల్

కింగ్‌స్టన్: వన్డే, టి20 జట్ల కోసం కొత్త కెప్టెన్లను వెస్టిండీస్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. వన్డే జట్టుకు షై హోప్, టి20 టీమ్‌కు రావ్‌మన్ పావెల్ సారథులుగా వ్యవహరిస్తారు. ఈ రెండు ఫార్మాట్‌లలో ఇప్పటి వరకు కెప్టెన్‌గా ఉన్న నికోలస్ పూరన్ రాజీనామా చేయడంతో ఈ ఎంపిక అనివార్యమైంది. విండీస్ దేశవాళీ క్రికెట్‌లో కెప్టెన్లుగా వీరిద్దరు మంచి ఫలితాలు సాధించారు. ఫిబ్రవరి 28నుంచి జరిగే దక్షిణాఫ్రికా పర్యటన వీరిద్దరికి కెప్టెన్లుగా తొలి సిరీస్ కానుంది.

క్లుప్తంగా...

పరీక్షల భయం ఉండదిక..

ఇంటర్ విద్యార్థులకు ఏపీఎన్ఆర్టీఎస్ సహకారంతో కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: పరీక్షల భయంతో కలిగే మానసిక ఒత్తిడిని విద్యార్థులు అధిగమించేలా చేయడంపై ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్టీఎస్) దృష్టి సారించింది. ఇందుకోసం బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్‌తో కలిసి ప్రవాస వైద్యులు, నిపుణులతో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లోని లెక్చరర్లకు 'లైఫ్ స్కిల్స్–స్ట్రెస్ మేనేజ్‌మెంట్' పేరిట శిక్షణ ఇస్తోంది. ఆ అధ్యాపకులు తమ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తారు. ఇంటర్మీడియెట్ పరీక్షల సమయంలో విద్యార్థులు అధిక ఒత్తిడికి గురవుతున్నారని, దానిని ఎలా అధిగమించవచ్చనే విషయాన్ని వివరించేందుకు వర్చువల్‌గా ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఏపీఎన్ఆర్టీఎస్ అధ్యక్షుడు వెంకట్ ఎస్ మేడపాటి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి కాలేజీ నుంచి ఇద్దరు చొప్పున 10,200 మంది (ప్రభుత్వ కాలేజీల నుంచి 3,400 మంది, ప్రైవేట్ కాలేజీల నుంచి 6,800 మంది) లెక్చరర్లను ఎంపిక చేశామని పేర్కొన్నారు. విద్యార్థులను మానసిక ఒత్తిడి నుంచి దూరం చేయడానికి అవలంబించాల్సిన విధానాలపై వారికి శిక్షణ ఇస్తున్నామని వివరించారు. ఇప్పటికే 50 శాతం కళాశాలల్లో శిక్షణ పూర్తయిందని, ఈ నెల 22 వరకు కొనసాగుతుందని తెలిపారు. శిక్షణ పూర్తయిన లెక్చరర్లు తమ కాలేజీల్లోని విద్యార్థులకు ఒత్తిడి అధిగమించడంపై కౌన్సెలింగ్ ఇస్తారని పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో అమెరికాలోని అల్బామాకు చెందిన సర్టిఫైడ్ చైల్డ్ అండ్ అడాలెసెంట్ సైకియాట్రిస్ట్ డాక్టర్ అపర్ణ ఉప్పల, ఎస్పీఐఎఫ్ వ్యవస్థాపకుడు నెల్సన్ వినోద్ మోజెస్ (మెంటల్ హెల్త్ జర్నలిస్ట్ విభాగంలో అవార్డ్ గ్రహీత)తోపాటు ప్రముఖ యాంకర్, సినీనటి ఝాన్సీ తదితరులు పాల్గొంటున్నారని తెలిపారు.

మే 5న ఏపీ ఈసెట్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ ఆధ్వర్యంలో ఏపీ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈసెట్) మే 5న నిర్వహించనున్నట్లు ఈ సెట్ కన్వీనర్ డాక్టర్ ఏ కృష్ణమోహన్ గురువారం తెలిపారు. మార్చి 8న నోటిఫికేషన్ విడుదల చేస్తామని, పరీక్ష రాసేందుకు పాలిటెక్నిక్‌తో పాటు బీఎస్సీ మ్యాథ్స్ అభ్యర్థులు అర్హులని చెప్పారు. మే 9న ప్రాథమిక కీ విడుదల చేసి 20న ఫలితాలు విడుదల చేస్తామన్నారు.

285 మంది బాలకార్మికులకు విముక్తి

విజయవంతమైన 'ఆపరేషన్ స్వేచ్ఛ'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 285 మంది బాల కార్మికులకు సీఐడీ స్వేచ్ఛ కలిగించింది. 'ఆపరేషన్ స్వేచ్ఛ' పేరిట ఈ నెల 9వ తేదీ నుంచి 15వరకు సీఐడీ విభాగం కార్మిక శాఖతో కలసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. వివిధ దుకాణాలు, ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి వారిని ఆ వృత్తి నుంచి బయటకు తీసుకొచ్చింది.

జిల్లాలవారీగా విముక్తి కలిగించిన బాల కార్మికుల వివరాలు..

శ్రీకాకుళం 5, విశాఖపట్నం 24, ఏలూరు 36, పశ్చిమ గోదావరి 3, కృష్ణా 16, ఎన్టీఆర్ 1, గుంటూరు 25, పల్నాడు 6, బాపట్ల 9, ప్రకాశం 17, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు 5, తిరుపతి 28, చిత్తూరు 2, అన్నమయ్య 61, వైఎస్సార్ 25, అనంతపురం 17, నంద్యాల 5 గురు.

ఇంటర్ హాల్‌టికెట్లు ఇవ్వకపోతే ప్రిన్సిపాళ్లపై చర్యలు

- విద్యార్థులు టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయవచ్చు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి అటెండెన్సు నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులందరికీ హాల్‌టికెట్లను జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లు జారీచేయాలని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఎం.వి.శేషగిరిబాబు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. దీనికి భిన్నంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కాలేజీల యాజమాన్యాలు హాల్‌టికెట్లను ఇవ్వడానికి నిరాకరిస్తే విద్యార్థులు, తలిదండ్రులు స్టేట్ కంట్రోల్ రూము టోల్ ఫ్రీ నంబరు 18004257635కు అన్ని రోజుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల లోపు ఫిర్యాదు చేయాలని సూచించారు.

'కోత'లపై కొరడా

- 80 శాతానికిపైగా సిజేరియన్లు చేసిన ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు
- 5 ఆస్పత్రుల్లో వందశాతం సిజేరియన్ ప్రసవాలే!
- 3 ఆస్పత్రుల్లో 99 శాతం సర్జరీలే..

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇష్టారాజ్యంగా సిజేరియన్లు నిర్వహించే ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్‌హోంలపై కఠినంగా వ్యవహరించాలని వైద్య, ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా 80 శాతానికిపైగా సిజేరియన్ కాన్పులే నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులపై కొరడా ఝుళిపించడానికి సిద్ధమైంది. తొలుత ఆయా ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీచేయనుంది. 2022–23లో డిసెంబర్ నెల వరకు నిర్వహించిన మొత్తం ప్రసవాల్లో 80 శాతానికి పైగా సిజేరియన్లు చేసిన ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులు రాష్ట్రంలో 119 ఉన్నాయి. ఐదు ఆస్పత్రులు ఏకంగా వందశాతం, మూడు ఆస్పత్రులు 99 శాతం, ఎనిమిది ఆస్పత్రులు 90–98 శాతం సిజేరియన్ ప్రసవాలే చేశాయి.

'ప్రభ'వించితివా.. శివా!

కోటప్పకొండకు శివరాత్రి శోభ

- తెలుగు రాష్ట్రాల్లో తిరునాళ్లకు ప్రత్యేకత త్రికోటీశ్వరుడు
- వందలాది ఏళ్లుగా ప్రభలతో తరలివస్తున్న భక్తజనం
- కోటిన్నొక్క ప్రభలు కడితే కోటయ్య దిగి వస్తాడని నమ్మకం



సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా నరసరావుపేట సమీపంలో ఉండే కోటప్పకొండ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకత ఉంది. ఎక్కడాలేని విధంగా శివరాత్రి రోజున కోటప్పకొండకు 30 కి.మీ. దూరంలోని అన్ని గ్రామాల ప్రజలు ప్రభలు కట్టుకుని కొండకు వెళ్లి శివయ్యను దర్శించుకోవడం ఇక్కడి సంస్కృతిలో భాగం. వందల ఏళ్లుగా కొనసాగుతున్న ఈ ప్రభల వైభవాన్ని చూడాలే కాని వర్ణించలేం. ప్రభుత్వం ఈ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించింది. తిరునాళ్ల రోజున రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు అందజేయడం ఆనవాయితీ.

ప్రభల సంస్కృతి ప్రారంభమైందిలా

పరమశివుడు మూడు కొండల(త్రికూటం)పై జంగమదేవర రూపంలో ధ్యానంలో ఉండేవారట. కొండ సమీపంలోని కొండకావూరు గ్రామానికి చెందిన ఆనందవల్లి (గొల్లభామ) నిత్యం స్వామికి పాలను తీసుకెళ్లి ఇచ్చేదట. ఆ తరువాత గర్భం దాల్చిన ఆనందవల్లి స్వామి చెంతకు వెళ్లి.. తాను కొండ ఎక్కి రాలేకపోతున్నానని చెప్పిందట. కొండదిగి కిందకు వస్తే రోజూలాగే పాలను ఆహారంగా ఇస్తానందట. అందుకు అంగీకరించిన శివుడు.. కొండ దిగుతున్న సమయంలో చివరి వరకు వెనక్కి తిరిగి చూడకూడదని షరతు విధించారట. మధ్యలో వెనుదిరిగి చూస్తే శిల అయిపోతానని చెప్పారట. షరతుకు అంగీకరించి ఆనందవల్లి ముందు నడుస్తుంటే.. స్వామి వెనుకే బయలుదేరారట. కొంతదూరం వెళ్లాక భారీ శబ్దాలు రావటంతో ఆనందవల్లి వెనుదిరిగి చూసిందంట. ఆ వెంటనే స్వామి బ్రహ్మ శిఖరంపై శిల రూపంలో మారిపోయారని చెబుతారు. ఈ క్షేత్రంలో ఆనందవల్లిని దర్శించుకున్న తర్వాతే స్వామి వారిని దర్శించుకుంటారు. కాగా, అక్కడి భక్తులు స్వామి వద్దకు వెళ్లి కొండ దిగి రావాలని వేడుకోగా.. తన కొండకు ఎప్పుడైతే కోటిన్నొక్క ప్రభలు వస్తాయో అప్పుడే కొండ దిగి వస్తానని చెప్పారట. అప్పటి నుంచి కోటయ్య చెంతకు భక్తులు ప్రభలతో రావడం ప్రారంభమైందని స్థానికులు చెబుతారు.



నరసరావుపేట మండలం గురవాయపాలెంలో తయారవుతున్న విద్యుత్ ప్రభ

గ్రామాలు సుభిక్షంగా ఉండాలని..

గ్రామాలు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోటప్పకొండకు ప్రభలు కట్టుకుని వెళతారు. క్రమం తప్పకుండా చాలా గ్రామాల ప్రజలు ప్రభలను తీసుకొస్తున్నారు. ప్రభల విషయంలో గ్రామాల మధ్య పోటీ కూడా ఉంటుంది. గ్రామ పెద్దలు ఇంటికి ఇంత, ఎకరానికి ఇంత అని చందాలు వేసుకుని ప్రభలు నిర్మిస్తారు. గ్రామాలతోపాటు ప్రత్యేకంగా కొన్ని కుటుంబాలు కూడా ప్రభలు తయారు చేసుకుంటాయి. ఈ ప్రభలపై ఏర్పాటు చేసే కార్యక్రమాలను తిలకిస్తూ భక్తులు జాగారం పూర్తి చేస్తారు. ప్రభ కొండకు బయలుదేరే ముందు గ్రామంలో, కొండ వద్ద తిరునాళ్ల రోజు, తిరిగి గ్రామానికి వచ్చిన తర్వాత మరోసారి పండుగ వాతావరణంలో ప్రభ మహోత్సవాన్ని నిర్వహిస్తారు. గతంలో కోటప్పకొండకు ఎద్దుల సాయంతో ప్రభలను తరలించేవారు. ప్రభల ఎత్తు 20 అడుగుల ఎత్తు వరకు ఉండేది. కాలక్రమేణా ప్రభల ఎత్తు 80 నుంచి 90 అడుగుల వరకు చేరింది. విద్యుత్ ప్రభల తయారీ, కొండకు తరలించడం, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసాదం, తిరిగి గ్రామానికి చేర్చడానికి ఒక్కో ప్రభకు రూ.50 లక్షల వరకు ఖర్చవుతోంది.



ప్రభ (ఫైల్‌ఫొటో)

ప్రభల సంస్కృతిని కాపాడుతున్నాం



తరతరాలుగా మా పూర్వీకులు కోటప్పకొండకు ప్రభలు కడుతున్నారు. మేం 44 ఏళ్లుగా విద్యుత్ ప్రభ కడుతున్నాం. సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుంది.

– ఎస్.హరిబాబు, అప్పాపురం, నాదెండ్ల మండలం

గ్రామం బాగు కోరి..



కోటప్పకొండకు ప్రభలను కడితే గ్రామం సుభిక్షంగా ఉంటుందని పెద్దల విశ్వాసం. అదే ఆనవాయితీని కాపాడుతూ వస్తున్నాం. శివరాత్రికి రెండు మూడు నెలల ముందే ప్రభల ఏర్పాటుకు సిద్ధమవుతాం.

– కంచేటి వీరనారాయణ, కాకాని, నరసరావుపేట మండలం

మే 10న పాలిసెట్–2023

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం.. ఏప్రిల్ 30 వరకు గడువు
- ప్రవేశ పరీక్షకు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో ఉచిత శిక్షణ
- రాష్ట్ర సాంకేతిక విద్య కమిషనర్ సీహెచ్ నాగరాణి వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కాలేజీల్లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన పాలిసెట్–2023ను మే 10వ తేదీన నిర్వహించనున్నారు. ఈ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి చైర్‌పర్సన్ చదలవాడ నాగరాణి గురువారం ప్రారంభించారు. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాలిసెట్–2023 వివరాలతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించడంతోపాటు ఆన్‌లైన్‌లో నమూనా దరఖాస్తును పూర్తిచేయడం ద్వారా నూతన విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియకు నాంది పలికారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని నాగరాణి తెలిపారు. పరీక్షను ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తామని, వ్యవధి 2 గంటలు కాగా, ప్రశ్నపత్రం మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటుందని వివరించారు. పదో తరగతి పరీక్షలు పూర్తయిన వెంటనే అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఆసక్తిగల విద్యార్థులకు ఉచితంగా పాలిసెట్‌కు శిక్షణ అందిస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు విద్యార్థులు https:// polycetap.nic.inని వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. తమకు సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లోని సహాయ కేంద్రాలను కూడా సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ సంయుక్త సంచాలకులు పద్మారావు, రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి కార్యదర్శి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త జిల్లాల్లో త్వరగా ఖాళీల భర్తీ



- కార్యదర్శుల సమావేశంలో సీఎస్ డా.జవహర్ రెడ్డి
- పదోన్నతులు, రేషనలైజేషన్, ఇన్‌చార్జ్ బాధ్యతల అప్పగింత
- అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇ–ఆఫీస్ విధానం
- గ్రూపు–1, 2 స్థాయి పోస్టుల వివరాలు వెంటనే అందించండి
- అసెంబ్లీ, కౌన్సిల్‌లో సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు పంపండి
- కోర్టు కేసులపై త్వరలో జీపీలు, కార్యదర్శులతో వర్క్‌షాప్
- ఉద్యోగుల ఆర్థికేతర డిమాండ్లను సకాలంలో పరిష్కరించాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్త జిల్లాల్లో మండల, జిల్లా స్థాయి పోస్టులతో పాటు గ్రామ, వార్డు సచివాలయాలు సహా వివిధ విభాగాల్లో ఖాళీల భర్తీకి ఏపీపీఎస్సీ ద్వారా రిక్రూట్‌మెంట్ ప్రక్రియ జరిగే లోగా తాత్కాలిక ప్రాతిపదికన ప్రస్తుతం ఉన్న సిబ్బంది రేషనలైజేషన్, పదోన్నతులు, ఇన్‌చార్జి బాధ్యతల అప్పగింత ద్వారా త్వరగా భర్తీ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఇందుకు సంబంధించి తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్ రెడ్డి కార్యదర్శులకు సూచించారు. గురువారం రాష్ట్ర సచివాలయం ఐదవ బ్లాకు కలెక్టర్ల సమావేశ మందిరంలో సీఎస్ అధ్యక్షతన కార్యదర్శుల సమావేశం జరిగింది. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను మరింత మెరుగు పరచడం, అధికారాల బదిలీ, కలెక్టర్లతో వీడియో సమావేశాల్లో వచ్చిన అంశాలపై ఫాలోఅప్ చర్యలు, అసెంబ్లీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న వివిధ ఎల్ఏక్యూ, ఎల్సీక్యూలపై సత్వరం సమాచారం అందించడం, తదితర అజెండా అంశాలపై సీఎస్ కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

- గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగుల ప్రొబేషన్ డిక్లరేషన్‌కు చర్యలు తీసుకోవాలి. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూపు 1, 2స్థాయి పోస్టుల ఖాళీల వివరాలను వెంటనే సాధారణ పరిపాలన శాఖకు అందజేయాలి. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇ–ఆఫీస్ విధానం కింద ఇ–రశీదులు, ఇ–డిస్పాచ్ విధానాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలి.
- త్వరలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో అసెంబ్లీ, శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత శాఖలు త్వరగా సమాధానాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలి. వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఏసీబీ, విజిలెన్సు కేసులను నిరంతరం మానిటర్ చేస్తూ ఆయా కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి.
- ఏపీ ఆన్‌లైన్ లీగల్ కేసుల మేనేజ్‌మెంట్ విధానం కింద వివిధ శాఖల్లో నమోదు అవుతున్న కోర్టు కేసులకు సంబంధించి సకాలంలో కౌంటర్లు దాఖలు చేయాలి. కోర్టు కేసులపై జాప్యం లేకుండా సకాలంలో చర్యలు తీసుకోవాలి. దీనిపై త్వరలో జీపీలు, కార్యదర్శులతో వర్కషాపు నిర్వహిస్తాం.
- గతంలో నిర్వహించిన ఉద్యోగ సంఘాల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాల్లో ఉద్యోగ సంఘాల నుండి వచ్చిన డిమాండ్లలో ఆర్థికేతర అంశాలకు సంబంధించిన డిమాండ్లను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి.

'డ్రోన్ల'పై స్వల్పకాలిక కోర్సులు

- 12 రాష్ట్రాల్లో 116 ఐటీఐలకు అనుమతిచ్చిన కేంద్రం
- ఆంధ్రప్రదేశ్‌లోని 10 ఐటీఐల్లో అందుబాటులోకి..



సాక్షి, అమరావతి: డ్రోన్ల రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరుల అవసరాన్ని తీర్చేందుకు ఆంధ్రప్రదేశ్ సహా 12 రాష్ట్రాల్లోని 116 ఐటీఐల్లో ఆరు స్వల్పకాలిక కోర్సుల నిర్వహణకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ అనుమతిచ్చింది. ఈ విషయాన్ని ఇటీవల పార్లమెంట్‌లో వెల్లడించింది. డ్రోన్ల తయారీ, టెక్నీషియన్, పర్యవేక్షణ, నిర్వహణ, కిసాన్ డ్రోన్ ఆపరేటర్ తదితర కోర్సులకు అనుమతిచ్చినట్లు తెలిపింది. వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఐటీఐల్లో డ్రోన్లకు సంబంధించిన నైపుణ్య శిక్షణ కోర్సులు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కోరగా.. ఏపీలోని 10 ఐటీఐల్లో స్వల్పకాలిక కోర్సులకు కేంద్రం అనుమతిచ్చింది. అలాగే అసోం, అరుణాచల్‌ప్రదేశ్, బిహార్, చండీగఢ్, గుజరాత్, మహారాష్ట్ర, మణిపూర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు కూడా కేంద్రం అనుమతి మంజూరు చేసింది.

డ్రోన్స్ స్వల్పకాలిక కోర్సులు

కోర్సు	సమయం
డ్రోన్ డెవలపర్(సాఫ్ట్‌వేర్)	510 గంటలు
డ్రోన్ మాన్యుఫాక్చరింగ్ అండ్ అసెంబ్లీ టెక్నీషియన్	390 గంటలు
డ్రోన్ మానిటరింగ్ అండ్ మెయింటెనెన్స్ అసోసియేట్	390 గంటలు
డ్రోన్ ఆపరేటర్ మల్టీ రోటర్	390 గంటలు
డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్	400 గంటలు
కిసాన్ డ్రోన్ ఆపరేటర్	390 గంటలు

'పోలవరం' ఫిర్యాదుపై నివేదిక ఇవ్వండి

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టులో పర్యావరణ ఉల్లంఘనలు, ఇతరత్రా అక్రమాలు జరిగాయంటూ 22–4–19న పెంటపాటి పుల్లారావు దాఖలు చేసిన ఫిర్యాదుపై నివేదిక ఇవ్వాలని ఏపీ సీఎస్‌కు సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ (సీఈసీ) ఆదేశించింది. ఈ మేరకు సీఎస్‌ను కమిటీ సభ్య కార్యదర్శి అమర్‌నాథ్ శెట్టి లేఖ రాశారు.

ముగిసిన చింతకాయల విజయ్ సీఐడీ విచారణ

ఉదయం 11.30 నుంచి 6 గంటల వరకు..

నగరంపాలెం/పాతగుంటూరు : టీడీపీ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడి తనయుడు విజయ్‌ను గురువారం సీఐడీ పోలీసులు విచారించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి భారతిపై అనుచిత పోస్టుల కేసులో గతేడాది సెప్టెంబర్‌లో విజయ్‌పై సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ క్రమంలో గత నెల 30న అతన్ని విజయవాడ సీఐడీ పోలీసులు గుంటూరులోని ప్రాంతీయ కార్యాలయంలో విచారించారు. తదుపరి విచారణ నిమిత్తం ఈ నెల 16న హాజరుకావాలని విజయ్‌కు సూచించారు. ఉదయం 10.30 గంటలకు కార్యాలయంలోకి రాగా, సాయంత్రం సుమారు ఆరు గంటలకు బయటకొచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో సీఐడీ పోలీసులు 68 ప్రశ్నలు సంధించగా, ప్రస్తుతం 42 ప్రశ్నలు వేశారని తెలిపారు. ఏ విధంగానూ తనను ఇబ్బందులకు గురిచేయలేదన్నారు. టీడీపీకి గ్రామ స్థాయిలో ఎంత వరకు బలం ఉందనేది తెలుసుకునేందుకు ప్రయత్నించారని, దానిని ప్రభుత్వానికి తెలియజేసేందుకు సీఐడీ విచారించారంటూ ఆరోపించారు. టీడీపీ నాయకులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, బుద్దా వెంకన్న, కోవెలమూడి నాని, నసీర్, సాయికృష్ణ, చిట్టాబత్తిని చిట్టిబాబు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

సీఎం కోసమే సీఐడీ : అయ్యన్న ఆరోపణ

ముఖ్యమంత్రిని సంతృప్తి పరిచేందుకే సీఐడీ అధికారులు తప్పుడు పనులు చేస్తున్నారని టీడీపీ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. గురువారం అరండల్‌పేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. చింతకాయల విజయ్‌ను సీఐడీ అధికారుల విచారణలో కేసుకు సంబంధించిన అంశాలేవీ ఉండటం లేదన్నారు. ఎలాంటి బెదిరింపులకు భయపడేది లేదని, సైకో ముఖ్యమంత్రిని రాష్ట్రం నుంచి పంపించే వరకూ నిద్రపోయేది లేదన్నారు. మరో తొమ్మిది నెలల్లో దుర్మార్గపు పాలనకు ముగింపు పలుకుతామని అన్నారు.

వరి.. దిగుబడుల సరి

ఆశాజనకంగా ధాన్యం దిగుబడులు

- ఐదేళ్లల్లో ఎన్నడూ లేని విధంగా నమోదు
- ఏడాదిలోనే 5 బస్తాల పెరుగుదల
- ప్రభుత్వ ప్రోత్సాహాలతో సత్ఫలితాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా రైతులు



సాక్షి, రాజమహేంద్రవరం: జలాశయాల్లో పుష్కలంగా నీరు.. సీజన్‌కు ముందుగానే బ్యారేజ్ నుంచి సాగునీటి విడుదల.. మూడు పంటల దిశగా ప్రభుత్వ సన్నద్ధత.. సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అందజేత.. ఆపై వరుణుడి కరుణ. ఇలా ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి అనుకూల పవనాలు వీడయంతో ఈ ఖరీఫ్‌లో రికార్డు స్థాయి వరి దిగుబడులు అందాయి. గత ఐదేళ్లతో పోల్చితే అత్యధిక దిగుబడులు నమోదయ్యాయి. ఈ పరిణామం కర్షకులకు ఎంతగానో ఉపకరిస్తోంది. జిల్లాలో 2021 ఖరీఫ్‌లో 82,695 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. ఎకరానికి (75 కిలోల బస్తా) 28 బస్తాల ధాన్యం దిగుబడి వస్తే.. 2022 ఖరీఫ్‌లో 73,606 హెక్టార్లలో వరి సాగైంది. ఎకరానికి 33 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. ఏడాది వ్యవధిలో ఎకరం పొలానికి 5 బస్తాలు వృద్ధి చెందింది. అంతకుముందు ఖరీఫ్‌లో 4,29,990 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అందితే.. ఈసారి 4,52,368 మెట్రిక్ టన్నులు.. అంటే 22,378 మెట్రిక్ టన్నులు అదనంగా దిగుబడి వచ్చింది. గత ఐదేళ్లుగా ఇలాంటి దిగుబడులు ఎప్పుడూ నమోదు కాలేదని వ్యవసాయ శాఖ చెబుతోంది.

తెగుళ్ల బెడద దూరం

ఏటా పంటలకు విపరీతమైన తెగుళ్లు ఆశించేవి. ఈ ఏడాది ఖరీఫ్‌లో తెగుళ్ల బెడద నుంచి రైతులకు ఉపశమనం కలిగింది. ప్రధానంగా ఆకుముట్టు పురుగు బెడద పెద్దగా కనిపించలేదు. వెద్ద పద్ధతిలో సాగు చేయడంతో పంటకు ఎలుకల బెడద దూరమైంది. ఇలా ప్రతి అంశం రైతులకు అనుకూలంగా ఉండటంతో పంట దిగుబడి సైతం ఆశించిన మేర అందిందని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

రైతులకు ఉపయుక్తం



ఖరీఫ్–2022 దిగుబడులు ఘనంగా ఉన్నాయి. ప్రతి మండలంలో 2021 ఖరీఫ్, 2022 ఖరీఫ్‌కు వ్యత్యాసం కనిపించింది. ఇందుకు ముందస్తుగా సాగునీరు అందించడం. ఎంతగానో దోహద పడింది. ప్రతి ఎకరానికి అదనంగా ధాన్యం అందడంతో రైతులకు ఆర్థిక ప్రయోజనం కలిగింది. పెట్టిన పెట్టుబడులు తిరిగి దక్కడంతో పాటు లాభాలు చూశారు. ఈ పరిణామం రైతుల్లో రబీ సాగుకు ముందుకు వచ్చేలా చేసింది. రబీ సకాలంలో పూర్తయితే.. మూడో పంటకు అవకాశం ఉంటుంది. మినుములు, పెసలు లాంటి ఆరుతడి పంటలు పండించుకునే వెసలుబాటు దొరుకుతుంది.

–ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ అధికారి

అనుకూలించిన వాతావరణం

2021 ఖరీఫ్‌తో పోలిస్తే.. 2022 ఖరీఫ్‌కు వాతావరణం అనుకూలించింది. పంట సాగు సమయంలో వర్షాలు సంవృద్ధిగా పడ్డాయి. అప్పటికి జిల్లా సాధారణ సగటు వర్షపాతం 717.8 మి.మీటర్లుకాగా.. 839.2 మి.మీటర్లు నమోదైంది. 13.0 శాతం వర్షపాతం అధికంగా నమోదైంది.

- ఏటా మూడు పంటల సాగు ప్రోత్సహించాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. అందుకు అనుగుణంగా 2022 ఖరీఫ్‌లో జూన్ 1 నుంచి ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేశారు. సాధారణంగా జూన్ 11న విడుదల చేయాల్సి ఉండగా.. పది రోజుల ముందుగా సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ నుంచి నీటిని విడుదలకు చర్యలు తీసుకున్నారు. ఫలితంగా ప్రకృతి విపత్తులు, గోదావరి వరద నుంచి పంటను గట్టెక్కించుకునే అవకాశం కలిగింది.
- మొక్కలు ఆహారాన్ని తయారుచేసుకుని ఏపుగా పెరిగి మంచి దిగుబడులు రావాడానికి కిరణజన్య సంయోగక్రియ బాగా ఉపకరిస్తుంది. సూర్యుని వెలుగు ఎక్కువ సమయం ఉంటే మొక్కలకు అంత అనుకూలం. సెప్టెంబర్ అనంతరం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాధారణంగా 30 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సగటున రెండు డిగ్రీల దాదా అధిక వేడి నెలకొంది. ఫలితంగా పైరు బాగా కుదురుకుని ఏపుగా పెరిగి దిగుబడులు పెరిగేందుకు దోహదపడింది.
- సాగుకు అవసరమైన సమయంలో ప్రభుత్వం విత్తనాలు సబ్సిడీపై అందజేసింది.
- దిగుబడిలో కీలక భూమిక పోషించే ఎరువులను సీజన్ ప్రారంభానికి ముందే ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచింది.
- జిల్లాలో వ్యవసాయం మీద ఆధారపడిన రైతులు 2,18,171 మంది ఉన్నారు. వీరికి పంట సాగుకు అవసరమైన పెట్టుబడులను రైతు భరోసా పథకం ద్వారా ప్రభుత్వం అందజేయడంతో కర్షకుల్లో ఉత్సాహం నెలకొని కాడిపడ్డారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943